

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 341

సోమవారం 3-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చందమామపై
తొలి ప్రైవేట్ ల్యాండర్ -6లో



రిత్విక్...
మళ్లీ సాధించాడు -14లో



సెమీస్‌లో భారత్ X ఆస్ట్రేలియా

దుబాయ్‌లో భారత స్పిన్ తంత్రం పదునుగా పని చేసింది.. 249 పరుగుల సాధారణ స్కోరు చేసి కూడా టీమిండియా విజయాన్ని అందుకోగలిగింది.. చాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 44 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది.. ఈ మ్యాచ్‌కు ముందే సెమీస్ స్థానాలు ఖరారు కాగా... ఫలితం తర్వాత సెమీఫైనల్ ప్రత్యర్థి ఎవరో ఖాయమైంది. రేపు దుబాయ్‌లోనే జరిగే తొలి సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాతో రోహిత్ బృందం తలపడుతుంది. ఈ ఐసీసీ టోర్నీలో కంగారూలను చిత్తు చేసి భారత్ ఫైనల్ చేరాలని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

- వివరాలు 14లో ▶

నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

సాయంత్రానికి తేలనున్న రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఫలితం

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఫలితానికి రెండు రోజుల సమయం !

కరీంనగర్, నల్లగొండలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- వివరాలు 2లో ▶

భారీ లెక్కలు.. ఫీజు బేరాలు!

ఫీజులు భారీగా పెంచాలంటున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు

ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ మండలి ముందు ప్రతిపాదనలు

ప్రయత్నాలు సఫలమైతే ఈ ఏడాది కన్వీనర్ కోటా ఫీజులు రెట్టింపయ్యే చాన్స్

- వివరాలు 3లో ▶

రంగంలోకి రోబోలు!

ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- చిక్కుకుపోయిన కార్మికుల వెలికితీతకు అవాంతరాలు ఎదురవుతున్నాయి.. మరో రెండు, మూడు రోజుల్లో సమస్యకు పరిష్కారం దొరుకుతుంది
- రోబోలను కూడా వినియోగించే ప్రయత్నాలు చేస్తాం
- సహాయక చర్యల్లో 11 సంస్థలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.. జీపీఆర్‌తో తొలుత గుర్తించిన చోట కార్మికుల ఆనవాళ్లు దొరకలేదు
- ఈ ప్రమాదం అనుకోకుండా జరిగింది.. ప్రభుత్వ నిర్లక్ష్యం లేదు.. ఇది మనందరి సమస్య.. ఏకతాటిపై నిలబడదామన్న సీఎం
- సహాయక చర్యల పర్యవేక్షణ.. నిపుణులతో సమీక్ష



ఎస్ఎల్‌బీసీ సొరంగంలో రెస్క్యూ సిబ్బందితో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మల్లు రవి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదంలో చిక్కుకున్న 8 మంది కార్మికులను బయటకు తీసేందుకు తీవ్ర అవాంతరాలు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. మరో రెండు, మూడురోజుల్లో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. రోబోలను సైతం వినియోగించి కార్మికులను వెలికితీసే ప్రయత్నాలను చేస్తామని వెల్లడించారు. మళ్లీ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా సహాయక చర్యలను చేపడుతున్నామని వివరించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్దనున్న ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్దకు చేరుకున్న ఆయన సహాయక చర్యలను పర్యవేక్షించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, బాలునాయక్‌తో కలిసి నిపుణులతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం

'ఫ్లోరైడ్ పీడిత నల్లగొండ జిల్లాతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాకు చిరకాల వాంఛగా ఉన్న ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుపై గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. పదేళ్లలో కనీసం 3 కి.మీ కూడా పూర్తిచేయలేదు. బిల్లులు ఇవ్వకుండా కాంట్రాక్టు కంపెనీని ఇబ్బంది పెట్టారు. కరెంట్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్‌ను కట్ చేయడంతో మోటార్లు నడవని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని జాగ్రత్తలు తీసుకుని

మిగతా 2వ పేజీలో ▶

మోదీ మంచోడే కానీ.. కిషన్‌రెడ్డే..!

- వనపర్తి ప్రజాపాలన ప్రగతి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ విషయంలో ప్రధాని సానుకూలంగా, సానుభూతితోనే ఉన్నారు
- రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే సైంధవుడి పాత్ర పోషిస్తున్నారు

- వివరాలు 3లో

క్రిప్టో సీజ్.. ఓ కొత్త కథ!

సాక్షి, హైదరాబాద్: నగలు, నగదు, వస్తువులు, వాహనాల సీజింగ్.. బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్, ఆస్తుల అటాచ్‌మెంట్.. ఇవన్నీ పోలీసులకు సుపరిచితమే. వీటిలోకి ఇప్పుడు క్రిప్టో కరెన్సీ కూడా వచ్చి చేరింది. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లు దోచిన సొమ్మును దేశం దాటించేందుకు క్రిప్టో కరెన్సీని వాడుతున్నారు. ఈ నేపథ్యంలో నేరస్తులు పట్టుబడితే వారి నుంచి ఆ క్రిప్టో కరెన్సీని పోలీసులు రికవరీ చేస్తున్నారు. అయితే, క్రిప్టో సీజింగ్ కొత్త కావడంతో పెద్ద ప్రహసనంగా మారింది.



క్రిప్టో రూపంలో దేశం దాటుతున్న మోసం సొమ్ము

ప్రస్తుతం యాప్‌ల ఆధారంగా జరుగుతున్న సైబర్ నేరాల్లో చాలావరకు చైనీయులే సూత్రధారులుగా ఉంటున్నారు. నేపాల్, చైనా, ఇండోనేసియా, దుబాయ్ తదితర దేశాల్లో కూర్చుని, ఇక్కడ ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని దందా చేస్తున్నారు. ఏజెంట్ల కమీషన్ పోగా మిగిలిన దోపిడీ సొమ్ము విదేశాల్లోని ఆ సూత్రధారులకు చేరాల్సిందే. ఒకప్పుడు ఈ లావాదేవీలన్నీ హవాలా రూపంలో జరిగేవి. కొన్ని దేశాలకు హవాలా కష్టసాధ్యం కావడంతో పాటు ఎలాంటి ఆధారాలు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సూత్రధారులు క్రిప్టో కరెన్సీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఇక్కడి పాత్రధారుల ఖాతాల్లోకి నగదు వెళ్లిన తర్వాత దాన్ని బిట్ కాయిన్ రూపంలోకి మార్చి తమ వద్దకు వచ్చేలా చేసుకుంటున్నారు.

క్రిప్టో వాలెట్స్‌లో రెండు రకాలు

గూగుల్ ప్లేస్టోర్స్, యాపిల్ యాప్ స్టోర్స్‌లో క్రిప్టో కరెన్సీకి సంబంధించి అనేక యాప్స్ ఉన్నాయి. వాలెట్స్‌గా పిలిచే వీటిని డౌన్‌లోడ్ చేసుకుని, బ్యాంకు ఖాతాకు అనుసంధానించుకోవడం ద్వారా క్రిప్టో కరెన్సీ క్రయవిక్రయాలు చేయవచ్చు. ఈ వాలెట్స్‌లో బినాన్స్, కాయిన్ బేస్ వంటి కస్టోడియన్ వాలెట్స్‌తో పాటు సేఫ్ పాల్, ట్రస్ట్ వంటి నాన్ కస్టోడియన్ వాలెట్స్ ఉంటాయి. కేంద్ర ఆర్థిక శాఖ అధీనంలోని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) అనుమతి తీసుకుని నడిచేవి కస్టోడియన్ వాలెట్స్. అనుమతి లేకుండా నడిచేవి నాన్ కస్టోడియన్ కిందికి వస్తాయి. కస్టోడియన్ వాలెట్స్ ఆపరేట్ చేయడానికి వినియోగదారుడి నో యువర్ కస్టమర్ (కేవైసీ) వివరాల నమోదు, వర్చువల్ వెరిఫికేషన్ తప్పనిసరి. ఇలా చేస్తే పోలీసుల దర్యాప్తులో తమ ఉనికి బయటపడుతుందనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లు ఎక్కువగా నాన్ కస్టోడియన్ వాలెట్స్ వాడుతున్నారు.

అంకెలు, అక్షరాల సమాహారమే

బిట్ కాయిన్‌గా పిలిచే క్రిప్టో కరెన్సీ 25 నుంచి 50 అంకెలు, అక్షరాలతో కూడిన వాలెట్ అడ్రస్ రూపంలో ఉంటుంది. కేవలం ఈ వాలెట్ అడ్రస్ ఆధారంగా క్రిప్టో కరెన్సీ ఏ వాలెట్‌లో ఉందో గుర్తించడం సాధ్యం కాదు. నిందితుల ఫోన్‌లో ఆ వాలెట్ ఉండి, అందులో వాలెట్ అడ్రస్ దొరికితేనే ఆ కరెన్సీ, దాని విలువ తెలుస్తుంది. వాలెట్ ఉన్న ఫోన్‌ను సీజ్ చేసినంత మాత్రాన క్రిప్టో కరెన్సీని సీజ్ చేసినట్లు కాదు. ఓ వినియోగదారుడు క్రిప్టో కరెన్సీ వాలెట్ అడ్రస్‌ను పోగొట్టుకుంటే దాన్ని రిట్రైవ్ చేసుకోవడానికి రెండు పద్ధతులు ఉంటాయి. కస్టోడియన్ వాలెట్స్‌లో క్రిప్టో కరెన్సీని కేవైసీ ద్వారా, నాన్ కస్టోడియన్ వాలెట్స్‌లో 12 పదాలతో కూడిన '12 వర్డ్ పాస్ ఫ్రేజ్', ఎంపిక చేసుకున్న ప్రశ్నలు–సమాధానాల ద్వారా రిట్రైవ్ చేసుకోవాలి. ఈ విధానంలో సదరు నాన్ కస్టోడియన్ వాలెట్ 12 పదాలను ఓ వరుస క్రమంలో చూపిస్తుంది. దాన్ని రాసుకుని, రహస్యంగా దాచుకునే వినియోగదారుడు.. అవసరమైనప్పుడు క్రిప్టో కరెన్సీ రిట్రైవ్ చేసుకోవడానికి వినియోగిస్తాడు. ఈ పాస్ ఫ్రేజ్ ఎవరి దగ్గర ఉన్నా... దాన్ని వినియోగించి క్రిప్టో అసెట్స్‌ను రిట్రైవ్ చేసుకోవచ్చు.

- ఆన్‌లైన్ మోసాల్లో పట్టుబడిన క్రిప్టో కరెన్సీ సీజ్
- దోపిడీ సొమ్ము దేశం దాటకుండా కొత్త ఉపాయం
- సీజ్ చేస్తున్న పోలీసులు, వివిధ దర్యాప్తు ఏజెన్సీలు
- ఈ ప్రక్రియ పెద్ద ప్రహసనమే అంటున్న అధికారులు
- తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా హైదరాబాద్‌లో సీజింగ్

పెరుగుతున్న క్రిప్టో సీజింగ్

గెయిన్ బిట్ కాయిన్ స్కామ్‌ను దర్యాప్తు చేస్తున్న సీబీఐ గత బుధవారం ఐదు రాష్ట్రాల్లో దాడులు చేసి రూ.23.94 కోట్ల విలువైన క్రిప్టో కరెన్సీని సీజ్ చేసింది. గోల్డ్ కాస్ట్ సోలార్ స్కామ్‌లో ఢిల్లీ పోలీసులు గత ఏడాది అక్టోబర్‌లో రూ.80 లక్షల విలువైన క్రిప్టోను సీజ్ చేశారు. రూ.2.06 కోట్లతో ముడిపడిన ట్రేడింగ్ ఫ్రాడ్ కేసును ఛేదించి హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ఈ ఏడాది జనవరి 29న రూ.40 లక్షల విలువైన బిట్ కాయిన్లు సీజ్ చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఇదే తొలి అధికారిక క్రిప్టో కరెన్సీ/బిట్ కాయిన్ సీజింగ్. సైబర్ నేరాలతో బిట్ కాయిన్స్‌కు విడదీయరాని బంధం ఉన్న నేపథ్యంలో క్రిప్టో కరెన్సీ సీజ్ చేయడం అత్యవసరంగా మారింది.



12 వర్డ్ పాస్ ఫ్రేజ్ నమూనా

సైబర్ ఠాణాలకు అధికారిక వాలెట్స్

ఓ నిందితుడి వాలెట్‌లో ఉన్న క్రిప్టో కరెన్సీకి సంబంధించిన పాస్ ఫ్రేజ్ అతడి కుటుంబీకులు, స్నేహితులు, సన్నిహితుల వద్దా ఉండే అవకాశం ఉంటుంది. అలా ఉంటే నిందితుడిని అరెస్టు చేయగానే వాళ్లు పాస్ ఫ్రేజ్ వినియోగించి ఆ క్రిప్టో కరెన్సీని తమ ఫోన్లలో యాక్టివేట్ చేసుకుని, మరో దాంట్లోకి మార్చేయడం, ఎన్‌క్యాష్ చేసుకునే ప్రమాదం ఉంటుంది. అలా జరగకుండా చూసేందుకు దర్యాప్తు అధికారులు అధికారికంగా కస్టోడియన్ వాలెట్ యాక్టివేట్ చేసుకుంటున్నారు. నిందితుడి వాలెట్‌లోని క్రిప్టోను ఇందులోకి బదిలీ చేసుకుని న్యాయస్థానానికి సమాచారం ఇస్తున్నారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణా సబ్ ఇన్‌స్పెక్టర్ వినయకుమార్ ఇలాగే రూ.40 లక్షల విలువైన క్రిప్టో కరెన్సీ సీజ్ చేశారు. ఈ కేసుతో వచ్చిన అనుభవంతో ఉన్నతాధికారులు సైబర్ క్రైమ్ ఠాణాల్లో ఉన్న ప్రతి టీమ్‌కు క్రిప్టో వాలెట్స్ ఓపెన్ చేయించారు. భవిష్యత్‌లో సైబర్ నేరగాళ్ల నుంచి క్రిప్టో కరెన్సీ స్వాధీనం చేసుకుంటే దాన్ని భద్రపరచడం కోసం వీటిని వినియోగించనున్నారు.

క్లుప్తంగా...

అసెంబ్లీ ప్రోరోగ్

గవర్నర్ నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: శాసనసభ, మండలిని ప్రోరోగ్ చేస్తూ నోటిఫికేషన్ జారీ అయింది. గత ఏడాది డిసెంబర్ 9న ప్రారంభమైన రాష్ట్ర మూడో అసెంబ్లీ నాలుగో సెషన్‌ను ఆర్టికల్ 174 ప్రకారం ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ ప్రోరోగ్ అమల్లోకి వస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. శాసనమండలిని కూడా ప్రోరోగ్ చేస్తూ మరో నోటిఫికేషన్‌ను గవర్నర్ వర్మ జారీ చేశారు. ప్రోరోగ్ జారీ నేపథ్యంలో బడ్జెట్ సమావేశాల కోసం అసెంబ్లీని సమన్ చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది.

పార్టీ నేతకు కేసీఆర్ ఆర్థిక సహాయం

వైద్య ఖర్చులకోసం రూ.10 లక్షల చెక్కు ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత



దోకుపర్తి సుబ్బారావుకు చెక్కును అందిస్తున్న కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం టౌన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దోకుపర్తి సుబ్బారావుకు పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ రూ. 10 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. సోషల్ మీడియా వేదిక ద్వారా కేసీఆర్ సందేశ్ పేరిట.. పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకువెళుతున్న సుబ్బారావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కేసీఆర్, ఆయనను ఆదివారం ఎర్రవెల్లి నివాసానికి పిలిపించుకున్నారు. సుబ్బారావు యోగక్షేమాలు, ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చుల కోసం రూ.10 లక్షల చెక్కును సుబ్బారావుకు అందజేశారు. కాగా, తమను ఆపదలో ఆదుకున్న పార్టీ అధినేతకు సుబ్బారావు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమకు అండగా నిలిచిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు, పార్టీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డికి సుబ్బారావు దంపతులు ధన్యవాదాలు తెలిపారు. దోకుపర్తి సుబ్బారావు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆమరణ దీక్ష సమయంలో కేసీఆర్‌ను ఖమ్మం జైలుకు తీసుకువచ్చినప్పుడు ఆయనతోపాటు జైలులో ఉన్నారు. ఆ కేసులో సుబ్బారావు ఏ2గా ఉన్నారు.



ఎలన్ మస్క్‌కు శిశు సంక్షేమ శాఖ ఇస్తే బెటర్ సార్ !

రంగంలోకి రోబోలు!



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు జూపల్లి, ఉత్తమ్

▶ మొదటి పేజీ తరువాయి

పనులు ప్రారంభించింది. టన్నెల్ బోరింగ్ మిషిన్ మరమ్మతు కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని అమెరికా పంపి స్పేర్‌పార్ట్స్‌ను తెప్పించాం. ప్రాజెక్టు పూర్తయితే రూపాయి ఖర్చు లేకుండానే 30 టీఎంసీల నీరు గ్రావిటీ ద్వారా 4 లక్షల ఎకరాలకు అందుతుంది. మేము శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తుంటే అనుకోకుండా దుర్ఘటన జరిగింది. ఇందులో ప్రభుత్వ నిర్లక్ష్యం లేదు. ఇది మనందరి సమస్య..విపత్తు విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ అండగా ఉండాలి..' అని సీఎం విజ్ఞప్తి చేశారు.

దేశంలోని వ్యవస్థలన్నీ ఇక్కడే ఉన్నాయి..

'దేశ భద్రత కోసం కష్టపడే ఆర్మీ వ్యవస్థ ఇక్కడ పనిచేస్తోంది. టన్నెల్ నిపుణులు, ప్రైవేటు ఏజెన్సీలతో పాటు దేశంలో ఉన్న వ్యవస్థలన్నీ ఇక్కడ ఉన్నాయి. మొత్తం 11 సంస్థలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి, వారందరినీ అభినందిస్తున్నా. ప్రమాద స్థలంలో మట్టి, నీరు ఎక్కువగా ఉండటం, కన్వేయర్ బెల్టు రిపేరులో ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సోమవారం సాయంత్రానికి బెల్టు అందుబాటులోకి వస్తుంది. జీపీఆర్‌తో తొలుత గుర్తించిన చోట కార్మికుల ఆనవాళ్లు దొరకలేదు. ప్రభుత్వం ఇంకా పట్టుదల, చిత్తశుద్ధితో సహాయక చర్యలను చేపడుతోంది. ప్రమాదం జరిగిన గంటలోనే ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులను సంఘటన స్థలానికి పంపా.

ప్రధాని మోదీతోనూ మాట్లాడా..

దేశంలోని వ్యవస్థలతో పాటు మంత్రులు ఇక్కడే ఉండి పనిచేస్తున్నారు. దీనిపై ప్రధాని మోదీతో మాట్లాడా. కేంద్రం సహకారంతోనూ ప్రయత్నాలు చేస్తున్నాం. ఇతర రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన వారిపై సానుభూతి, మానవత్వంతో వ్యవహరిస్తున్నాం. సహాయక చర్యలను చూసేందుకు వస్తున్న ప్రతిపక్షాలతో పాటు ఎవరినీ నియంత్రించ లేదు, నిర్బంధించ లేదు. పూర్తి పారదర్శకంగా ఉన్న మమ్మల్ని తప్పుబడుతున్నారు..' అని రేవంత్ విమర్శించారు.

రెండు ఉదంతాలకు మధ్య తేడా ఉంది..:

'గతంలో బీఆర్ఎస్ హయాంలో దేవాదుల ప్రాజెక్టు పనుల్లో 9 మంది చనిపోతే ఐదేళ్ల తర్వాత వాళ్ల మృతదేహాలు దొరికిన విషయం మర్చిపోయారా? శ్రీశైలం పవర్‌హౌస్ ఘటనలో చనిపోయిన వారిని చూసేందుకు పీసీసీ అధ్యక్షుడిగా నేను వస్తుంటే అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అప్పటి ఘటనకు, ఇప్పటి ప్రమాదానికి తేడా ఉంది. అక్కడ నిర్లక్ష్యం ఉంది. తాగి నడిపి మనిషిని గుద్దితే జరిగిన ప్రమాదం లాంటిది కాళేశ్వరం ఉదంతం.. తాగి వస్తున్న వాడిని బతికించేందుకు చెట్టును గుద్దిన ఘటన లాంటిది ఈ ప్రమాదం. ఈ రెండింటి మధ్య కూడా తేడా ఉంది. కేసీఆర్ ఎక్కడా కన్పించడం లేదు. ప్రతిపక్షంగా నిలదీసే బాధ్యత ఆయనకు లేదా? నేను ఎన్నికల ప్రచారానికి తిరుగుతున్నానని కిషన్‌రెడ్డి అంటున్నాడు. మా వ్యవస్థ అంతా ఇక్కడే ఉంది. టీం లీడర్‌గా నేను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు ఇస్తున్నా..' అని సీఎం చెప్పారు.


హరీశ్ నీ పాస్‌పోర్టు బయటపెట్టు..

'ప్రమాదం జరిగితే నేను ఎన్నికల ప్రచారానికి వెళ్లానని హరీశ్ అంటున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత హరీశ్ దుబాయ్‌లో దావత్ చేసుకున్నది నిజం కాదా? అబుదాబిలో రెండు రోజులు దావత్‌లో మునిగి తేలారు. మత్తు దిగినాక వచ్చి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారు. హరీశ్.. మీ పాస్‌పోర్టును బయట పెట్టండి. ఎయిర్‌పోర్టులో వివరాలు చూడండి. నేను వస్తే రెస్క్యూ చర్యలకు ఇబ్బంది కలుగుతుందనే రాలేదు. ఇట్ల సోయి లేకుండా మాట్లాడవచ్చా?..' అని రేవంత్ మండిపడ్డారు.

అనుమానిత ప్రాంతాలు తాజాగా గుర్తింపు

- ఊహాచిత్రాన్ని రూపొందించిన ఎన్డీఆర్ఎఫ్
- డయాగ్రామ్ ఆధారంగా 3 దశల్లో రెస్క్యూ

సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలిన ఘటనలో గల్లంతైన కార్మికుల జాడ ఉన్నట్టుగా అనుమానిస్తున్న ఇతర ప్రాంతాలను.. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) టెక్నాలజీ సహాయంతో నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) తాజాగా గుర్తించింది. నలుగురు కార్మికులు టన్నెల్ బోరింగ్ యంత్రం (టీబీఎం)కు వెనుక మట్టిదిబ్బల కింద కూరుకుపోయి ఉన్నట్టు అనుమానిస్తుండగా, మరో నలుగురు టీబీఎం ఉన్న ప్రాంతంలోనే శిథిలాల కింద ఉన్నారని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఎన్జీఆర్ఐ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎన్డీఆర్ఎఫ్ నిపుణులు ఆదివారం ఊహా చిత్రం రూపొందించారు. దీని ఆధారంగా డయాగ్రామ్‌ను తయారు చేసి, దాని ఆధారంగా మూడు దశల్లో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించేందుకు వ్యూహం సిద్ధం అయ్యింది.



ఆ రెండు చోట్లా ఇనుప పైపులు, రాడ్లు

ఇంకా రెడీ కాని కన్వేయర్ బెల్టు.. రేపు దోమలపెంటకు సిస్మాలజీ నిపుణులు

సాక్షి, నాగర్‌కర్నూల్: గ్రౌండ్ పెనిట్రేటెడ్ రాడార్ (జీపీఆర్) సాంకేతికతతో తొలుత గుర్తించిన రెండు, మూడు అనుమానిత పాయింట్ల వద్ద తవ్వినా కార్మికుల ఆచూకీ లభ్యం కాలేదు. జీపీఆర్ నిపుణులు సూచించిన పాయింట్ల వద్ద సింగరేణి మైన్స్, ర్యాట్ మైన్స్ బృందాలతో పాటు మాన్యువల్‌గా తవ్వకాలు జరిపారు. అయితే ఆయా చోట్ల ఇనుప రాడ్లు, పైపులు మాత్రమే దొరికాయి. కార్మికుల జాడ లభించలేదు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా రోబోల ద్వారా అన్వేషణ చేపట్టాలని భావిస్తున్నారు. ప్రమాద స్థలంలో సుమారు 18 ఫీట్ల ఎత్తున మట్టి, శిథిలాలు పేరుకుపోవడంతో వాటిని తొలగించడం సహాయక సిబ్బందికి కష్టంగా మారింది. కన్వేయర్ బెల్టు అందుబాటులోకి రాకపోవడంతో ఈ ప్రక్రియ ఆలస్యంగా కొనసాగుతోంది. బెల్టు మరమ్మతుకు రాబిన్స్ కంపెనీకి చెందిన నిపుణులు నిరంతరం కష్టపడుతున్నా, కొత్తగా ఫౌండేషన్ వేయాల్సి ఉండటంతో ఆలస్యం అవుతోంది. ఇలావుండగా..నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీకి చెందిన నిపుణులు ఈనెల 4న దోమలపెంటకు రానున్నారు. సొరంగంలోని ప్రమాద స్థలానికి పైభాగంలో భూమిలోని చీలికలు, పొరలు, నీటి ధారలు, వాటి ప్రవాహాలను గుర్తించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోనున్నారు. అలాగే భూఫలకాలు, పొరల తీరుపై, భవిష్యత్తులో టన్నెల్ నిర్మాణానికి చేపట్టాల్సిన చర్యలపై సూచనలివ్వనున్నారు.

ఎంపీ సెగ్మెంట్‌ల వారీగా మీనాక్షి సమీక్ష

రేపు మెదక్, మల్కాజ్‌గిరి నాయకులకు దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఇటీవల నియమితురాలైన మీనాక్షి నటరాజన్ చకచకా కార్యరంగంలోకి దూకుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొంత ఆలస్యంగా రాష్ట్రానికి వచ్చిన ఆమె ఇప్పటికే టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొని రాష్ట్ర పార్టీ నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ నియోజకవర్గాల వారీ సమీక్షలకు సిద్ధమయ్యారు. విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలోనే ఆమె తాను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తానని, ఆ సమావేశాల్లో అన్ని అంశాలు మాట్లాడుకుందామని చెప్పారు. ఈ మేరకు ఈనెల 4వ తేదీన గాంధీభవన్‌లో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మెదక్, సాయంత్రం 5 గంటలకు మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాల పరిధిలోని నాయకులతో ఆమె సమావేశమవుతారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశాలకు హాజరుకావాలని ఆయా నియోజకవర్గాల పరిధిలోని రాష్ట్ర మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, పోటీ చేసిన అభ్యర్థులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు, అనుబంధ సంఘాల నేతలు, కార్పొరేషన్ చైర్మన్లతోపాటు మాజీ ప్రజాప్రతినిధులు, అధికార ప్రతినిధులు, సీనియర్ నేతలకు టీపీసీసీ సమాచారం పంపింది. కాగా, ఈ సమావేశాల్లో భాగంగా మీనాక్షి తన మార్కు దిశానిర్దేశం చేస్తారని గాంధీభవన్ వర్గాలంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రభుత్వ పనితీరుపై ఆమె నేతల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారని తెలుస్తోంది.

ఆర్థిక నేరాల కట్టడికి చర్యలు

- మల్టీ లెవెల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ మోసాలను ఆదిలోనే పసిగట్టేలా ప్రత్యేక వ్యవస్థ
- సీఐడీలో ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఏర్పాటుపై అధికారుల కసరత్తు



సాక్షి, హైదరాబాద్: నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేసి నిందితులను గుర్తించడమే కాదు.. నేరం జరగకుండా నిలువరించడం కూడా పోలీసుల ప్రథమ కర్తవ్యం. ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న ఆర్థిక నేరాల విషయంలోనూ ఇదే సూత్రాన్ని అవలంబిస్తున్నారు తెలంగాణ పోలీసులు. ఎక్కడో కూర్చుని ఇక్కడి ప్రజల బ్యాంకు ఖాతాలు కొల్లగొట్టి.. వారి కష్టార్జితాన్ని ఎగరేసుకుపోతున్న సైబర్‌నేరగాళ్ల కట్టడికి ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఆన్‌లైన్‌లో మోసగించే వారిపై ఫోకస్‌పెట్టి.. ఆదిలోనే అలాంటి నేరాల కట్టడికి తెలంగాణ సీఐడీలో మరో నూతన యూనిట్‌ను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సైబర్‌నేరాల కట్టడికి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను అదేవిధంగా డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల కట్టడికి టీజీ యాంటీనార్కోటిక్స్ బ్యూరోను ఏర్పాటు చేసినట్టే, ఆర్థిక నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టేందుకు తెలంగాణ సీఐడీలో అంతర్భాగంగా ఎకనామిక్ ఇంటెలిజెన్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నారు.

మోసపూరిత ప్రకటనలు ఇచ్చేవారిపై నిఘా..

ఈ విభాగం ప్రధానంగా ఈ కామర్స్ సైట్స్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్ సహా అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో నకిలీ, మోసపూరిత వాణిజ్య ప్రకటనలు ఇచ్చేవారిపై నిఘా పెడుతుంది. మల్టీలెవల్ మార్కెటింగ్‌తో లాభాలు వస్తాయని, పార్ట్‌టైం జాబ్స్ ఇస్తామని.. పలు రకాల స్కీంలతో ప్రకటనలు ఇచ్చే వారిపై నకిలీ వివరాలతో ఏర్పాటు చేసుకున్న ఖాతాలతో డెకాయి ఆపరేషన్స్ చేస్తుంది. ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనల్లో నంబర్లు, అడ్రస్‌లు, వ్యక్తుల గురించి ఆరా తీస్తుంది. ఇందులోని అధికారులు తాము కూడా ఒక వినియోగదారుడిగా అవతలి వ్యక్తులతో (మోసపూరిత ప్రకటనలు ఇచ్చిన వారితో) సంప్రదింపులు చేస్తూ, వారి వివరాలు కనుగొని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. అలా కాకుండా మోసాలకు పాల్పడే వారిని ఆదిలోనే గుర్తిస్తే.. అమాయక పౌరులు వారి వలలో పడి మోసపోకుండా ముందుగానే కట్టడి చేయవచ్చన్నదే ఈ నూతన వింగ్ ఏర్పాటు ఆలోచన వెనుక ప్రధాన ఉద్దేశం. ఇలా చేయడం ద్వారా ఆర్థిక మోసాల బారి నుంచి ప్రజలను కాపాడటంతోపాటు వారిని అప్రమత్తం చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నూతన వింగ్ ఏర్పాటుతోపాటు, సాంకేతికంగా మంచి పరిజ్ఞానం ఉన్న సిబ్బందిని నియమించేలా పోలీస్ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.

నేడు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

కరీంనగర్, నల్లగొండలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు

- సాయంత్రానికి తేలనున్న రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఫలితం
- గ్రాడ్యుయేట్ ఫలితానికి రెండు రోజుల సమయం!



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/నల్లగొండ: ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాటు పూర్తయ్యాయి. ఈ మేరకు కరీంనగర్, నల్లగొండలలో ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలు సోమవారం సాయంత్రం లోగా వెల్లడికానున్నాయి. పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ఫలితం రావడానికి రెండు రోజుల సమయం పట్టే అవకాశముంది.

- కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్–మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటల నుంచి కరీంనగర్ జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. దీనికోసం మొత్తం 35 టేబుళ్లు వినియోగించనున్నారు. ఇందులో 21 పట్టభద్రుల ఓట్ల కోసం, 14 టేబుళ్లు ఉపాధ్యాయుల ఓట్లు కోసం కేటాయించారు. ఒక్కో టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వర్తించనుండగా, ఇందులో ఒక మైక్రో అబ్జర్వర్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు లెక్కింపు అసిస్టెంట్లు ఉన్నారు. వీరందరికీ శనివారం అధికారులు శిక్షణ ఇచ్చారు. లెక్కింపు కోసం మొత్తం 800 మంది సిబ్బందిని వినియోగించనున్నారు. ఇందులో 20 శాతం రిజర్వ్ సిబ్బందిని నియమించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్నికల అధికారులు మాక్ కౌంటింగ్ చేపట్టారు. ఈ మాక్ కౌంటింగ్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సిబ్బందికి ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు విధానం, నిబంధనలు, మార్గదర్శకాలను వివరించారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 3.55 లక్షల ఓట్లు, టీచర్ నియోజకవర్గంలో 27,088 ఓట్లు ఉన్నాయి. ఈ క్రమంలో టీచర్ల లెక్కింపు సాయంత్రానికి వెలువడే అవకాశాలు ఉండగా.. గ్రాడ్యుయేట్ మాత్రం మరునాటికి పూర్తయ్యే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. గ్రాడ్యుయేట్ స్థానంలో 56 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, టీచర్ ఎమ్మెల్సీ బరిలో 15 మంది తలపడుతున్నారు.
- వరంగల్–ఖమ్మం–నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జాలబావి సమీపంలోని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 19 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, 24,139 మంది ఓట్లు పోలయ్యాయి.

నేటి నుంచి ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

ఎమ్మెల్యే కోటాలో ఐదు స్థానాలకు ఏర్పాట్లు చేసిన అసెంబ్లీ వర్గాలు

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. గత నెల 24వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సోమవారం నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. దీనికోసం అసెంబ్లీ వర్గాలు అన్ని ఏర్పాట్లు చేశాయి. ఈనెల 11వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 13వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశముంటుంది. పోలింగ్ ఈనెల 20వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. వెంటనే కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఎమ్మెల్సీలుగా ఉన్న సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్‌ల పదవీకాలం మార్చినెలాఖరుతో ముగియనుంది. శాసనసభలో పార్టీల బలాబలాల ప్రకారం మూడు స్థానాలు కాంగ్రెస్ పార్టీకి, ఒకటి బీఆర్ఎస్‌కు దక్కనున్నాయి. మరో స్థానం ఎవరికి వస్తుందన్న దానిపై స్పష్టత లేదు. అయితే, కాంగ్రెస్ నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను నిలపాలని యోచిస్తోంది. ఈ నాలుగింటిలో ఒకటి తమకివ్వాలని ఎంఐఎం అడుగుతోంది. ఈ నేపథ్యంలో త్వరలోనే కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకోనుంది. ఇక, బీఆర్ఎస్ నుంచి ఎవరిని బరిలో నిలపాలన్న దానిపై ఆ పార్టీ వర్గాలు ఇంకా కసరత్తు చేస్తున్నాయి.

భారీ లెక్కలు.. ఫీజు బేరాలు!

గత మూడేళ్ల కాలంలో ప్రవేశ పెట్టిన పలు కొత్త కోర్సులు, మౌలిక సదుపాయాల కల్పన కారణంగా ఖర్చు బాగా పెరిగిపోయిందని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు చెబుతున్నాయి. వార్షిక ఫీజులను ఈ ఏడాది భారీగా పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ మండలి (టీజీఎఫ్ఆర్సీ) ముందు ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించాయి. మరోవైపు ప్రభుత్వ పెద్దలతోనూ ఫీజుల పెంపు విషయమై యాజమాన్యాలు లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది. ఖర్చులు పరిశీలించే ఆడిటింగ్ వ్యవస్థతో దొడ్డిదారిన సంప్రదింపులు జరుపుతున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రైవేటు కాలేజీలు అనుకున్నది అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాది కన్వీనర్ కోటా ఫీజులు దాదాపు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని ఉన్నత విద్యా మండలి వర్గాలు చెబుతున్నాయి. అప్పుడు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల ఫీజులు కూడా పెరుగుతాయని అంటున్నారు.

- సాక్షి, హైదరాబాద్

- ఫీజులు భారీగా పెంచాలంటున్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు
- ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ మండలి ముందు ప్రతిపాదనలు
- ఖర్చులు భారీగా పెరిగినట్టు లెక్కలు చూపించిన యాజమాన్యాలు
- ఆడిట్ వ్యవస్థతో పాటు ప్రభుత్వ పెద్దలతోనూ మంతనాలు!
- ప్రయత్నాలు సఫలమైతే ఈ ఏడాది కన్వీనర్ కోటా ఫీజులు రెట్టింపయ్యే చాన్స్

బీటెక్, బీఫార్మసీ, అగ్రికల్చర్ కాలేజీల ఫీజులను ఎఫ్ఆర్సీ ప్రతీ మూడేళ్ళకోసారి సమీక్షిస్తుంది. 2022లో కొత్త ఫీజులను నిర్ణయించారు. ప్రస్తుతం ఇవే అమల్లో ఉన్నాయి. 2022-23లో నిర్ణయించిన ఫీజులు అప్పట్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు ఆఖరి సంవత్సరం వరకూ వర్తిస్తాయి. కాగా 2025-26కు కొత్త ఫీజులను ఖరారు చేసేందుకు గాను ఆడిట్ నివేదికలు ఇవ్వాలని గత ఏడాది ఆగస్టులోనే ఎఫ్ఆర్సీ యాజమాన్యాలను ఆదేశించింది. దీంతో 157 కాలేజీలు కొత్త ఫీజులతో మండలికి ప్రతిపాదనలు సమర్పించాయి. గత మూడేళ్లలో కొత్తగా వచ్చిన కోర్సుల కోసం, మౌలిక వసతులు, బోధన సిబ్బంది కోసం భారీగా ఖర్చు చేశామని జమా ఖర్చుల్లో పేర్కొన్నాయి. ఈ ప్రతిపాదనలను మండలి నేతృత్వంలోని ఆడిట్ బృందాలు పరిశీలిస్తాయి. ఆ తర్వాత యాజమాన్యాలతో మండలి చర్చలు జరిపి ఫీజులను నిర్ణయిస్తుంది. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత కొత్త ఫీజులు అమలులోకి వస్తాయి. 2025-26, 2026-27, 2027-28 వరకూ కొత్త ఫీజులు అమల్లో ఉంటాయి. కొత్త విద్యా సంవత్సరం సమీపిస్తున్న నేపథ్యంలో ఎఫ్ఆర్సీ ఈ ప్రక్రియను వేగవంతం చేసింది.

ప్రతిపాదనలు పరిశీలిస్తున్న ఎఫ్ఆర్సీ

వంద శాతం పెంచాల్సిందే

ఈసారి ఫీజులు భారీగా పెంచాల్సిందేనని ప్రైవేటు కాలేజీలు పట్టుబడుతున్నాయి. 157 కాలేజీలకు గాను 60 కాలేజీల్లో ప్రస్తుతం రూ. 1.40 లక్షలకు పైనే ఫీజు ఉంది. వీటిని ఈసారి రెట్టింపు చేయాలని కోరుతున్నాయి. 33 కాలేజీల్లో రూ.75 నుంచి రూ.1.15 లక్షల వరకూ ఫీజులున్నాయి. ఈ కాలేజీలు రూ.1.10 లక్షల నుంచి రూ.1.60 లక్షల వరకూ పెంచాలని ప్రతిపాదించాయి. రూ.50 వేల లోపు ఉన్న మిగతా కాలేజీలు కనీస ఫీజు రూ.75 వేలు చేయాలని పట్టుబడుతున్నాయి. మూడేళ్ళ క్రితం కొన్ని కాలేజీల ఫీజులు భారీగా పెరిగాయి. వసతులు, బోధన సిబ్బంది పరిశీలన అనంతరం కొన్నింటికి తగ్గించారు. ఎంజీఐటీ ఫీజు రూ.1.08 లక్షల నుంచి రూ.1.60 లక్షలకు పెరిగింది. నారాయణమ్మ ఫీజు రూ.1.22 లక్షల నుంచి రూ. లక్షకు తగ్గించారు. సీబీఐటీ ఫీజును తొలుత రూ.1.34 లక్షల నుంచి రూ.1.73 లక్షలకు పెంచారు. తర్వాత ఆడిట్ నివేదిక ప్రకారం సవరించి రూ.1.15 లక్షలకు తగ్గించారు. కాలేజీ కోర్టును ఆశ్రయించడంతో అనంతరం రూ.1.65 లక్షలుగా ఖరారు చేశారు. కొన్ని కాలేజీల ఫీజులు అసలు పెంచలేదు. ఇవి ఈసారి ఫీజుల పెంపు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాయి.

కొత్త కోర్సులు వచ్చాయి..ఖర్చు పెరిగింది

రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీల్లో లక్షకు పైగా ఇంజనీరింగ్ సీట్లు ఉంటే, ఇందులో 61 వేల సీట్లు సీఎస్ఈ, ఇతర కొత్త కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి. కాగా కొత్త కోర్సుల కోసం భారీగా ఖర్చు చేశామని కాలేజీలు అంటున్నాయి. లైబ్రరీ, లేబొరేటరీ, ఇతర మౌలిక వసతుల నేపథ్యంలో ఈ మూడేళ్ళలో 80 శాతం వ్యయం పెరిగిందని చెబుతున్నాయి. ఏఐ, డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కోర్సుల ఫ్యాకల్టీకి అత్యధిక వేతనాలు చెల్లిస్తున్నట్టు జమా ఖర్చుల్లో పేర్కొన్నాయి.

తీవ్ర వ్యతిరేకత

ప్రైవేటు కాలేజీల ప్రతిపాదనలపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రైవేటు అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. మౌలిక వసతులు ఈ మూడేళ్లలో ఎక్కడా పెరగలేదని, చాలా కాలేజీల్లో సరిపడా ఫ్యాకల్టీ లేదని అంటున్నాయి. ఆడిట్ వ్యవస్థతో పాటు ప్రభుత్వం అన్నీ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఫీజులపై నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాయి.



వేతనాలే ఇవ్వడం లేదు



చాలా కాలేజీలు ఉద్యోగులకు సరిగా వేతనాలు ఇవ్వడం లేదు. ఒక్కసారి బ్యాంకు లావాదేవీలు పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తుంది. కొత్త కోర్సులు వచ్చినా, సీట్లు పెరిగినా, నైపుణ్యం ఉన్న సిబ్బందిని నియమించలేదు. కాలేజీల్లో ఎలాంటి మౌలిక వసతులు ఉన్నాయో అధికారులు పరిశీలించాలి. తప్పుడు నివేదికలు ఇచ్చిన కాలేజీలపై చర్యలు తీసుకోవాలి.

- అయినేని సంతోష్‌కుమార్ (ప్రైవేటు సాంకేతిక కాలేజీల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు)

తప్పుడు లెక్కలు ఆమోదించొద్దు



ప్రైవేటు కాలేజీలు తప్పుడు ప్రతిపాదనలతో ఫీజుల పెంపునకు ప్రయత్నిస్తున్నాయి. వీటిని గుడ్డిగా ఆమోదించవద్దు. దీని వల్ల పేద విద్యార్థికి చదువు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఎఫ్ఆర్సీ అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

- టి.నాగరాజు (ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

క్లుప్తంగా...

పాలన చేతకాక ప్రతిపక్షాలపై విమర్శలు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మండిపడ్డారు. రాష్ట్ర కేబినెట్‌లో ఆరు మంత్రి పదవులను భర్తీ చేయలేని దుస్థితిలో రేవంత్ సర్కారు ఉందని విమర్శించారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో పాలన పడకేసిందని ధ్వజమెత్తారు. ఎస్ఎల్‌బీసీ ఘటనా స్థలానికి వెళ్లేందుకు సీఎంకు ఎనిమిది రోజులుగా తీరిక లేదన్నారు. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ లేకున్నా సీఎం రేవంత్.. ఢిల్లీ వెళ్లి వచ్చారని, ఒకవేళ రాహుల్‌ను కలిస్తే ఒక్క ఫొటో కూడా ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. పేరుకు పీసీసీ అధ్యక్ష పదవిని బీసీ నాయకుడికి ఇచ్చారని, సీఎం పదవిని బీసీలకు ఇవ్వాలంటూ అధిష్టానానికి లేఖ రాయాలని ఆయన పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు సూచించారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తిరిగి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారని చెప్పారు. తెలంగాణలో 90 శాతం మంది ప్రజలకు ఉర్దూ రాకపోయినా బోర్డులపై ఉర్దూ భాషలో ఎందుకు రాస్తున్నారని ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్ మీద ఏసీబీ కేసు పెడితే కేంద్రానికి ఏం సంబంధమని అన్నారు. కేటీఆర్‌ను అరెస్టు చేయడానికి రేవంత్‌రెడ్డి భయపడుతున్నారన్నారు.

రామ్మోహన్‌ది అవగాహన రాహిత్యం


ఎమ్మెల్సీ బల్మూరి కౌంటర్



సాక్షి, హైదరాబాద్: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు ఎద్దేవా చేశారు. ఎవరో ఇచ్చిన స్క్రిప్టు చదివే ముందు.. సరిచూసుకుని, స్పష్టత తీసుకుని మాట్లాడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో ఐటీ పరిశ్రమ రాజీవ్‌గాంధీ హయాంలోనే అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ నేతృత్వంలో ఐటీతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రం నుంచి రెండుసార్లు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి తెలంగాణ అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అవగాహన లేకుండా చేసిన వ్యాఖ్యలను కేంద్రమంత్రి వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్సీ బల్మూరి డిమాండ్ చేశారు.

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్.. అన్నీ సీఎం రేవంత్‌రెడ్డినే!

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ మొదలైన అన్ని సర్వీసుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, ఇందిరమ్మ రాజ్యంలో శాఖాధిపతులు కేవలం ఉత్సవ విగ్రహాలేనని బీఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. సివిల్ సర్వెంట్స్‌ను కాదని రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలను ఆదివారం 'ఎక్స్'వేదికగా దుయ్యబట్టారు. సీఎస్, డీజీపీ, పీసీసీఎఫ్‌లు కేవలం ఏసీ గదుల్లో కూర్చుని లక్షల జీతాలు తీసుకోవడానికేనా? అని ప్రశ్నించారు. కేటీఆర్, హరీశ్‌రావుల మీద అక్రమ కేసులు, పీసీసీఎఫ్‌ను బైపాస్ చేయడం చూస్తే అదే నిజమనిపిస్తుందని వ్యాఖ్యానించారు. అటవీ శాఖలో పీసీసీఎఫ్‌కు చెప్పకుండా ఆ శాఖ అధికారులను విదేశీ పర్యటనకు పంపడం ఉన్నతాధికారిని అణచివేసే కుట్రేనని ఆరోపించారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డోబ్రియాల్ సీనియర్, సిన్సియర్ ఆఫీసర్ అని, ఈ అధికారికి ఒక మాటైనా చెప్పకుండా ఇతర అధికారులను విదేశీ పర్యటనకు పంపడం ఆ అధికారిని అవమానించడమేనని అన్నారు.

మోదీ మంచోడే..కానీ కిషన్‌రెడ్డే..!





వనపర్తి సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మేఘారెడ్డి, సభకు హాజరైన జనం

- వనపర్తి ప్రజాపాలన ప్రగతి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ విషయంలో ప్రధాని సానుకూలంగా, సానుభూతితోనే ఉన్నారు
- రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే సైంధవుడి పాత్ర పోషిస్తున్నారు
- కిషన్‌రెడ్డి ఇక్కడ మెట్రో విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు సహకరించడం లేదని ఫైర్

వనపర్తి: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సానుకూలంగానే ఉన్నా.. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైంధవుడి పాత్ర పోషిస్తూ అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేంద్ర మంత్రులు, బీజేపీ అగ్ర నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. తమిళనాడులో నిర్మలా సీతారామన్, కర్ణాటకలో శోభా కరంద్లాజేలు తమ రాష్ట్రాల్లో మెట్రో రైలు పనులను చేయిస్తుంటే.. తెలంగాణ నుంచి కేంద్రమంత్రి హోదాలో ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో మెట్రో విస్తరణకు ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. 'ప్రధానమంత్రి గుజరాత్‌లోని సబర్మతి నదిని, యూపీ సీఎం యోగి గంగానదిని, అమిత్ షా ఢిల్లీలోని యమునా నదిని ప్రక్షాళన చేయిస్తున్నారు. కిషన్‌రెడ్డి మాత్రం హైదరాబాద్‌లోని మూసీనది ప్రక్షాళనకు సహకరించడం లేదు..' అని ధ్వజమెత్తారు. ఆదివారం వనపర్తిలో పర్యటించిన ఆయన.. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. చిన్ననాటి మిత్రులను కలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి సభలో ప్రసంగించారు.

సమస్య అక్కడ లేదు..ఇక్కడే ఉంది

'కిషన్‌రెడ్డి..గత ఎన్నికల్లో తన చీకటి మిత్రుడు కేసీఆర్ ఓటమి పాలయ్యాడనే దుఃఖంలో ఉన్నాడు. ఢిల్లీ నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి, విద్యుత్, గృహ నిర్మాణశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హైదరాబాద్‌కు వచ్చి పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తే స్థానిక కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరు కాకపోవడంలో ఆంతర్యం ఏమిటి? ఢిల్లీలో ఉన్న మంత్రి హైదరాబాద్‌కు వస్తే.. గల్లీలో ఉన్న నీవు ఎందుకు రాలేదు? సమస్య మోదీతో కాదు.. ఆయన సానుభూతితో ఉన్నారు. సమస్య ఇక్కడే ఉంది. ముసుగు తొడిగి ఎక్కువ రోజులు ఉండలేవు. అసూయ, అసహనంతో మాట్లాడుతున్నావు..' అని సీఎం మండిపడ్డారు.

ఇద్దరు కేంద్రమంత్రులూ పగబట్టారు

'మేము అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలో 55 వేల ఉద్యోగాలు ఇచ్చాం. కేంద్రంలో 12 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో లెక్క చెప్పాలి. సికింద్రాబాద్‌లో వరదలు వచ్చి సమయంలో ఇళ్లు, వాహనాలు.. ఏం నష్టం జరిగితే అదే తిరిగి ఇస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన బీజేపీ నేతలు ఎందుకు ముఖం చాటేశారు?. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్న ఇరువురు నేతలు తెలంగాణ అభివృద్ధికి సహకరించాల్సింది పోయి.. మా ప్రజా పాలన ప్రభుత్వంపై పగబట్టి బుసలు కొడుతున్నారు. ఈడీ, సీబీఐ మీచేతుల్లో ఉన్నా.. మేము భయపడం. ఎంతమంది, ఎన్ని అడ్డంకులు సృష్టించినా తెలంగాణ అభివృద్ధి ఆపడం సాధ్యం కాదు..' అని రేవంత్ స్పష్టం చేశారు.

పాలమూరు రైతులకు అన్యాయం చేసిన కేసీఆర్

'పాలమూరు నుంచి ఎంపీగా కేసీఆర్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే.. ఆయన కృష్ణా జలాల్లో వాటాను తగ్గించేందుకు సంతకం చేసి పాలమూరు రైతులకు అన్యాయం చేశాడు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నిరుద్యోగులను విస్మరించారు. బీఆర్ఎస్ నేతలు.. పచ్చగున్న తాన తిని వెచ్చగున్న తాన పడుకున్నారు' అని సీఎం విమర్శించారు.

అన్నివిధాలుగా మహిళలకు అండ

'మేం అధికారం చేపట్టిన కొద్దికాలంలోనే మహిళలను వెయ్యికి పైగా బస్సులకు యజమానులు చేశాం. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీ ఉత్పత్తుల సరసన మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుగా హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద 150 షాపులతో అతిపెద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను కేటాయించాం. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు జీరో, పావలా వడ్డీ రుణాలను పునః ప్రారంభించాం. బీఆర్ఎస్, బీజేపీ ఏకమై రైతులను ఆగం చేస్తే.. ప్రజాపాలనలో 25.50 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ వర్తింపజేశాం. రాష్ట్రంలో 50 లక్షల పేద కుటుంబాలకు ఉచిత విద్యుత్‌తో పాటు, రూ.500కే ఎల్పీజీ సిలిండర్ అందజేస్తున్నాం' అని రేవంత్ వివరించారు.

తెలంగాణ రైజింగ్‌ను అడ్డుకోలేరు: భట్టి

పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ ప్రజా సమస్యలు పరిష్కరించలేకపోయిన సన్యాసి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. తెలంగాణ రైజింగ్‌ను కేసీఆర్ కుటుంబం అడ్డుకోలేదన్నారు. మార్చి 31 లోగా అర్హులందరికీ రైతు భరోసా అందిస్తామని చెప్పారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నాటికి రాష్ట్రంలో స్వయం ఉపాధి కల్పన పథకాలకు రూ.6 వేల కోట్ల నిధులు కేటాయించి పంపిణీ చేస్తామని అన్నారు. సభలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ కె.దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్ సీఎస్ శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

'రేవంత్ అన్న భరోసా' పథకం ప్రారంభం

రేవంత్ అన్న భరోసా పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ నుంచి రూ.36.64 కోట్లతో 42,230 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 10,490 మంది మహిళలకు ఇవ్వనున్నారు. ఆదివారం ఈ కార్యక్రమాన్ని రేవంత్ ప్రారంభించారు. అనంతరం జాబ్‌మేళా ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు.

స్నేహితులు, గురువులతో కలిసి భోజనం



అద్దెకున్న పార్వతమ్మ కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి

వనపర్తితో తనకు విడదీయలేని ఆత్మీయ బంధం ఉందని రేవంత్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో 40 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులను, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆయన కలుసుకున్నారు. ఒక్కొక్కరిని పేరుపెట్టి పిలుస్తూ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు స్నేహితులు ప్రభుత్వ పథకాలు సరిగా అందడం లేదని చెప్పారు. దీంతో నిధుల కొరత ఉందని, మార్చి నుంచి పరిస్థితి చక్కబడుతుందని రేవంత్ తెలిపారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. అలాగే 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వనపర్తిలో తాను అద్దెకు ఉన్న ఇంటి యజమానులను (పార్వతమ్మ కుటుంబం) సీఎం కలిశారు.

భక్తరామదాసు జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తాం : భట్టి




కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, సీతక్క తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): కళలను, కళాకారులను చిత్తశుద్ధితో ప్రోత్సహిస్తున్న ప్రజా ప్రభుత్వం మనదని, ఇకపై ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం తరఫున భక్త రామదాసు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రాబోయే ఉగాది పండుగ రోజున గద్దర్ తెలంగాణ సినిమా అవార్డుల ప్రదానోత్సవం జరుగనున్నదని స్పష్టం చేశారు. ఆదివారం ఎల్బీ స్టేడియంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో శ్రీభక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమిళనాడు రాష్ట్రంలో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల మాదిరిగా తెలంగాణలోనూ రామదాసు జయంతి వేడుకలను ప్రతియేటా నిర్వహిస్తామని తెలిపారు. సినిమా కళాకారులకు పురస్కారాలు ఇచ్చినట్లుగానే సంగీత నాటక కళాకారులకు కూడా ఇస్తామని ప్రకటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క మాట్లాడుతూ, భగవంతుడు ఇచ్చిన కళను ప్రజలకు పంచి సమాజ వికాసానికి కళాకారులు దోహదపడాలని కోరారు. మే 4వ తేదీన త్యాగరాజ స్వామి జయంతిని ప్రభుత్వం తరఫున నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భక్త రామదాసు జయంతి ఉత్సవాలలో భాగంగా సుమారు 26 బృందాలు రామదాసు కీర్తనలను ఆలపించి భక్తిభావంలో ముంచెత్తాయి.

చేతనైతే చంద్రబాబు మీద యుద్ధం ప్రకటించు

సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రేవంత్‌రెడ్డి ఎక్కడికి వెళ్లినా కేసీఆర్‌ను తిట్టడం తప్ప ప్రజలకు పనికొచ్చే ఒక్క విషయం కూడా మాట్లాడటం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రేవంత్‌కు చేతనైతే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణకు చేస్తున్న అన్యాయంపై యుద్ధం ప్రకటించాలని హితవు పలికారు. వనపర్తి వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి తీరును తీవ్రస్థాయిలో విమర్శించారు. పదేపదే పాలమూరు బిడ్డను అంటూ, శుష్కమైన సెంటిమెంట్‌ను వల్లించడమే తప్ప రేవంత్ పాలమూరుకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు.

నీలా సూట్‌కేసులు మోయలేదు..

పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక సంబంధాలను నిర్వహించామే తప్ప నీలా పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి తరఫున సూట్ కేసులు మోయలేదని హరీశ్‌రావు రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు యథేచ్ఛగా రోజుకు 10వేల క్యూసెక్కులు తరలించుకుపోతున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే, మా మీద రంకెలు వేస్తున్నారని అన్నారు. 'నీకు చేతనైతే కృష్ణా నీటి విషయంలో చంద్రబాబుపై యుద్ధం ప్రకటించు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడు' అని సూచించారు. పాలమూరుకు ఎన్నటికి తీరని శాపం కాంగ్రెస్ పార్టీనే అని, దత్తత తీసుకున్నానని చెప్పి దగా చేసిన చరిత్ర చంద్రబాబుదని ధ్వజమెత్తారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు అర్థం లేని ఆరోపణలు చేయడం ముఖ్యమంత్రికి అలవాటుగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. దుబ్బాక శాసనసభ్యుడి కూతురు పెళ్లి కోసం అబుదాబి వెళితే దాన్ని వివాదం చేయడం రేవంత్ నీచత్వానికి పరాకాష్ట అని అన్నారు. తాను అబుదాబికి వెళ్లింది ఫిబ్రవరి 21న అని, ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగింది ఫిబ్రవరి 22న అని వివరించారు.

సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను తెరవాలి

సిద్దిపేట జోన్: రాష్ట్రంలో సన్‌ఫ్లవర్ దిగుబడి కొనుగోలు కేంద్రాలను ఇంకెప్పుడు ప్రారంభిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సన్‌ఫ్లవర్ పంట మద్దతు ధర రూ.7280 ఉంటే.. దళారులు రూ.5500 నుండి రూ.6 వేల మధ్య కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో క్వింటాకు రూ.వెయ్యికి పైగానే రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఇప్పటికైనా సన్‌ఫ్లవర్ రైతుల కష్టాలను పట్టించుకుని కొనుగోలు కేంద్రాలను తక్షణమే తెరవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

వరంగల్ ఎయిర్‌పోర్టు | ఆలస్యానికి రాష్ట్రమే కారణం

- అదనంగా 280 ఎకరాల భూమి ఇవ్వాలని రాష్ట్రాన్ని కోరాం
- భూ కేటాయింపు పూర్తయిన రెండున్నరేళ్లలో నిర్మిస్తాం
- రెండు కారణాల వల్ల క్లియరెన్స్ ఇవ్వడంలో జాప్యం.. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు
- ఎయిర్‌పోర్టుతో వరంగల్‌లో పెరగనున్న ఉపాధి: కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో కిషన్‌రెడ్డి


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సహకరించనందునే వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు అనుమతుల్లో తీవ్ర జాప్యం జరిగిందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం కవాడిగూడలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు రకాల కారణాలతో ఈ ఎయిర్‌పోర్టు క్లియరెన్స్‌లో తీవ్ర జాప్యం జరిగిందని తెలిపారు. హైదరాబాద్‌కు కేవలం 150 కిలోమీటర్ల దూరంలో వరంగల్ ఉండటంవల్ల జీఎంఆర్ నుంచి ఎన్ఓసీ రావడానికి ఆలస్యమైందని చెప్పారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అదనంగా 280 ఎకరాల భూమి కేటాయించాలని రాష్ట్రాన్ని కోరామని, భూకేటాయింపు పూర్తయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రెండున్నరేళ్లలో ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తిచేస్తామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్టు గతంలో ఆసియాలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్టుగా ఉండేదని గుర్తుచేశారు. గత పదేళ్లలో దేశంలో విమానాశ్రయాల సంఖ్య 74 నుంచి 150కి పెరిగిందని తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో 2,800 మీటర్ల రన్‌వే అవసరమని, అందుకోసం అదనంగా 280 ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేటాయించాలని కోరారు. భద్రాద్రి విమానాశ్రయం విషయంలో గతంలో సూచించిన స్థలం అనువుగా లేదని, దానికి బదులుగా ప్రతిపాదించిన స్థలానికి సంబంధించి ఫీజిబిలిటీని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఉడాన్ స్కీంలో వరంగల్ విమానాశ్రయం

వరంగల్ ఎయిర్‌పోర్టును ఉడాన్ స్కీమ్‌తో అనుసంధానించి కమర్షియల్ ఆపరేషన్స్‌కు అన్నిరకాలుగా సహాయం అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటు వల్ల వరంగల్‌లో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. వరంగల్‌కు కాకతీయుల నాటి వైభవాన్ని కల్పించేందుకు చిత్తశుద్ధితో కేంద్ర ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. వరంగల్, భద్రాచలం, నిజామాబాద్, ఆదిలాబాద్ వంటి ద్వితీయశ్రేణి నగరాల్లో విమాన సదుపాయాలను కల్పించేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

మాసాయిపేటకు కేసీఆర్.. మోర్బీకి మోదీ వెళ్లారా?

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాసాయిపేట రైలు ప్రమాదంలో 25 మంది చనిపోతే అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, గుజరాత్‌లోని మోర్బీలో కేబుల్ బ్రిడ్జి కూలిపోయి 134 మంది చనిపోతే ప్రధాని మోదీ ఘటనా స్థలాలకు వెళ్లారా? అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి ప్రశ్నించారు. కొండగట్టులో ప్రమాదం జరిగినప్పుడు కూడా సీఎం హోదాలో ఉన్న కేసీఆర్ వెళ్లలేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఎస్ఎల్‌బీసీ ప్రమాదంపై మాట్లాడుతున్నవారు ఆరోజు మోదీ, కేసీఆర్‌లను ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ఆదివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్ఎస్, బీజేపీలు ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులు రోజూ అక్కడే ఉండి పనులు సమీక్షిస్తున్నారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి కోమటిరెడ్డిలు కూడా ఘటనా స్థలానికి వెళ్లి రెస్క్యూ చర్యలను పర్యవేక్షించారని, సీఎం రేవంత్ కూడా ఆదివారం టన్నెల్ వద్దకు వెళ్లి అధికారులకు దిశానిర్దేశం చేసి వచ్చారని వివరించారు. బాధాకరమైన ఘటనను కూడా రాజకీయం చేయడం తగదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తరహాలో తమది ఫాంహౌస్ పాలన కాదని, జవాబుదారీ పాలన అని చెప్పారు. బీజేపీలో క్రమశిక్షణ లేదు.. శిక్షణ లేదని అన్నారు. ఆ పార్టీకి ఒక అధ్యక్షుడు ఉండగానే మరో అధ్యక్షుడు వస్తున్నాడంటూ ఆ పార్టీ నేతలే మాట్లాడుతున్నారని, క్రమశిక్షణ లేని బీజేపీ నేతలు తమకు ఏం సుద్దులు చెపుతారని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు.



ఈ ప్రపంచం నుంచి మనకు ఉన్న ఏకైక రక్షణ దాని గురించిన గట్టి జ్ఞానమే!

– జాన్ లాకి

సాక్షి

సోమవారం, 3 మార్చి 2025

వ్యక్తిగత ప్రపంచం

‘ఒక గ్రంథాలయం, ఒక గార్డెన్ ఉందంటే నీకు కావాల్సినవన్నీ ఉన్నట్టే’ అన్నారు రోమన్ తత్వవేత్త సిసిరో. ఆ రెండింటితో పాటు ఇంకా ఎన్నో ఉన్నప్పటికీ, కేవలం గ్రంథాలయం గురించే ముచ్చటగా తలుచుకున్నారు ఇటీవల ముగిసిన ‘జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్’లో తల్లి, రచయిత్రి సుధామూర్తితో అక్షతామూర్తి (బ్రిటన్ మాజీ ప్రధాని రిషీ సునాక్ భార్య) సంభాషిస్తూ తల్లికీ, తండ్రి (నారాయణ మూర్తి)కీ విడి పర్సనల్ లైబ్రరీలు ఉండేవనీ; తల్లి దగ్గర సాహిత్యం, చరిత్ర పుస్తకాలుంటే, తండ్రి దగ్గర సైన్సు, టెక్నాలజీ పుస్తకాలుండేవనీ; తానూ, తమ్ముడు రోహన్ రెంటినీ కలగలిపి చదివేవారమనీ చెప్పారు. అన్నట్టూ, రోహన్ మూర్తి పూనికతో 2015లో ప్రారంభమైన ‘మూర్తి క్లాసికల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా’ భారత సాహిత్యంలోని అన్ని క్లాసిక్స్ ఆంగ్లానువాదాలను ప్రచురిస్తోంది. ఏమైనా ఈ ‘ఇన్ఫోసిస్’ కుటుంబం పర్సనల్ లైబ్రరీ అనే భావనను మరోసారి సాహిత్య పాఠకులకు తియ్యగా గుర్తుచేసింది.

వ్యక్తిగత లైబ్రరీ అనేదానికి నిర్దిష్ట కొలతలు లేవు. అన్ని సైజుల్లో, షేపుల్లో ఉంటుంది. అసలు ఏ ఆకృతి లేకుండా కేవలం పుస్తకాల దొంతర రూపంలోనూ ఉండొచ్చు. ఒంటరి పాఠకుడిగానూ, జీతం లేని లైబ్రేరియన్‌గానూ ద్విపాత్రాభినయం చేసే ఒకరి లైబ్రరీ ఇంకొకరి లైబ్రరీలా ఉండదు. అది వారి అభిరుచికీ, సౌకర్యానికీ అద్దం. పుస్తకాలను అక్షర క్రమంలో పెట్టుకుంటామా, సైజుల వారీగానా, వర్గీకరణ పరంగానా, రచయితల పరంగానా అన్నది వారి వారి ఛాయిస్. టక్కున తీసి చదువుకోగలిగే ఫేవరెట్స్ ఎక్కడ పెట్టుకోవాలో, రిఫరెన్స్ కోసం అవసరమయ్యే పుస్తకాలు ఎటువైపుంచాలో, ఎప్పుడోగానీ తీయమని తెలిసేవి ఎటు పక్కుంచాలో, అసలు ప్రతిపూటా తీయడం వల్ల నలిగిపొయ్యే నిఘంటువుల లాంటివి ఎక్కడ ఉంచితే మేలో, కొనడమేగానీ ఎన్నడూ పేజీ తిప్పిన పాపానపోని పుస్తకాలను ఏం చేయాలో ఎవరిది వారికే తెలుస్తుంది. ఏ పుస్తకం పక్కన ఏది వస్తే చెలిమి చేసినట్టుంటుందో, దేని పక్కన ఏది రాకుండా చూసుకుంటే గొడవ తప్పించినట్టు అవుతుందో కూడా చూసుకోవాలి. లైబ్రరీ అనేది భిన్న రూపాలుగా విస్తరించి ఉంటుందనేది నిజమే అయినా, ప్రాథమికంగా అది అచ్చు పుస్తకాల నిలయం. అమెరికా రచయిత్రి సూసన్ సోంటాగ్ దగ్గర 15,000 పుస్తకాల భారీ భాండాగారం ఉండేది. వాటిని ఆమె ఆర్ట్, ఆర్కిటెక్చర్, తత్వశాస్త్రం, మనస్తత్వశాస్త్రం, చరిత్ర, మతం... ఇలా ప్రక్రియలుగా విభజించి పెట్టుకునేవారు. అర్జెంటీనా–కెనడా రచయిత ఆల్బెర్టో మాంగ్వ్యాల్ దగ్గర ఏకంగా 35,000 పుస్తకాలు ఉన్నాయి. వాటిని ఎక్కడా సరిగ్గా సర్దుకోలేక ఫ్రాన్స్‌లో అవి పట్టేంతటి ఒక పాత భవంతి దొరికితే దాన్ని ఆయన కొనేశారు. ఇక అబ్బురపరిచే మేధానిధి లాంటి ‘బాబాసాహెబ్’ అంబేడ్కర్ తన జీవితకాలంలో తన నివాసం ‘రాజగృహ’లో సుమారు యాభై వేల పుస్తకాలను సేకరించారు. ప్రపంచంలోనే అతి పెద్ద వ్యక్తిగత గ్రంథాలయాల్లో ఇదీ ఒకటి. వందల నుంచి వేల పుస్తకాల ఇంటి లైబ్రరీలు ఉన్న రచయితలు, సాహిత్య ప్రేమికులు తెలుగులోనూ గురజాడ అప్పారావు నుంచి మొదలుకొని ఎందరో ఉన్నారు.

సాహిత్య వాసన ఉన్నవారికైనా ఒకరి ఇంటికెళ్తే ముందు చూపు పడేది వారింట్లో ఉన్న పుస్తకాలపైనే! అది సంభాషణకు మంచి ఊతం కాగలదు. కానీ అన్నీ మూటగట్టేసి అటక మీద పెట్టేసే జీవితపు కరుకు వాస్తవంలోకి మనుషులు జారిపోతున్నారు. అందుకే కనీసం ప్రదర్శన నిమిత్తం అయినా లైబ్రరీలు ఇళ్లల్లో ఆకర్షణగా ఉండటం లేదు. చేతిలో పుస్తకంతో కనబడటం పాత వాసనగా మారిపోయింది. కలిసి ఒక సినిమాకో, షాపింగ్‌కో వెళ్లినట్టుగా స్నేహంగా లైబ్రరీకి వెళ్లడం అనేది ట్రెండీగా ఉండటం లేదు. అందుకే పర్సనల్ లైబ్రరీలు అటుండనీ, అసలు లైబ్రరీలే తగ్గిపోతున్నాయి. పుస్తకాలను చదవడం బరువైపోతోంది, వాటిని నిర్వహించడం భారమైపోతోంది. ‘‘మనం చదివిన స్కూల్ లైబ్రరీలోని తెలుగు పుస్తకాలు గత పాతికేళ్లుగా చదివినవాళ్లు లేరుట. తీసేస్తున్నారని తెలిసి కొంచెం సొమ్ము ఇచ్చి కొనేశాను’ అంటూ విశ్వం నుంచి మెసేజ్’’ అని మొదలవుతుంది విజయ కర్రా రాసిన ‘ఆ ఒక్కటి’ కథ. కథానాయకుడు పదో తరగతిలో ఉన్నప్పుడు రాసిన ప్రేమలేఖను ఆ అమ్మాయికి ఇచ్చే ధైర్యం లేక ఒక పుస్తకంలో పెడతాడు. ఇన్నింట్లో ఆ పుస్తకం ఏమిటో ఇన్నేళ్ల తర్వాత వెతకడం ఇందులో కథ. ఆ పుస్తకాల డబ్బాలు విప్పుతున్నప్పుడు బయటపడే తెలుగు, బెంగాలీ, సంస్కృత, రష్యన్ రచయితల పేర్లు బయటికి చదువుకోవడం పుస్తక ప్రేమికులకు మాత్రమే అర్థమయ్యే సంతోషం. చివరకు ‘భ్రమరవాసిని’ నవల ఆఖరు పేజీలలో ఆ ప్రేమలేఖ బయటపడుతుంది. అలా ‘మన జాతి సంపద’ ఏమిటో తెలుస్తుంది.

ఇటాలియన్ రచయిత అంబెర్తో ఎకో వ్యక్తిగత గ్రంథాలయంలో ముప్పై వేలకు పైగా పుస్తకాలు ఉండేవి. ఇందులో చాలా పుస్తకాలు చదవనివి ఉంటాయని దీన్ని ‘యాంటీ–లైబ్రరీ’ అని అభివర్ణించారు లెబనీస్–అమెరికన్ వ్యాసకర్త నసీమ్ నికోలస్ తలాబ్. ఒక్క క్లిక్ దూరంలో వందల ఈ–బుక్స్ అందుబాటులో ఉన్న సాంకేతిక యుగంలో, అవసరమైనది ఇట్టే బ్రౌజ్ చేయడం వీలుకాక పుస్తకాల దొంతరలన్నీ తిప్పి తిప్పలు పడాల్సిన పరిస్థితిలో... మన ఇంట్లో ‘స్పేస్’ ఇవ్వాల్సివచ్చే భౌతిక పుస్తకం విలువైనది అయివుండాలి. కానీ పుస్తకాలంటూ ఇంట్లో ఉండాలి. ఎందుకంటే డిజిటల్ పుస్తకం చదివిన ఫీలివ్వదు; పుస్తకంలోని విషయమే తప్ప, ఆ పుస్తకం బయటి వ్యవహారంతో ముడిపడే జ్ఞాపకాన్నివ్వదు. మనసుకు నచ్చే కొన్ని పుస్తకాలతో అయినా ఇంటిని అలంకరించుకుందాం. గుండెల్లో భౌతిక పుస్తకాన్ని పదిలపరుచుకుందాం.

ఇది కొత్త రాజకీయమా?

కామెంట్



కరణ్ థాపర్

నా చిన్నతనంలో డోనాల్డ్ అనగానే డక్ గుర్తొచ్చేది. ఇప్పుడు ట్రంప్ ఆ స్థానం ఆక్రమించారు. వాల్ట్ డిస్నీ కంపెనీ రూపొందించిన ప్రపంచ ప్రఖ్యాత కార్టూన్ క్యారెక్టర్ డోనాల్డ్ డక్ లేదా ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... శక్తిమంతమైన అగ్రరాజ్యం అమెరికాకు ఈ ఇద్దరిలో ఎవరు ఎక్కువగా ప్రాతినిధ్యం వహిస్తారు?

మొదటి ప్రపంచ యుద్ధానికీ ముందూ, ఆ తర్వాతా ఫ్రాన్స్ ప్రధానమంత్రిగా వ్యవహరించిన జార్జెస్ క్లెమెన్సో అమెరికా గురించి చేసిన ప్రఖ్యాత వ్యాఖ్యను ఇక్కడ మనం ప్రస్తావించుకోవాలి. ఆయన అభిప్రాయం ప్రకారం, నాగరికత అనే మధ్య దశను అనుభవించకుండానే, అనాగరికత నుంచి అధోగతికి నేరుగా పురోగమించిన దేశం ప్రపంచంలో ఒకే ఒక్కటి ఉంది... అది అమెరికా! ఆయన ఇప్పుడు జీవించి ఉంటే ట్రంప్ గురించి ఏమనేవారో?

డోనాల్డ్ ట్రంప్, వ్లాదిమీర్ జెలెన్‌స్కీ మధ్య ఇటీవల తలెత్తిన కలహం అబ్బురపరిచేది, లేదంటే నమ్మశక్యం కానిది. ఈ పనికి మాలిన కలహం అమెరికా అధ్యక్షుడి నిజస్వరూపం ఎలాంటిదో తేటతెల్లం చేసింది. కానీ మొన్న శుక్రవారం ఏం జరిగిందో తెలియాలంటే, జనవరి నుంచి జరుగుతున్న విషయాలను అర్థం చేసుకోవాలి.

జెలెన్‌స్కీ ఓ ‘నియంత’ అంటూ ట్రంప్ అభివర్ణించారు. ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. జెలెన్‌స్కీకి ఆ దేశ ప్రజల్లో 4 శాతం మాత్రమే మద్దతు ఉందని చెప్పారు. ఉక్రెయిన్ ఎన్నికల్లో ఆయనకు 57 శాతం మద్దతు లభించిన వాస్తవాన్ని ఈ సందర్భంగా మనం గుర్తు చేసుకోవాలి. అయితే ఆ ‘4 శాతం’ అనేది రష్యా ప్రాపగాండా అని జెలెన్‌స్కీ కొట్టిపారేశారు.

ట్రంప్ అక్కడితో ఆగలేదు. ఉక్రెయిన్ అధినేతను ‘ఒక మోస్తరుగా సక్సెస్ అయిన కమెడియన్’ (అధ్యక్షుడు కాకమునుపు జెలెన్‌స్కీ ఒక నటుడు) అని కొట్టిపారేశారు. రష్యా – ఉక్రెయిన్ యుద్ధానికి ఆయనే తెరతీశారనీ ఆరోపించారు. సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోనట్లయితే తన దేశాన్ని కోల్పోతారు అని ఒక అడుగు ముందుకువేసి మరీ హెచ్చరించారు.

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా ప్రభుత్వం జరుపుతున్న చర్చల నుంచి జెలెన్‌స్కీనీ, ఇతర యూరప్ దేశాల నేతలనూ ట్రంప్ దూరం పెట్టారు. రష్యా అధ్యక్షుడు శాంతి కోరుకుంటున్నారని పలు ఇంటర్వ్యూలలో ఆయన పుతిన్‌ను ప్రశంసించారు. తాను పుతిన్‌ను విశ్వసిస్తున్నానని విస్పష్టంగా ప్రకటించారు. రష్యాదే పై చేయి అని నమ్ముతున్నట్లు తేల్చి చెప్పారు. చర్చల్లో భాగస్వామిగా చేయాల్సినంత ముఖ్యుడు కాదని వ్యాఖ్యానించి జెలెన్‌స్కీని కించపరిచారు.



వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్ష కార్యాలయం (ఓవల్ ఆఫీస్)లో దోనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ

ఎంత రెచ్చగొట్టినా సరే మౌనం పాటించాలని ఉక్రెయిన్ అధినేతకు సలహాలు అందివుంటాయి. అయినా జెలెన్‌స్కీ ఊరుకోలేదు. రష్యా ‘తప్పుడు ప్రచారపు బుడగ’లో ట్రంప్ జీవిస్తున్నారని దుయ్యబట్టారు. ఉక్రెయిన్‌కు 500 బిలియన్ డాలర్ల సాయం అందించామన్న ట్రంప్ మాటలతో కూడా ఆయన విభేదించారు. అది ‘సీరియస్’గా చెబుతున్నమాట కాదని కొట్టేశారు.

అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, జాతీయ భద్రతా సలహాదారు మైఖెల్ వాల్ట్స్‌ను రెచ్చగొట్టడానికి ఇంతకంటే ఇంకేం కావాలి! వారు వెంటనే స్పందించారు. ట్రంప్ మీద నోరు పారేసుకోవద్దని జెలెన్‌స్కీని ప్రసార మాధ్యమాల ద్వారా హెచ్చరించారు. నిజానికి నోరు పారేసుకున్నది ట్రంపే!

ఇదంతా గమనిస్తుంటే, ఏమనిపిస్తోంది? సున్నిత హాస్యంతో సత్ప్రవర్తనకు మారుపేరుగా నిలిచిన ‘డోనాల్డ్ డక్’ ఈ వ్యవహారాన్ని సుతరామూ అంగీకరించలేదు. ఈసడించుకుని గగ్గోలు పెట్టేది. క్లెమెన్సో తన అభిప్రాయానికి తాజా పరిణామాలు రుజువు అనేవారు. దిగజారినవారు మాత్రమే ఇలా ప్రవరిస్తారు.

నేను ఇప్పుడొక భిన్నమైన ప్రశ్న వేస్తాను. సాటి ప్రభుత్వ అధినేతను, అదీ తమ మిత్రపక్ష ప్రభుత్వ అధినాయకుడిని... శత్రు దేశం కొమ్ము కాస్తూ ఒక అమెరికా అధ్యక్షుడు ఇలా బహిరంగంగా చులకన చేసి మాట్లాడిన దృష్టాంతం మీరెప్పుడైనా విన్నారా? మీ ఊహకు అందని విరుద్ధ భావన కదా ఇది!

ఈ చర్చ మరొక ప్రశ్నకు దారి తీస్తుంది. తాను అమెరికా అధ్యక్షుడు, శక్తిమంతుడు, విలక్షణ స్వభావి కనుక తానొక్కడికే ఎలా మాట్లాడినా చెల్లుబాటు అవుతుందా? లేదా ఇతర ప్రభుత్వాల అధినేతలు సైతం ఆయన్ని అనుసరించే ప్రమాదం ఉందా? మరో విధంగా చెప్పాలంటే, ట్రంప్ ప్రవర్తన కొత్త తరహా రాజకీయాలకు ముందస్తు సూచనేమో! ఇతరులూ అలా మాట్లాడితే అదో కొత్త ఆనవాయితీ అవుతుంది.

- సాటి ప్రభుత్వ అధినేతను, అదీ తమ మిత్రపక్ష ప్రభుత్వ అధినాయకుడిని... శత్రుదేశం కొమ్ము కాస్తూ ఒక అమెరికా అధ్యక్షుడు ఇలా బహిరంగంగా చులకన చేసి మాట్లాడిన దృష్టాంతం మీరెప్పుడైనా విన్నారా?
- ఈ తీరుతోనే అమెరికా మళ్లీ గొప్ప దేశం అవుతుందా? లేదా తనంతట తానే క్రమేణా క్షీణించి పోతుందా?
- ఎంత రెచ్చగొట్టినా సరే మౌనం పాటించాలని ఉక్రెయిన్ అధినేతకు సలహాలు అందివుంటాయి. అయినా జెలెన్‌స్కీ ఊరుకోలేదు. రష్యా ‘తప్పుడు ప్రచారపు బుడగ’లో ట్రంప్ జీవిస్తున్నారని దుయ్యబట్టారు.

నా ఉద్దేశంలో కేవలం చిన్న దేశాల అధ్యక్షుల గురించి మాత్రమే శక్తిమంతమైన దేశాల అధినేతలు ఇలా లెక్క లేనట్లు మాట్లాడగలరు. స్కూల్లో అయితే దీన్ని బుల్లీయింగ్ అంటాం. ఇవ్వాళా రేపూ ఇదే వాస్తవ రాజకీయం. ఇంకా చెప్పాలంటే, నడుస్తున్న రాజనీతి!

చివరకు ట్రంప్ ప్రవర్తన సమకాలీన అమెరికా గురించి ఆందోళనకరమైన ప్రశ్నను లేవనెత్తుతోంది. జాత్యహంకారం, సామాజిక వివక్ష, అన్యాయాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్న భావన వదిలేసిన తర్వాత... ఇక ఏదైనా సరే ఎలా నిషిద్ధం అవుతుంది? అందుకే ఏం మాట్లాడినా, ఎలా విరుచుకుపడినా ఇప్పుడు సమ్మతమే అవుతుందా? అది అసత్యమైనా, అన్యాయమైనా, పూర్తిగా పక్షపాతమైనా సరే ఆమోదయోగ్యమేనా? ఈ తీరుతోనే అమెరికా మళ్లీ గొప్ప దేశం అవుతుందా? లేదా తనంతట తానే క్రమేణా క్షీణించి పోతుందా? తన ఔన్నత్యాన్ని మరీ మరీ దిగజార్చుకుంటుందా? తన నైతిక స్థితిని ఇంకా ఇంకా బలహీనపరుచుకుంటుందా?

శుక్రవారం జరిగిన కలహం వల్ల ఉక్రెయిన్, యూరప్, ఆఖరికి అమెరికా కూడా తీవ్రమైన చిక్కులు ఎదుర్కోవచ్చు. దీన్నంతటినీ చూస్తూ నవ్వుకుంటున్నది ఒకే ఒక్కరు... రష్యా అధ్యక్షుడు! అయితే, తన దురుసుతనానికి త్వరలోనే ట్రంప్ పశ్చాత్తాపపడ్డా నేను ఆశ్చర్యపోను. కానీ అప్పటికే ఆలస్యమవుతుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

కొత్త స్నేహాలు



యూఎస్‌ను నమ్మలేమని యూరప్ ఎంత త్వరగా అర్థం చేసుకుంటే, స్వేచ్ఛా ప్రపంచానికి అంతమంచిది. ఉమ్మడి సైనిక కూటములు ఏర్పరుచుకోవడంతో సహా యూరప్, కామన్‌వెల్త్ దేశాలు సందర్భానికి తగినట్టుగా వ్యవహరించాలి.

– మహమ్మద్ నషీద్, మాల్దీవుల మాజీ అధ్యక్షుడు

ఉద్వేగ సామర్థ్యం ఉందా?



తల్లితండ్రులు తమ అబ్బాయిని పెళ్లి చేసుకొమ్మని ఒత్తిడి చేసేముందు, ఆ పెళ్లిని సంబాళించుకోగలిగే ‘ఈక్యూ’ (ఉద్వేగ ప్రజ్ఞ) వాళ్లకు ఉన్నదా అని చూసుకోండి. అది సాధ్యం కాకపోతే పెళ్లికి దూరంగా ఉండటమే మంచిది. కేవలం సంపాదించడమే ఒకరిని పురుషుడిని చేయదు. మానవ సంపర్కం అనేది పరస్పరం జననేంద్రియాలను సొంతం చేసుకోవడానికి మించినది.

– స్వాతి కె., న్యాయవాది

నేర్చుకుంటేనే మేలు



నేను పుట్టిన రాష్ట్రం మరాఠీ. నేను పుట్టిన కుటుంబం గుజరాతీ. దేశ విద్యా విధానం నన్ను ఇంగ్లిష్, హిందీ నేర్చుకునేట్టు చేశాయి. అవకాశం ఉండటంతో కౌమారంలో ఫ్రెంచ్ నేర్చుకున్నాను . నా క్లినిక్‌కు వచ్చే పేషెంట్లను మీకు ఏ భాష సౌకర్యంగా ఉంటుందని ముందు అడుగుతాను. అది వారికి రిలీఫ్ ఇస్తుంది. ఏ రాజ కీయ నాయకుడైనా మీరు భాష నేర్చుకోవడానికి అడ్డుపడితే, అంతిమంగా నష్టపోయేది మీరే!

– జకర్ డాక్టర్, వైద్యుడు

పట్టించుకోవద్దా?



ప్రధాన స్రవంతిలోకి ఒక ప్రధాన చర్చ రావాల్సివుంది. ఎందుకు దాన్ని ‘సింధు’ లోయ అంటారు? ఎందుకు సింధు – సరస్వతి’ లోయ అనరు? ఎందుకు పాకిస్తాన్‌లోని మొహెంజోదారో మీదే ప్రత్యేక దృష్టి? ధోలావీరా (గుజరాత్), రాఖిగఢీ (హరియాణా) లాంటి వాటిని ఎందుకు అసలు ప్రస్తావించరు?

– రాజీవ్ మల్హోత్రా, పరిశోధకుడు

ఎలాంటి డీల్ ఇది?



తర్వాతి తరానికి మనం దారుణమైన సందేశాన్ని ఇస్తున్నాం – ప్రపంచంలోని ప్రతీదీ ‘డీల్’ (లావాదేవీ) ద్వారానే కుదురుతుంది. ఈ డీల్ బరువు కింద మానవ విలువలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. మనకు డీల్ కుదిర్చినంతవరకే సూత్రాలు పనికొస్తాయి. డీల్ లేకపోతే మన నాయకులు అన్యాయం జరిగినప్పుడు కూడా మౌనంగా ఉంటారు. మానవాళి భవిష్యత్తుకు ఎంత దారుణమైన వారసత్వం ఇస్తున్నాం!

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

తగిన దుస్తులు



100 మిలియన్ డాలర్లు అడగడానికి గనక వైట్ హౌస్‌కు వెళ్తే, నేను సూట్, టై ధరిస్తాను.

– సాల్వతోర్ బబోన్స్, సోషియాలజిస్ట్

ఈ లాభం ఎలా వచ్చింది?

బీఎస్ఎన్ఎల్‌కి చివరగా 2009–2010 ఆర్థిక సంవత్సరంలో 581 కోట్ల రూపాయల లాభం వచ్చింది. అది కూడా అప్పటికి దానికి ఉన్న డిపాజిట్ల మీద వచ్చిన వడ్డీ తప్ప వాణిజ్యపరమైన లాభాల వల్ల కాదు. వాణిజ్య పరంగా దానికి లాభాలు 2007–2008 ఆర్థిక సంవత్సరంలో చివరగా వచ్చాయి. భారత ప్రభుత్వం ‘సావరిన్ గ్యారెంటీ’తో రూ. 8,500 కోట్ల రుణం బాండ్ల రూపంలో తీసుకోవడంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో 2020 సెప్టెంబర్ 28న బీఎస్ఎన్ఎల్ లిస్ట్ అయింది. దానితో ప్రతి మూడు నెలలకు ఒకసారి తమ ఆర్థిక ఫలితాలను సెబీకి ఇవ్వవలసి ఉంటుంది. ఈ రకంగా ప్రతి మూడు నెలలకు ఆ సంస్థ తన ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తోంది. డిసెంబర్ 2024తో ముగిసిన మూడు నెలల కాలానికి బీఎస్ఎన్ఎల్‌కు నికరంగా 262 కోట్ల లాభం 17 ఏళ్ల తర్వాత వచ్చింది. ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలానికి మొత్తంగా చూస్తే ఇంకా నష్టాలలోనే ఉన్నా, ఒక త్రైమాసికంలో లాభాలు ఆర్జించడం దాదాపు 17 ఏళ్లలో ఇదే తొలిసారి. అయితే ఇది ఎలా సాధ్యం అనేది ఇప్పుడు చూద్దాం.

రెవెన్యూ పరంగా చూస్తే కేవలం 131 కోట్లు మాత్రమే ఆదాయం పెరిగింది. సాధారణంగా మూడు, నాలుగు త్రైమాసికాల్లో టెలికం కంపెనీల ఆదాయాలు పెరుగుతాయి కనుక ఆ ఆదాయం పెరుగుదల లెక్కలోకి రాదు. కానీ ఇతర ఆదాయంలో 336 కోట్ల పెరుగుదల, ఉద్యోగుల జీతభత్యాల ఖర్చులో 336 కోట్లు తగ్గటం, డిప్రిసియేషన్, ఋణ మాఫీ వంటి అంశాలలో 766 కోట్లు తగ్గుదల వల్ల ఈ లాభం ఆర్జించడం సాధ్యమయింది. అంటే ఆర్థిక ఫలితాల లెక్కలు కట్టడంలో ఈ 2024–25 నుండి బీఎస్ఎన్ఎల్ చేసిన మార్పుల వల్ల ఇది సాధ్యం అయింది.

లెక్కలు కట్టడంలో చేసిన మార్పులు ఏమిటి?

ఉద్యోగుల జీతభత్యాలను ఆ యా ప్రాజెక్టుల వారీగా విడగొట్టి చూపడం వల్ల రూ. 337 కోట్లు ఖర్చు ఆదా అయింది. అలాగే డిప్రిసియేషన్, పారు బకాయిల రద్దు వంటి చర్యలను ఆ యా సర్కిళ్లకు ప్రత్యేకంగా లెక్క కట్టడం ద్వారా 766 కోట్లు తక్కువ చూపించగలిగారు. గతంలో ఈ మొత్తాలను సర్కిల్ వారీగా కాకుండా మొత్తం మీద చూపించేవారు. ఏతావతా స్పెక్ట్రం మీద కట్టే మొత్తం డబ్బులను విడగొట్టి ఆ యా సర్కిళ్లలో చూపడం, తగ్గుదలను ప్రాజెక్టు వారీగా చూపడం వల్ల ఆదాయం గణనీయంగా పెరగక పోయినా ఈ త్రైమాసికంలో 262 కోట్ల లాభం వచ్చింది. నాల్గవ త్రైమాసికంలో ఏడాదికి కట్టే మొత్తాలు ఉండటం మూలంగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది.



స్థూలంగా చూస్తే ప్రయివేటు టెలికాం కంపెనీలు రేట్లు పెంచితే కేవలం నాలుగు నెలల్లో 65 లక్షల మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌కు వస్తే ఆ తరువాత నెలలో మళ్లీ 4 లక్షల మంది వినియోగదారులు వెళ్లి పోయారు. అంతకు ముందు కేవలం ఏడాదిన్నరలో బీఎస్ఎన్ఎల్ రెండు కోట్ల మంది వినియోగదారులను కోల్పోయింది. ఇందుకు కారణం విశ్లేషిస్తే నెట్‌వర్క్ నాణ్యతా లోపం ప్రధాన కారణం. ప్రయివేటు టెలికాం కంపెనీలు 5జీ నెట్‌వర్క్ అందిస్తుంటే ఇంకా 3జీలోనే బీఎస్ఎన్ఎల్ ఉండటం, భారతీయ సాంకేతికతతో కూడిన 4జీ సేవలు అందుబాటులో రావడానికి గత నాలుగేళ్లుగా ఆలస్యం కావడం, ఇప్పుడిప్పుడే టవర్ల అప్‌గ్రెడేషన్ పూర్తి అవుతున్నా కొన్ని సాంకేతిక సమస్యలు పరిష్కారం కావాల్సి ఉండటం... వంటి కారణాల వల్ల బీఎస్ఎన్ఎల్ మార్కెట్ షేర్‌ను పెంచుకోలేకపోతోంది.

4జీ సేవలు అందుబాటులోకి త్వరలో పూర్తి స్థాయిలో రాబోతున్నాయి. దానిని 5జీ లోకి మార్చుకునే అవకాశాలు ఉండటం, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు విదేశీ కంపెనీతో అనుసంధానం కానుండటంతోనైనా బీఎస్ఎన్ఎల్ తన ఆదాయాలు మరింత పెంచుకుని లాభాలు పూర్తి స్థాయిలో పొందాలని కోరుకుందాం.

– తారానాథ్ మురాల । టెలికామ్ రంగ విశ్లేషకులు

భావోద్వేగాల డిజిటల్ బందిఖానా!

అభిప్రాయం



బి.టి. గోవిందరెడ్డి

ఇటీవలి కాలంలో కౌమార దశ (టీనేజ్)లో ఉన్న పిల్లల ఆత్మహత్యలు పెరిగిపోతుండటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. 8, 9వ తరగతుల వరకు చదువే లోకంగా ఉన్న పిల్లలు... టెన్త్, ఇంటర్‌లలో చేరిన తర్వాత ఈ స్వీయ హననానికి పాల్పడుతుండటాన్ని తేలికగా తీసుకోరాదు. సెలవులు, వారాంతాల్లో సోషల్ మీడియాలో గంటల తరబడి రీల్స్ చూస్తూ గడిపిన నవ యువత మళ్లీ స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లడానికి ఇష్టపడటం లేదని వారి మనస్తత్వాన్ని లోతుగా పరిశీలించినవారి మాట. చదువుల ఒత్తిడి కొత్తదేమీ కాకున్నా... ‘రీల్స్’ భూతం వారి మెదడుపై దుష్ప్రభావాలను చూపుతున్నట్టు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇంటి వద్ద రోజూ పదిగంటలకు పైగా స్క్రీన్ చూడటానికి బానిసలైన తర్వాత నియంత్రిత వ్యవస్థలో కళాశాల, పాఠశాల వాతావరణాలకు సర్దుకోలేక చిన్న మనసులు తీవ్ర క్షోభకు గురవుతున్నాయి. ఈ వయసు వారి మెదడు సహజంగా భావోద్వేగాలను నియంత్రించుకోగల శక్తి కలిగి ఉన్నా... స్మార్ట్‌ఫోన్ అధిక వాడకం ఈ సంతులనాన్ని దెబ్బ తీస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి.

కౌమార వయసులో మెదడు అభివృద్ధి చెందే దశలోనే ఉంటుంది. మరీ ముఖ్యంగా ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్‌లో రసాయన మార్పులు జరుగుతూ ఉంటాయి. నిర్ణయాలు తీసుకోవడం, ఉద్వేగాల నియంత్రణ ఈ ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్ ద్వారానే జరుగుతూ ఉంటాయి. ఇదే సమయంలో మన భావోద్వేగాల వ్యక్తీకరణకు ఉపకరించే లింబిక్ వ్యవస్థ చాలా చురుకుగా ఉంటుంది. మెదడు లోపలి ఈ వ్యవస్థలో అమిగ్డలా అనే భాగం... భయం, కోపం, ఆనందం వంటి అనుభూతులకు కారణమైతే; ఆకలి, దప్పిక, శరీర ఉష్ణోగ్రత, ఉద్వేగాలకు, స్పందనలకు హైపోథాలమస్ కారణం అవుతుంది. ఇవి మాత్రమే కాకుండా... లింబిక్ వ్యవస్థలో హిప్పోకాంపస్, థాలమస్, హైపోథాలమస్, సింగులేట్ గైరస్, బేసల్ గాంగ్లియా వంటి అనేక మెదడు భాగాలు ఉంటాయి. ఫ్రంటల్ కార్టెక్స్, లింబిక్ వ్యవస్థల మధ్య అసమతౌల్యం ఏర్పడినప్పుడు యువతీ యువకుల్లో భావోద్వేగాలస్పందన చాలా తీవ్రంగా ఉంటుంది. అదే సమయంలో మానసిక క్షోభను, కుంగుబాటును నియంత్రించుకోవడం అంతగా సాధ్యపడదు.

అయితే సాధారణంగా ఈ లోటుపాట్లు ఉన్నా కౌమార వయస్కులు మానసిక క్షోభను సమర్థంగానే తట్టుకోగలరు. ప్రకృతిసిద్ధంగా ఉండే న్యూరో కెమికల్స్ వల్ల ఇది సాధ్యమవుతుంది. ఉల్లాసానికి కారణమయ్యే డోపమైన్ వంటి న్యూరో రసాయనాల కారణంగా వీరు ఆనందం, సంతృప్తిని వెతుక్కుంటూ ఉంటారు. అలాగే అభివృద్ధి చెందుతూ ఉండే హెచ్‌పీఏ (హైపోథాలమిక్–పిట్యూటరీ–ఎడ్రినల్యాక్సిస్) కూడా ఎక్కువ కాలం నిరాశ, నిస్పృహలో ఉండకుండా చూస్తుంది.



అంటే ఎంతో ప్రేమించే కుటుంబ సభ్యులు అకాల మరణం పాలైనా, తల్లితండ్రుల్లో ఎవరైనా రోజూ తీవ్రంగా హింసిస్తున్నా ఆ వయసు పిల్లల్లో ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనే రాదు. పిల్లల్లో సహజంగా ఉండే ఈ రక్షణ వ్యవస్థ సుదీర్ఘ స్మార్ట్‌ఫోన్‌ల వినియోగంతో ముక్కచెక్కలవుతుంది. ఫలితంగా ఆందోళన, మానసిక ఉద్వేగాలతో అస్థిరతలు ఏర్పడతాయి.

మృత్యుకుహరం ఈ డిజిటల్ వల

విద్యార్థులు సెలవు రోజుల్లో రోజుకు పది గంటల కంటే ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్‌లను వాడుతున్నట్లు అంచనా. సామాజిక మాధ్యమాలను వాడినంత సేపూ మెదడులో ఆనందం కలిగించే డోపమైన్ (హ్యాపీ హార్మోన్) అధికంగా ఉత్పత్తి అవుతుంది. ఇది కాస్తా కంపల్సివ్ బిహేవియర్ (వద్దని అనుకున్నా కొన్ని పనులు పదే పదే చేయాలనుకోవడం)కు దారి తీస్తుంది. విద్యార్థులు సెలవులు ముగించుకుని కాలేజీలు, పాఠశాలల్లో అడుగుపెట్టగానే డోపమైన్ ఉపసంహరణ కారణంగా అసహనం పెరిగిపోతుంది. చిన్న చిన్న విషయాలకే ఆగ్రహం, అకారణ దిగులు ఆవహిస్తాయి. ఈ స్థితిలో ఆత్మహత్య వైపు వారి ఆలోచన మళ్లుతుంది.

కాపాడుకోవడం మన చేతుల్లోనే...

తల్లితండ్రులు, చదువు చెప్పేవారు, విధాన రూపకర్తలు సమన్వయంతో పనిచేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం సాధించడం కష్టమేమీ కాదు. డిజిటల్ టెక్నాలజీ వాడకానికి సంబంధించి విద్యార్థులకు కొన్ని హద్దులు నిర్ధారించాలి. ఒక క్రమ పద్ధతిలో వారి స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్, ట్యాబ్లెట్‌ల వాడకాన్ని తగ్గించేలా ప్రోత్సహించాలి. అర్థవంతమైన కంటెంట్‌ను పరిచయం చేయాలి. సెలవుల తర్వాత స్కూళ్లు, కాలేజీలు తెరిచిన వెంటనే సీరియస్‌గా పాఠాల జోలికి పోకుండా మొదటి రెండు రోజులు ఒత్తిడి లేని వాతావరణాన్ని సృష్టించాలి. పిల్లలు ఒక రోజు ఆగి కాలేజీకి వెళ్తామంటే వారిని నిందించడం, బెదిరించడం చేయకుండా తల్లిదండ్రులు తమ కాఠిన్యాన్ని తగ్గించుకోవాలి. పాఠశాలల్లో పరిమిత స్థాయిలో డిజిటల్ టెక్నాలజీలను వాడేలా చేయడం ద్వారా వారు సామాజిక మాధ్యమాల వల నుంచి నెమ్మదిగా బయటపడే అవకాశం ఏర్పడుతుంది. విద్యా సంస్థల్లో కౌన్సెలింగ్ ఏర్పాట్లు ఉండాలి.

ఆరోగ్యకరమైన హద్దులను నిర్ణయించడం, విద్యాపరంగా, సామాజికంగా అనుకూల వాతావరణాన్ని సృష్టించడం వంటి చర్యల ద్వారా కౌమార వయస్కులు... డిజిటల్ – వాస్తవ ప్రపంచాల మధ్య తేడా తెలుసుకుని సమతుల్యతను సాధించడానికి వీలు కలుగుతుంది. ఇది కేవలం తల్లితండ్రులు, విద్యావేత్తల బాధ్యత కాదు. సమాజం మొత్తానిది. అప్పుడు మాత్రమే యువత భావోద్వేగ సంక్షోభాన్ని నివారించగలం. యువతకు అందమైన భవిష్యత్తును కల్పించగలం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మొబైల్: 90524 72424

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.చవితి రా.10.31 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: రేవతి ఉ.10.44 వరకు, తదుపరి అశ్వని, వర్జ్యం: తె.5.20 నుండి 6.47 వరకు (తెల్లవారితే మంగళవారం), దుర్ముహూర్తం: ప.12.34 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, అమృతఘడియలు: ఉ.8.24 నుండి 9.57 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.22, సూర్యాస్తమయం: 6.02.

సైలో బంకర్.. సైలెంట్ కిల్లర్

ఖమ్మం జిల్లా కిష్టారం వద్ద సింగరేణి బొగ్గు లోడింగ్‌కు ఏర్పాటు

- ఫలితంగా 24 గంటల దుమ్ము, ధూళితో సమీప ప్రజల అవస్థలు
- ఇళ్లను కమ్మేస్తూ పేరుకుపోతున్న నల్లమట్టి
- ఆరేళ్లలో 45 మంది అనారోగ్యంతో మృతి చెందారంటూ ఆందోళన

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: పాడి పంటలు..ప్రకృతి అందాలతో అలరారిన ఆ గ్రామం ఇప్పుడు మృత్యు ఘంటికలు మోగిస్తోంది. సింగరేణి సంస్థ ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం సమీపాన ఓపెన్‌కాస్ట్ గని నుంచి బొగ్గు లోడింగ్‌కు ఏర్పాటు చేసిన సైలోబంకర్ వారి పాలిట మరణశాసనంగా మారింది. బొగ్గు లోడింగ్ సమయాన బంకర్ల నుంచి లేస్తున్న దుమ్ము, ధూళి గ్రామ పరిధిలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీలను కమ్మేస్తోంది. ఇళ్లు, గోడలు, నీరు ఇలా అన్నింటా దుమ్ము పేరుకుపోతుండగా, శరీరాల్లోకీ చేరి అనారోగ్యానికి గురై తనువు చాలిస్తున్నారు. సింగరేణి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారంటూ సైలో బంకర్లను తొలగించాలనే డిమాండ్‌తో స్థానికులు ఫిబ్రవరి పదో తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.

కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్

కిష్టారం ఓపెన్‌కాస్ట్ గని నుంచి బొగ్గును రైల్వేమార్గం ద్వారా రవాణా చేసేందుకు వీలుగా రూ.398 కోట్లతో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఓసీలో ఉత్పత్తి అయిన బొగ్గును నాలుగు కి.మీ. దూరాన ఉన్న క్రషింగ్ స్టేషన్‌కు పంపి అక్కడ బొగ్గు పరిమాణాన్ని తగ్గిస్తారు. ఆపై 24 వేల టన్నుల సామర్థ్యం ఉన్న స్టోరేజీ బంకర్‌కు పంపి, కన్వేయర్ బెల్ట్ ద్వారా లోడింగ్ పాయింట్ అయిన వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన సైలో బంకర్‌కు చేరుస్తారు. ఆ తర్వాత బొగ్గును రైల్వే వ్యాగన్లలోకి లోడ్ చేస్తారు. ఈ విధానంలో గంట నుంచి గంటన్నర లోపే ఓ గూడ్స్ రైలులోని వ్యాగన్లలో లోడింగ్ పూర్తవుతుంది.

ఆ కాలనీలకు శాపం

రెండు సైలో బంకర్ల ద్వారా బొగ్గును 30 మీటర్ల ఎత్తు నుంచి రైల్వే వ్యాగన్లలోకి జారవిడుస్తున్నారు. ఈ సమయాన భారీగా దుమ్ము, ధూళి ఎగిసిపడి సమీపంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీలకు వ్యాపిస్తోంది. ఈ కాలనీల్లో 350 కుటుంబాలు, 1,500 మంది జనాభా నివసిస్తుండగా ఇళ్లు, వాకిళ్లేకాక ఇళ్ల ఆవరణ, సామగ్రి, తాగునీటిపైనా మసి పేరుకుపోతోంది.

బంకర్ వల్లే 45 మంది బలి..

2019లో బంకర్ నిర్మించినప్పటి నుంచి అంబేద్కర్ నగర్, బీసీ కాలనీల్లో 45 మంది వరకు అనారోగ్యంతో మృతిచెందారని స్థానికులు చెబుతున్నారు. ప్రతీ ఇంట్లో ఎవరో ఒకరు నీరసం, కాళ్లనొప్పులు, జ్వరం, కళ్ల మంటలు, శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులు ఇలా ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతూ జీవచ్ఛవాలుగా బతుకుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భవిష్యత్ దృష్ట్యా బంకర్‌ను తొలగించి తమ ప్రాణాలను కాపాడాలని పదిహేను రోజులుగా దీక్షలు చేస్తున్న వీరు.. ఇది సాధ్యం కాకపోతే ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేస్తున్నారు.



సైలోబంకర్ వద్ద వాటర్ స్ప్రింక్లర్ లేనప్పుడు వెలువడుతున్న బొగ్గు మసి



సైలో బంకర్ వద్ద వాటర్ స్ప్రింక్లర్‌తో నీరు వెదజల్లినప్పటి పరిస్థితి

బంకరే అమ్మ ప్రాణం తీసింది..



అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన శ్యామల భర్త చనిపోవడంతో కూలిపని చేస్తూ ఇద్దరు పిల్లలను పెంచి పెద్ద చేసింది. మంజుశ్రీ డిగ్రీ పూర్తి చేయగా.. ఆమె అన్న ఉద్యోగం చేస్తున్నాడు. ఆరోగ్యంగా ఉన్న తల్లి ఒకరోజు హఠాత్తుగా కళ్లు తిరిగి కింద పడగా వైద్యులు పరీక్షించి దుమ్ము పీల్చడం వల్ల ఊపిరితిత్తులకు పట్టిందని.. అక్కడి నుంచి మెదడులోకి చేరిందని తేల్చారు. 2023లో శ్యామల చనిపోగా అన్నాచెల్లెలు మిగిలారు.

చదువుకునే వయసులోనే మృత్యుఒడికి..



అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన నక్కా మేరి–రాములకు ఇద్దరు కూతుర్లు. అంకిత టీటీసీ చదువుతుండగా 2021 డిసెంబర్‌లో కడుపు నొప్పి రావడంతో సత్తుపల్లిలో వైద్యులకు చూపిస్తే ఇన్‌ఫెక్షన్ ఉందని తేల్చారు. ఆపై ఏపీలోని తిరువూరులో రూ.2 లక్షలు వెచ్చించి వైద్యం చేయించినా నీరసంగానే ఉండేది. అనంతరం కోమాలోకి వెళ్లి బ్రెయిన్ స్ట్రోక్‌తో 2022లో చనిపోయింది.

అవయవాలు పాడై..



అంబేద్కర్ కాలనీకి చెందిన 39 ఏళ్ల బుర్రా రవీంద్ర లారీ క్లీనర్‌గా పనిచేసేవాడు. భార్య రజని దివ్యాంగురాలు. ఆయన 3 నెలల క్రితం వరకు ఆరోగ్యంగా ఉండగా, ఒళ్లు వాపు రావడంతో ఖమ్మంలో ప్రైవేట్ ఆస్పత్రి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చూపిస్తే దుమ్ము పీల్చడం వల్ల ఊపిరితిత్తులు పాడైనట్టు తేల్చారు. దీంతో రవీంద ర్ సెల్ఫీ వీడియోలో బంకర్ వల్ల తాను అనారోగ్యానికి గురైనట్టు చెప్పగా, జనవరి 17న మృతి చెందాడు.

భర్త మృతి.. గుండెజబ్బుతో కొడుకు



అంబేద్కర్‌కాలనీకి చెందిన కొత్తపల్లి సునీత భర్త నర్సింహారావు సింగరేణిలో టిప్పర్లపై వెళ్లేవాడు. ఆ తర్వాత అనారోగ్యం పాలుకావడంతో ఆస్పత్రిలో చూపిస్తే గుండె మొత్తం దుమ్ము పట్టిందని చెప్పారు. వైద్యం కోసం రూ.3 లక్షలు వెచ్చించినా 2021లో ఆయన చనిపోయాడు. ఇక కుమారుడి గుండెకు కూడా రంధ్రం ఉందని తేలడంతో రూ.5 లక్షలతో గుంటూరులో వైద్యం చేయించారు.

సైలో బంకర్‌ను తొలగించాలి..



సైలో బంకర్ల వల్ల అంబేద్కర్‌నగర్ కాలనీ, బీసీకాలనీ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మా పెద్దనాన్న, పెద్దమ్మ గత ఏడాది చనిపోయారు. ఇప్పుడు సైలో బంకర్ వల్ల మా రాతలు మారిపోయాయి. గేదెల నుంచి పితికిన పాలు కూడా వాసన వస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి సమస్యకు పరిష్కారం చూపించాలి.

– పాలకుర్తి నాగేశ్వరరావు, అంబేద్కర్ కాలనీ

నేడు రాజస్తాన్‌కు భట్టి

సాక్షి, హైదరాబాద్: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సోమవారం రాజస్తాన్ పర్యటనకు వెళ్లనున్నారు. సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఆధ్వర్యంలో రాజస్తాన్‌లో 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి సింగరేణి సంస్థ, రాజస్తాన్‌లోని జైపూర్ విద్యుత్ వితరణ్ నిగమ్ లిమిటెడ్ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరగాల్సి ఉంది. రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, భట్టి విక్రమార్క సమక్షంలో సోమవారం జైపూర్‌లో ఈ మేరకు ఎంఓయూ జరగనుంది.

రేవంత్‌ది పూటకో మాట

- బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు పూటకో మాట..ఆ మాటకో బ్యాగు అన్న చందంగా మారిందని బీఆర్‌ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మన్నె క్రిశాంక్ మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి ఎన్ని స్కాములు చేసినా బీజేపీ ఎందుకు విచారణ అడగడం లేదు? ఆర్‌ఆర్ ట్యాక్స్ అని మాట్లాడే మోదీ ఎందుకు విచారణ జరపడం లేదు? పక్క రాష్ట్రంలో కూడా రేవంత్ మీద అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. కేపీసీ కంపెనీకి రూ. 210 కోట్ల కాంట్రాక్టు కర్ణాటకలో వచ్చింది.. కేపీసీ అనిల్‌కుమార్, రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి మధ్య ఎంత డీల్ కుదిరిందో చెప్పాలి. రేవంత్‌రెడ్డి ముందు బెదిరిస్తాడు.. తర్వాత తిరుపతిరెడ్డి సెటిల్ చేస్తాడు' అని క్రిశాంక్ విమర్శించారు.

విజయ డెయిరీ గుర్తులతో 'ప్రైవేట్' దోపిడీ

- వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు చక్రపాణి ఫిర్యాదు

వరంగల్: ఉమ్మడి వరంగల్, నిజామాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ప్రభుత్వ విజయ డెయిరీ గుర్తులతో 4 ప్రైవేట్ పాల డెయిరీలు ప్రజలను దోచుకుంటున్నాయని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి ఆరోపించారు. దీనిపై ప్రభుత్వ విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డికి ఫిర్యాదు చేసి వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రైవేట్ పాల డెయిరీలు.. ప్రభుత్వ విజయ డెయిరీ బ్రాండ్, ప్యాకింగ్‌ను అనుకరించడమే కాకుండా.. పాలలో హానికరమైన హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనాలు కలుపుతున్నాయని తెలిపారు. ఈ అక్రమ వ్యాపారంతో రాష్ట్రంలో నిత్యం సుమారు నాలుగు లక్షల లీటర్ల కల్తీ పాల విక్రయాలు జరుగుతున్నాయని వివరించారు. అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై న్యాయపరమైన చర్యలు చేపడతామని చైర్మన్ హామీ ఇచ్చినట్లు చక్రపాణి వెల్లడించారు.

'మహాకుంభమేళా'కు తెలంగాణ అధికారుల బృందం

- కృష్ణా, గోదావరి పుష్కరాల నేపథ్యంలో అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో రాష్ట్రంలో నిర్వహించే గోదావరి, కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఉన్నత స్థాయి అధికారుల బృందం ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా ప్రాంతాన్ని పరిశీలించింది. 60 కోట్ల మంది భక్తులు మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు చేసిన సంగతి తెలిసిందే. అన్ని కోట్ల మంది సందర్శించినా.. చిన్నచిన్న దుర్ఘటనలు మినహా కుంభమేళా దిగ్విజయంగా పూర్తయింది. కనీవినీ ఎరుగని రీతిలో యూపీ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 2027లో గోదావరి పుష్కరాలు, 2028 లో కృష్ణా పుష్కరాలు ఉన్న నేపథ్యంలో ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల బృందాన్ని అక్కడికి పంపింది. దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు ఇందులో పాల్గొన్నారు. వీరు అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు.

రైతులకు నీళ్లివ్వకపోతే పోరాటమే!

- మల్కపేట రైతులకు 48 గంటల్లో నీళ్లు ఇవ్వాలి
- లేదంటే ఇరిగేషన్ మంత్రి కార్యాలయం ముందు ధర్నా చేస్తా
- మేడిగడ్డ పర్రెను రిపేర్ చేయకుండా రైతులను గోస పెడుతున్నారు
- ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు
- సిరిసిల్ల పర్యటనలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ఎల్లారెడ్డిపేట మండలం దేవుని గుట్ట తండాలో రైతులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల: రైతులకు నీళ్లు, కరెంట్ ఇచ్చే తెలివి కాంగ్రెస్ పార్టీకి లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్నది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాలో ఎండిపోయిన వరి పొలాలను ఆదివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. రేవంత్ సర్కార్ కేసీఆర్‌పై ఉన్న కోపం, ద్వేషంతో రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోయేలా చేస్తోందని ఆరోపించారు. సిరిసిల్ల, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో సాగునీరు లేక వ్యవసాయం సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'కాళేశ్వరం నుంచి నీళ్లు తీసుకొచ్చి మల్కపేట రిజర్వాయర్‌లో పోస్తే, దేవునిగుట్ట తండాలో రైతులు సాగు చేసేవారు. మేడిగడ్డ పర్రెను రిపేర్ చేసి నీళ్లు ఇవ్వొచ్చు. సిరిసిల్ల జిల్లాలో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని చూస్తూ ఊరుకోం. 48 గంటల్లో నీళ్లు విడుదల చేయకపోతే నీటిపారుదల శాఖ మంత్రి కార్యాలయం ముందు ధర్నా చేస్తా' అని కేటీఆర్ హెచ్చరించారు. మిడ్ మానేరులో 16 టీఎంసీల నీళ్లు ఉన్నాయని, అందులో నుంచి ఒక టీఎంసీని మల్కపేట రిజర్వాయర్‌కు విడుదల చేస్తే ఈ ప్రాంత రైతుల వ్యవసాయానికి సరిపోతాయని తెలిపారు. సాగునీళ్లు విడుదల చేయకపోతే అన్నదాతలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని రైతులకు మల్కపేట ద్వారా సాగునీరు అందించాలని ఈఎన్‌సీ అనిల్ కుమార్, మధ్యమానేరు ఎస్ఈ సుమతితో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోనూ మాట్లాడినట్లు కేటీఆర్ వెల్లడించారు. మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు కుట్రపూరిత ప్రమాదమని అన్నారు.

రైతులను పొట్టన పెట్టుకుంటున్న రేవంత్

సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే 450 మంది రైతులను పొట్టన పెట్టుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లోని ఒక్క హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నీళ్లు పాతాళంలోకి, నిధులు ఢిల్లీకి, నియామకాలు గాల్లో కలిసిపోయాయని మండిపడ్డారు.

రైతు కుటుంబాన్ని పరామర్శించిన కేటీఆర్

జిల్లాలోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డిని కేటీఆర్ పరామర్శించారు. సిరిసిల్ల పట్టణంలో టీ స్టాల్ నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

బెనిఫిట్ పాలసీ ఏదీ?

- 8 నెలల్లో 65 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది 3,914 మంది
- వారందరినీ విధుల నుంచి తప్పించిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ
- రిటైర్‌మెంట్ బెనిఫిట్లు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణ ప్రయోజనాలపై తీవ్ర గందరగోళం నెలకొంది. 65 సంవత్సరాలు దాటిన వారిని గతేడాది జూన్ నుంచి తప్పిస్తున్నారు. గత ఎనిమిది నెలల్లో 65 సంవత్సరాలు నిండిన టీచర్ల సంఖ్య 3,914కు చేరింది. వీరిని విధుల నుంచి తప్పించినా, విరమణ ప్రయోజనాలేవీ అందలేదు. గత ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50 వేలు చొప్పున నగదు అందించాలి. అయితే ఈ ఉత్తర్వులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆ తర్వాత కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం రిటైర్‌మెంట్ బెనిఫిట్లను పెంచుతున్నట్టు ప్రకటించింది. అసెంబ్లీ వేదికగా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ప్రకటన చేయడంతో ఆందోళన సద్దుమణిగినా, నేటివరకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడలేదు.

విధుల నుంచి తప్పిస్తూ... ఖాళీలను చూపిస్తూ

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణ ప్రక్రియ గతేడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైంది. అయితే విరమణ ప్రయోజనాలపై స్పష్టత లేకపోవడంతో అధికారులు రెండు నెలల పాటు వారికి అవకాశం కల్పించారు. ఆ తర్వాత జూన్ నుంచి 65 సంవత్సరాలు దాటిన టీచర్లు, హెల్పర్లు విధులకు హాజరు కావొద్దని స్పష్టం చేశారు. వారు ఉద్యోగ విరమణ పొందుతున్నట్టు సీడీపీఓలు సంతకాలు తీసుకొని రాష్ట్ర కార్యాలయానికి నివేదిక సమర్పించారు. అయితే వారికి ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత ప్రయోజనాలు కల్పిస్తామని, అప్పటివరకు కార్యాలయానికి రావొద్దని చెబుతున్నారు. గత వారం రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర వ్యాప్త ఖాళీలను వెల్లడిస్తూ వాటి భర్తీకి సంబంధించిన బెనిఫిట్ల సంగతి తేల్చకుండా నియామకాలు చేపట్టడాన్ని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బెనిఫిట్లు అందించిన తర్వాతే నియామకాలు చేపట్టాలి

రిటైర్ అయిన ప్రతి టీచర్, హెల్పర్‌కు విరమణ ప్రయోజనాలు తక్షణమే అందించాలి. పెంచిన ప్యాకేజీకి అనుగుణంగాడబ్బులు అందించడంతోపాటు ఆసరా పెన్షన్, సంక్షేమ పథకాలను కూడా వర్తింపజేయాలి. వాటిని క్లియర్ చేయకుండా నియామకాలు చేపడితే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. – **నల్ల భారతి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు**

కార్పొరేట్ల కోసమే యూపీఎస్

- ఉద్యోగుల సొమ్ము రూ.10.5 లక్షల కోట్లు కార్పొరేట్ల చేతుల్లోకి
- సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్థితప్రజ్ఞ
- యూపీఎస్ అమలు గెజిట్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

సాక్షి, హైదరాబాద్ /కవాడిగూడ: కార్పొరేట్ సంస్థలకు దండిగా డబ్బును పంచిపెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను తీసుకొచ్చిందని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఆరోపించారు. తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏప్రిల్ 1 నుంచి అమలు కాబోతున్న యూపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్క్ వద్ద సీపీఎస్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. యూపీఎస్ విధానం అమలుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వసూలు చేసిన రూ.10.5 లక్షల కోట్లు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్తాయని ఆందోళన వ్యక్తంచేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పదేళ్లుగా పోరాటం చేస్తుంటే.. ఇప్పుడు కొత్తగా యూపీఎస్ తెచ్చి ఉద్యోగులను తీవ్ర గందరగోళానికి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సామాజిక భద్రత కల్పించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల కడుపు నింపే పనులు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతినెలా రాష్ట్రం నుంచి సీపీఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ రూ.450 కోట్లు షేర్ మార్కెట్‌కు ఎన్‌పీఎస్ ట్రస్టు ద్వారా తరలిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్తగా నియమితులైన 51 వేల మంది ఉద్యోగుల సీపీఎస్ సొమ్ముతో కలిపి ఇది రూ.600 కోట్లు అవుతుందని తెలిపారు.

మే 1న చలో ఢిల్లీ

యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 1న బ్లాక్ డే నిర్వహించాలని స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఆ రోజు దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ప్రధానమంత్రికి లేఖలు రాస్తూ జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మే 1న చలో ఢిల్లీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. పెన్షన్ చెల్లించే బాధ్యతల నుంచి ప్రభుత్వాలు తప్పుకొని ప్రజల సొమ్మును పెన్షన్ ఫండ్‌కు తరలించి షేర్ మార్కెట్లో పెట్టుబడులను పెంచే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. సీపీఎస్, యూపీఎస్‌ల లక్ష్యం ఇదేనని తెలిపారు.

ప్రజల్లో పౌల్ట్రీ ఉత్పత్తులపై విశ్వాసం కల్పించండి

- ముఖ్యమంత్రికి పౌల్ట్రీ అసోసియేషన్ల వినతి



సాక్షి, హైదరాబాద్: చికెన్, కోడిగుడ్ల విషయంలో ప్రజల్లో ఉన్న భయాందోళనలను దూరం చేయాలని పౌల్ట్రీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం టీపీఎఫ్, ఎన్ఈసీసీ, టీపీబీఏ, పౌల్ట్రీ ఇండియా తదితర అసోసియేషన్ల ప్రతినిధులు మాజీ ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. కోడిగుడ్లు తదితర పౌల్ట్రీ ఉత్పత్తుల విషయంలో జరుగుతున్న దుష్ప్రచారంపై ఆవేదన వ్యక్తం చేశారు. కోడిగుడ్ల విషయంలో ప్రజల్లో భయాందోళనలు దూరంచేసేలా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజల్లో విశ్వాసం కల్పించాలని వారు సీఎంను కోరారు. తమ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించారని, వెంటనే చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో పౌల్ట్రీ ప్రతినిధులు మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్‌బాబు, రాంరెడ్డి, ఆనంద్, ఉదయ్ సింగ్ బయాస్, సంజీవ్ చింతావర్ తదితరులు ఉన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

ఇద్దరు యువకులు దుర్మరణం • మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మాన్యంచెల్కకు చెందిన సయ్యద్ నవాజ్ (28), మహ్మద్ జుబేర్ (28), సయ్యద్ సోహెబ్ వెల్డర్లుగా పనిచేస్తుంటారు. ముగ్గురు కలిసి శనివారం హైదరాబాద్‌లో వెల్డింగ్ పనిచేసేందుకు వెళ్లి అర్ధరాత్రి కారులో తిరిగి నల్లగొండకు బయల్దేరారు. నవాజ్ బంధువు సల్మాన్ సైతం వీరితో వస్తున్నాడు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు జరుగుతుండడంతో సర్వీస్ రోడ్డు మీదుగా వీరి కారు నెమ్మదిగా వెళ్తుండగా.. వెనుక నుంచి లారీ అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు ముందున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కిందకు వెళ్లడంతో ముందు సీట్లలో కూర్చున్న సయ్యద్ నేవాజ్, మహ్మద్ జుబేర్ అక్కడికక్కడే మృతిచెందారు. సోహెబ్, సల్మాన్ తీవ్ర గాయాలతో కారులోనే ఇరుక్కుపోయారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన సోహెబ్, సల్మాన్‌ను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి, నవాజ్, జుబేర్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుల కారు ట్రావెల్స్ బస్సు కిందకు వెళ్లగా.. ఆ బస్సు దాని ముందున్న కారును, ఆ కారు మరో ట్రావెల్స్ బస్సును ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో గంటపాటు ట్రాఫిక్‌జాం అయ్యింది. చిట్యాల ఎస్ఐ ధర్మ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతుడు నవాజ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం షురూ..!

- 71,480 ఇళ్ల నిర్మాణానికి పచ్చజెండా
- 700 ఇళ్లకు ముగ్గు.. జియో ఫెన్సింగ్‌తో యాప్‌లో నమోదు
- ఈ నెల 15 నాటికి తొలి విడత నిధుల విడుదల
- 25 వేల పట్టణ ప్రాంత ఇళ్లను మంజూరు చేసిన కేంద్రం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. ఈ నెల 15 నాటికి ఈ ఇళ్లకు సంబంధించిన తొలి విడత ఆర్థిక సాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమయ్యే రూ.715 కోట్ల మొత్తాన్ని సిద్ధం చేసుకుని గృహనిర్మాణ శాఖకు అందించనుంది. వాటిని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రారంభమయ్యేనాటికి ఇళ్ల మంజూరు పత్రాలు అందుకున్న 71,480 మంది ఇళ్లు నిర్మించుకునేందుకు అధికారులు అనుమతి మంజూరు చేశారు. వారిలో ఇప్పటి వరకు 700 మంది నిర్మాణ పనులు మొదలు పెట్టారు. వాటికి గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో జియో ఫెన్సింగ్ చేశారు. ఇళ్లకు ముగ్గు పోసుకున్న ప్రాంత ఫొటోలను, అక్షాంశ రేఖాంశాల ఆధారంగా వివరాలను ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేశారు. తదుపరి తనిఖీకి వచ్చినప్పుడు అదే ప్రాంతంలో నిర్మాణం ఉండాలి. చోటు మారితే జియో ఫెన్సింగ్ ఆధారంగా సులభంగా గుర్తిస్తారు. ఆ నిర్మాణ ఫొటో యాప్‌లో క్యాప్చర్ కాదు. దీంతో ఇంటి స్థలాన్ని మార్చినట్టుగా అధికారులు గుర్తించి లబ్ధిదారును అనర్హత జాబితాలోకి మార్చి ఆర్థిక సాయాన్ని నిలిపివేస్తారు.

15 నెలల తర్వాత మోక్షం..

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం కూడా ఉంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకం మొదలుపెడతామని ఎన్నికల ప్రచారంలో పార్టీ చెప్పుకుంది. కానీ, అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత గానీ నిర్మాణాలు మొదలు కాలేదు. లబ్ధిదారుల గుర్తింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేసింది. ఏడాది క్రితం దరఖాస్తులందితే, అర్హులను తేల్చి గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల జాబితాను రూపొందించటానికి ఏడాది సమయం పట్టింది. ఐదేళ్లలో సంవత్సరానికి 4 లక్షలు చొప్పున 20 లక్షల ఇళ్లను నిర్మించనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ తొలి ఏడాది ఎలాంటి పురోగతి లేకుండానే గడిచిపోయింది. ఉమ్మడి రాష్ట్రంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తొలిసారి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సాచ్యురేషన్ పద్ధతిలో ప్రారంభమైంది. తెలంగాణలో 19 లక్షల ఇళ్లను నిర్మించారు. 2013లో పథకం పురోగతి నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పథకం ఆగిపోయింది. పుష్కర కాలం తర్వాత తిరిగి ప్రారంభమైంది.

25 వేల పట్టణ ప్రాంత యూనిట్లు మంజూరు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద తెలంగాణకు మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం 25 వేల ఇళ్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం లక్ష ఇళ్లు మంజూరు చేయాలని కోరితే, కేంద్రం 25 వేలే ఇవ్వటం గమనార్హం. వీటి రూపంలో రూ.375 కోట్లు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతుంది. మార్చి నాటికి ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. రెండో విడతలో వీలైనన్ని ఎక్కువ ఇళ్లను మంజూరు చేయించుకునే దిశలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచింది. రాష్ట్రంలో పట్టణ ప్రాంత పరిధి ఎక్కువగా ఉన్నందున ఇళ్ల సంఖ్య పెంచాలని కోరుతోంది. గ్రామీణ ప్రాంత ఇళ్లకు సంబంధించి ఇంకా కేటాయింపుల్లో స్పష్టత రాలేదు. ఆ నిధుల కోసం అధికారులు ప్రయత్నం చేస్తున్నారు.



భారత సంతతి నర్సుపై అమెరికాలో దాడి

ఫ్లోరిడా: అమెరికాలో భారత సంతతికి చెందిన నర్సుపై దాడి జరిగింది. ఫ్లోరిడాలోని పామ్స్ వెస్ట్ ఆసుపత్రిలో లీలామలాల్ (67) మహిళపై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఆమె ముఖాన్ని గుర్తుపట్టలేనంత తీవ్రంగా గాయపరిచాడు. దాడి సమయంలో ఆమె భారతీయ వారసత్వంపై వివక్ష పూరిత వ్యాఖ్యలు చేశాడు. ఘటన జరిగిన కొద్దిసేపటికే దుండగుడు స్టీఫెన్ స్కాంటిల్ బరీ(33)ను పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై ద్వేషపూరిత నేరం, హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నర్సుపై దాడితో తమకు మరింత రక్షణ కల్పించాలని ఆరోగ్య కార్యకర్తలు డిమాండ్ చేశారు. తమపై దాడులు సర్వసాధారణం అయ్యాయని, ఒక్కోసారి వారంలో రెండు దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇండియన్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా ఆందోళన వ్యక్తం చేసింది. నేపథ్యంతో సంబంధం లేకుండా ఆరోగ్య కార్యకర్తలందరినీ ఇది ప్రభావితం చేస్తుందని నొక్కి చెప్పింది. ఆరోగ్య కార్యకర్తలకు భద్రత కల్పించాలని, దాడి చేసినవారికి కఠిన శిక్షలు విధించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. రెండు రోజుల క్రితం ప్రారంభించిన ఈ పిటిషన్ పై ఇప్పటికే 9,500 మంది సంతకాలు చేశారు.

నా కూతురిని వేధించారు!

కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే

జల్‌గావ్: కొందరు యువకులు తన కూతురిని వేధించారని కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే ఆవేదన వెలిబుచ్చారు. కేంద్ర మంత్రినైన తన కూతురికే ఇలా జరిగితే ఇక సామాన్యుల పరిస్థితేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''నా కూతురు శుక్రవారం రాత్రి కొందరు స్నేహితులతో కలిసి సంత్ ముక్తాయ్ యాత్రకు వెళ్లింది. కొందరు యువకులు వారిని వేధించారు. ఫొటోలు, వీడియోలు తీశారు. వెంట ఉన్న గార్డు, సిబ్బంది అడ్డుకున్నా అభ్యంతరకరంగా ప్రవర్తించింది. నేను గుజరాత్ నుంచి తిరిగి రాగానే నా కూతురు జరిగిన విషయం చెప్పింది. అదే గుంపు ఫిబ్రవరి 24న ఓ కార్యక్రమంలోనూ అభ్యంతరకరంగా ప్రవర్తించారు'' అంటూ ముక్తాయ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంత్రి ఫిర్యాదు చేశారు. నిందితులు ఒక పార్టీకి చెందినవారని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. కొందరిని అరెస్టు చేశారని, ఈ ఉదంతంపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసుల రక్షణలో ఉన్న కేంద్ర మంత్రి కూతురిపై వేధింపులు మహారాష్ట్రలో మహిళల దుస్థితికి అద్దం పడుతున్నాయని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది.

చందమామపై బ్లూ ఘోస్ట్

తొలి ప్రైవేట్ ల్యాండర్‌గా రికార్డు



కేప్ కెనావెరల్ (యూఎస్): చంద్రుడిపై మొట్టమొదటిసారిగా ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన ల్యాండర్ సురక్షితంగా దిగి చరిత్ర సృష్టించింది. ఆదివారం అమెరికాలోని ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ సంస్థకు చెందిన బ్లూ ఘోస్ట్ ల్యాండర్ ఆటోపైలట్ విధానంలో నెమ్మదిగా చందమామపై దిగింది. చంద్రుని ఈశాన్య కొనవైపు పురాతన అగ్నిపర్వత సానువుల్లో ఇది దిగిందని ఫైర్‌ఫ్లై ఏరోస్పేస్ చీఫ్ ఇంజనీర్ విల్ కోగన్ ప్రకటించారు. ''దశాబ్ద కాలం క్రితం పురుడుపోసుకున్న మా అంకుర సంస్థ చరిత్ర సృష్టించింది. బ్లూ ఘోస్ట్ ల్యాండింగ్ పలు గండాలను తప్పించుకుంది. ఇప్పుడు చంద్రుని ఉపరితలంపై స్థిరంగా ఉంది'' అని పేర్కొన్నారు. గతంలో పలు దేశాలకు చెందిన ప్రైవేట్ సంస్థలు చంద్రునిపై ల్యాండర్లను దింపేందుకు ప్రయత్నించి విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో అదుపు తప్పడం, క్రాష్ ల్యాండింగ్, కూలిపోవడం, ఒరిగిపోవడం వంటి అపశ్రుతులకు తావులేకుండా ఒక ప్రైవేట్ సంస్థ తొలి ప్రయత్నంలోనే విజయవంతంగా చంద్రునిపై ల్యాండర్‌ను దించడం ఇదే తొలిసారి. దేశాల్లో అమెరికా, రష్యా, చైనా, భారత్, జపాన్ మాత్రమే ఇప్పటిదాకా ఈ ఘనత సాధించాయి. బ్లూఘోస్ట్ ల్యాండయిన అరగంటకే చంద్రుని పరిసరాల ఫొటోలు తీసి అమెరికాలో ఆస్టిన్ నగరంలోని సంస్థ మిషన్ కంట్రోల్ కేంద్రానికి పంపింది. అమెరికాలో అరుదైన పేడపురుగు జాతి అయిన బ్లూ ఘోస్ట్ పేరును ఈ ల్యాండర్‌కు పెట్టారు. నాలుగు కాళ్ల ఈ ల్యాండర్ ఎత్తు 2 మీటర్లు. వెడల్పు 3.5 మీటర్లు. జనవరి 15న ఫ్లోరిడాలోని అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి దీన్ని ప్రయోగించారు. ఇది చంద్రునిపై ధూళిని పరీక్షించనుంది. 10 అడుగుల లోతు రంధ్రం చేసి అక్కడి మట్టిని పరిశీలించనుంది. నాసా వ్యోమగాముల స్పేస్‌సూట్‌పై పేరుకుపోయే చంద్రధూళిని దులిపేసే పరికరం పనితీరును కూడా అక్కడ పరీక్షించనుంది.

గురువారం మరో ల్యాండర్

హ్యూస్టన్‌కు చెందిన ఇంట్యూటివ్ మెషీన్స్ సంస్థకు చెందిన నాలుగు మీటర్ల ఎత్తయిన ల్యాండర్‌ను గురువారం చంద్రునిపై దింపేందుకు కూడా శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. దక్షిణ ధ్రువానికి 100 మైళ్ల దూరంలో కిందివైపు దాన్ని ల్యాండ్ చేయాలని చూస్తున్నారు. గతేడాది ఇదే ప్రాంతంలో ఒక ల్యాండర్‌ను విజయవంతంగా దించినా దాని కాలు విరిగి పక్కకు ఒరిగి నిరుపయోగంగా మారింది. రెండేళ్ల క్రితం ఈ సంస్థ ఒక ల్యాండర్‌ను ప్రయోగించినా అది వేగంగా ఢీకొని చంద్రునిపై కూలిపోయింది. జపాన్‌కు చెందిన ఐస్పేస్ సంస్థ ల్యాండర్ కూడా త్వరలో చంద్రునిపై కాలుమోపనుంది. దీన్ని కూడా బ్లూఘోస్ట్‌తో పాటే ప్రయోగించారు.

అమెరికా.. ఉక్రెయిన్ మధ్య సయోధ్య ఎలా?

యూరప్ దేశాల మల్లగుల్లాలు

- లండన్‌లో అధినేతల అత్యవసర భేటీ
- మూడంచెల వ్యూహం: స్టార్మర్
- ఉక్రెయిన్‌కు మరింత ఆర్థిక సాయం
- అవసరమైతే సైనిక దన్ను కూడా!
- యూరప్ భద్రతపై నేతల ఆందోళనలు



ఆదివారం లండన్‌లో అత్యవసరంగా భేటీ అయిన యూరప్ దేశాల అధినేతలు. చిత్రంలో జెలెన్‌స్కీ

లండన్: అధినేతలు డొనాల్డ్ ట్రంప్, జెలెన్‌స్కీ వాగ్యుద్ధంతో అమెరికా, ఉక్రెయిన్ సంబంధాలు అకస్మాత్తుగా దెబ్బతిన్న వైనం యూరప్‌ను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. వాటిని తిరిగి చక్కదిద్దే మార్గాల కోసం అవి మల్లగుల్లాలు పడుతున్నాయి. ఈ అంశంపై చర్చించేందుకు యూరప్ దేశాధినేతలు ఆదివారం లండన్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇందుకు బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ చొరవ తీసుకున్నారు. 'సురక్షిత యూరప్ కోసం' పేరిట జరిగిన ఈ శిఖరాగ్ర సమావేశంలో చర్చంతా అమెరికా, ఉక్రెయిన్ సంబంధాల చుట్టే తిరిగినట్టు సమాచారం. ఉక్రెయిన్‌కు మరిన్ని నిధులు అందించాలని నేతలు నిర్ణయానికి వచ్చారు. అవసరమైతే యూరప్ దేశాలన్నీ తమ సైన్యాన్ని కూడా ఉక్రెయిన్‌కు పంపేందుకు సిద్ధంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈ కీలక భేటీలో జెలెన్‌స్కీతో పాటు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కూడా పాల్గొన్నారు.

తరానికోసారే!

యూరప్ భద్రత కోసం ఖండంలోని దేశాలన్నీ ఒక్కతాటిపైకి రావాల్సిన అవసరముందని స్టార్మర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇలాంటి అవసరం, అవకాశం తరానికి ఒక్కసారి మాత్రమే వస్తాయని అన్నారు. ''రష్యా బారి నుంచి ఉక్రెయిన్‌కు శాశ్వత రక్షణ కల్పించాలి. యూరప్‌లోని ప్రతి దేశం భద్రతకూ ఇది చాలా కీలకం'' అని చెప్పారు. ''ఇందుకు మూడంచెల మార్గముంది. ఉక్రెయిన్‌ను సాయుధంగా పటిష్టపరచాలి. దాని భద్రతకు యూరప్ మొత్తం పూచీగా ఉండాలి. ఇక ఉక్రెయిన్‌తో కుదిరే ఒప్పందాలను రష్యా అధ్యక్షుడు పుతిన్ మళ్లీ తుంగలో తొక్కకుండా చూసే బాధ్యతను అమెరికా తీసుకోవాలి'' అని ప్రతిపాదించారు. అంతకుముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో స్టార్మర్ విడిగా భేటీ అయ్యారు. అందులో జెలెన్‌స్కీ కూడా పాల్గొన్నారు. రష్యా, ఉక్రెయిన్ కాల్పుల విరమణకు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమెరికా ముందుంచాలని వారు నిర్ణయానికి వచ్చారు. ఈ ప్రయత్నంలో మిగతా యూరప్ దేశాలన్నింటినీ కలుపుకుని వెళ్తామని చెప్పారు. అంతకుముందు ఉక్రెయిన్‌కు 3.1 బిలియన్ డాలర్ల రుణం అందించేందుకు బ్రిటన్ అంగీకరించింది.

ట్రంప్‌తోనూ మాట్లాడా: స్టార్మర్

శిఖరాగ్రం అనంతరం నేతలు మీడియాతో మాట్లాడారు. వీలైనంత త్వరలో మరోసారి సమావేశమై అన్ని అంశాలపైనా లోతుగా చర్చించుకోవాలని నిర్ణయించినట్టు స్టార్మర్ వెల్లడించారు. అమెరికా నమ్మదగ్గ భాగస్వామి కాదన్న విమర్శలను తోసిపుచ్చారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం యూరప్ భద్రతకు చాలా కీలకమని పునరుద్ఘాటించారు. ఈ విషయమై ట్రంప్‌తో శనివారం రాత్రి ఫోన్లో సుదీర్ఘంగా మాట్లాడినట్టు వివరించారు. ''యూరప్ ఒకరకంగా నాలుగు రోడ్ల కూడలిలో నిలిచింది. కనుక ప్రతి అడుగూ ఆచితూచి వేయాల్సిన సమయమిది. పరిస్థితులన్నీ పూర్తిగా అదుపు తప్పేందుకు ఒకే ఒక్క తప్పుడు నిర్ణయం చాలు'' అని హెచ్చరించారు.

గాజాకు సాయం ఆపేసిన ఇజ్రాయెల్

రంజాన్ నేపథ్యంలో కాల్పుల విరమణ పొడిగింపునకు ఆమోదం

టెల్ అవీవ్: హమాస్‌తో కాల్పుల విరమణ తొలి దశ ఒప్పందం శనివారం ముగిసిన నేపథ్యంలో గాజాలోకి మానవతా సాయాన్ని నిలిపేస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఒప్పందాన్ని పొడిగించాలంటే తమ ప్రతిపాదనలకు హమాస్ ఒప్పుకుని తీరాలని షరతు విధించింది. అందుకు హమాస్ ససేమిరా అనడంతో గాజాలోకి నిత్యావసర వస్తువులు, ఔషధాలు, ఇతరత్రా సరకుల రవాణాను ఇజ్రాయెల్ బలగాలు ఆదివారం అడ్డుకున్నాయి. దాంతో మానవతా సాయానికి హఠాత్తుగా అడ్డుకట్టపడింది. దీనిపై హమాస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ''సాయం ఆపేయడం చౌకబారు బెదిరింపు చర్య. తద్వారా ఇజ్రాయెల్ యుద్ధ నేరానికి పాల్పడుతోంది. తొలి దశ కాల్పుల విరమణ నిబంధనలను ఉల్లంఘిస్తోంది'' అని ఆరోపించింది. అమెరికా ఆదేశాల మేరకే గాజాకు సాయాన్ని ఆపేశామని ఇజ్రాయెల్ పేర్కొంది. రంజాన్ నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఏప్రిల్ 20 దాకా పొడిగించాలన్న అమెరికా అభ్యర్థనకు ఇజ్రాయెల్ అంగీకరించింది ఆ మేరకు తొలి దశ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్టు ఆదివారం ప్రకటించింది. ఒప్పందంలో తదుపరి దశకు వెళ్లకుండా తొలి దశను పొడిగించడాన్ని హమాస్ తప్పుబట్టింది. తమ బందీల్లో సగం మందిని హమాస్ విడుదల చేస్తేనే రెండోదశ కాల్పుల విరమణకు సిద్ధపడతామని ఇజ్రాయెల్ చెబుతోంది. రెండో దశ చర్చల వేళ మరింతమంది బందీలను వదిలేయాలని డిమాండ్ చేసింది. శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి, ఇజ్రాయెల్ గాజా నుంచి వెనుతిరిగితేనే మొత్తం బందీలను వదిలేస్తామని హమాస్ తేల్చిచెప్పింది.

విషాదంగా ముగిసిన రెస్క్యూ ఆపరేషన్

గల్లంతైన నలుగురూ మృతి

డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్): ఉత్తరాఖండ్‌లో టిబెట్ సరిహద్దుల్లో భారత చిట్టచివరి గ్రామం మనాలో హిమపాతం ఘటనలో రెస్క్యూ ఆపరేషన్ చివరకు విషాదాంతంగా ముగిసింది. జాడ తెలీకుండా పోయిన మిగతా నలుగురు కార్మికుల కోసం ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, వాయుసేన, ఎస్‌డీఆర్ఎఫ్, బీఆర్ఓ, ఐటీబీపీ ఎంతగా వెదికినా లాభం లేకపోయింది. మంచుమేటల కింద కూరుకుపోయిన వారి మృతదేహాలను ఆదివారం బయటకు తీశారు. దీంతో 60 గంటల రెస్క్యూ ఆపరేషన్ ముగిసింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఎనిమిదికి పెరిగింది. కాపాడిన 46 మందిని శనివారమే జోషిమఠ్ సైనిక ఆస్పత్రికి తరలించారు. ఇద్దరిని రిషికేశ్ ఎయిమ్స్‌కు తరలించారు. ముగ్గురి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. బద్రీనాథ్ ఆలయానికి వెళ్లే రహదారిలో మంచుచరియలు పడగా సరిహద్దు రోడ్డు సంస్థ(బీఆర్ఓ) సిబ్బంది ఆ మంచును తొలగిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఆరు గంటల ప్రాంతంలో ఇతర 54 మంది సిబ్బంది విశ్రాంతి తీసుకుంటున్న 8 కంటైనర్లు, ఒక షెడ్‌పై మంచుచరియలు పడటంతో దుర్ఘటన జరిగిన విషయం తెల్సిందే. వీరిలో 33 మందిని శుక్రవారం రాత్రి, 17 మందిని శనివారం మంచు నుంచి బయటకు లాగారు. బయటకు తీసుకొచ్చిన వారిలో నలుగురు శనివారం చనిపోయారు. జాడ గల్లంతైన మిగిలిన ఆ నలుగురి కోసం ఆదివారం రెస్క్యూ ఆపరేషన్ చేసినా వారిని కాపాడలేకపోయామని ఛమోలీ జిల్లా మేజిస్ట్రేట్ సందీప్ తివారీ చెప్పారు. మృతదేహాలను హెలికాప్టర్‌లో జోషీమఠ్‌కు తీసుకొచ్చి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పోస్ట్‌మార్టమ్ నిర్వహించారు.



సోమ్‌నాథ్ ఆలయంలో మోదీ పూజలు

జామ్‌నగర్: గుజరాత్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రఖ్యాత సోమ్‌నాథ్ ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. దేశవ్యాప్తంగా ద్వాదశ జ్యోతిర్లింగాల్లో సోమ్‌నాథ్ మొదటిది. అంతకుముందు జామ్‌నగర్‌లోని వన్‌తారా జంతు సంరక్షణ, పునరావాస కేంద్రాన్ని ప్రధాని సందర్శించారు. రిలయన్స్ జామ్‌నగర్ రిఫైనరీ కాంప్లెక్స్ సమీపంలోని ఈ కేంద్రం 3 వేల ఎకరాల్లో విస్తరించింది. సంరక్షణకు నోచుకోని ఏనుగులు, అటవీ జంతువులకు ఇక్కడ పునరావాసం, వైద్యచికిత్సలు అందిస్తారు. 43 జాతులకు చెందిన 2 వేలకుపైగా జంతువులు ఆశ్రయం పొందుతున్నాయి. గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా మోదీ శనివారం ససన్‌లోని గిర్ అటవీ సంరక్షణశాల ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఆదివారం రాత్రి అక్కడే బస చేసి సోమవారం జంగిల్ సఫారీని ఆస్వాదించనున్నారు.

రూ. 5కే రైతులకు విద్యుత్ కనెక్షన్

మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

భోపాల్: రైతులకు కేవలం రూ.5కే శాశ్వత విద్యుత్ కనెక్షన్ అందిస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఆదివారం ప్రకటించారు. మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించనుందని చెప్పారు. ఇప్పటిదాకా శాశ్వత కనెక్షన్ లేని వారికే దీన్ని అందజేస్తామన్నారు. విద్యుత్ సంబంధ సమస్యలను అధిగమించేందుకు రైతులకు సోలార్ పంప్‌సెట్లు అందజేయనున్నట్లు కూడా యాదవ్ వెల్లడించారు.

అమెరికా అధికార భాష ఇంగ్లిష్ ఉత్తర్వులపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్: అమెరికా అధికార భాషగా ఇంగ్లిష్‌ను గుర్తిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆదేశాలపై సంతకం చేశారు. ఫెడరల్ నిధులందుకునే ప్రభుత్వ ఏజెన్సీలు, సంస్థలు ఇంగ్లిష్‌తోపాటు ఇతర భాషల్లో పత్రాలు, సేవలను కొనసాగించాలా వద్దా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. అమెరికాలో 30 రాష్ట్రాల్లో ఇప్పటికే ఇంగ్లిష్ అధికార భాషగా ఉంది.

అవేవీ నకిలీ ఓటర్ కార్డులు కావు

ఒకే ఎపిక్ నంబర్ ఉన్న కార్డులపై ఈసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఒకే ఎలక్టర్ ఫొటో ఐడెంటిటీ కార్డ్ (ఎపిక్) నంబర్‌తో ఒకటికి మించి ఓటర్ గుర్తింపు కార్డులు జారీ అయిన వైనంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టతనిచ్చింది. ఒకే ఎపిక్ నంబర్ ఉన్నా అవేవీ నకిలీ ఓటర్ కార్డులు కావని స్పష్టంచేసింది. ''వేర్వేరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒకే విధమైన ఆల్ఫాన్యూమరిక్ సిరీస్‌లను ఉపయోగించడం వల్ల కొందరు ఓటర్లకు ఒకే తరహా ఎపిక్ నంబర్ ఉన్న కార్డులు జారీ అయ్యాయి. ఎపిక్ నంబర్ ఒకలా ఉన్నంత మాత్రాన అవి నకిలీ/డూప్లికేట్ కార్డులు కావు. అన్నీ ఒరిజినల్ కార్డులే'' అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. పలు వేర్వేరు రాష్ట్రాల్లో ఓటర్లు ఒకే ఎపిక్ నంబర్‌లను కలిగి ఉన్నారంటూ వచ్చిన కథనాలపై ఈసీ ఈ మేరకు స్పందించింది. దాంట్లో గందరగోళ పడాల్సిన పని లేదని స్పష్టం చేసింది. ''పలు రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లు ఒకే ఆల్ఫాన్యూమరిక్ సిరీస్‌ను అనుసరించడంతో ఇలా జరిగింది. అన్ని రాష్ట్రాల ఎలక్టోరల్ డాటాబేస్‌ను సమీకృత ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్ (ఎరోనెట్) ప్లాట్‌ఫాంలోకి మార్చడానికి ముందు, అంటే కేంద్రీకృత వ్యవస్థను అమలుచేయని కాలంలో ఎపిక్ మాన్యువల్‌గా నంబర్లను కేటాయించినప్పుడు ఇది జరిగింది. ఓటర్ల ఎపిక్ నంబర్లు ఒకేలా ఉండొచ్చు గానీ వారి వ్యక్తిగత వివరాలు, అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ బూత్ తదితర వివరాలన్నీ వేరుగానే ఉంటాయి. అలాంటి ఓటరు స్వరాష్ట్రంలో సంబంధిత నియోజకవర్గంలో నిర్దేశించిన పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు ఏ ఇబ్బందీ లేదు. అయినా భయాందోళనలుంటే అలాంటి వారికి ప్రత్యేక (యూనిక్) ఎపిక్ నంబర్‌ను కేటాయిస్తాం. అందుకు వీలుగా ఎరోనెట్ 2.0 ప్లాట్‌ఫాంను త్వరలో అప్‌డేట్ చేస్తాం'' అని ఈసీ పేర్కొంది.



ప్రభుత్వాన్ని బిచ్చమెత్తుకోవడం ప్రజలకు అలవాటైంది

మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదాస్పద వ్యాఖ్యలు



రాజ్‌గఢ్: ప్రభుత్వాన్ని బిచ్చమెత్తుకోవడం ప్రజలకు అలవాటుగా మారిపోయిందని మధ్యప్రదేశ్ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బిచ్చగాళ్లంతా ఒక చోట చేరడం బలమైన సమాజం అనిపించుకోదన్నారు! శనివారం రాయ్‌గఢ్ జిల్లా సుథాలియాలో రాణి అవంతీ బాయి లోధీ విగ్రహావిష్కరణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''త్యాగధనుల జీవితాలను చూసి నేర్చుకోవాలి. దేశం కోసం వారు జీవితాలను త్యాగం చేశారు. ఆ విలువలను అనుసరిస్తే జీవితంలో విజయం సాధించగలుగుతాం. సమాజానికి ఎంతో కొంత ఇవ్వగలుగుతాం. కానీ ప్రజలు సమాజం నుంచి తీసుకోవడాన్ని అలవాటుగా మార్చుకున్నారు. ఇప్పుడిక ప్రభుత్వాన్ని కూడా బిచ్చమెత్తుతున్నారు'' అన్నారు. ''తీసుకోవడానికి బదులుగా సమాజానికి ఇవ్వడాన్ని అలవాటుగా మార్చుకోవాలి. అప్పుడు సంతోషంగా ఉంటారు. మెరుగైన సమాజానికి బాటలు పడతాయి. అలాగాక ఉచితాలను ఎక్కువగా ఆశించడం మన స్వాతంత్ర్య యోధులను అవమానించడమే. వారెప్పుడూ ఎవరినుంచీ ఏమీ ఆశించలేదు'' అంటూ హితవు పలికారు.

నేనుండగా వారసుడిని ప్రకటించను: మాయావతి

మేనల్లుడు ఆకాశ్‌కు బీఎస్పీ బాధ్యతల నుంచి ఉద్వాసన



లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌కు పార్టీ నుంచి ఉద్వాసన పలుకుతున్నట్టు అధినేత్రి మాయావతి ప్రకటించారు. ఆదివారం లక్నోలో జరిగిన పార్టీ జాతీయ స్థాయి సమావేశంలో ఆమె సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. తాను బతికి ఉన్నంత కాలం తన వారసుని పేరు ప్రకటించబోనన్నారు. తన సోదరుడు ఆనంద్ కుమార్, రామ్‌జీ గౌతమ్ ఇక పార్టీ జాతీయ సమన్వయకర్తలుగా ఉంటారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలపై ఆకాశ్ మామ అశోక్ సిద్ధార్థ్‌ను గత నెలలో బీఎస్పీ నుంచి బహిష్కరించారు. దేశవ్యాప్తంగా బీఎస్పీని రెండు వర్గాలుగా విడగొట్టింది అశోకేనని మాయా ఆరోపించారు. ఆనంద్ రాజకీయ జీవితాన్ని కూడా ఆయన నాశనం చేశారన్నారు. ''పార్టీకి, ఉద్యమానికే నా తొలి ప్రాథమ్యం. సోదరుడు, సోదరి, వాళ్ల పిల్లలు ఆ తర్వాతే'' అన్నారు.

అధిక వేడి వల్ల... ముందస్తు ముదిమి!

దీర్ఘకాలం వేడిమి పరిస్థితులను ఎదుర్కొంటే వేగంగా ఆయుక్షీణం



మెల్‌బోర్న్: రోజంతా వేడిమి పరిస్థితుల్లో పనిచేశాక అలసిపోయిన భావన కలగడం సహజం. అలసిపోతే పర్లేదు గానీ దానివల్ల ఆయుష్షు కూడా వేగంగా క్షీణిస్తుందట! పర్యావరణ ఒత్తిళ్లకు తలొగ్గి మన శరీరంలో చాలా మార్పులే జరుగుతాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. డీఎన్ఏలో మార్పులు జరగకపోయినా మారే ఉష్ణ పరిస్థితులకు తగ్గట్టు ఒంట్లో ఏ ప్రొటీన్ ఉత్పత్తి ఏ మేరకు పెరగాలో, ఏది ఎంతగా తగ్గాలో నిర్ణయాలు జరిగిపోతాయట. ఈ ఎపీజెనిటిక్స్ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆస్ట్రేలియాలో జరిగిన తాజా అధ్యయనంలో తేలింది. అధిక ఉష్ణోగ్రతలు మనిషిపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశంపై మొనాష్ విశ్వవిద్యాలయంలోని రోంగ్‌బిన్ క్సూ, యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌లోని షుఆయ్ లీ సారథ్యంలోని అధ్యయన బృందం పరిశోధన చేసింది. అత్యధిక ఉష్ణోగ్రతలకు లోనైన వ్యక్తుల్లో వృద్ధాప్య ఛాయలు త్వరగా కనిపిస్తాయని తేల్చారు. అంతే కాదు, దీర్ఘకాలం పాటు వేడిమి పరిస్థితుల ప్రభావానికి గురైతే వృద్ధుల ఆయుష్షు రెండేళ్లకు పైగా హరించుకుపోతుందని వెల్లడించారు!

వాతావరణ మార్పుల ప్రభావం

వాతావరణ మార్పుల వల్ల వేడి పెరిగేకొద్దీ మన శరీరం మరింత ఒత్తిడికి గురవుతుంది. ఈ ఒత్తిడే వృద్ధాప్యం త్వరగా రావడానికి ప్రధాన కారణంగా మారుతోంది. ముఖ్యంగా వడగాల్పులకు, వేడి వాతావరణానికి చిరునామాగా నిలిచే ఆస్ట్రేలియాలో కొన్నేళ్లుగా ఈ పరిస్థితులు పరిపాటిగా మారుతున్నాయి. ఉష్ణోగ్రత ప్రభావ మార్పులు అక్కడ మనుషులపై స్పష్టంగా కనిపించాయని అధ్యయనం పేర్కొంది.

పరిశోధనల్లో ఏం తేలింది?

68 ఏళ్ల పైబడిన 3,700 మందిపై సదరన్ కాలిఫోర్నియా వర్సిటీలో పరిశోధన చేశారు. తక్కువ వయసు వారిలో పోలిస్తే పెద్దవాళ్ల మీదే అత్యధిక ఉష్ణోగ్రత పరిస్థితులు అధిక ప్రభావం చూపాయి. వయసు పెరిగేకొద్దీ వేడిని నియంత్రించుకునే సామర్థ్యమూ సన్నగిల్లుతోంది. దాంతో అనారోగ్యం బారిన పడటం, చనిపోవడం వంటివి జరుగుతున్నాయి. వృద్ధాప్య ఛాయలను నిర్ధారించే మూడు రకాలైన పీసీఫీనో ఏజ్, పీసీగ్రిమ్ ఏజ్, డ్యూన్‌డిన్ పేస్ జీవ గడియార పద్ధతుల్లో వలంటీర్ల రక్త నమూనాలను పరిశీలించారు. 2010 నుంచి ఆరేళ్లపాటు వీళ్లంతా అధిక వేడి పరిస్థితులను ఎదుర్కొన్నప్పటి పరిస్థితులను పోల్చిచూశారు. అమెరికాలో ప్రామాణికమైన 32 డిగ్రీ సెల్సియస్ వరకు సాధారణ, 32–39 డిగ్రీలను మధ్యస్థ, 39–51 డిగ్రీల దాకా అతి తీవ్ర వేడిమిగా పరిగణించి వలంటీర్ల డేటాతో సరిచూశారు. పీసీఫినో ఏజ్ ప్రకారం సుదీర్ఘకాలం వేడికి గురైతే 2.48 ఏళ్లు ముందుగానే వృద్ధాప్యం వస్తుందని తేలింది. పీసీగ్రిమ్ ఏజ్ పద్ధతిలో 1.09 ఏళ్లు, డ్యూన్‌డిన్ పేస్ పద్ధతిలో 0.05 ఏళ్లు ముందుగా వృద్ధాప్యం వస్తుందని వెల్లడైంది.

వేడికి, వయసుకు లింకేమిటి?

వయసు మీద పడటం సహజ ప్రక్రియ. వృద్ధాప్య ఛాయలు బయట పడటం ఒక్కో మనిషిలో ఒక్కోలా ఉంటుంది. ఒత్తిళ్లు, షాక్ వంటి అనూహ్య ఘటనలు ఎదురైనప్పుడు శరీరంలో పెనుమార్పులు సంభవిస్తాయి. చాన్నాళ్లపాటు సరిగా నిద్ర పోకుంటే వృద్ధాప్య ఛాయలు త్వరగా రావడం ఖాయం. అత్యధిక వేడిమి పరిస్థితులు మనిషిలోని సత్తువను లాగేస్తాయి. జీవక్రియలను పూర్తిస్థాయిలో చేసే సామర్థ్యాన్ని శరీరం క్రమంగా కోల్పోతుంది. వయసు మీదపడే రేటు పెరుగుతుంది. వృద్ధాప్యంలో రావాల్సిన రోగాలు ముందే ముసురుకుంటాయి.

జెనటిక్ స్థాయిల పరిస్థితేంటి?

తీసుకునే ఆహారానికి తగ్గట్టు శరీరంలో మార్పులు జరుగుతాయి. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, దుంపల వంటి తేలిగ్గా జీర్ణమయ్యే సహజసిద్ధ ఆహారం తీసుకుంటే ప్రొటీన్లు, విటమిన్లు తగిన మోతాదులో అంది శరీరంలో సానుకూల మార్పులు జరుగుతాయి. అలాగాక బాగా వేయించిన, ప్యాక్ చేసిన, నూనెలు అతిగా వాడిన, పూర్తి ప్రాసెస్డ్ ఆహారం తీసుకుంటే పోషకాలందక ఒంట్లో ప్రతికూల మార్పులు సంభవిస్తాయి. దాంతో వయసు మీద పడకుండా ఆపే సహజసిద్ధ సామర్థ్యం తగ్గుతుంది. వేడిమి సందర్భాల్లోనూ ఒంట్లోని జన్యు కణాలు విరుద్ధ రీతిలో స్పందిస్తాయి. ఫలితంగా ఏ సందర్భంలో ఏ రకం ప్రొటీన్‌ను ఎంత మోతాదులో ఉత్పత్తి చేయాలనే డీఎన్ఏ సీక్వెన్స్ దెబ్బ తింటుంది. ఇది శరీర భౌతిక క్రియలపై ప్రతికూల ప్రభావం చూపి ఆరోగ్య స్థితిని పాడుచేసే ప్రమాదముంది. వేడిమి వృద్ధాప్య రేటును నిర్దేశించే జన్యు కణాలను అసంబద్ధంగా క్రియాశీలం చేస్తుంది. అలా ముందుగానే వృద్ధాప్యంలోకి జారిపోతాం.

సెబీ మాజీ చీఫ్ మాధవిపై కేసుకు ఏసీబీ కోర్టు ఆదేశం



ముంబై: స్టాక్ మార్కెట్ అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనల ఆరోపణలపై సెబీ మాజీ చీఫ్ మాధవీ పురి బచ్, మరో ఐదుగురిపై కేసులు నమోదు చేయాలని ఏసీబీ ప్రత్యేక కోర్టు శనివారం ఆదేశించింది. ఈ జాబితాలో బచ్‌తో పాటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి, నాటి పబ్లిక్ ఇంట్రెస్ట్ డైరెక్టర్ ప్రమోద్ అగర్వాల్, ముగ్గురు సెబీ పూర్తికాల సభ్యులు అశ్వనీ భాటియా, అనంత్ నారాయణ్, కమలేశ్ చంద్ర వర్ష్ణీ ఉన్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ప్రాథమిక ఆధారాలున్నందున నిష్పాక్షిక, న్యాయమైన దర్యాప్తు అవసరమని జడ్జి శశికాంత్ ఏకనాథ్ రావ్ బంగార్ పేర్కొన్నారు. తమకు సమాచారం ఇవ్వకుండా జారీ చేసిన ఈ ఉత్తర్వులపై న్యాయపరంగా ముందుకెళతామని సెబీ తెలిపింది. సెబీకి తొలి మహిళా సారథిగా నిలిచిన బచ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రయోజనాలు పొందారంటూ అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ వెలువరించిన కథనం సంచలనం రేపడం తెలిసిందే.



కేరాఫ్.. కాంటినెంటల్..
కాంటినెంటల్ వంటకాలకు నగరం కేరాఫ్ అడ్రస్‌గా గుర్తింపు పొందుతోంది. సాధారణంగా సింగపూర్, మలేషియా, చైనీస్ వంటకాలతో నగరానికి ప్రత్యేక అనుబంధముంది. - సిటీప్లస్‌లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమవారం	మంగళవారం
సా. 6.28 గం.	ఉ. 5.10 గం.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.0/21.0
నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 35, కనిష్ఠంగా 21 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.


గచ్చిబౌలి స్టేడియంలో జెండా ఊపి రన్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

ఉత్సాహంగా డెసిబుల్ డాష్ రన్

గచ్చిబౌలి: వినికిడి సమస్యలపై అవగాహన పరుగును ఉత్సాహంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్, కేపీహెచ్‌బీలలోని మైత్రో కేర్ ఈఎన్‌టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, మౌర్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియం వద్ద 2కే, 5కే, 10కే రన్‌ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, డాక్టర్ ప్రకాశ్ జెండా ఊపి ప్రారంభించారు. డెసిబుల్ డాష్ కేవలం పరుగు మాత్రమే కాదని, ఇది వినికిడి ఆరోగ్యం గురించి అవగాహన పెంచడానికి, వినికిడి సవాళ్లతో జీవిస్తున్న వారికి మద్దతునిచ్చే శక్తిమంతమైన ఉద్యమంగా నిర్వహిస్తున్నామన్నారు. రన్నర్లు, వైద్యులు, పారామెడికల్ నిపుణులు, ఐటీ ఉద్యోగులు, ఫార్మాస్యూటికల్ దిగ్గజాలు, క్రీడా ప్రముఖులు, సామాజికవేత్తలు, కళాకారులు, ప్రభావశీలురు, ప్రముఖ పౌరులు, రాజకీయ నాయకులు, ఆరోగ్య ఔత్సాహికులు పాల్గొంటున్నారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్విని అమరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.







గోవిందా.. హరి గోవిందా..

జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సాయంత్రం స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నగర నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఏడు కొండల వాడా.. వేంకట రమణా.. గోవిందా.. గోవిందా అంటూ గోవింద నామస్మరణ మార్మోగింది. సంప్రదాయ నృత్యాలు, ఆటపాటలతో స్వామివారి గరుడ వాహన సేవ వైభవోపేతంగా జరిగింది. - బంజారాహిల్స్

ముషీరాబాద్‌కు చెందిన ప్రకాశ్ చిరుద్యోగి. అతని కుమారుడు కొత్తపేటలోని కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. సెకండియర్ ఫీజు మొత్తం రూ.1.60 లక్షలు కాగా.. దశలవారీగా రూ.1.20 లక్షలు చెల్లించారు. గత నెల ప్రాక్టికల్ పరీక్షల నేపథ్యంలో ఫీజు చెల్లించాలని ఒత్తిడి పెరగడంతో రూ. 20 వేలు చెల్లించారు. మరో రూ.20 వేలు పెండింగ్‌లో కట్టాల్సి ఉంది. ఈ నెల 5 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కొంత ఫీజు పెండింగ్‌లో ఉండటంతో హాల్ టికెట్ ఇచ్చేందుకు కాలేజీ వర్గాలు నిరాకరించాయి. పరీక్షల తర్వాత చెల్లిస్తామని వేడుకుంటున్నప్పటికీ ఇది యాజమాన్యం నిర్ణయం అని చెప్పారు. ఇది ఒక ప్రకాశ్ ఎదుర్కొంటున్న సమస్య కాదు.. పూర్తి స్థాయి ఫీజులు క్లియర్ చేయని విద్యార్థుల తలిదండ్రులందరిదీను.

పరీక్షల వేళ ‘ఫీ’జులుం!

కాలేజీ లాగిన్‌లో ఇంటర్ హాల్ టికెట్లు

- ఫీజు క్లియరెన్స్ కోసం తీవ్ర ఒత్తిళ్లు
- పెండింగ్ ఉంటే హాల్ టికెట్లకు నిరాకరణ
- మానసిక ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
- ఇదీ ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల తీరు



సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష వేళ విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి పెరిగింది. విద్యా సంవత్సరం పూర్తి స్థాయి ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలు తేల్చి చెబుతున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థుల వార్షిక పరీక్షల హాల్ టికెట్ల జారీని కాలేజీల లాగిన్‌కు ఇవ్వడం వాటికి కలిసి వచ్చినట్లయింది. విద్యా సంవత్సరం ఫీజులు ఎలాంటి పెండింగ్ లేకుండా పూర్తిగా వసూలు చేసేందుకు హాల్ టికెట్లకు ఫీజుల క్లియరెన్స్ మెలిక పెడుతున్నారు. దీంతో విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారు. ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థులతో పాటు ఫస్టియర్ విద్యార్థులు సైతం తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. పరీక్షల తర్వాత పెండింగ్‌ను క్లియర్ చేస్తామని చెబుతున్నా.. కాలేజీ యాజమాన్యాలు వినిపించుకోవడంలేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కార్పొరేట్‌ల తీరు మరింత కఠినం

విద్యా సంవత్సరం ఫీజుల విషయంలో కార్పొరేట్ కాలేజీ తీరు మరింత కఠినంగా తయారైంది. మేనేజ్‌మెంట్ నిర్ణయమంటూ ఫీజులు చెల్లించనిదే హాల్ టికెట్లు ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ఇంటర్‌తో పాటు ఐఐటీ, మెడిసిన్ అంటూ వల విసిరి విద్యార్థులను చేర్చుకున్న కార్పొరేట్ కాలేజీలు ఫీజుల విషయంలో అసలు రూపం బయటపెడుతున్నారు. విద్యా సంవత్సరానికి కనీసం రూ.1.50 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నాయి. ఒకసారి ఫీజుల విషయంలో అంగీకరింపజేసి.. నెమ్మదిగా వసూళ్ల దిగుతున్నారు. కార్పొరేట్ వలలో చిక్కుకున్న పేద కుటుంబాలు ఫీజులు చెల్లించేందుకు అప్పులు చేయక తప్పడం లేదు. పరీక్షల సమయంలో ఒత్తిడి పెంచి పూర్తి స్థాయి ఫీజులు వసూళ్లకు పాల్పడుతుండటంతో పేద కుటుంబాలకు తలకు మించిన భారంగా తయారైంది. ఫీజుల ఒత్తిడితో విద్యార్థులు పరీక్షలపై సరిగా దృష్టి పెట్టలేకపోతున్నారని తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పడమట పర్యాటక రాగం!

టూరిస్ట్ ప్రాంతాలను కలుపుతూ ప్రత్యేక సర్క్యూట్

- పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటుకు హెచ్‌ఎండీఏ సన్నాహాలు
- తారామతి బారాదరి, బాపూఘాట్, ఎకోపార్కు తదితర ప్రాంతాల అనుసంధానం

దేశ, విదేశాలకు చెందిన సందర్శకులను ఆకట్టుకునేలా సదుపాయాలు



సర్క్యూట్ ఇలా..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలను అనుసంధానం చేసే సరికొత్త ప్రాజెక్టు నిర్మాణానికి హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) చర్యలు చేపట్టింది. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులను ఆకట్టుకొనేలా ప్రత్యేక టూరిస్ట్ సర్క్యూట్‌లకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, పీపుల్స్ ప్లాజా వలయంలోని చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా వలయ రహదారి ఉన్నట్లుగానే పడమట వైపున సుమారు 31 కిలో మీటర్ల పరిధిలో ఒక సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నారు. సుమారు 180 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన ఎకో పార్కు, గాంధీజీ భారీ విగ్రహంతో పాటు పర్యాటకులు సందర్శించేలా అభివృద్ధి చేయనున్న బాపూఘాట్‌తో పాటు వివిధ ప్రాంతాలను ఈ వలయంలో రూపొందించనున్నారు. ఇందుకోసం మౌలిక వసతులు, రహదారుల విస్తరణ, ప్రత్యేక రవాణా సదుపాయాలను విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు. ఎకో పార్కు నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. త్వరలో దీన్ని ప్రారంభించనున్నారు. చారిత్రక తారామతి బారాదరితో పాటు, హిమాయత్‌సాగర్ ఫారెస్ట్ ట్రెక్ పార్కు తదితర ప్రాంతాలను ఈ వలయం అనుసంధానం చేయనుంది. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ)పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. డిజైన్, నిర్మాణం, నిధుల కేటాయింపు, నిర్వహణ, బదిలీ (డీబీఎఫ్‌ఓటీ) మోడల్ గా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందుకోసం త్వరలోనే ఆసక్తుల వ్యక్తీకరణకు ఆన్‌లైన్ బిడ్డింగ్ నోటిఫికేషన్ వెలువడనుందని పేర్కొన్నారు.

సర్క్యూట్‌లోని ప్రధాన ప్రాంతాలు..

- ఈ కొత్త టూరిజం సర్క్యూట్‌లో ఎకోపార్క్ (కొత్వాల్‌గూడ, హిమాయత్ సాగర్ సమీపంలో), బాపూ ఘాట్, తారామతి బారాదరి, ఫారెస్ట్ ట్రెక్ పార్క్ (చిలుకూరు రిజర్వ్ ఫారెస్ట్ బ్లాక్) వంటి నాలుగు ప్రధాన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. మొత్తం 31 కిలోమీటర్ల పొడవున ఈ సర్క్యూట్ విస్తరించనుంది.
- తారామతి బారాదరి నుంచి బాపూఘాట్‌కు 3.8 కిలో మీటర్లు, బాపూఘాట్ నుంచి ఎకోపార్కు (హిమాయత్‌సాగర్) 13.50 కి.మీ, హిమాయత్‌సాగర్ నుంచి ఫారెస్ట్ ట్రెక్ పార్కు (నార్సింగి) వరకు 7.5 కి.మీ, అక్కడి నుంచి తిరిగి తారామతి బారాదరి వరకు 6 కి.మీ చొప్పున ఈ సర్క్యూట్ విస్తరించి ఉంటుంది.

పర్యాటకులను ఆకట్టుకునేలా..

- ఈ సర్క్యూట్‌ను ఆధునిక పర్యాటక హంగులతో అభివృద్ధి చేయనున్నారు. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా రవాణా సదుపాయాలను ఏర్పాటు చేస్తారు.
- భాగ్య నగర చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించేలా సర్క్యూట్‌ను అందంగా తీర్చిదిద్దుతారు. రెస్టరెంట్‌లు, షాపింగ్ సెంటర్‌లు తదితర అన్ని సదుపాయాలూ ఉంటాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో పర్యాటకులు వివిధ ప్రాంతాలను సందర్శించేవిధంగా ఏర్పాట్లు చేస్తారు.
- పర్యాటక రంగం అభివృద్ధిని ప్రభుత్వం ప్రత్యేకంగా భావిస్తోంది. ఇప్పటికే మూసీ ప్రక్షాళనతో పాటు బాపూఘాట్‌ను సువిశాలమైన చారిత్రక సందర్శన స్థలంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.
- ఈ క్రమంలో నగరాన్ని అన్ని రంగాలతో పాటు పర్యాటక రంగంలోనూ అంతర్జాతీయ స్థాయిలో నిలిపేందుకు ఇలాంటి సర్క్యూట్‌లు దోహదం చేస్తాయని అధికారులు భావిస్తున్నారు.
- ప్రత్యేకమైన పర్యాటక ప్యాకేజీలతో వెస్ట్ హైదరాబాద్ టూరిజం సర్క్యూట్‌ను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సందర్శించే విధంగా ప్రోత్సహిస్తారు.
- 'ఈ సర్క్యూట్ పూర్తయితే నగర పర్యాటక రంగం కొత్త శోభను సంతరించుకుంటుంది. అందుకే దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ఈ ప్రాజెక్ట్ అభివృద్ధి చేయాలని భావిస్తున్నాం' అని హెచ్‌ఎండీఏ అధికారి ఒకరు వివరించారు.


గుల్జార్ హౌజ్ వద్ద ట్రాఫిక్ గందరగోళం

సారూ.. జర చూడరూ!

రంజాన్ మార్కెట్‌లో పార్కింగ్ తిప్పలు

- పాతబస్తీలో మొదలైన సందడి
- ఈ నెల రోజులూ ఇక ఇక్కట్లు
- ఊసే లేని మల్టీ లెవల్ పార్కింగ్ హామీ
- తాత్కాలిక సౌకర్యం కల్పించాలంటున్న వాహనదారులు

చార్మినార్: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. దీంతో పాటు పాతబస్తీలో పార్కింగ్ సమస్య కూడా మొదలైంది. ఇక నెల రోజుల పాటూ పాతబస్తీలో రంజాన్ మార్కెట్ కొనసాగుతుంది. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన వివిధ రకాల వస్తువులు ఇక్కడి రంజాన్ మార్కెట్‌లో లభిస్తాయి. దీంతో పాతబస్తీ చార్మినార్ పరిసరాల్లో జోరుగా రంజాన్ మార్కెట్ ఉంటుంది. వివిధ ప్రాంతాలను చెందిన వినియోగదారులు తమకు నచ్చిన వస్తువులను ఖరీదు చేయడానికి పాతబస్తీకి భారీ సంఖ్యలో తరలి వస్తుంటారు. అయితే.. పాతబస్తీ రంజాన్ మార్కెట్‌కు వచ్చే వినియోగదారుల సౌకర్యార్థం పార్కింగ్ అందుబాటులో లేకుండాపోయింది. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా రోజుకు ఐదుసార్లు నమాజ్ చేసే ముస్లింలు సైతం మక్కా మసీదుకు పెద్ద ఎత్తున తరలి వస్తారు. వీరందరి వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి ఇప్పటి వరకు సరైన పార్కింగ్ లాట్‌లు అందుబాటులో లేవు. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి దారుషిఫా, నయాపూల్, పురానాపూల్ ద్వారా పాతబస్తీలోకి అడుగుపెట్టే వాహనదారులకు పార్కింగ్ సమస్యలు రంజాన్ మాసంలో మరింత జటిలం కానున్నాయి.

మల్టీ లెవల్ పార్కింగ్ సిస్టం ఏమాయే?

చార్మినార్- మక్కా మసీదు సమీపంలోని పంచ్ మహల్లాలో జీహెచ్‌ఎంసీ మల్టీ లెవల్ పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి ఏడేళ్ల క్రితం ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్‌ను కూల్చివేసి ఏడేళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు సైతం మంజూరు కావడంతో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ గత సార్వత్రిక ఎన్నిలకు ముందు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు జరగలేదు. దీంతో పాటు మోతిగల్లీలోని నిజాం కాలం నాటి ట్రెజరీ భవనాన్ని తొలగించిన సంబంధిత అధికారులు ఇక్కడ కూడా మల్టీ లెవల్ పార్కింగ్ నిర్మాణాలు చేపడతామని హడావుడి చేశారు. ఏడేళ్లు గడిచిపోయినా ఏమీ జరగలేదు. ఇలా పాతబస్తీకి వచ్చే సందర్శకులు, వినియోగదారులు, వాహనదారులకు తమ వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేసుకోవాలో తెలియని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.

రంజాన్ మార్కెట్ ప్రారంభంతో మరిన్ని సమస్యలు..

ఇక సాధారణ రోజుల్లో తలెత్తే పార్కింగ్ సమస్యలతో పాటు.. ఈ నెల రోజుల పాటు కొనసాగే రంజాన్ మార్కెట్‌లో అధికంగా ఉంటాయి. అత్యధిక సంఖ్యలో వచ్చే వాహనాల పార్కింగ్‌కు తాత్కాలికంగానైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. గత రంజాన్ మార్కెట్ సందర్భంగా పాతబస్తీలోని కొన్ని ఖాళీ స్థలాలను ఎంపిక చేసి తాత్కాలికంగా ఉచిత పార్కింగ్ అంటూ రంజాన్ ప్రారంభానికి ముందే ప్రకటించేవారు సంబంధిత లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు. అయితే.. ఆదివారం నుంచి రంజాన్ మాసం ప్రారంభమైనప్పటికీ.. పాతబస్తీలో అవసరమైన మేరకు పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తీసుకురాకపోవడంతో స్థానిక వ్యాపారులతో పాటు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లాడ్‌బజార్‌లో సౌకర్యం లేకపోవడంతో..

లాడ్‌బజార్‌లోని గాజుల దుకాణాలను సందర్శించడానికి దూరపు ప్రాంతాల నుంచి షాపింగ్ కోసం వచ్చే వినియోగదారులకు సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో తమకు నిరాశ కలుగుతోందని స్థానిక వ్యాపారులు అంటున్నారు. తమ కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని గాజుల వ్యాపారులు కోరుతున్నారు. సరైన పార్కింగ్ లేకపోవడంతో తమ వాహనాలను ఎక్కడ పార్కు చేసుకోవాలో తెలియక వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందంటున్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తే ఈ రంజాన్ మాసంలో ఆశించిన స్థాయిలో వ్యాపారాభివృద్ధి జరుగుతుందని కోరుతున్నారు. ప్రత్యేకంగా కారు పార్కింగ్ ఏర్పాటు చేయాని వారు సూచిస్తున్నారు.

బాల్యానికి మూడు‘ముళ్లు’

- 18 ఏళ్లు నిండక ముందే పెళ్లి పీటల పైకి..
- గ్రేటర్ జిల్లాల పరిధిలో ఆగని బాల్య వివాహాలు
- తరచూ వెలుగు చూస్తున్న ఘటనలు

జిల్లా	అడ్డుకున్న బాల్య వివాహాలు
వికారాబాద్	94
రంగారెడ్డి	54
మేడ్చల్	54
హైదరాబాద్	46



సాక్షి, సిటీబ్యూరో: ఎగుమతుల ఖిల్లా.. రంగారెడ్డి జిల్లా బాల్య వివాహాలకు నిలయంగా మారుతోంది. ఐటీ, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకుపోతూ అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఉమ్మడి జిల్లాలోని పలువురు బాలికలు మూడు ముళ్ల బంధంలో చిక్కుకుంటున్నారు. 18 ఏళ్ల వయసు నిండక ముందే పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. తల్లిదండ్రులు తమకు ఇష్టం లేని పెళ్లిళ్లు చేస్తుండటంతో అధికారులను ఆశ్రయిస్తున్నారు. 2024 జనవరి నుంచి నవంబర్ చివరి వరకు తెలంగాణ వ్యాప్తంగా దాదాపు వెయ్యి బాల్య వివాహాలను అడ్డుకోగా, వీటిలో కేవలం గ్రేటర్ జిల్లాల పరిధిలోనే 248 కేసులు ఉండటం గమనార్హం.

అవగాహన కల్పిస్తున్నా..

బాల్య వివాహాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. పిల్లలకు త్వరగా పెళ్లి చేసి, బాధ్యతల భారాన్ని తగ్గించుకోవాలనే సామాజిక దురాచారం నుంచి తల్లిదండ్రులు ఇంకా బయటపడటం లేదు. ఉన్నత చదువులు చదువుకుని, మంచి ఉద్యోగం సంపాదించి సొంతకాళ్లపై నిలబడాలనే బాలికల ఆలోచనను మొగ్గలోనే తుంచేస్తున్నారు. బాల్య వివాహాల రద్దు కోసం ప్రభుత్వాలు బలమైన చట్టాలను తీసుకొచ్చినప్పటికీ.. తల్లిదండ్రుల్లో ఉన్న బలహీనత బాలికల పాలిట శాపంగా మారుతోంది. కొంత మంది తల్లిదండ్రుల ఒత్తిడికి తలొగ్గి తాళి కట్టించుకుంటుంటే.. మరి కొంత మంది ఎదురు తిరుగుతున్నారు.

పలువురికి విముక్తి

బలవంతపు పెళ్లిని నిలిపివేయించాలని కోరుతూ పోలీసులను, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆశ్రయిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 94 బాల్య వివాహాలను అడ్డుకోగా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 54 చొప్పున అడ్డుకున్నారు. హైదరాబాద్‌లో 46 మంది బాలికలకు బాల్య వివాహాల నుంచి విముక్తి కల్పించారు.

ట్యాంకర్ల డెలివరీ టైమింగ్ తగ్గించాలి

- జలమండలి ఎండీ అశోక్ రెడ్డి
- మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ


మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో జలమండలి ఎండీ తనిఖీ

సాక్షి, సిటీబ్యూరో: ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. వేసవిలో నీటి డిమాండ్‌ను ఎదుర్కోవడానికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే డెలివరీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం సూక్ష్మ స్థాయి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. అవసరమైతే అదనపు ట్యాంకర్లు, సిబ్బందిని సమకూర్చుకోవాలని చెప్పారు. మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఏమైనా అవసరాలుంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వాటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ట్యాంకర్ల సరఫరాపై ఆరా

ట్యాంకర్ డ్రైవర్లతో ఎండీ మాట్లాడారు. ట్యాంకర్ బుకింగ్, డెలివరీ లాగ్ బుక్‌ను పరిశీలించారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి? ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాదాపూర్ ఫిల్లింగ్ స్టేషన్ లో 06 ఫిల్లింగ్ పాయింట్స్, 80 ట్యాంకర్లు ఉండగా.. రోజుకి 600 ట్రిప్పులు డెలివరీ చేస్తున్నారు. 80 శాతం బుకింగ్స్ ను 6 నుంచి 12 గంటల్లో డెలివరీ చేస్తుండగా.. మిగిలిన 20 శాతం 24 గంటల్లో డెలివరీ చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ 600 ట్రిప్పులు డెలివరీ చేస్తుండగా.. రాబోయే రోజుల్లో 1200 బుకింగ్స్ వచ్చినా డెలివరి చేసే సామర్థ్యం ఉందని జీఎం.. ఎండీ కి వివరించారు.ఈ కార్యక్రమంలో జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఈడీ ఇన్‌స్పెక్షన్..

జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ ఆదివారం పలు ఫిల్లింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. షాపూర్‌నగర్, మౌలాలి, ఎల్లారెడ్డి గూడ ఫిల్లింగ్ స్టేషన్లకు వెళ్లారు. ట్యాంకర్ బుకింగ్ స్టేటస్, రోజుకి ఎన్ని ట్యాంకర్లు బుక్ అవుతున్నాయి? ఎన్ని డెలివరీ చేస్తున్నారు? తదితర వివరాలు తనిఖీ చేశారు. ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ ఇన్‌చార్జిలతో మాట్లాడి వివరాలు కనుక్కున్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

మసీద్ బండ సెక్షన్‌లో విద్యుత్ శాఖ నిర్వహణ పనులు చేపడుతోంది. దీంతో ఆ సెక్షన్ పరిధిలో ఉన్న ఫిల్లింగ్ స్టేషన్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చెయ్యడం ఆగింది. ఒకే ఫిల్లింగ్ స్టేషన్ తో (గ్రావిటీ ద్వారా నడిచే) నీటి సరఫరా చేస్తున్నారు.

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు షేక్ ఖయ్యూమ్, ముస్తఫా అలీ

అత్తాపూర్: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చంద్రాయణగుట్టకు చెందిన మీర్ ముస్తఫా అలీ, ఎంఎం పహాడీకి చెందిన షేక్ ఖయ్యూమ్‌లు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయడమే వత్తిగా మలుచుకున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు దాదాపు 80 కేసులు నమోదై ఉన్నాయి. వీరు తరచు దొంగతనాలు చేస్తూ పట్టుబడిన ప్రతిసారి బైయిల్‌పై బయటకు వస్తు తిరిగి అదే పంథాను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గత నెల 25వ తేదీన టీఎస్12ఈఏ 4398 నెంబర్ గల వారి యాక్టివా స్కూటీకి డూప్లికేట్ టీఎస్09ఈవై 0733 నంబర్ ప్లేట్‌ను అతికించారు. అనంతరం సర్వారెడ్డి కాలనీకి చేరుకున్నారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడును తెంచుకుని పారిపోయి డూప్లికేట్ నెంబర్‌ప్లేట్, వారు ధరించిన బట్టలు, మాస్క్‌లను తొలగించి ఏమీ తెలియనట్లు ప్రయాణించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగలించిన బంగారు గొలుసును జకియా సుల్తానా అనే మహిళకు ఇవ్వడంతో ఆమె విక్రయించిందన్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 17.5 గ్రాముల బంగారం, యాక్టివా స్కూటీ, రూ.60 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

తక్కువ ధరకు బంగారమంటూ టోకరా

- నగరవాసి నుంచి రూ.5 లక్షలు స్వాహా
- నిందితుడిని అరెస్టు చేసిన సైబర్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: వాట్సాప్ ద్వారా కాల్స్ చేసి, తక్కువ ధరకు బంగారం విక్రయిస్తానంటూ వల వేసి, అందినకాడికి దండుకుని మోసం చేస్తున్న నేరగాడిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన జాలె చంద్రశేఖర్‌రెడ్డి ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌లకు బానిసగా మారాడు. ఇతర వ్యసనాలకూ ఉన్న ఇతగాడు తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం సైబర్ నేరగాడి అవతారం ఎత్తాడు. స్నేహితులు, పరిచయస్తుల ద్వారా నగరానికి చెందిన అనేక మంది ఫోన్ నెంబర్లు సేకరించిన ఇతగాడు వారికి వాట్సాప్ కాల్ చేసి తానో బంగారం వ్యాపారిగా పరిచయం చేసుకుంటాడు. ముంబైలో తక్కువ ధరలకు బంగారాన్ని ఖరీదు చేస్తుంటానని, దాన్ని మార్కెట్ రేటు కంటే తక్కువగా విక్రయిస్తానని నమ్మబలుకుతాడు. ఎదుటి వారిని పూర్తిగా నమ్మించడం కోసం వారికి తెలిసిన కొందరి పేర్లు చెప్తాడు. ఇలా కోఠిలో నివసిస్తున్న ఓ వృద్ధుడికి (75) గత ఏడాది డిసెంబర్‌లో కాల్ చేశాడు. ఆరు తులాల బంగారం రూ.5 లక్షలకు విక్రయిస్తానని నమ్మించాడు. ఆయన నుంచి అడ్వాన్స్‌గా ఆ మొత్తం తన బ్యాంకు ఖాతాల్లో జమ చేయించుకున్నాడు. ఆపై బాధితుడు తన బంగారం విషయంపై చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి అడుగుతుండగా... క్రిస్మస్ పండుగతో పాటు ఇతర సాకులు చెప్పి తప్పించుకున్నాడు. తీవ్రంగా ఒత్తిడి చేయగా... ఈ ఏడాది జనవరి 15న నేరుగా వచ్చి బంగారం ఇస్తానని చెప్పాడు. అలా చేయకపోవడంతో బాధితుడు పదేపదే ఫోన్లు చేసినా స్పందించడం మానేశాడు. దీంతో తాను మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసి ఆదివారం నిందితుడిని అరెస్టు చేసింది.

నెలరోజుల క్రితం ఆత్మహత్య?

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఆత్మహత్య చేసుకున్న వ్యక్తికి చెందిన బ్యాగు, టీషర్ట్

గచ్చిబౌలి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆలస్యంగా లభ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ ఆదివారం తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయదుర్గంలోని మహాప్రస్థానం ఎదురుగా ఉండే గుట్టవైపు వేపచెట్టుకు 35–40 ఏళ్ళ వయసున్న ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకున్నట్లుగా పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం స్థానికులు అటువైపు వెళ్లగా దుర్వాసన రావడంతో గమనించి మొబైల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఉండగా..మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నట్లుగా గుర్తించారు. కింద ఒక బ్యాగు అందులో షర్టులు, ప్యాంట్లు, ఒక కంటి అద్దాలు పెట్టుకొనే బాక్సు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సుమోటోగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా దాదాపు నెల క్రితం ఈ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

ద్వారకామయి పీఠంలో గణపతి, చండీహోమం

మీర్‌పేట: మీర్‌పేట ప్రశాంతిహిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠంలో పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామిజీ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఆదివారం గణపతి, చండీహోమం నిర్వహించారు. బీజేపీ జాతీయ కోర్ కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన విజ్ఞాన్ వైభవ్

చివరి రోజు విద్యార్థులతో కిటకిటలాడిన స్టాల్స్

ఆకట్టుకున్న డ్రోన్ షో



రక్షణ రంగం యంత్ర పరికరాల వివరాలను తెలుసుకుంటున్న విద్యార్థులు



ఆర్మీ అధికారులతో స్కూల్ విద్యార్థులు



అంతరిక్షం నమూనా వద్ద యువతి

చందానగర్: గచ్చిబౌలి స్టేడియంలో విజ్ఞాన్ వైభవ్ ఎగ్జిబిషన్ –2025 ఆదివారంతో ముగిసింది. మూడు రోజులపాటు నిర్వహించిన యుద్ధ పరికరాల ప్రదర్శన విద్యార్థులను, యువతను ఎంతో ఆకట్టుకుంది. రక్షణ రంగానికి చెందిన అనేక అరుదైన ఆయుధాలు, పరికరాలు వివిధ స్టాల్స్‌లలో ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్షణరంగ ఉత్పత్తుల తయారీలో భారత్ మరో పదేళ్లలో ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తుందని డీఆర్‌డీఓ ప్రతినిధులు పేర్కొన్నారు. మూడు రోజులపాటు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు రక్షణరంగ పరిశోధన కేంద్రాలు, ఉత్పత్తి సంస్థలు తయారు చేసిన ఆయుధాలను తిలకించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో డ్రోన్ షో అందరినీ ఆకట్టుకుంది. ఇండియన్ ఆర్మీ అధికారులతో విద్యార్థులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

ఖతర్నాక్ కాంతి దత్!

- తృతీయ ఫైన్ జ్యువెలరీ పేరుతో సంస్థ ఏర్పాటు
- ప్రముఖ సినీ నటుల పేర్లు చెప్పి వరుస మోసాలు
- ఇప్పటికే ఇతడిపై జూబ్లీహిల్స్, సీసీఎస్‌లో కేసులు
- మరో బాధితురాలి ఫిర్యాదుతో తాజాగా ఇంకో కేసు..



సాక్షి, సిటీబ్యూరో: తృతీయ ఫైన్ జ్యువెలరీ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి, బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా భాగస్వామి అని, టాలీవుడ్, కోలీవుడ్ నటులు సమంత, కీర్తి సురేష్ బ్రాండ్ అంబాసిడర్లు అంటూ నమ్మించి వర్ధమాన వ్యాపారవేత్తల్ని మోసం చేయడంలో దిట్ట తొనంగి కాంతిదత్‌పై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో (సీసీఎస్) కేసు నమోదైంది. గత నెల 22న ఇది రిజిస్టర్ కాగా...ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే ఇతడిపై జూబ్లీహిల్స్‌తో పాటు సీసీఎస్‌లో కేసులు ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో జూబ్లీహిల్స్ అధికారులు అరెస్టు కూడా చేశారు. తాజాగా శేరిలింగంపల్లికి చెందిన సౌజన్య జూపల్లిని రూ.4.5 కోట్ల మేర మోసం చేసిన ఆరోపణలపై సీసీఎస్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన కాంతిదత్ ఫిల్మ్‌నగర్ పరిధిలోని షేక్‌పేటలో స్థిరపడ్డాడు. జూబ్లీహిల్స్ రోడ్ నం.36లో తృతీయ ఫైన్ జ్యువెలరీ పేరుతో సంస్థను ఏర్పాటు చేశాడు. ఇందులో భాగస్వామిగా ఉన్న వైజాగ్‌కు చెందిన శ్రీజరెడ్డి తిప్పల రూ.2.50 కోట్లు వెచ్చించారు. 2023 సెప్టెంబర్ 7న బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా చేతుల మీదుగా ఈ షోరూం ప్రారంభమైంది. దీని నిమిత్తం రూ.1.5 కోట్లు ఆమెకు ఇవ్వాలంటూ శ్రీజరెడ్డి దగ్గర తీసుకున్నాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో ఫోర్జరీ సంతకాలతో ఆమెను డైరెక్టర్ పదవి నుంచి తొలగించిన కాంతి దత్ తన తల్లిని నియమించాడు. శ్రీజ ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. ఇదిలా ఉండగా...కాంతి దత్ మొదట ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.3.50 కోట్లు తీసుకుని తృతీయ జ్యువెలరీలో డైరెక్టర్‌గా చేర్చుకున్నాడు. ఈయనతో పాటు గౌతమ్ వ్యక్తిని కూడా నమ్మించి మోసగించడంతో వాళ్లు ఆయా ఠాణాల్లో ఫిర్యాదు చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో జూబ్లీహిల్స్ పోలీసులు కాంతిదత్‌ను అరెస్టు చేశారు. ఆ సందర్భంలో ప్రముఖ డిజైనర్ శిల్పారెడ్డి కూడా ఓ వీడియో విడుదల చేస్తూ సస్టైన్ కార్ట్ వ్యాపారం పేరుతో తనను మోసం చేసినట్లు ఆరోపించారు. మొత్తమ్మీద పలువురి నుంచి దాదాపు రూ.40 కోట్లు తీసుకుని మోసం చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. కాంతి దత్ చేతిలో తాను కూడా రూ.4.5 కోట్లకు మోసపోయానంటూ సౌజన్య గత నెల 21న సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్‌లో తన కుమార్తెను ట్యూషన్‌కు తీసుకువెళ్లినప్పుడు తాను నయోమీ రెస్టారెంట్‌లో కూర్చుంటానని, అక్కడే తనకు కాంతి దత్ పరిచయం అయ్యాడని ఆమె పోలీసులకు తెలిపారు. అలా మాయమాటలు చెప్పిన అతగాడు శ్రీ స్వేర హాస్పిటాలిటీ పేరుతో లిమిటెడ్ లయబిలిటీ పార్టనర్‌షిప్ కంపెనీలో వాటా అంటూ ఆమెను ఆకర్షించాడు. ఈ కంపెనీ పేరుతో బంజారాహిల్స్‌లో నయోమీ రెస్టారెంట్ బ్రాంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పాడు. ఆపై దక్షిణ్ కథ సౌత్ ఇండియన్ రెస్టారెంట్, తృతీయ ఫైన్ జ్యువెలర్స్ పేర్లు చెప్పి 2023–24ల్లో దాదాపు రూ.4.5 కోట్ల వరకు సౌజన్య నుంచి తీసుకుని మోసం చేశాడు. ఎట్టకేలకు తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు సీసీఎస్‌ను ఆశ్రయించడంతో కేసు నమోదైంది. సౌజన్య తన ఫిర్యాదుతో పాటు కాంతి దత్‌తో చేసిన లావాదేవీలకు సంబంధించిన పూర్తి ఆధారాలు అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మరోపక్క కాంతిదత్‌పై మాదాపూర్ ఠాణాలో గతంలో ఓ హిట్ అండ్ రన్ కేసు నమోదైంది. బైక్ ట్యాక్సీ డ్రైవర్ రాజశేఖర్ మృతి చెందడంతో నమోదైన ఈ కేసులోనూ ఆయన అరెస్టు అయ్యారు.

ప్రేమ పేరుతో వంచన.. యువకుడిపై కేసు

బంజారాహిల్స్: ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతితో చెట్టాపట్టాలేసుకుని తిరిగి..ఆమెను గర్భవతిని చేసి..ఆపై ముఖం చాటేసిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన ఓ యువతి (25)కి అదే ప్రాంతానికి చెందిన ఎస్.శివాచారితో 2020 ఆగస్టులో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని శివాచారి నమ్మించడంతో ఆమె సన్నిహితంగా మెలిగింది. ఇటీవలే శివాచారి కేపీహెచ్‌బీకి మకాం మార్చగా యువతి కూడా బంజారాహిల్స్‌కు వచ్చి ఓ ఆస్పత్రిలో పనిచేస్తూ హాస్టల్‌లో ఉంటుంది. ఇక్కడ కూడా తరచూ కలుసుకునేవారు. ఆమె రెండుసార్లు గర్భం దాల్చగా, బలవంతంగా మాయమాటలు చెప్పి గర్భస్రావం చేయించాడు. గత నెల నుంచి శివాచారి ప్రవర్తనలో మార్పు వచ్చినట్లు గమనించింది. లోతుగా ఆరా తీయగా శివాచారికి ఆరు నెలల క్రితమే మరో యువతితో నిశ్చితార్థం జరిగినట్లుగా తెలిసింది. దీంతో ఆమె ఆత్మహత్యాయత్నానికి కూడా పాల్పడింది. నాలుగు నెలల్లో పెళ్లి చేసుకుంటానని నమ్మించిన నిందితుడు పెళ్లి చేసుకోగా మరో యువతితో నిశ్చితార్థం చేసుకోవడమే కాకుండా తమ ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడం లేదని, వాట్సప్ బ్లాక్ చేశాడని, తనను మోసం చేశాడని బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శివాచారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మాచర్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

పరీక్షల వేళ భయాందోళన వద్దు

మొయినాబాద్‌రూరల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు భయాందోళనకు గురికావొద్దని తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియెట్ ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ చైర్మన్ గౌరీ సతీష్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈనెల 5 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇంటర్‌బోర్డు నియమావళిని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఉదయం 8.45 గంటలలోపు వచ్చిన వారినే పరీక్షలకు అనుమతించనున్నారని, ఆ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరని చెప్పారు. సమయాన్ని పాటిస్తూ విద్యార్థులు 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రాలకు వెళ్లాలని బోర్డు తొలిసారి నిబంధనలు అమలులోకి తెచ్చిందన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ.. పరీక్ష కేంద్రాలకు తగిన సమయానికి తీసుకెళ్లాలన్నారు. ఏవైనా సందేహాలుంటే 92402 05555 టోల్‌ఫ్రీ నంబర్‌తో పాటు జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

క్రీడలను ప్రోత్సహించాలి

హుడాకాంప్లెక్స్: బీసీసీఐ వద్ద ఉన్న నిధులను ఇతర క్రీడలకు మళ్లించి క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అభిప్రాయపడ్డారు. హీరో సుమన్ 50 ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం 'సుమన్ తల్వార్ లెజెండరీ కప్–2025' పేరిట రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుయాష్కి మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, మద్యం ఇతర వ్యసనాల బారిన పడుతూ జీవితాలను పాడు చేసుకుంటున్నారని, క్రీడలను అలవాటు చేసుకోవడం ద్వారా వారి జీవితాలను క్రమశిక్షణగా తీర్చిదిద్దుకోవచ్చని సూచించారు.

మద్యం తాగి వాంతులు చేసుకుని..

వలస కూలీ మృతి

మొయినాబాద్: మద్యం తాగి వాంతులు చేసుకుని ఓ వలస కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి అజీజ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన నీలాంచల్ బెహెర(33) బతుకు దెరువుకోసం 3 ఏళ్ల క్రితం అజీజ్‌నగర్‌కు వలస వచ్చాడు. సోడా కంపెనీలో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో మద్యం తాగి పడుకున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో అక్కడే పనిచేసే అతని బంధువు ఈశ్వర్ మహకుల్ భోజనం చేయడానికి నీలాంచల్‌ను నిద్ర లేపాడు. ఆ సమయంలో వాంతులు చేసుకుని మళ్లీ పడుకున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో నిద్ర లేపే ప్రయత్నం చేయగా.. అతను లేవలేదు. వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచిగాంధీకి తీసుకెళ్లగా.. బెహెర చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రతి ఇంట్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోండి



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

శంకర్‌పల్లి: పిల్లల తల్లిదండ్రులందరికీ చేతులు జోడించి వేడుకుంటున్నా.. ప్రతి ఇంట్లో ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోండని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని దొంతాన్‌పల్లిలో ఆదివారం సక్సెస్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరాటే నేర్చుకోవడం ఎంత ముఖ్యమో, దానిని నిత్యం సాధన చేయడం అంత కన్నా ముఖ్యమని తెలిపారు. ఫోన్లలో సోషల్ మీడియా, టీవీలు చూడడం తగ్గించి పుస్తక పఠనంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సక్సెస్ షోటోకాన్ కరాటే ప్రతినిధులు రవీందర్ కుమార్, అనిల్, రాజు, శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్ నాయక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రెష్.. ఫిష్

- జల్‌పల్లి చెరువు చేపలకు భలే గిరాకీ
- పెద్ద ఎత్తున తరలివస్తున్న కొనుగోలుదారులు
- స్వచ్ఛమైన, తాజా చేపలను విక్రయిస్తున్న పెంపకందారులు
- చికెన్, మటన్‌కు ప్రత్యామ్నాయంగా చేపల వంటకాలు



జల్‌పల్లి చెరువు వద్ద కొనసాగుతున్న చేపల విక్రయాలు

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువు చేపలకు గిరాకీ పెరిగింది. నెల రోజులుగా బర్డ్ ఫ్లూ వార్తల నేపథ్యంలో జనం చికెన్, గుడ్లు తినడాన్ని కొంత తగ్గించారు. ఈ నేపథ్యంలో మటన్, చేపల వైపు మొగ్గు చూపుతున్నారు. చికెన్ విక్రయాలు పడిపోవడంతో మటన్ వ్యాపారులు కిలోకు వెయ్యి రూపాయల చొప్పున వరకు విక్రయిస్తున్నారు. ఇంత డబ్బు వెచ్చించలేని పేద, మధ్య తరగతి ప్రజలు ప్రత్యామ్నాయంగా చేపలు తినేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ క్రమంలోనే స్వచ్ఛమైన నీటితో కూడిన జల్‌పల్లి చెరువులో కళ్ల ముందే పట్టుకొచ్చిన చేపలను విక్రయిస్తుండటంతో శని, ఆదివారాల్లో నగర శివారు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

రుచికరమైన చేపలకు పెట్టింది పేరు...

పుష్కలమైన నీటితో నిండుకుండలా తొణికిసలాడుతున్న జల్‌పల్లి చెరువులో ప్రతీ శని, ఆదివారాల్లో తాజా చేపలను విక్రయిస్తుంటారు. 150 ఎకరాల మేర విస్తరించిన ఉన్న ఈ చెరువులోని చేపలు ఎంతో రుచికరంగా ఉంటాయి. దీంతో ఇక్కడ పెద్ద ఎత్తున చేపల విక్రయాలు కొనసాగుతుంటాయి. ప్రస్తుతం వీరి సంఖ్య రెట్టింపైంది. పాతబస్తీ, కాటేదాన్, శంషాబాద్ తదితర ప్రాంతాల ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. పాంప్లెట్స్ రకం కిలో రూ.120 ఉండగా.. సాధారణ చేపలు కిలో రూ.150 చొప్పున విక్రయిస్తున్నారు. రవ్వ, బొచ్చ, కట్ల, గ్యాస్కిట్, కొర్రమీను తదితర రకాల చేపలు ఈ చెరువులో లభ్యమవుతున్నాయి.

రెండు సంఘాల ఆధ్వర్యంలో.

జల్‌పల్లి శ్రీరామ ఫిష్ సొసైటీ, పాతబస్తీ కందికల్ గేట్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రెండు గ్రూపుల పెంపకందారులు ఈ చెరువులో చేపలను పెంచి విక్రయిస్తుంటారు. ఈసారి తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో 55 వేల చేప పిల్లలను ఉచితంగా అందజేశారు. వీటికి అదనంగా రెండు సంఘాల వారు ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి నుంచి 11 లక్షల చేప పిల్లలను తీసుకొచ్చి వదిలారు. నీరు సమృద్ధిగా ఉండడంతో చేపల తూకం కూడా గణనీయంగా పెరిగింది. ఒక్కో చేప ఒక కిలో నుంచి నాలుగు కిలోల వరకు తూగుతోంది. దీంతో పెంపకందారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.



విక్రయానికి ఉన్న చేపలు

గిరాకీ పెరిగింది



ఇటీవల చేపల కోసం జల్‌పల్లి చెరువుకు వచ్చే వారి సంఖ్య బాగా పెరిగింది. డిమాండ్ ఉన్నప్పటికీ సాధారణ ధరకే విక్రయిస్తున్నాం. చెరువు నీరు కలుషితం కాకుండా కలిసికట్టుగా చూసుకుంటున్నాం. కుల మతాలకతీతంగా ఫిష్ సొసైటీ ఏర్పాటు చేసుకున్నాం. చేప పిల్లలను వదిలినప్పటి నుంచి అవి పెరిగేంత వరకు అసోసియేషన్ సభ్యులందరు పర్యవేక్షిస్తుంటారు.

– నర్సింహ, ఫిష్ సొసైటీ సభ్యుడు

ఎంతో రుచికరం



చికెన్, గుడ్లు తినడం తగ్గించాం. బయట మార్కెట్లలో లభించే చేపలతో పోలిస్తే జల్‌పల్లి చెరువు చేపలు రుచికరంగా ఉంటాయి. కళ్ల ముందే చేపలను పట్టుకొచ్చి తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కటింగ్ చేసే వారు కూడా ఇక్కడే అందుబాటులో ఉన్నారు. స్వచ్ఛమైన నీటిలో పెరిగిన చేపలు తినడమే ఆరోగ్యానికి మంచిదని ఈ చేపలకు ప్రాధాన్యమిస్తున్నాం.

– రాజు, శ్రీరాంకాలనీ

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : ఎస్‌పి ఆర్‌హిల్స్, హిందు 11కేవీ ఫీడర్లు, గ్రీన్‌లాండ్స్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎస్‌పిఆర్‌హిల్స్, వెంకట్‌ప్లాజా, ఓర్రా జ్యువెల్స్, కృష్ణా జ్యువెల్స్, ఎక్సైడ్ బ్యాటరీ, పోచమ్మ దేవాలయం, పంజగుట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఆదివారం తెలిపారు. అదేవిధంగా రాజీవ్‌నగర్, ఎంసీహెచ్ మార్కెట్ 11 కేవీ ఫీడర్లు, మోతీనగర్, గ్రీన్‌లాండ్ సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా కళ్యాణ్‌నగర్, రాజీవ్‌నగర్, బీఎస్‌పురి, సెర్వెల్‌కో ఆపరేటివ్ సొసైటీ, జయంతినగర్, శ్రీరామ్‌నగర్, వెంకట్ ప్లాజా, ఓర్రా, కృష్ణా జ్యువెలరీస్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

7న మహిళా ప్రముఖులకు అవార్డుల ప్రదానం

లిబర్టీ: వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలకు ఈ నెల 7న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. ఆదివారం ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు భారతీయ నారి శిరోమణి సన్మానం పేరిట అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఫారెన్ కరస్పాండెంట్ క్లబ్‌లో అవార్డుల ప్రదాన వేడుక ఉంటుందన్నారు.

నిజమైన కార్యకర్తలకే పదవులు ఇవ్వాలి

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం శ్రమించిన అసలు సిసలైన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. ఏఐసీసీ, పీసీసీ నాయకత్వం పదేళ్ల తర్వాత పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషించిన నాయకులను, కార్యకర్తలను గుర్తించాలని కోరారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ త్వరలో పీసీసీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యవర్గ సభ్యుల నియామకంలో క్షేత్రస్థాయి పరిశీలించి నిజమైన కార్యకర్తలు, నాయకులు గుర్తించి పదవులు కట్టబెట్టాలన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ నిజమైన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం



పంజగుట్ట: గుర్తుతెలియని మృతదేహాన్ని పంజగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం శ్రీనగర్‌కాలనీ, హెచ్‌పీ గ్యాస్ షాప్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా అతను అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్యలో ఉండవచ్చునని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

అలరించిన నృత్యాంజలి



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన అనన్య సూరపనేని నృత్యాంజలి కార్యక్రమం అలరించింది. స్వామివారి సన్నిధిలో అనన్య చేసిన భరతనాట్యం ప్రదర్శన ఆద్యంతం నయనానందకరంగా సాగింది. శ్రీ వేంకటేశ్వరస్తోత్రం, మరకతమణి మయచేల, పలుకు తేనెల తల్లి, కొలువైతివా రంగశాయి వంటి అద్భుతమైన అంశాలను ప్రదర్శించిన అనన్య చక్కని అభినయంతో ఆకట్టుకుంది.


చెన్నకేశవ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

అబిడ్స్: చెన్నకేశవ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఖాజా వెంకట వసంత, నవరయ్య మాట్లాడుతూ.. గుడిమల్కాపూర్ పూలు, కూరగాయల మార్కెట్‌కు వచ్చేవారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు.



రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

- శనివారం రాత్రి మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు..
- ఆదివారం నుంచి ఉపవాస దీక్షలు..
- ముస్తాబైన మసీదులు..
- వెల్లివిరుస్తున్న ఆధ్యాత్మికత..



రంజాన్ వేడుకలకు ముస్తాబైన మసీదు

బంజారాహిల్స్: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి నెలవంక కనిపించింది. సౌదీ అరేబియాలో శనివారం నుంచే దీక్షలు ప్రారంభం కావడంతో ఆ మరుసటి రోజు మన దేశంలో దీక్షలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. రంజాన్ నేపథ్యంలో ముస్లింల ఉపవాస దీక్షలు, దానాలు, ప్రార్థనలు, నిత్య ఖురాన్ పఠనం, ఇఫ్తార్ విందులతో నగరంలో మత సామరస్యం వెల్లివిరుస్తోంది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్ల పరిధిలో ఉన్న 122కి పైగా మసీదులు రంజాన్ నేపథ్యంలో రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఇప్పటికే ముస్లింలు ఉపవాస దీక్షలతో నెల రోజులు దైవారాధనలో గడిపేందుకు సిద్ధమయ్యారు.

◆ ఇస్లామియా కేలండర్‌లో 9వ నెల రంజాన్ మాసాన్ని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. దివ్య ఖురాన్ గ్రంథం ఈ మాసంలోనే ఆవిర్భవించడమే ఇందుకు కారణం. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ మాసం.

◆ ఈ మాసంలో రోజుకు 5 సార్లు నమాజ్‌తో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. వయస్సుతో నిమిత్తం లేకుండా చిన్నా, పెద్దా, వృద్ధులు సైతం భక్తిశ్రద్ధలతో దీక్షలు చేపడతారు. జకాత్‌తో పాటు ఫిత్రా దానానికి రంజాన్‌లో ఎంతో ప్రాధాన్యం ఉంది. మూడు పూటలా తిండికి, దుస్తులకు నోచుకోని అభాగ్యులకు సంపన్నులైన ముస్లింలు దానం చేయాలని ఇస్లాం బోధిస్తుంది.

◆ ఈ మాసం మనిషి సత్ప్రవర్తన దిశలో సాగడానికి దిశా నిర్దేశం చేస్తుంది. దీక్షల విరమణ సమయంలో ఆహారం అందించేందుకు మసీదుల వద్ద స్టాళ్లు సిద్ధం చేశారు. మసీదుల ముందు, రహదారులకు ఇరువైపులా హలీం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆయా చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో..

◆ మరోవైపు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదుల వద్ద మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా జలమండలి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనికి తోడు రంజాన్ నెలవంక శనివారం దర్శనమివ్వడంతో ముస్లిం సోదరులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడమే కాకుండా రాత్రి నుంచే ప్రత్యేక తరావిహ్ నమాజ్ ఆచరించారు.

'సేవలు పొందకుండానే నష్టపరిహారం అడగరాదు'

బంజారాహిల్స్: వినియోగదారుడు మ్యానువల్ షెడ్యూల్‌కు కట్టుబడి ఉండనందున ప్యూర్ ఎలక్ట్రిక్ వెహికిల్ కంపెనీపై వినియోగదారుడి ఫిర్యాదును తొలగించారు. ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీ అయిన ప్యూర్ ఈవీకి వ్యతిరేకంగా సంద్రల్ విష్ణు అనే వినియోగదారుడు దాఖలు చేసిన ఫిర్యాదును జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తోసిపుచ్చింది. తనకు నష్టపరిహారం కింద రూ.3 లక్షలు, మానసిక వేదనకు రూ.5 లక్షలు, స్కూటర్ ధరకు రూ.90 వేల పరిహారంతో పాటు వారంటీ కింద కొత్త బ్యాటరీ రీప్లేస్‌మెంట్ కోరిన ఫిర్యాదిదారులు సాక్ష్యం లేకపోవడం, యూజర్ మ్యానువల్ ప్రకారం సర్వీస్ షెడ్యూల్‌ను అనుసరించడంలో వైఫల్యం కారణంగా కొట్టివేశారు. అధ్యక్షుడు వక్కంటి నరసింహారావు, సభ్యులు బి.శ్రీదేవి, వి.జనార్దన్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ (2) ఈ కేసుపై విచారణ చేపట్టాంది. లోపభూయిష్ట సేవకు సంబంధించిన వాదనలను సహేతుకమైన సందేహం, స్వతంత్ర నిపుణుల ఆధారాలతో నిరూపించడంలో ఫిర్యాదుదారులు విఫలమయ్యారని బెంచ్ నిర్ణయించింది. మ్యానువల్‌లో నిర్దేశించిన ఉచిత సేవలను ఫిర్యాదుదారుడు వినియోగించుకోలేదని కూడా కమిషన్ గుర్తించింది. 2021 ఏప్రిల్ 7న ఫిర్యాదుదారుడు వాహనం కొనుగోలు చేసినప్పటికీ షెడ్యూల్‌లో పేర్కొన్నట్లుగా ఉచిత సేవలను పొందకుండానే 2023 డిసెంబర్ 10న లీగల్ నోటీసులు జారీ చేశారన్నారు. వారంటీ క్లెయిమ్‌ల కోసం అవసరమైన సర్వీస్ షెడ్యూళ్లకు కట్టుబడి లేకపోవడం వల్ల ఫిర్యాదును తిరస్కరించడానికి దారితీసింది. ఏ వాహనదారుడైనా వాహనం కొనుగోలు చేసినప్పుడు మ్యానువల్ షెడ్యూల్ ప్రకారం ఉచిత సేవలను వినియోగించుకుంటే నష్టం జరిగినప్పుడు వాటిని పొందే అవకాశం ఉంటుందని ఈ కేసు స్పష్టం చేస్తుంది.

టి.ఆయుర్వేదిక్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక





డాక్టర్ ఉమా శ్రీనివాస్



డాక్టర్ వి.నర్సింహ

వెంగళరావునగర్ : తెలంగాణ ఆయుర్వేదిక్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.ఉమా శ్రీనివాస్, డాక్టర్ వి.నర్సింహ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఉపాధ్యక్షులుగా డాక్టర్ సుజాత, డాక్టర్ దుర్గాబాయి, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా డాక్టర్ నాగలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ జోహార్, డాక్టర్ ఐ.అశోక్, డాక్టర్ కె.అరుణగాయత్రి, డాక్టర్ సంధ్యా సందీప, డాక్టర్ సుజాతలను సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు డాక్టర్ ఉమా శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధి, ఉన్నతాధికారులతో చర్చించే విషయంలో ప్రతి సభ్యుడి ఆలోచనను పరిగణలోనికి తీసుకుంటామన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌ఓసీ పత్రాల అందజేత..

బంజారాహిల్స్: కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఖైరతాబాద్ డివిజన్ గాంధీనగర్‌కు చెందిన రమేష్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే దానం నాగేందర్ అందజేశారు. అలాగే కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి రావడంతో ఎమ్మెల్యే నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ బీరప్పతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా తనకు సీఎంఆర్‌ఎఫ్ వచ్చేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యేకు రమేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



రమేష్ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

సేవా దృక్పథంతో పని చేయాలి



లక్డీకాపూల్‌లో శ్రీకర హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

ఖైరతాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యులు మనోస్థైర్యాన్ని కల్పిస్తూ దృక్పథంతో వైద్య సేవలు అందించాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లో శ్రీకర హాస్పిటల్ శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ మెడికల్ టూరిజం కోసం ప్రభుత్వం సులువైన పద్ధతులు అవలంభిస్తున్నందునే ఎంతో మంది విదేశీయులు మన దేశంలో మెరుగైన వైద్య చికిత్సలు పొందుతున్నారన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా దాదాపు 50కోట్ల మందికి అన్ని ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. 75 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లకు ఉచిత వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తోందన్నారు. కార్యక్రమానికి హాజరైన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ విజయారెడ్డి, సర్ఫరాజ్ సిద్ధిఖీ, ఆరిఫ్ రిజ్వాన్ హాస్పిటల్‌లోని పలు విభాగాలను ప్రారంభించారు. లక్డీకాపూల్‌లో ప్రారంభమైన శ్రీకర హాస్పిటల్‌లో కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఆర్థో, క్రిటికల్ కేర్, న్యూరో, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ సేవలు అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమంలో హాస్పిటల్ సీఎండీ డాక్టర్ అఖిల్ దాడి, ఇన్‌చార్జిలు డాక్టర్ భాను ప్రతాప్, డాక్టర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మున్నూరు కాపులకు అవకాశం కల్పించాలి

కాచిగూడ: త్వరలో చేపట్టనున్న మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులకు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలోనే అత్యధిక జనాభా కలిగిన మున్నూరుకాపులకు ప్రస్తుత మంత్రివర్గంలో ఒక మంత్రి పదవి కూడా కేటాయించకపోవడం దారుణమని అన్నారు. మున్నూరుకాపు భీష్మ పితామహుడు, కరుడుగట్టిన కాంగ్రెస్ వాది వి.హనుమంతరావుకు పార్టీలో, ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వం చేపట్టిన కులగణనలో మున్నూరుకాపుల సంఖ్య తక్కువగా చూపారని దానిని సరిచేయాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రధాన కార్యదర్శి నగేష్, మహిళా అధ్యక్షురాలు చామకూర సుజాత తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో దివ్యాంగులను నామినేట్ చేయాలి

జియాగూడ: రాష్ట్రంలోని పంచాయతీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు వీలుగా ప్రత్యేక చట్టం చేయాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక హైదరాబాద్ సౌత్ కమిటీ గౌరవ అధ్యక్షురాలు పి.శశికళ కోరారు. ఈ మేరకు దివ్యాంగుల హక్కుల వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జియాగూడలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో ఇద్దరు దివ్యాంగులను నామినేట్ చేసేందుకు ప్రత్యేక చట్టాలు చేసి అమలు చేస్తున్నారన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ హామీ ఇచ్చిన ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టానికి సవరణలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో 25,538 వేల మందికి మున్సిపాలిటీల్లో 260, మున్సిపల్ కార్పొరేషన్లలో 26, మండల ప్రజా పరిషత్‌ల్లో 1080, జిల్లా పరిషత్‌లో 64 మందికి రాజకీయ అవకాశాలు వస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై కూడా ఎలాంటి ఆర్థిక భారం లేకుండానే 26,968 మందిని నామినేట్ చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ నగర ఉపాధ్యక్షుడు ఎస్.రాజు, సహాయ కార్యదర్శి నర్సింగ్, నాయకులు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

దోర్ సమాజ్‌ను గ్రూప్-బీ లోనే కొనసాగించాలి

జియాగూడ: నిరుపేదలైన ఎస్సీ డోర్ కమ్యూనిటీని గ్రూప్-బీ లోనే కొనసాగించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ కోరారు. ఈ మేరకు ట్యాంక్‌బండ్ బూర్గుల రామకృష్ణ భవన్‌లో మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తార్ సిబ్బందిని ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం జియాగూడ డోర్ సమాజ్ అధ్యక్షుడు దత్తు పోల్, ఉపాధ్యక్షుడు సురేశ్ గజరే, సభ్యులు వినోద్ చౌగ్లే, గణేశ్ కాలే , ఉమేశ్ హిటకర్, రాజేంద్ర గజరే, జియాగూడ ఎంఐఎం ఇన్‌చార్జి ఫరూఖ్‌తో కలిసి ఎమ్మెల్యే మాట్లాడారు. గత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో డోర్ కమ్యూనిటీని షెడ్యూల్ కులాల్లో చేర్చారని దీంతో వీరికి సామాజిక, ఆర్థిక, విద్యాపరంగా ఎదుగుదలకు సహకారం లభించిందన్నారు. సర్వే చేసినా యథావిధిగా గ్రూప్-బీ లోనే కొనసాగించాలని ఆయన విన్నవించారు.


లేపాక్షిలో ఉగాది వార్షిక క్లియరెన్స్ సేల్..

బంజారాహిల్స్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-69లోని నందగిరి హిల్స్‌లో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియంలో ఈ నెల 1 నుంచి 31 వరకు అన్ని హస్త కళాకృతులపై 10–50 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు షోరూం మేనేజర్ సుబ్బారావు తెలిపారు. ఉగాది, వార్షిక క్లియరెన్స్ సేల్స్‌లో భాగంగా ఈ రాయితీ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉగాది, వార్షిక క్లియరెన్స్ సేల్స్‌లో భాగంగా ఇక్కడ అరుదైన, వివిధ రకాల డిజైన్లతో హస్త కళాకృతులు విశేషంగా ఆకట్టుకుంటున్నట్లు ఆయన వివరించారు.



పాతబస్తీకి రంజాన్ కళ !

- ముస్లింల ఉపవాస దీక్షలు షురూ
- చార్మినార్ పరిసర ప్రాంతాలు కిటకిట
- గాజుల విక్రయాలకు ప్రసిద్ధి లాడ్‌బజార్



లాడ్‌బజార్‌లోని గాజుల దుకాణం



ఆకట్టుకుంటున్న రంగు రంగుల గాజులు

చార్మినార్: పాతబస్తీకి రంజాన్ కళ వచ్చింది. రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లింలు ఆదివారం తెల్లవారుజామున 5.11 గంటలకు సహెర్‌తో చేపట్టగా సాయంత్రం విరమించి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. దీంతో పాతబస్తీలోని మసీదుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. అలాగే చార్మినార్ చుట్టూ చిరు వ్యాపారాలు సైతం ఊపందుకున్నాయి.

ముస్తాబైన లాడ్‌బజార్..

రంజాన్ మాసాన్ని దృష్టిలో పెట్టుకుని చార్మినార్ పక్కనే ఉన్న లాడ్‌బజార్‌లోని దుకాణాలను మరింత అందంగా తీర్చిదిద్దారు. తీరొక్క గాజులు అందుబాటులో పెట్టడంతో పాటు బంపర్ ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ సహజ సిద్ధంగా లభించే మట్టి గాజులతో పాటు గోట్లు, మెటల్, డైమండ్స్, సీసం, బ్రాస్, ఫైబర్, మిర్రర్, ఎనామిల్ తదితర ఫ్యాషన్ గాజులు లభిస్తాయి.

లాడ్‌బజార్ అంటే..

లాడ్లా అంటే గారాబం.. ప్రేమ.. అనురాగం అని అర్థం. ఉర్దూ భాషలో తమకు ఇష్టమైన వారిని ముఖ్యంగా చిన్నారులను లాడ్లా అని సంబోధిస్తుంటారు. తమ ప్రేమకు, అభిమానానికి గుర్తుగా ఇక్కడ నుంచి కానుకను కొని బహుకరిస్తుండడం వల్ల దీనికి ఈ పేరు వచ్చిందని చెబుతుంటారు. మహ్మద్ కులీ కుతుబ్‌షా కూడా తన ప్రేయసి భాగమతికి ఇక్కడి లాడ్‌బజార్‌లోని గాజులనే బహుమతిగా ఇచ్చారని పెద్దలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇక్కడ దాదాపు 250కి పైగా దుకాణాలు ఉండగా, వీటి ద్వారా లక్షల్లో వ్యాపారం కొనసాగుతున్నది. ఇదిలా ఉంటే వినియోగదారులకు సరైనా పార్కింగ్ సౌకర్యం లేక అవస్థలు తప్పడం లేదని స్థానిక వ్యాపారులు అంటున్నారు. ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

నెల రోజుల పాటు సహర్ విందు

రహమత్‌నగర్ : పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యుడు, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లింలకు ఆదివారం తన నివాసంలో సహర్(ఉపవాస దీక్ష ప్రారంభ భోజనం) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ ఏటా రంజాన్ మాసంలో సహర్ విందును ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా నెల రోజుల పాటు సహర్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



భోజనం వడ్డిస్తున్న బాబా ఫసియుద్దీన్

మెగా ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మెగా వైద్య శిబిరానికి హాజరైన స్థానికులు

వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలోని శ్రీసాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వైద్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఎకో, 2డి, ఈఎన్‌టీ, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో దాదాపు 250 మంది పరీక్షలు చేయించుకున్నారు. యశోద ఆసుపత్రి కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, ఇంటర్నల్ మెడిసిన్, గ్యాస్ట్రోలజీ, పీడియాట్రిక్, గైనక్ వైద్యులైన డాక్టర్ ప్రమోద్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంపత్, డాక్టర్ తరుణ్, డాక్టర్ అఖిల్, డాక్టర్ సురేష్, మ్యాక్స్ విజన్ వైద్యులు డాక్టర్ బిందు, డాక్టర్ రాజ, క్లౌ డెంటల్ నుంచి డాక్టర్ నదీమ్ తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు ప్రతాప్‌రెడ్డి, కోడె సాంబశివరావు, మనోహర్‌రావు, సుగుణ, హనుమంతరావు పాల్గొన్నారు.

శ్రీపాద రావు సేవలు ఎనలేనవి

వెంగళరావునగర్ : నిరంతరం ప్రజలతో ఉంటూ వారికి స్నేహ హస్తాన్ని అందించిన గొప్ప నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ అన్నారు. శ్రీపాదరావు జయంతి వేడుకలు ఆదివారం ఫస్ట్ బెటాలియన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీపాదరావు ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ రాంబాబు, భాస్కర్, నర్సింహ, ఆర్‌ఐలు రవీందర్, రాజేష్, నర్సయ్య, ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

ఉత్సవ కమిటీల్లో కుల సంఘాల ప్రమేయాన్ని నిలువరించాలి

కాచిగూడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీలో కుల సంఘాల ప్రమేయాన్ని పూర్తిగా నిలువరించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంబేడ్కర్ జయంతిని సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన, కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరపాలన్నారు. ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, మానవ హక్కుల ఉద్యమ పితామహులు అంబేడ్కర్ జయంతి వేడులకను బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలతో కలిపి నిర్వహించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జయంతిని, బాబు జగ్జీవన్‌రామ్ జయంతితో కలిపి ఉత్సవ కమిటీని ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14న ప్రపంచ విజ్ఞాన దినోత్సవంగా పాటిస్తూ 193 సభ్య దేశాలు పిలుపునిస్తుంటే, తెలంగాణలో మాత్రం అంబేడ్కర్ స్థాయిని తక్కువగా చేసి చూపే ప్రభుత్వ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జయంతి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించి ఉత్సవాలను ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయాలని కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు.

సాక్షి
సోమవారం । 3 । మార్చి । 2025

పట్టుకున్నా.. పైసా దొరకదు!

నకిలీ యాప్స్‌తో కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరస్తులు ● పోలీసులు అరెస్టు చేసినా రికవరీ శూన్యమే..

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. కొట్టేసిన సొమ్ము పోలీసులకు దొరకకుండా కొత్త ఎత్తులు వేస్తున్నారు. పట్టుబడినా వారి వద్ద పైసా కూడా దొరకడం లేదు. కొట్టేసిన సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో ఉంచితే పోలీసులు సీజ్ చేస్తారని భావించి హవాలా రూపంలో విదేశాలకు తరలిస్తున్నారు. దీంతో ప్రయాసపడి పోలీసులు సైబర్ నిందితులను పట్టుకున్నా సొమ్ము రికవరీ చేయలేకపోతున్నారు.



- పార్ట్‌టైం జాబ్స్, పెట్టుబడులు, అధిక వడ్డీల పేరిట ఆశ చూపడం.. ఇలా రూపం ఏదైనా సైబర్ నేరస్తుల మాయాజాలం ఒక్కటే. జనాన్ని నిండా ముంచడమే కేటుగాళ్ల పన్నాగం. ఈ ఏడాదిలో ఇప్పటివరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో వేలసంఖ్యలో క్రిప్టో పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాలు, ఆన్‌లైన్ గేమింగ్ మోసాల కేసులు నమోదయ్యాయి. ట్రై కమిషనరేట్ల పరిధిలో కేటుగాళ్లు కొట్టేసిన కోట్లాది రూపాయల సొమ్ములో 50 శాతం హవాలా రూపంలో విదేశాలకు చేరినట్లు పోలీసులు గుర్తించారు. భవిష్యత్తు అవసరాలు, పొదుపు, అదనపు ఆదాయంపై భారతీయుల ఆలోచనలు పెట్టుబడిగా మారాయి. ఇంటర్నెట్ వేదికగా నిరుద్యోగులు, గృహిణులు, చిరువ్యాపారులు, మధ్య తరగతి కటుంబాలపై చైనీయులు పలు యాప్‌లను అస్త్రాలుగా ప్రయోగిస్తున్నారు. గేమింగ్, డేటింగ్, పోర్న్ వెబ్‌సైట్లలో లింకులను క్లిక్ చేస్తే మన వ్యక్తిగత సమాచారం వారి చేతికి చేరినట్టేనని సైబరాబాద్ సైబర్ క్రైమ్ అధికారి తెలిపారు. సమాచారంతో మనల్ని బ్లాక్‌మెయిల్ చేసి అందినకాడికి దోచుకుంటారని పేర్కొన్నారు.

హవాలా రూపంలో..

చైనాకు చెందిన ప్రధాన సూత్రధారులు హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్ వేదికగా మనదేశంలో నకిలీ కంపెనీలను ఏర్పాటు చేసి చక్రం తిప్పుతున్నారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో విదేశీసంస్థల్లో పనిచేసిన ఉద్యోగులను ఈ సంస్థలకు డైరెక్టర్‌గా మార్చుతున్నారు. వీరికి ప్రతినెలా రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు వేతనంగా అందిస్తున్నారు. వీరు ఆయా నగరాల్లోని నిరుద్యోగులు, ఆటోడ్రైవర్లు కూలీలతో బ్యాంకు ఖాతాలు ప్రారంభింపజేస్తున్నారు. కొన్నిసార్లు వర్చువల్ ఖాతాలు తెరుస్తున్నారు. వివిధ మోసాలతో ఖాతాల్లోకి చేరే నగదును క్రిప్టో కరెన్సీగా మార్చి హవాలా మార్గంలో చైనాకు తరలిస్తున్నారు.




ఎల్లో రిబ్బన్ రన్

ఖైరతాబాద్: మహిళల్లో వచ్చే ఎండోమెట్రియాసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ఆదివారం నెక్లెస్ రోడ్డులో జలవిహార్ వేదికగా ది ఎండోమెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎల్లో రిబ్బన్ రన్ నిర్వహించారు. 3కే, 5కే, 10కే విభాగాలుగా నిర్వహించిన రన్‌ను సామాజికవేత్త, సినీనటి డాక్టర్ సాయి కామాక్షి భాస్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నిమ్మి బింద్రాతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐడీ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీపీ షిఖా గోయల్, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి పాల్గొని రన్‌లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. ఎల్లో రిబ్బన్ రన్‌లో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–69, నందగిరిహిల్స్‌లోని అన్ని హస్త కళాకృతులపై డిస్కౌంట్ కల్పిస్తున్న లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎంపోరియం ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- బండారు వైష్ణవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ ట్రక్ గ్యారేజీ వెనుక గల రోటరీ కాలనీలో ఉదయం 10 గంటలకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

10న గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే



కరపత్రం విడుదల చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు

కవాడిగూడ: గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డేను జయప్రదం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆదివారం కవాడిగూడ డివిజన్ బీమా మైదాన్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం జరిగింది. చంద్రన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథులుగా జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, సెక్రటరీ జనరల్ ప్రఫుల్ రాంరెడ్డి, బత్తుల సోమయ్య, క్రిస్టోఫర్ హాజరై మాట్లాడారు. 2011 మార్చి 10 సీమాంధ్ర దోపిడి పాలనపై తెలంగాణ ప్రజలు తిరుగుబాటు చేసిన రోజు అని గుర్తుచేశారు. హైదరాబాద్ నడిబొడ్డున ట్యాంక్‌బండ్‌పై 1969 అమరవీరుల యాదిలో 2001 నుంచి అమరులైన అమరవీరుల ఆత్మబలిదానాల సాక్షిగా మిలియన్ మార్చ్ కొనసాగిందని కొనియాడారు. మాజీ సీఎం కేసీఆర్ తన హయాంలో అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించారని, ప్రశ్నించిన ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులపై ఉక్కుపాదం మోపారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అప్పటి ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని, ప్రతి నెలా ఇస్తామన్న రూ.30 వేల గౌరవ భృతి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఉద్యమకారులను అన్ని విధాలుగా ఆదుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కోతి మాధవి, కళాబృందం నాయకులు వేముల యాదగిరి, మోహన్ బైరాగి, చంద్రుడు, అంజలీ కుమారి, వెంకటలక్ష్మి, స్వరూపారాణి, అరుణతోపాటు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

వాహన యజమానుల సమస్యలు పరిష్కరిస్తా

విజయడెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి



విజయ డెయిరీ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మినీ లారీ ఓనర్స్

లాలాపేట: విజయడెయిరీకి పాలు సరఫరా చేసే వాహనాల యజమానుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని విజయ డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తార్నాక మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు చైర్మన్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. డెయిరీలో కొత్తగా టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తమ సమస్యలను చైర్మన్‌కు వివరించారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి యజమానులకు కొంత గడువు ఇచ్చారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తార్నాక మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.బాల్‌రాజు, ప్రధాన కార్యదర్శి అమీద్ ఖాన్, కొరపాక అంజన్న, బాబు, శ్రీనివాస్, హుస్సేన్, రాజు, అబ్దుల్ తదితరులు ఉన్నారు.

హీమో ఫీలియా బాధితులకు ఫ్యాక్టర్ ఇంజెక్షన్



విద్యార్థులకు ఫ్యాక్టర్ ఇంజెక్షన్ అందిస్తున్న దృశ్యం

పంజగుట్ట: హీమోఫిలియాతో బాధపడుతున్న విద్యార్థులకు హీమోఫిలియా హైదరాబాద్ సొసైటీ బాసటగా నిలిచింది. త్వరలో జరగబోయే పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే హీమోఫిలియా బాధిత 12 మంది విద్యార్థులకు రూ.3 లక్షల విలువైన ఫ్యాక్టర్ ఇంజెక్షన్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. పంజగుట్టలోని హీమోఫిలియా సొసైటీ కార్యాలయంలో ఒక్కొక్కరికీ 24 వేల రూపాయల విలువైన ఫ్యాక్టర్ ఇంజెక్షన్‌లను ఆదివారం అధ్యక్ష, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రావు, అబ్దుల్ రజాక్ బాధిత విద్యార్థులకు అందచేశారు. పరీక్షలకు హాజరయ్యే సమయంలో వ్యాధిగ్రస్థులకు శరీరంలో అంతర్గత రక్తస్రావం జరగకుండా ముందస్తుగా ఇంజెక్షన్ తీసుకోవాలని సూచించారు. హీమోఫీలియా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో బాధిత విద్యార్థులకు ఉచిత ఫ్యాక్టర్ మందులు అందచేసినట్లు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ వంశీ, కోశాధికారి కుమార్, మహిళా ప్రతినిధి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి జీవితం ఆదర్శప్రాయం



మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

సాక్షి,సిటీ బ్యూరో: సినిమాను బాధ్యతాయుతమైన వ్యాపారంగా అభివృద్ధి చేసిన నాటి సినీరంగ ప్రముఖుల్లో నటి, నిర్మాత కృష్ణవేణి ఒకరని, ఆమె జీవితాన్ని ఈ తరం నటీనటులు, గాయకులు, నిర్మాతలు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణవేణి సంస్మరణ సభలో ఆమె చిత్రపటానికి ఆయన నివాళులు అర్పించాను. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఆదర్శప్రాయమైన జీవితం గడిపిన ఎందరో ప్రముఖ నటీనటులు, ఇతర సాంకేతిక సిబ్బందిని చలనచిత్ర రంగానికి పరిచయం చేసిన ఘనత కృష్ణవేణికి దక్కుతుందన్నారు. సినిమా అంటే వ్యాపారం మాత్రమే కాదని, ప్రజలను ప్రభావితం చేసే ఉన్నతమైన మాధ్యమమనే స్పృహను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. సినిమా రంగంలో ఉన్నత ప్రమాణాలు, ఉత్తమ సంప్రదాయాలు, మంచి భాష, హుందాతనానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కాలుష్య నివారణ అందరి బాధ్యత



సాక్షి, సిటీబ్యూరో: కాలుష్య నియంత్రణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని తెలంగాణ పీసీబీ కార్యదర్శి జి.రవి అన్నారు. శంషాబాద్‌లోని నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగ కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల, సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను పునర్వినియోగం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. నగరంలో గాలి నాణ్యతను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఎస్ఈఈ, జేసీఈఈ హనుమంత్ రెడ్డి, ఎస్ఈఈ నరేందర్, రంగారెడ్డి ప్రాంతీయ కార్యాలయం ఈఈ వెంకట్ నర్సు హాజరయ్యారు.

'యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్'లో భారత్ పాత్ర కీలకం



ప్రసంగిస్తున్న డా.రంగారెడ్డి

సుల్తాన్‌బజార్: యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్‌పై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో భారతదేశం కీలకపాత్ర పోషించనున్నదని ఇఫ్కాయ్(ఇన్ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ ఆఫ్ ఇండియా) అధ్యక్షుడు డాక్టర్ బుర్రి రంగారెడ్డి వెల్లడించారు. ఆదివారం మాస్కోలోని రాడిసన్ స్లావియాన్స్కియా హోటల్‌లో నిర్వహించిన 3వ రష్యన్ కాంగ్రెస్ ఆఫ్ మెడికల్ మైక్రోబయల్, ఇన్ఫెక్టాలజీ సమావేశంలో ఆయన భారత ప్రతినిధిగా ప్రసంగించారు. 'యాంటీ మైక్రోబయల్, డయోగ్నస్టిక్‌లో భారతదేశంలో చికిత్స నిర్వహణలో వివాదాలు ఎదుర్కోవడం'అనే అంశంపై మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ అత్యంత ఆందోళనకరమైన సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఇది భారతదేశంలో అంటువ్యాధుల చికిత్సకు సవాలుగా నిలిచిందని వివరించారు. ఏఎంఆర్‌ను ఎదుర్కోవడానికి కొత్త చికిత్స విధానాలు, అధునాతన డయాగ్నొస్టిక్ అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ దేశాల వైద్యులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హోంఫుడ్ షాపు కూల్చివేత

ముషీరాబాద్: ముషీరాబాద్ జీహెచ్ఎంసీ పార్కు సమీపంలోని హోంఫుడ్ షాపును అర్ధరాత్రి బుల్డోజర్‌తో కూల్చివేశారు. దీనితో రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని షాపు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... ముషీరాబాద్ జీహెచ్ఎంసీ పార్కు సమీపంలో రాకేష్‌గౌడ్ 2005 సంవత్సరం నుంచి హోం ఫుడ్ షాపును కొనసాగిస్తున్నాడు. ఈ షాపు అరబిందో భవనం సమీపంలో ఉండటంతో దాని నిర్వహకులు అర్ధరాత్రి షాపులో కరెంట్ కట్ చేసి వెనకభాగంలో బుల్డోజర్‌తో కూల్చవేశారు. దీంతో షాపులో ఉన్న సుమారు 4 లక్షల విలువ చేసే స్వీట్లు, పిండి వంటలు, ఫర్నిచర్ పూర్తిగా ధ్వంసమయ్యాయని షాపు యజమాని రాకేష్‌గౌడ్ ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్ తదితరులు ఆదివారం ఉదయం షాపు వద్దకు చేరుకొని అరబిందో భవన్ నిర్వాహకులను నిలదీశారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు.

పోటీతత్వం పెంపునకు కృషి చేయాలి

సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల



మాట్లాడుతున్న డాక్టర్ గుమ్మడి వెన్నెల. చిత్రంలో కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ వనిత

చిక్కడపల్లి: ఆత్మవిశ్వాసం, పోటీతత్వాన్ని పెంపొందించుకునే లక్ష్యం వైపు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ గుమ్మడి వెన్నెల అన్నారు. ఆదివారం అశోక్‌నగర కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత్రి , పాత్రికేయురాలు డాక్టర్ వినిత ఆధ్వర్యంలో బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గత మూడు మాసాలుగా నిర్వహించిన జానపద గేయాల పోటీలలోని విజేతలను బహుతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. చిన్నారుల జానపద గేయాలు సమాజాహితానికి, చైతన్యానికి నిదర్శనమన్నారు. పిల్లల్లో నానాటికి సృజనాత్మకశక్తి పెరుగుతోందని, దాన్ని వెలికితీసి దేశానికి ఆణిముత్యాల్లాంటి నిష్ణాతులను అందివ్వాలని అన్నారు. ప్రశాంతత, ఆనందాన్ని ఇచ్చేవి కళలు మాత్రమేనని పేర్కొన్నారు.

గిగ్-ప్లాట్‌ఫామ్ వర్కర్స్ కోసం ప్రత్యేక చట్టం

ప్రభుత్వానికి టీజీపీడబ్ల్యూయూ విజ్ఞప్తి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణలో గిగ్- ప్లాట్‌ఫామ్ వర్కర్స్(టీజీపీడబ్ల్యూ) కోసం ప్రత్యేక చట్టం రూపొందించాలని టీజీపీడబ్ల్యూయూ అధ్యక్షుడుషేక్ సలావుద్దీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల సీఎం నిర్వహించిన సమీక్ష సమావేశంలో గిగ్ – ప్లాట్‌ఫామ్ వర్కర్స్ సమస్యలపై సంపూర్ణ అధ్యయనం చేయాలని, సామాజిక రక్షణ, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, సంక్షేమం వంటి అంశాలపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిపారు. ఇప్పటికే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) గిగ్–ప్లాట్‌ఫామ్ వర్కర్స్‌పై పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని, అందులో కీలక సమస్యలు మార్గదర్శక సిఫార్సులు స్పష్టంగా పేర్కొందన్నారు. అధ్యయనం కోసం కాలయాపన చేయకుండా సీజీజీ నివేదికకు ప్రాధాన్యతనిస్తూ తక్షణమే చట్టానికి రూపకల్పన చేయాలని, సామాజిక రక్షణ, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, సంక్షేమ హామీలను పొందుపరచాలని కోరారు.

ప్రత్యేక పద్ధతిలో తడి, పొడి చెత్త డబ్బాల క్లీనింగ్



చెత్త డబ్బాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: అన్నదానం చేసే ప్రాంతాల్లో తడి, పొడి డబ్బాల్లో మలినాలు పేరుకుపోతుండటంతో దుర్వాసనలు వస్తుండడంతో జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం చెత్త డబ్బాల క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టింది. బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ హాస్పిటల్ ఎదుట కేబీఆర్ పార్కు సమీపంలో అన్నార్తులకు ప్రతిరోజూ దాతలు అన్నదానం చేస్తుంటారు. తిన్న తర్వాత విస్తరాకులతోపాటు మిగులు వ్యర్థాలను ఇక్కడ ఏర్పాటు చేసిన డబ్బాల్లో వేస్తుంటారు. ఈ డబ్బాల్లో విస్తరాకులతోపాటు అన్నం మిగిలి వ్యర్థాలను రోజూ తొలగిస్తున్నా డబ్బాల్లో అడుగున మలినాలు పేరుకుపోయి క్రిమికీటకాలతో పాటు దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షిస్తున్న మెక్లిన్ సంస్థ, ఎస్ఎఫ్ఏలు, పారిశుధ్య కార్మికులు ఈ డబ్బాల క్లీనింగ్‌కు శ్రీకారం చుట్టారు. ప్రత్యేక వాహనం ద్వారా కెమికల్స్‌తో కూడిన వాటర్‌ను ఈ డబ్బాల్లో ప్రెషర్‌తో కొట్టడం వల్ల ఈ మలినాలతోపాటు క్రిమికీటకాలు వెళ్లిపోయి డబ్బాలు శుభ్రం అవుతుండగా దుర్వాసనలు కూడా దూరమవుతున్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ జీహెచ్ఎంసీ అడుగడుగునా తడి, పొడి చెత్త డబ్బాలు ఏర్పాటు చేసింది. కేబీఆర్ పార్కు చుట్టూ మెక్లిన్ సంస్థ పారిశుధ్య నిర్వహణను చేపట్టింది. వీరి ఆధ్వర్యంలోనే క్లీనింగ్ కార్యక్రమం కొనసాగుతుంది.

జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన యువమోర్చా ప్రతినిధుల సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం యువమోర్చా నాయకులు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుని మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పేద ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, యువమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి ఎ.యశ్వంత్, కృష్ణాగౌడ్, ఫిని సాయి, భరత్‌గౌడ్, దిలీప్ సింగ్, విక్కీ సింగ్, చక్రీ, సునీల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో నేపాల్ దేశస్తుడి ఆత్మహత్య

కేపీహెచ్‌బీకాలనీ: కుటుంబ తగాదాలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేపాల్ దేశానికి చెందిన ప్రేమ్ రావెల్ (34) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీకాలనీలోని నాల్గో ఫేజ్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ తగాదాలు భరించలేక శనివారం రాత్రి ఇంటి సీలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నమ్మకంగా పనిచేసి.. నగదు తస్కరించి..

బంజారాహిల్స్: నమ్మకంగా పనిచేస్తూ కార్యాలయంలోంచి నగదు తస్కరించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-3లోని శ్రీ వశిష్ఠ అపూర్వ సంస్థలో కొంతకాలంగా ఒడిశాకు చెందిన అశోక్ జెనా(39) ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 9న ఈ కార్యాలయ లైజనింగ్ ఆఫీసర్ ఆర్.సురేంద్రనాథ్ రెడ్డి రూ.50 వేల నగదును డ్రాలో పెట్టి బయటకు వెళ్లిపోయాడు. సాయంత్రం వచ్చి చూసుకోగా అందులోని డబ్బులు కనిపించలేదు. ఇక్కడి సీసీ ఫుటేజీలను పరిశీలించగా అశోక్ జెనా తన సోదరుడు కమల్ జెనాతో కలిసి డబ్బులు చోరీకి గురైన రోజు మధ్యాహ్నం ఆఫీసుకు వచ్చినట్లుగా గుర్తించారు. వీరిపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం సెంటర్‌కు నిప్పు



మైలార్‌దేవ్‌పల్లి: ఆదివారం రాత్రి మూడు గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం సెంటర్‌లోని డబ్బులు దొంగలించడానికి విఫలయత్నం చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మసూద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... మధుబన్ కాలనీలో ఆదివారం రాత్రి ఏటీఎం సెంటర్‌లోంచి మంటలు, పొగలు వచ్చాయి. స్థానికులు గమనించి మంటలను ఆర్పేశారు. అప్పటికే ఏటీఎం మెషీన్ పూర్తిగా దగ్ధం అయింది. అప్పటికే మెషీన్‌లో ఏడు లక్షల నగదు ఉన్నట్లు ఎస్‌బీఐ అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైశ్యుల జనాభా ప్రకారం రాజకీయ వాటా ఇవ్వాలి



అభివాదం చేస్తున్న విమలక్క, కాచం సత్యనారాయణ తదితరులు

పంజగుట్ట: వైశ్య కులస్తుల జనాభా ప్రకారం 'మేం ఎంతో మాకు అంత రాజకీయ వాటా'అన్న డిమాండ్ న్యాయబద్ధమైనదని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'జనాభా దామాషా ప్రకారం వైశ్యుల రాజకీయ ప్రాతినిధ్యం కోసం'అనే అంశంపై చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విమలక్క మాట్లాడుతూ మార్వాడీలు వచ్చాక వైశ్య కులస్థుల వ్యాపారం దెబ్బతీశారని, పెద్దపెద్ద మాల్స్ వచ్చాక పూర్తిగా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వాటా కోసం చేసే ఉద్యమంలో తన సహకారం ఉంటుందని ఆమె తెలిపారు. వేదిక వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ వైశ్యులు పేరుకు అగ్రవర్ణమే అయినా రాజకీయంలో అట్టడుగు స్థానంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను కూడా వర్గీకరించాలని, మందకృష్ణ మాదిగను ఆదర్శంగా తీసుకుని ఉద్యమిస్తామని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల్లో 600 మండలాల్లో కనీసం 40 నుంచి 50 మండలాలు వైశ్య కులస్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే నెలలో వైశ్యుల రాజకీయ గర్జన పేరుతో సభ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సీనియర్ పాత్రికేయులు పల్లె రవికుమార్, ఖలీల్, దొమ్మాటి వెంకట్, ప్రేమ్‌గాంధీ, ప్రతాప్, రమేష్, తులసీ గుప్త, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వచ్చి.. నగలు పోగొట్టుకుని..

బంజారాహిల్స్: బంధువుల పెళ్లి కోసం నగరానికి వచ్చిన ఓ మహిళకు చెందిన లక్షలాది రూపాయల విలువ చేసే నగలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్టణంకు చెందిన అడ్డాల పద్మావతి, బ్రహ్మానందం దంపతులు ఈ నెల 12వ తేదీన తమ సమీప బంధువు అడ్డాల రామకృష్ణ కొడుకు పెళ్లి కోసం నగరానికి వచ్చారు. యూసుఫ్‌గూడలోని ఎల్ఎన్ నగర్‌లో అడ్డాల రామకృష్ణ ఇంట్లోనే బస చేశారు. ఈ నెల 13వ తేదీన పద్మావతి గాజులరామారంలో జరిగిన రామకృష్ణ కొడుకు పెళ్లికి వెళ్తూ లక్ష్మీదేవి నెక్లెస్‌తో పాటు గాజులు, గొలుసులు, కమ్మలు, ఉంగరాలు ధరించింది. అనంతరం రాత్రి తిరిగి వచ్చాక తమకు కేటాయించిన గదిలో బస చేసింది. ఆభరణాలను ట్రావెల్ బ్యాగ్‌లో భద్రపర్చింది. అయితే 14వ తేదీన ఆభరణాలు వేసుకుందామని బ్యాగ్ తెరిచి చూడగా ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఈ విషయాన్ని అడ్డాల రామకృష్ణ దృష్టికి తీసుకువచ్చింది. ఇంటికి వచ్చినవారందరినీ విచారించినా ఎలాంటి ఫలితం లేకుండాపోయింది. ఈ నెల 16వ తేదీన పద్మావతి విశాఖపట్టణం వెళ్లిపోయింది. తాజాగా ఆదివారం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నగలను అడ్డాల సత్యవతి, సీహెచ్ హరినాథ్, ఆయన భార్య సునీత, ఎల్.సత్యవతి చోరీ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 3, మార్చి, 2025

మైండ్‌స్పేస్‌లో ఎకో రన్



మాదాపూర్ : భావితరాల పచ్చని భవిష్యత్తు కోసం హైదరాబాద్ పరుగులు తీస్తోందని స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని మైండ్ స్పేస్‌లో రేడియోమిర్చి, మైండ్ స్పేస్ సంయుక్తంగా నిర్వహించిన ఎకో రన్ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. 21 కే, 10 కే, 5 కే వంటి వివిధ కేటగిరీల్లో నిర్వహించిన రన్‌లో 4వేల మంది రన్నర్‌లు పాల్గొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాజస్థాన్, పాండిచ్చేరి, మధురై, తిరునెల్వేలితో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అథ్లెట్లు ఇందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో సినీ నటులు చాందినీ చౌదరి, అభినవ్ గోమటం, టీఎస్‌ఐఐసీ వైస్ చైర్మన్ ఈ.విష్ణు, రహేజా కార్పొరేషన్ సీఓఓ శ్రావణ్‌గోనె తదితరులు పాల్గొన్నారు.



ఉత్సాహంగా 5 కే రన్

చందానగర్ : నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని మాతృశ్రీనగర్‌లో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అనిల్ కావూరి, కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో 4వ ఎడిషన్ 5కే రన్ ఆదివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిలుగా భారత అంతర్జాతీయ మాజీ క్రికెటర్, మాజీ బీసీసీఐ చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 కే రన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. వృద్ధులు, యువత, చిన్న పిల్లలు పాల్గొనడం సంతోషించదగ్గ పరిణామమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. ఈ రన్‌లో సుమారు 1500 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ఇగ్నైట్ జూనియర్ కాలేజ్ రమేష్, టైటిల్ స్పాన్సర్ జేకే ఇన్ఫ్రా పట్టాభి, కో స్పాన్సర్లు మయూరా ఆయుర్వేద, బచ్పన్ ప్లే స్కూల్, బీఎంఎస్ వెల్నెస్ సెంటర్, పల్స్ హార్ట్ హాస్పిటల్, యూరో కిడ్స్ ప్లే స్కూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొటీన్ అమూల్యమే..

సాక్షి, సిటీబ్యూరో : ఆరోగ్యాన్ని అందించడంలో ప్రొటీన్ పాత్రను మెజారిటీ భారతీయులు గుర్తిస్తున్నారు. ప్రపంచ ప్రొటీన్ దినోత్సవం సందర్భంగా.. ఆల్మండ్ బోర్డ్ ఆఫ్ కాలిఫోర్నియా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. శక్తిని అందించడంలో, బలమైన రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో ప్రొటీన్ కీలకమని 65 శాతం మందిలో గుర్తించారని, ప్రొటీన్‌ను అందించే వనరుల్లో బాదం పప్పు ప్రధానమైందిగా భావిస్తున్నారని అధ్యయనం తేల్చింది.

కేరాఫ్.. కాంటినెంటల్..

నగరంలో సింగపూర్, మలేషియా, చైనా వంటకాలు

- ఆహార ప్రియులకు ఒరిజినల్ రుచులు అందిస్తున్న టిగా
- వినూత్న రుచులకు ప్రముఖ చెఫ్స్ ఆల్బర్ట్ రాయన్, షా
- 'సాక్షి'తో అనుభవాలు పంచుకున్న ఇంటర్నేషనల్ చెఫ్స్





కాంటినెంటల్ వంటకాలకు నగరం కేరాఫ్ అడ్రస్‌గా గుర్తింపు పొందుతోంది. సాధారణంగా సింగపూర్, మలేషియా, చైనీస్ వంటకాలతో నగరానికి ప్రత్యేక అనుబంధముంది. ఈ మూడు దేశాల వంటకాలు భాగ్యనగరంలో విరివిగా లభ్యమవుతుండడం.. ప్రధానంగా సింగపూర్, మలేషియాలో దక్షిణాది వంటకాలకు మంచి ఆదరణ ఉండడం.. చైనీస్ వంటకాలకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తుండడం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగరంలోని 'ది లీలా హైదరాబాద్' ఆధ్వర్యంలో ఆగ్నేయాసియా వంటకాలను అందుబాటులోకి తీసుకురావడానికి, వినూత్న భోజన గమ్యస్థానం టిగా (టీఐజీఏ)ను ప్రారంభించింది. 'త్రీ' అనే మలయ్ పదం నుంచి పుట్టుకొచ్చిన టీఐజీఏ సింగపూర్, మలేషియా, చైనీస్ వంటకాల సమ్మేళనాన్ని అందిస్తోంది.

- సాక్షి, సిటీబ్యూరో

దక్షిణాది ప్రేరణతో..

మలేషియాలో దక్షిణాది వంటకాలకు ప్రత్యేక ఆదరణ ఉంది. ఇక్కడి నుంచి మలేషియాకి వచ్చిన ఫుడ్ లవర్స్ మామ అని సంబోధిస్తూ ఫుడ్ ఆర్డర్ చేస్తుంటారు. ఇందులో భాగంగా కొన్ని మలేషియా వంటకాలకు మామ కలిపి వాటి పేర్లను తయారు చేశాము. మలేషియాలో చాలా వంటకాలు దక్షిణాది ప్రేరణతో వాటి వైవిధ్యాన్ని, తయారీ విధానాన్ని రూపొందించుకున్నాయి. ఆహారాన్ని ఆస్వాదించడంలో, గౌరవించడంలో దక్షిణాది ప్రజలు ఉన్నత స్థాయిలో ఉంటారు. ముఖ్యంగా హైదరాబాదీలు. ఈ నేపథ్యంలో నగరం వేదికగా సింగపూర్, మలేషియా, చైనా సాంస్కృతిక వంటకాలను అందించడం సంతోషంగా ఉంది.

- షా, చెఫ్







సాధారణంగా ఏ కాంటినెంటల్ వంటకం నగరానికొచ్చినా కాసింతైనా స్థానిక రుచులకు అనుగుణంగా వాటి ఫ్లేవర్స్, రుచిని మార్చుతారు. కానీ ఇక్కడ ఎలాంటి మార్పూ లేకుండానే స్వచ్ఛమైన ఆగ్నేయాసియా వంటకాలను అందిస్తామని ప్రముఖ సింగపూర్ మాస్టర్ చెఫ్ ఆల్బర్ట్ రాయన్ తెలిపారు. దీని ఆవిష్కరణ సందర్భంగా నగరంలో సందడి చేసిన ప్రముఖ చెఫ్‌లు ఆల్బర్ట్ రాయన్, మలేషియా వంటకాల నిపుణుడు, ప్రముఖ చెఫ్ 'షా' సాక్షితో ముచ్చటించారు. వారు పంచుకున్న అనుభవాలు వారి మాటల్లోనే..





అరుదైన డిషెస్..

దాదాపు 20 ఏళ్లకు పైగా ప్రొఫెషనల్ చెఫ్‌గా వివిధ దేశాల్లో వినూత్న వంటకాలను వండి వడ్డించాను.. కానీ హైదరాబాద్ నగరం ఆహ్వానించినంత ఉన్నతంగా మరే ప్రాంతం లేదని చెప్పగలను. ఆగ్నేయాసియాకు చెందిన పసందైన వంటకాలను చారిత్రాత్మక నగరం హైదరాబాద్‌కు చేరువ చేయడం సంతోషంగా ఉంది. ఇలాంటి వినూత్న భోజన గమ్యస్థానం టిగా (టీఐజీఏ) 'మూడు' అనే మలయ్ పదంలో భాగంగా సింగపూర్, మలేషియా, చైనీస్ వంటకాల సమ్మేళనాన్ని అందిస్తుంది. నగరంలోని కాంటినెంటల్ రుచుల ఆసక్తికి అనుగుణంగా విదేశాల నుంచి నేరుగా దిగుమతి చేసుకున్న ఉత్పత్తులతో మాత్రమే అరుదైన పసందైన డిషెస్ తయారు చేస్తున్నాం. ఈ వంటకాల్లో ఆయా దేశాల సంస్కృతి, పాకశాస్త్ర పరిపూర్ణ ప్రామాణికత నిర్ధారించడానికి రెస్టారెంట్ నిర్దిష్ట మూలికలు, సుగంధ ద్రవ్యాలను పెంచడం ప్రారంభించింది. చైనీస్, మలయ్, ఇండియన్ సంస్కృతుల నుంచి ప్రేరణ పొందిన సింగపూర్ అద్భుత వంటల వారసత్వం, చిల్లీ క్రాబ్, హైనానీస్ చికెన్ రైస్ వంటి ఐకానిక్ వంటకాలను కలినరీ స్పెషల్‌గా అందిస్తున్నాం. నాసి లెమాక్, రెండాంగ్, సాటే వంటి మలేషియా ప్రత్యేకతలు ఆయా దేశం టేస్ట్ ప్రొఫైల్, పాక శాస్త్ర నైపుణ్యాలను హైలైట్ చేస్తాయి. వీటికి అనుబంధంగా అద్భుతమైన టీలు, ప్రసిద్ధ సామాజిక భోజన సంస్కృతి అయిన ఆర్టిసాన్ డిమ్ సమ్ వంటి క్లాసిక్ కాంటోనీస్ యమ్ చా అనుభవం చేయవచ్చు. ఇలా ఒక ప్రాంతానికి సంబంధించిన సాంస్కృతిక వైభవాన్ని స్వచ్ఛంగా కలుషితం లేకుండా కొనసాగిస్తున్న నగరం హైదరాబాద్ కావడం విశేషం.

- ఆల్బర్ట్ రాయన్, చెఫ్

ఆతిథ్య రంగం.. అలంకరణ

- ఉత్సాహంగా వార్షిక ఫ్లవర్ అరేంజ్‌మెంట్ కాంపిటీషన్-2025





సాక్షి, సిటీబ్యూరో : కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ (ఐహెచ్‌ఎం-హైదరాబాద్) సృజనాత్మకతతో కూడిన పుష్పాలంకరణకు వేదికయ్యింది. వార్షిక ఫ్లవర్ అరేంజ్‌మెంట్ కాంపిటీషన్-2025 పేరుతో అంతర్ కళాశాలల పోటీ ఆదివారం నిర్వహించారు. ఆతిథ్య రంగంలో పుష్పాలంకరణ అవసరాన్ని ప్రతిబింబించేలా సృజనాత్మకతను ప్రదర్శించారు. ప్రముఖ హోటళ్ల నుంచి వచ్చిన ప్రొఫెషనల్ ఫ్లోరిస్టులు, నైపుణ్యం కలిగిన కళాకారులు అలంకరణను అద్భుతంగా తీర్చిదిద్దారు. పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు.

వివిధ విభాగాల్లో..

ఫ్రీ స్టైల్, ఫ్లవర్ డెకరేషన్, ఇకెబానా, బొకే మేకింగ్ వంటి విభాగాల్లో పలువురు ప్రొఫెషనల్స్ తమ ప్రతిభను ప్రదర్శించారు. రంగురంగుల పూలు, ఆకులతో వైవిధ్యభరితంగా తీర్చిదిద్దారు. ఐహెచ్‌ఎం-హైదరాబాద్ కృషిని మరింత ప్రతిష్టాత్మక స్థాయిలో నిలిపిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తమ సెల్‌ఫోన్లతో ఫొటోలు దిగారు. అనంతరం బహుమతులు ప్రకటించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

- స్టాప్ రోడ్ యాక్సిడెంట్ యాప్ ప్రారంభించిన పీవీ సింధు

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో విప్రో జంక్షన్‌ను ప్రమాద రహిత జంక్షన్‌గా ప్రకటించారు. ఈ జంక్షన్‌లో ఆదివారం 'స్టాప్ రోడ్ యాక్సిడెంట్' యాప్‌ను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు ప్రారంభించారు. కార్యక్రమంలో యమధర్మరాజు వేషధారణతో వాహనదారులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతలో భాగంగా సర్వేజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రమాద రహిత జంక్షన్లుగా మార్చి రోడ్డు భద్రతా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సోలార్ క్యాట్‌ఐస్, జీబ్రా క్రాసింగ్ లైన్స్, సిగ్నేచర్ బోర్డ్స్ ఏర్పాటు చేసి విప్రో జంక్షన్ సర్కిల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ప్రకటించడంతో అక్కడ స్టాప్ యాక్సిడెంట్ యాప్‌ను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి జనార్ధన్‌రెడ్డి, టీజీఐఐసీ వీసీ ఎండీ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఫౌండేషన్ వైస్ చైర్మన్ రాము యలమంచి, సభ్యులు కిషోర్ సేతురామన్ పాల్గొన్నారు.





గెలుపు ఓటములు సహజం

- పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే బాధ్యత తల్లిదండ్రులదే
- 'ముస్కాన్'లో ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు



రాయదుర్గం : జీవితంలో గెలుపు ఓటములు సహజమని, ఓడిపోయినా విశ్వాసం కోల్పోకూడదని, ఓటమి వల్ల ఏమీ కాదని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్ హోటల్లో హిమాలయ వెల్‌నెస్ సంస్థ, స్మైల్ ట్రెన్ ఇండియాతో కలిసి 'ముస్కాన్' పేరిట ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చర్చా కార్యక్రమంలో తనదైన శైలిలో ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఓడిపోయిన ప్రతిసారీ ఏదో ఒకటి నేర్చుకొని గెలవడానికి ప్రయత్నిస్తూనే ఉండాలని సూచించారు. పిల్లలకు ఎలాంటి సమస్య వచ్చినా తల్లిదండ్రులు అధైర్యపడొద్దని, సమస్య పరిష్కార దిశగా సహకరించాలన్నారు. పెదవి చీలికతో జన్మిస్తున్న చిన్నారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో హిమాలయ వెల్‌నెస్ కంపెనీ 'ముస్కాన్' కార్యక్రమం చేపట్టడం అభినందించదగ్గ విషయమని అభివర్ణించారు. దీనికి మద్దతు ఇవ్వడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. హిమాలయ వెల్‌నెస్ కంపెనీ కన్స్యూమర్ ప్రొడక్ట్ డివిజన్ బిజినెస్ డైరెక్టర్ రాజేష్ కృష్ణమూర్తి, స్మైల్ ట్రెన్ ఆసియా సీనియర్ ఉపాధ్యక్షుడు, రీజినల్ డైరెక్టర్ మమతా కారోల్ ప్రత్యేక చర్చా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరు వందల జిల్లాల్లో..

ముస్కాన్ కార్యక్రమాన్ని 2016లో ప్రారంభించామని, ఇప్పటి వరకూ దేశంలో 600 జిల్లాల్లో 2వేల కంటే ఎక్కువ ఉచిత చీలిక శస్త్ర చికిత్సలను సులభతరం చేశామని గుర్తుచేశారు. ప్రతి ఇంట్లో ఆరోగ్యం, ప్రతి హృదయంలో ఆనందమే తమ ఆశయమని నిర్వాహకులు తెలిపారు. సకాలంలో చీలిక చికిత్స అందిస్తే పిల్లల చిరునవ్వును పునరుద్ధరించడమే కాకుండా ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవితాన్ని గడుపుతారన్నారు. కార్యక్రమంలో రెండు సంస్థల ప్రతినిధులు, చిన్నారులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సౌరభం

- మూడు రోజుల పాటు అలరించిన కళారూపాలు
- ముగిసిన 'లివింగ్ టెంపుల్' కార్యక్రమం
- ప్రధాన ఆకర్షణగా కూచిపూడి, భరత నాట్యం, పేరిణి నృత్యాలు



రాయదుర్గం: భారతీయ ఆలయ సంస్కృతి, వారసత్వాన్ని చాటేలా మూడు రోజులపాటు నిర్వహించిన కళా మహోత్సవం ఆదివారంతో ముగిసింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్‌లో 'ఏక్ చిత్ర' నిర్వాహకురాలు అన్నపూర్ణ మడిపడిగ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ సహకారంతో నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 30 మంది ప్రఖ్యాత కళాకారులు రూపొందించిన భారతీయ దేవాలయాల వారసత్వ గొప్పతనాన్ని అందించే 100కు పైగా అద్భుత కళాకృతులు, సంప్రదాయ ఆలయ కళలు, సమకాలీన కళాత్మక వ్యక్తీకరణల ప్రదర్శన అందరినీ ఆకట్టుకునేలా చేసింది. ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త కేకే మహమ్మద్ ఆధ్వర్యంలో దేశంలో ప్రఖ్యాత కళాకారులు తోట తరణి, అమర్ రమేష్, వైశాలి రస్తోగి సాహ్ని, చరణ్ జీత్, సంగం వాంఖడే, వినోద్ ధీరజ్ రూపొందించిన శిల్పాలు, ఇతర చిత్రాలను ఇందులో ప్రదర్శించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు..

టెంపుల్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నృత్యకారిణి దీపికా రెడ్డి కూచిపూడి ప్రదర్శన, అభినేత్రి ఆర్ట్స్ అకాడమీ ద్వారా నృత్యారాధన, కథక్, భరత నాట్యం, బీహారీ జానపద నృత్యాలు, పేరిణి నృత్యం ప్రేక్షకులను విశేషంగా అలరించాయి.

నగరంలో మొదటిసారి..



'లివింగ్ టెంపుల్' పేరిట హైదరాబాద్‌లో కార్యక్రమం నిర్వహించడం మొదటిసారి. చెన్నై, ఢిల్లీలో కళకు సంబంధించిన అనేక కార్యక్రమాలను నిర్వహించాం. మూడు రోజులపాటు నిర్వహించిన కళారూపాలు, చిత్రాలు, శిల్పాల ప్రదర్శన సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీటితోపాటు ప్రత్యేక చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేశాం.

- అన్నపూర్ణ మడిపడగ, ఏక్‌చిత్ర, లివింగ్ టెంపుల్ నిర్వాహకురాలు

కక్ష సాధింపులో బరితెగింపు

పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్

- ఏపీలో దళిత ఐపీఎస్ అధికారిని వేధిస్తున్న కూటమి సర్కారు



సాక్షి, అమరావతి: దళిత అధికారులపై చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోంది. ఇప్పటికే సీఐడీ పూర్వపు అదనపు డీజీ సంజయ్‌ని కుట్ర పూరితంగా సస్పెండ్ చేసిన కూటమి ప్రభుత్వం.. పలువురు దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా ఉద్దేశ పూర్వకంగా అవమానిస్తోంది. డీజీ ర్యాంకులో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై తాజాగా కక్ష సాధింపు చర్యలకు తెగబడింది. కనీసం నోటీసు కూడా జారీ చేయకుండా ఆయన్ను ఏకపక్షంగా సస్పెండ్ చేయడం విస్మయ పరుస్తోంది. అనుమతి లేకుండా విదేశీ పర్యటనలు చేశారనే అభియోగాలపై ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రభుత్వం ఆదివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. కానీ పీవీ సునీల్ కుమార్ ప్రభుత్వ ముందస్తు అనుమతితోనే విదేశీ పర్యటన చేశారు. అయినా పీవీ సునీల్ కుమార్ 2019–2024 మధ్య పలుసార్లు ప్రభుత్వ అనుమతి లేకుండా అమెరికా తదితర దేశాల్లో పర్యటించారని ప్రభుత్వం ఆరోపించింది. కీలక స్థానాల్లో ఉన్న ఐపీఎస్ అధికారి అనధికారిక విదేశీ పర్యటనలతో సున్నితమైన సమాచారం లీక్ అయ్యే అవకాశం ఉందనే సాకు చూపుతూ క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రభుత్వ అనుమతితోనే విదేశీ పర్యటనలు

పీవీ సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో వెల్లడించిన కారణాలు పూర్తిగా అవాస్తవం. ఎందుకంటే 2019–2024 మధ్య కాలంలో ఆయన విదేశీ పర్యటనలకు ముందుగా ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. ఆ పర్యటనలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగత పర్యటనలు కాబట్టి పీవీ సునీల్ కుమార్ తన సొంత ఖర్చుతో విదేశాలకు వెళ్లాలని కూడా పేర్కొంది. అందుకు సమ్మతించి, పూర్తిగా తన సొంత ఖర్చులతో, వ్యక్తిగత హోదాలో ఆయన అమెరికాలో ఉంటున్న కుమారుడిని చూడటానికి వెళ్లారు. అయినా సస్పెండ్ చేయడం కేవలం చంద్రబాబు ప్రభుత్వ కుట్రేనన్నది స్పష్టమవుతోంది. నిబంధనల ప్రకారం నోటీసు జారీ చేసి ఆయన వివరణ కోరాలి. ఆయన ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే అప్పుడు తదుపరి చర్యలు తీసుకోవాలి. కానీ కూటమి ప్రభుత్వం ఈ నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. ఎందుకంటే పీవీ సునీల్ కుమార్‌కు నోటీసులు జారీ చేస్తే.. తాను ప్రభుత్వ అనుమతితోనే, సొంత ఖర్చులతో విదేశాల్లో పర్యటించానని ఆయన ఆధారాలు సమర్పిస్తూ వివరణ ఇస్తారు. అందుకే ఆయనకు ఆ అవకాశం ఇవ్వకూడదనే ప్రభుత్వం కనీసం నోటీసు జారీ చేయకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేసిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

'అసైన్డ్' దోపిడీకి రాజముద్ర!



అమరావతిలో పేదల భూములు కాజేసిన పచ్చ ముఠాలకు 'రిటర్నబుల్ ప్లాట్లు'

సీఆర్‌డీఏకు చంద్రబాబు సర్కారు ఆదేశం.. రిజిస్ట్రేషన్‌కు సన్నాహాలు

అదే.. అమరావతి! అంతా.. రైతన్నలే..! కానీ రాజధాని ప్రాంతంలో.. గత ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం.. అదే చోట నిరుపేద రైతుల నుంచి అసైన్డ్ భూములను కాజేసిన పచ్చ ముఠాలను 'రాజముద్ర'తో సత్కరిస్తోంది. అమరావతిలో ఏకంగా 1,300 ఎకరాలు అసైన్డ్ భూములు రిటర్నబుల్ ప్లాట్ల ముసుగులో పచ్చ రాబందులకు ఫలహారంగా మారిపోతున్నాయి! అసలు అసైన్డ్ భూములను కొనడమే పెద్ద తప్పు.. ఇక వాటిని కొనుగోలు చేసిన టీడీపీ నేతలకు బదులుగా ప్లాట్లు కేటాయించడం అంతకంటే పెద్ద నేరం కాదా? రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న లక్షలాది మంది పేద రైతుల సమస్యకు పరిష్కారం చూపుతూ వాటిపై వారికి పూర్తి యాజమాన్య హక్కులు (ఫ్రీ హోల్డ్) కల్పిస్తూ వైఎస్సార్ సీపీ హయాంలో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అయితే దీన్ని సైతం కూటమి సర్కారు వివాదాస్పదంగా మార్చింది. గత సర్కారు 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించిన లక్షలాది ఎకరాల భూములు, ఫ్రీ హోల్డ్ భూములపై తీసుకున్న నిర్ణయాలను తిరగతోడి వాటిని పారిశ్రామిక పార్కులు, ఇతర ప్రభుత్వ అవసరాల కోసం వినియోగించుకోవడంపై ప్రతిపాదనలు రూపొందించాలని ఇప్పటికే క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించింది.

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో 2014–19 మధ్య బరితెగించి సాగించిన 'అసైన్డ్' భూముల దోపిడీకి చంద్రబాబు ప్రభుత్వం రాజముద్ర వేస్తోంది. అమాయక ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులకు మాయ మాటలు చెప్పి రూ.5 వేల కోట్లకు పైగా విలువ చేసే 1,300 ఎకరాల అసైన్డ్ భూములను చంద్రబాబు బినామీలు, సన్నిహితులు చేజిక్కించుకున్నట్లు అప్పట్లోనే వెల్లడైంది. వీటిని రిజిస్ట్రేషన్ చేసేందుకు అధికారులు అంగీకరించకపోవడంతో ఈ దోపిడీదారులు హైకోర్టుకు వెళ్లి రైతుల ఫోర్జరీ సంతకాలతో ఏకంగా న్యాయస్థానాన్నే మోసగించడానికి ప్రయత్నించారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భూ సమీకరణ కింద తీసుకున్న ఈ భూములకు అమరావతిలో ప్లాట్లు కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ భూ దోపిడీకి వ్యతిరేకంగా అసైన్డ్ రైతులు న్యాయ పోరాటానికి సిద్ధపడ్డారు. తమకు న్యాయం చేయాలని తాజాగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేస్తున్నారు.

పరిహారం ఇవ్వరంటూ భయపెట్టి..

కేంద్ర ప్రభుత్వ అసైన్డ్ భూముల పరిరక్షణ చట్టాన్ని ఉల్లంఘిస్తూ, అప్పటి రెవెన్యూ అధికారుల అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ 2014–19 మధ్య టీడీపీ హయాంలో చంద్రబాబు బృందం ఏకంగా 1,300 ఎకరాల అసైన్డ్ భూముల దోపిడీకి పాల్పడింది. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన ఈ భూములను చేజిక్కించుకోవడానికి పక్కా పన్నాగం పన్నింది. రాజధాని కోసం అన్ని భూములను సమీకరణ కింద ప్రభుత్వం తీసుకుంటుందని, ఇవి అసైన్డ్ భూములైనందున ఎలాంటి పరిహారం ఇవ్వదని మొదట రెవెన్యూ అధికారుల ద్వారా గ్రామాల్లో ప్రచారం చేయించింది. ఇందులో భాగంగా భూ సమీకరణ విధానాలు ఖరారు చేస్తూ జారీ చేసిన జీవో 1 లోనూ అసైన్డ్ భూములకు భూ సమీకరణ ప్యాకేజీ ప్రకటించలేదు. దీంతో పేద రైతులు భయాందోళనకు గురయ్యారు. అదే అదునుగా టీడీపీ పెద్దల బినామీలైన రియల్ ఎస్టేట్ వ్యాపారులు రంగ ప్రవేశం చేశారు. అసైన్డ్ భూములు తమకు అమ్మేయాలని, లేకపోతే ప్రభుత్వం ఎలాంటి పరిహారం ఇవ్వకుండా వాటిని తీసేసుకుంటుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను భయపెట్టారు. అతి తక్కువ ధరకు సేల్ డీడ్ అగ్రిమెంట్లతో భూములను బదలాయించుకున్నారు. మొత్తం 1,300 ఎకరాలను చేజిక్కించుకున్నాక చంద్రబాబు ప్రభుత్వం వీటికి కూడా భూ సమీకరణ ప్యాకేజీ ప్రకటిస్తూ జీవో 41 జారీ చేసింది. అంటే అసైన్డ్ భూములను అక్రమంగా అతి తక్కువకు కొట్టేసిన టీడీపీ ముఠాకు రాజధానిలో విలువైన వాణిజ్య, నివాస స్థలాలను కేటాయిస్తామని తెలిపింది. దాంతో తాము మోసపోయామని అసైన్డ్ రైతులు గుర్తించి, ఆందోళన వ్యక్తం చేసినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పటికి ఎకరా రూ.కోటి విలువ ఉన్న భూములకు రాజధాని నిర్మిస్తే ఎకరా రూ.4 కోట్లు పలుకుతాయంటూ నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. అంటే టీడీపీ ముఠా కొల్లగొట్టిన 1,300 ఎకరాల మార్కెట్ విలువ ఏకంగా రూ.5 వేల కోట్లు పైనే!

రికార్డుల గల్లంతు మాయాజాలం

1954 తర్వాత ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు నిబంధనలకు విరుద్ధమని రెవెన్యూ అధికారులు అభ్యంతరం తెలిపారు. అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే కూడా ఈ మేరకు లిఖిత పూర్వకంగా స్పష్టం చేశారు. ఈ భూముల రిజిస్ట్రేషన్లను అప్పటి మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ తిరస్కరించారు. దాంతో దోపిడీదారులు ఆ భూములన్నీ 1954కు ముందు రైతులకు కేటాయించినవంటూ తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేశారు. వాస్తవానికి అవన్నీ 1980 – 2006 మధ్య రైతులకు కేటాయించినవే. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2006లో కేటాయించిన భూములు కూడా వీటిలో ఉన్నాయి. ఆ వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు టీడీపీ పెద్దలు గుంటూరు కలెక్టరేట్‌లో అసైన్డ్ భూముల రికార్డులను ఏకంగా మాయం చేశారు.

ఫోర్జరీ సంతకాలతో హైకోర్టుకే మస్కా

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌ను అధికారులు తిరస్కరించడంతో చంద్రబాబు బినామీలు, సన్నిహితులు హైకోర్టుకు వెళ్లారు. 1954కు ముందు కేటాయించిన ఈ భూములను ఎస్సీ, ఎస్టీ రైతులు తమకు స్వచ్ఛందంగానే విక్రయించారని హైకోర్టుకు తెలిపారు. ఇందుకోసం ఆ రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసేలా అధికారులను ఆదేశించాలని, వాటికి భూ సమీకరణ కింద రాజధానిలో అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయించేలా సీఆర్‌డీఏను ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఓ వైపు హైకోర్టులో ఈ వ్యాజ్యం సాగుతుండగా.. మరోపక్క అమరావతిలో అసైన్డ్ భూముల దోపిడీకి ఆమోద ముద్ర వేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమవుతోంది. భూ సమీకరణ కింద తీసుకున్న ఆ 1,300 ఎకరాల అసైన్డ్ భూములకు అమరావతిలో రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించాలని సీఆర్‌డీఏను ఆదేశించింది. తదనుగుణంగా చంద్రబాబు బృందం సభ్యుల పేరిట రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు సీఆర్‌డీఏ సన్నాహాలు చేస్తోంది.

ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోండి..

టీడీపీ కూటమి ప్రభుత్వ కుట్రను గుర్తించిన అసైన్డ్ రైతులు పలువురు హైకోర్టును ఆశ్రయించారు. తాము అసలు భూములు విక్రయించనే లేదని స్పష్టం చేశారు. తాము స్వచ్ఛందంగా భూములు విక్రయించినట్టు తమ సంతకాలు ఫోర్జరీ చేసి అఫిడవిట్లు దాఖలు చేశారని పలువురు అసైన్డ్ రైతులు న్యాయస్థానానికి నివేదించారు. తమ భూములకు ప్లాట్లను తమకే కేటాయించేలా సీఆర్‌డీఏను, ఇతరుల పేరిట ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకుండా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు.

భూ దోపిడీని ఆధారాలతో నిగ్గు తేల్చిన సిట్

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే అమరావతిలో అసైన్డ్ రైతులు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. దాంతో గత ప్రభుత్వం విచారణకు సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సిట్ దర్యాప్తులో చంద్రబాబు బృందం భూ బాగోతం మొత్తం ఆధారాలతో బట్టబయలైంది. అసైన్డ్ భూముల పరిరక్షణ చట్టానికి విరుద్ధంగా భూముల బదలాయింపు చేయకూడదని లిఖిత పూర్వకంగా అభ్యంతరం తెలిపామని అప్పటి గుంటూరు కలెక్టర్‌గా ఉన్న కాంతిలాల్ దండేతో సహా పలువురు అధికారులు సీఆర్‌పీసీ 164 కింద వాంగ్మూలాలు ఇచ్చారు. దాంతో ఏ1గా చంద్రబాబు, ఏ 2గా నారాయణతో పాటు పలువురిపై గతంలో సిట్ కేసు నమోదు చేసి న్యాయస్థానంలో చార్జిషీటు కూడా దాఖలు చేసింది.

శ్రీపాదరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




కార్యక్రమంలో మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): మాజీ స్పీకర్ శ్రీపాదరావు నేటి తరానికి ఆదర్శప్రాయుడని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, గాంధీవాదాన్ని ముందుకు తీసుకువెళ్లిన గొప్ప నేత అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొనియాడారు. ఆదివారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రస్తుతం రాజకీయాల్లోకి వచ్చేవారికి శ్రీపాదరావు జీవితం ఒక పాఠంలాంటిదన్నారు. శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ శ్రీపాదరావు ప్రజలతో మమేకమైన వ్యక్తి అని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయం చేయాలని పేర్కొన్నారు. తన తండ్రి శ్రీపాదరావు హత్య ఘటనను గుర్తు చేసుకుంటూ అలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఎక్కువగా ఇబ్బంది పడేది కుటుంబ సభ్యులేనని ఆవేదన వ్యక్తం చేశారు. తన నడవడికలో తప్పులు ఉంటే ఎత్తి చూపాలని ప్రజలను కోరారు. అనంతరం పలువురు సాహితీవేత్తలు, రచయితలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, సత్యనారాయణ, మఖన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కూనంనేని సాంబశివ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి అవసరమైన సాహిత్యాన్ని అందించాలి

'శతర' పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి తదితరులు

కాచిగూడ (హైదరాబాద్): ప్రజాస్వామ్యానికి అవసరమైన సాహిత్యాన్ని కవులు, రచయితలు అందించాలని పలువురు వక్తలు సూచించారు. సిరికి స్వామినాయుడు రచించిన 'శతర ఆదివాసీ కవిత్వ సంకలనం పుస్తక ఆవిష్కరణ సభ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. కార్యక్రమానికి సుప్రసిద్ధ రచయిత అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షత వహించారు. సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని 'శతర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అటవీ ప్రాంతంలో ఆదివాసీల కోసం పాలకులు రోడ్లు వేయలేదని, ఆదివాసీల కాళ్లకింద ఉన్న ఖనిజ సంపదను దోచుకుని రవాణా చేయడం కోసమే వేశారని ఆరోపించారు. సిరికి స్వామి నాయుడు ఉపాధ్యాయుడిగా కొనసాగుతూనే గిరిజనుల కోసం అద్భుతమైన కవిత్వాన్ని అందించారని ఆయన కొనియాడారు. ప్రముఖ కవి ఆచార్య జయధీర్ తిరుమలరావు, ప్రముఖ పాత్రికేయుడు కె.శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ, పాలకులు అటవీ సంపదను ధ్వంసం చేస్తున్నారని, సైనికులతో భౌతిక దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రచయిత్రి దాసోజు లలిత, ప్రొఫెసర్ జి.మనోజ, పుస్తక రచయిత సిరికి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఐడీబీఐ బ్యాంక్‌లో 650 ఉద్యోగాలు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ).. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ (గ్రేడ్–ఓ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులు ఏడాది వ్యవధితో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్) కోర్సు పూర్తిచేయాలి. ఆరు నెలలు తరగతి గది శిక్షణ, రెండు నెలలు ఇంటర్న్‌షిప్, నాలుగు నెలలు ఆన్ జాబ్ ట్రైనింగ్ ఉంటాయి. తర్వాత ఉద్యోగంలోకి తీసుకుంటారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 650.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీని కలిగి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, ప్రాంతీయ భాష పరిజ్ఞానం ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** 01.03.2025 నాటికి 20 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **వేతనం, స్టైపెండ్:** శిక్షణ సమయంలో నెలకు రూ.5,000, ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15,000, ఉద్యోగంలో చేరిన తర్వాత ఏడాదికి రూ.6.14 లక్షల నుంచి రూ.6.50 అందుతుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.03.2025
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 06.04.2025.
» **వెబ్‌సైట్:** https://www.idbibank.in

సీఎస్ఐఆర్–ఎస్ఈఆర్సీ, చెన్నైలో 39 అప్రెంటిస్‌లు

చెన్నైలోని సీఎస్ఐఆర్–స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్(సీఎస్ఐఆర్ –ఎస్ఈఆర్సీ).. తాత్కాలిక ప్రాతిపదికన ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు, జేఆర్ఎఫ్/ప్రాజెక్ట్ అసోసియేట్–1, 2 అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 39.
» **ఖాళీల వివరాలు:** ట్రేడ్(ఐటీఐ) అప్రెంటిస్‌షిప్–16, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌షిప్–13,గ్రాడ్యుయేట్(డిగ్రీ)అప్రెంటిస్‌షిప్–02,జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)–01, ప్రాజెక్ట్ అసోసియేట్1–04,ప్రాజెక్ట్ అసోసియేట్2–03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్(సివిల్), ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 03.03.2025 నాటికి ఐటీఐ అప్రెంటిస్‌కు 14 ఏళ్లు, డిప్లొమా అప్రెంటిస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 21 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ఐటీఐ అప్రెంటిస్‌కు రూ.10,500, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.12,000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.13,000, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000, ప్రాజెక్ట్ అసోసియేట్–1కు రూ.25,000, ప్రాజెక్ట్ అసోసియేట్–2కు రూ.35,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఇంటర్వ్యూ వేదిక:** సీఎస్ఐఆర్–స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సెంటర్ (సీఎస్ఐఆర్–ఎస్ఈఆర్సీ), సీఎస్ఐఆర్ రోడ్, తారామణి, చెన్నై–600113 చిరునామకు పంపించాలి.
» **ఇంటర్వ్యూ తేదీలు:** ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు– 03.03.2025.
» **జేఆర్ఎఫ్/ప్రాజెక్ట్ అసోసియేట్ అప్రెంటిస్‌లు** –1, 2–04.03.2025.
» **వెబ్‌సైట్:** http://serc.res.in

ఎన్‌సీసీటీ, న్యూఢిల్లీలో డైరెక్టర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ కో ఆపరేటివ్ ట్రెనింగ్(ఎన్‌సీసీటీ).. ఒప్పంద ప్రాతిపదికన డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
» **అర్హత:** ఎకనామిక్స్/అగ్రికల్చర్/ఎంసీఏ/కామర్స్/బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ /కోఆపరేషన్/లా/ఇంజనీరింగ్(కంప్యూటర్)/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్ డిగ్రీ, సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 నుంచి రూ.1,50,000.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సెక్రటరీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ కోఆపరేటివ్ ట్రెనింగ్, 3 సిరి ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, ఆగస్ట్ క్రాంతి మార్గ్, న్యూఢిల్లీ–110016 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 30 రోజుల్లోగా పంపించాలి.
» **నోటిఫికేషన్ వెలువడిన తేది:** 23.02.2025.
» **వెబ్‌సైట్:** https://ncct.ac.in

కేంద్రంలో డాక్టర్ కొలువు



యూపీఎస్సీ సీఎంఎస్ 2025

ఎంబీబీఎస్.. పూర్తి చేశారా లేదా.. చివరి సంవత్సరం చదువుతున్నారా! మెడికల్ పీజీ, ఇతర ఉన్నత చదువులు లేకుండా సుస్థిర కెరీర్‌తోపాటు ఆకర్షణీయ వేతనం కోరుకుంటున్నారా!! అయితే.. మీకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎంఎస్)-2025కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఎంపికైతే ప్రారంభంలోనే రూ.56,100-1,77,500 పే స్కేల్ పొందొచ్చు. ఈ నేపథ్యంలో.. సీఎంఎస్-2025 వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» యూపీఎస్సీ సీఎంఎస్-2025 నోటిఫికేషన్ విడుదల
» కేంద్రంలో 705 డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్ల కొలువులు
» ఎంబీబీఎస్ అర్హతతో సుస్థిర కెరీర్‌కు అవకాశం
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100-రూ.1,77,500

వైద్య రంగంలో ఉన్నత కెరీర్ సొంతమవ్వాలంటే.. ఎంబీబీఎస్‌తోపాటు పీజీ, డీఎన్‌బీ వంటి స్పెషలైజేషన్లు ఉత్తీర్ణులవ్వాల్సిన ఆవశ్యకత. ఇందుకోసం ఎంబీబీఎస్ తర్వాత కనీసం మరో ఆరేళ్లు చదవాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎంబీబీఎస్‌తోనే ఉజ్వల కెరీర్‌కు మార్గంగా నిలుస్తోంది.. యూపీఎస్సీ నిర్వహించే కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.

నాలుగు విభాగాలు.. 705 పోస్టులు

యూపీఎస్సీ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నాలుగు విభాగాల్లో రెండు కేటగిరీలుగా మొత్తం 705 వైద్య పోస్టులు భర్తీ చేయనున్నారు.

- **కేటగిరీ–1:** సెంట్రల్ హెల్త్ సర్వీస్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్స్– 226 పోస్టులు.
- **కేటగిరీ–2:** రైల్వేస్‌లో అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు–450, న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులు–9, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (గ్రేడ్–2) పోస్టులు–20 ఉన్నాయి.

అర్హత

ఎంబీబీఎస్ ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది. కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్‌లో ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే. అయితే వీరికి ఇంటర్న్‌షిప్ పూర్తయ్యాకే నియామకం ఖరారు చేస్తారు.

వయసు

ఆగస్ట్ 1, 2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు (ఆగస్ట్ 2, 1993 తర్వాత జన్మించి ఉండాలి). సెంట్రల్ హెల్త్ సర్వీసెస్‌లో జూనియర్ టైమ్ స్కేల్ పోస్టుల అభ్యర్థులు ఆగస్ట్ 1, 2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పోస్టుల భర్తీకి రెండంచెల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో సీఎంఎస్ఈ రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో నిర్దిష్ట కటాఫ్‌లు సాధించిన వారితో మెరిట్ జాబితా రూపొందించి 1:2 నిష్పత్తిలో(ఒక్కో పోస్టుకు ఇద్దరు) రెండో దశ పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. రాత పరీక్ష మార్కులు, పర్సనాలిటీ టెస్ట్ మార్కులను కలిపి తుది జాబితా రూపొందిస్తారు.

రెండు పేపర్లు.. 500 మార్కులు

- సీఎంఎస్ఈ రాత పరీక్ష రెండు పేపర్లుగా 500 మార్కులకు ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 250 మార్కులు కేటాయించారు.
- **పేపర్–1:** జనరల్ మెడిసిన్ అండ్ పిడియాట్రిక్స్. ఈ పేపర్‌లో జనరల్ మెడిసిన్ నుంచి 96 ప్రశ్నలు, పిడియాట్రిక్స్ నుంచి 24 ప్రశ్నలు అడుగుతారు. ఇలా మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి.
- పేపర్–2ను మూడు భాగాలుగా వర్గీకరించారు. అవి.. ఎ) సర్జరీ; బి) గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్; సి) ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్. ఒక్కో విభాగం నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 120. రెండు పేపర్లలోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

వంద మార్కులకు నిర్వహించే పర్సనాలిటీ టెస్ట్‌లో అభ్యర్థుల్లోని జనరల్ నాలెడ్జ్‌తోపాటు, వైద్య రంగం పట్ల వారికున్న ఆసక్తి, సేవా దృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని, నాయకత్వ నైపుణ్యాలను పరిశీలిస్తారు.

ఆకర్షణీయ వేతనాలు

ఇండియన్ రైల్వేలో అసిస్టెంట్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్‌గా గ్రూప్–ఎ జూనియర్ స్కేల్‌తో రూ.56,100–రూ.1,77,500 వేతన శ్రేణితో ప్రారంభ వేతనం లభిస్తుంది. సెంట్రల్ హెల్త్ సర్వీస్, ఇతర విభాగాల్లోనూ ఇదే వేతన శ్రేణితో ప్రారంభ వేతనం అందుతుంది. ఆయా విభాగాల్లో సర్వీస్‌లో చేరిన వారు నిర్దిష్ట వ్యవధిలో ప్రొబేషన్ పిరియడ్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రొబేషన్ పిరియడ్‌లో సంతృప్తికరమైన పనితీరు కనబర్చిన వారికే శాశ్వత కొలువు ఖరారవుతుంది. ఇండియన్ రైల్వేస్‌లో ఒక ఏడాది వ్యవధిలో, మిగిలిన విభాగాల్లో రెండేళ్ల వ్యవధిలో ప్రొబేషన్ పిరియడ్ ఉంటుంది. దీంతోపాటు ఇండియన్ రైల్వేస్‌లో ప్రొబేషన్‌తోపాటు ఫౌండేషన్ కోర్సు విధానాన్ని కూడా అమలు చేస్తున్నారు. ప్రొబేషన్ పూర్తి చేసుకున్న వారిని జూనియర్ టైం స్కేల్ ఆఫీసర్లుగా శాశ్వత ప్రాతిపదికగా విధుల్లోకి తీసుకుంటారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, మార్చి 11
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2025, మార్చి 12 నుంచి 18 వరకు
- **సీఎంఎస్ఈ పరీక్ష తేదీ:** 2025, జూలై 20
- **తెలుగు రాష్ట్రాల్లో రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
- **వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

పేపర్–1(జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్) లో విజయానికి అభ్యర్థులు కార్డియాలజీ, రెస్పిరేటరీ డిసీజెస్, గ్యాస్ట్రో ఇంటెస్టినల్, జెనిటో యురినరీ, న్యూరాలజీ, హెమటాలజీ, ఎండోక్రినాలజీ, మెటబాలిక్ డిసీజెస్, ఇన్ఫెక్షన్స్–కమ్యూనికబుల్ డిసీజెస్, న్యూట్రిషన్/గ్రోత్, డెర్మటాలజీ, మస్కులో–స్కెలిటల్ సిస్టమ్, సైకియాట్రీ, జనరల్ మెడిసిన్ అంశాలపై పట్టు సాధించాలి. దీంతోపాటు పిడియాట్రిక్స్‌కు సంబంధించి.. కామన్ చైల్డ్‌హుడ్ ఎమర్జెన్సీస్, న్యూబార్న్ కేర్, నార్మల్ డెవలప్‌మెంటల్ మైల్‌స్టోన్స్, ఇమ్యునైజేషన్ ఇన్ చిల్డ్రన్, ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను గుర్తించడం, వారికి కల్పించే చికిత్స మార్గాలు, విధానాలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

పేపర్–2కు ఇలా

పేపర్–2లోని మూడు విభాగాలకు సంబంధించి దృష్టి పెట్టాల్సిన అంశాలు..

సర్జరీ: జనరల్ సర్జరీకి సంబంధించి గాయాలు, కాలేయం, రక్త నాళాలు, పేగులు, కణితులు, ఉదర సంబంధ తదితర సమస్యలకు సంబంధించిన శస్త్రచికిత్సల అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటితో పాటు యూరాలజికల్ సర్జరీ, న్యూరో సర్జరీ, ఈఎన్‌టీ సర్జరీ, థొరాసిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ సర్జరీ, ఆప్తమాలజీ, అనస్థీసియాలజీ, ట్రామటాలజీ అంశాలను ఔపోసన పట్టాలి.

గైనకాలజీ అండ్ ఆబ్‌స్టెట్రిక్స్

ఈ విభాగానికి సంబంధించి గైనకాలజీలో అప్లయిడ్ అనాటమీ, అప్లయిడ్ ఫిజియాలజీ, జెనిటల్ ట్రాక్ట్‌లో ఇన్ఫెక్షన్లు, నియోప్లాస్మా, గర్భాశయం స్థానంలో మార్పులు, కన్వెన్షనల్ కాంట్రాసెప్టివ్స్, యూడీ, ఓరల్ పిల్స్, ఆపరేటివ్ ప్రొసీజర్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్

ఇటీవల కాలంలో సీఎంఎస్ రాత పరీక్షలో కీలకంగా నిలుస్తున్న విభాగంగా దీన్ని పేర్కొనొచ్చు. అభ్యర్థులు ఈ విభాగంలో మంచి మార్కుల కోసం సోషల్ అండ్ కమ్యూనిటీ మెడిసిన్, కాన్సెప్ట్ ఆఫ్ హెల్త్, డిసీజ్, ప్రివెంటివ్ మెడిసిన్, హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ప్లానింగ్, డెమోగ్రఫీ అండ్ హెల్త్ స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ హెల్త్, న్యూట్రిషన్ అండ్ హెల్త్, ఆక్యుపేషనల్ హెల్త్, జెనిటిక్స్ అండ్ హెల్త్, ఇంటర్నేషనల్ హెల్త్, మెడికల్ సోషియాలజీ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్,మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్, నేషనల్ ప్రోగ్రామ్స్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో చదవాలి.

సమకాలీన సమస్యలపైనా

సీఎంఎస్ అభ్యర్థులు సమకాలీన ఆరోగ్య సమస్యలపైనా దృష్టిసారించాలి. ప్రధానంగా కోవిడ్ పరిస్థితులు, వ్యాక్సిన్లు, వ్యాక్సిన్ ప్రయోగాలు, తదితర అంశాల గురించి సమాచారం తెలుసుకోవాలి. అదే విధంగా అంతర్జాతీయంగా కోవిడ్ ప్రభావానికి గురైన దేశాలు, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గణాంకాలు, నివేదికలు, యూఎన్‌ఓ నివేదికల్లోని ముఖ్యాంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-బ్యాంకింగ్ అవేర్‌నెస్

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 3-3-2025

సన్నిధి

అడిగేవారికి చెప్పేవారు లోకువ అని సామెత. అయితే అవతలి వారు ఏమీ అడగకున్నా, వారికి ఏం కావాలో, ఏం చెబితే బాగుంటుందో తామే తెలుసుకుని నాలుగు మంచిమాటలు .. అందులోనూ ఆధ్యాత్మిక విషయాలు, వ్యక్తిత్వ వికాసానికి పాదులు తీసే అంశాలూ చెబుతుంటారు ప్రవచనకారులు. ఇక్కడ ప్రవచనకారులు అనగానే ముందుగా గుర్తొచ్చేది పురుషులే. అలాగని స్త్రీలు అసల్లేరని కాదు. అయితే వారి పేర్లు చెప్పాలంటే చేతివేళ్లు సరిపోతాయి. 8న మహిళా దినోత్సవం సందర్భంగా సమాజ హితంకోసం ప్రవచనాలు చెబుతున్న కొందరు మహిళామణుల గురించి తెలుసుకుందాం. వారి ప్రయాణంలోని సాధక బాధకాలు వారి మాటల్లోనే...

ప్రవచన శిరోమణులు



మహిళలు ప్రవచనాలా?
– డా. ఎస్. అనంతలక్ష్మి

‘‘ఈ రోజు ప్రేయర్ అయినాక నువ్వు మాట్లాడు’’ అన్నారు మాస్టర్ గారు. సంతోషం, భయం ఒకేసారి కలిగాయి. నా కంగారు అర్థం కాదా! పిలవలేదు. ఊపిరి పీల్చుకున్నా కాని, కొంచెం నిరాశ. తర్వాత జనకులం (తల్లి తండ్రులు స్కూలు తర్వాత పిల్లలకి సంప్రదాయం సంస్కారం నేర్పే వ్యవస్థ)లో పెద్దలకి ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుడి కథాభాగం చెప్పమన్నారు. ఎం. ఏ; లో అది మాకు పాఠ్యభాగం కాదు. మాస్టర్ గారికే నమస్కరించుకుని చెప్పాను. అది వాళ్ళకి కాదు నాకు శిక్షణ. వేదవాఙ్మయాన్ని, పురాణేతిహాసాలను, కావ్యాలను శాస్త్రవిజ్ఞానంతో సమన్వయం చేసి, నేటితరానికి పనికి వచ్చే అంశాలని వివరించి, వాటి సార్వకాలీనతను ప్రపంచానికంతటికి వెల్లడించటం మా గురువరేణ్యులు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్యుల పద్ధతి. అది శిష్యులలో కొద్దిగానైనా ప్రతిఫలించటం సహజం. ఈ కారణంగా నా సాహిత్య ప్రసంగాలు ఆధ్యాత్మిక ప్రవచనాలు అయ్యాయి. వీలైనంత మందికి మాకు తెలిసిన విషయాలను చెప్పాలనే తపన తప్ప అది ప్రసంగమో, ప్రవచనమో పట్టించుకోలేదు. అందరూ అవి ప్రవచనాలు అని నిర్ధారించారు. అందరూ నన్ను ప్రవచనకర్త, ఆధ్యాత్మిక వేత్త అంటుంటే వింతగా ఉంటుంది. నేను మామూలు గృహిణిని, ఉద్యోగినిని, తల్లిని అంతే! నన్ను అందరూ ఆ విధంగా గుర్తించటానికి నా కుటుంబ సభ్యులు అందరు కారణం. నా పిల్లలు, విద్యార్థులు అడిగే అనుమానాలని తీర్చటానికి మరింత అధ్యయనం చేయవలసి వచ్చింది. అనుకున్న ప్రయోజనాన్ని సాధించాననే అనుకుంటాను.

సాధారణంగా ఆడవాళ్ళు ప్రవచనాలు అంటూ బయలుదేరితే ఇంట్లోనే ఇబ్బందులని ఎదుర్కోవలసి వస్తుంది, అనేకరకాలుగా. అటువంటి సమస్య నాకు కుటుంబం నుండి రాలేదు. (ఎవరికీ ఇబ్బంది కలుగని విధంగా జాగ్రత్తలు తీసుకునే దాన్ని.) కాని, బయటి నుండి తప్పవు. ‘‘ఆడవాళ్ళు ప్రవచనాలు చేయటం ఏమిటి?’’,‘‘ముందు ఇల్లు చూసుకో మనండి.’’ ‘‘దీనికి కూడా ఆడవాళ్ళు పోటీకి వస్తే మా సంగతి ఏమిటి?’’ ఇటువంటివి చాలానే విన్నాం. పైగా మగవాళ్లు వినరు ఆడవాళ్ళు చెపితే వినేది ఏమిటి? అని. చేస్తున్నది ధర్మబద్ధం అయితే అటువంటి వ్యాఖ్యలని పట్టించుకో నవసరం లేదు. తల్లిలాగా లాలించినట్టు చెపితే మంచి వైపుకి సమాజం మళ్లుతుంది అనుకుని చెప్పాలి. అలాగే చెబుతున్నాను కూడా!



వ్యక్తిత్వ వికాసానికి.. ఆధ్యాత్మిక భావోన్నతికి...
– డా. తుమ్మలపల్లి వాణీకుమారి

వృత్తిరీత్యా నేను అధ్యాపకురాలిని. సుమారు 35 సంవత్సరాల బోధనానుభవంలో నాకు తెలిసినంతవరకు విద్యార్థులకు బోధించగలిగాననే సంతృప్తి నాకు నిండుగా ఉంది. నేను చాలాకాలంగా ప్రసార మాధ్యమాలలో, ఇతర సాహిత్య కార్యక్రమాలలో పాల్గొంటున్నా ప్రవచనాల వైపు మరల లేదు. ఒకసారి రామాయణం గురించి నేను వ్రాసిన పుస్తకాలను చూసి శ్రీ చాగంటి కోటేశ్వరరావు ‘‘ఇన్ని మంచి విషయాలను వ్రాసిన మీరు ప్రవచనాలను చెప్పకపోవడం ఏమిటి? పైగా హైదరాబాదులో ఉంటూ కూడా!’’ అన్నారు. వారి వాక్ప్రభావమో, దైవసంకల్పమో కానీ తరువాత కొన్ని ఆలయాలలో, ఇతర వేదికలలో ప్రవచనాలకు అవకాశం వచ్చింది.

మామూలు సాదం (అన్నం) భగవదర్పితమయితే ప్రసాదమైనట్లు మామూలు వచనం భగవత్సంబంధితమయితే అది ప్రవచనం అవుతుంది. ఆ విధంగా చెప్పేవారికి, వినేవారికి కూడా మనసు ఆధ్యాత్మికత వైపు మరలుతుంది కాబట్టి నాకు ప్రవచనాల పట్ల మక్కువ కలిగింది. అయితే ప్రవచనాలను వినేవారు పెద్దవారు. ప్రవచనకారులు చెప్పే విషయాల పట్ల కొంత అవగాహన ఉన్నా ఆసక్తిగా వింటారు. చెప్పే విషయాలలో, తీరులో వైవిధ్యం ఉండటమే ఇందుకు కారణమనుకుంటాను. తెలుగు రాష్ట్రాలలో విఖ్యాతులైన ప్రవచనకారులు ఎంతోమంది ఉన్నా, నేను చెప్పినప్పుడు ఆసక్తిగా వినే శ్రోతలు లభించటం నా అదృష్టం. మంచి విషయాలను పదేపదే చెప్పటం వలన చెప్పేవారికి, వినటం వలన వినేవారికి మనసులో నాటుకుపోతాయి. మానవ సహజమైన బలహీనతలను అధిగమించే స్థైర్యం అలవడుతుంది. నా వరకు ఇది నా వ్యక్తిత్వ వికాసానికి, ఆధ్యాత్మిక భావోన్నతికి తోడ్పడుతుందని ఆశిస్తున్నాను.



చిన్నప్పుడే పునాది పడింది
– ఖుర్షీదా బేగం షేక్

నాకు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం అలవాటు. అలా ధార్మిక పుస్తకాలు, ఇస్లాం సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ, ధార్మిక రచనలు చేస్తూ ఉండటం మూలాన నా జీవితంలో ఆధ్యాత్మికతకు బలంగా పునాది పడింది.

ఒక నిజమైన ముస్లిం విశ్వాసి నుండి దైవం ఏమి కోరుకుంటున్నాడో అది చేయడం మాత్రమే నా మోక్షానికి, దైవప్రేమకు, పరలోక జీవిత సాఫల్యానికి మార్గం అని గ్రహించాను. అంతిమ దైవగ్రంథం దివ్య ఖుర్ ఆన్, ప్రవక్త ముహమ్మద్(స) బోధించిన హదీసు బోధలను, మహాప్రవక్త ముహమ్మద్ (స) వారి జీవిత చరిత్రను అధ్యయనం చేశాను. అవే నాకు ఆధ్యాత్మిక ప్రేరణ. ఒక విశ్వాసిగా ఇస్లాం అడుగుజాడల్లో నడుస్తున్నా సాటి విశ్వాసులకు ఏదో చేయాలనే తపన ఉండేది.

గ్రామీణ ప్రాంతాలలో స్త్రీలు ఆధ్యాత్మికంగా చాలా వెనుకబడి ఉండేవారు. ధార్మిక సమావేశాల్లో వారికి ఖుర్ ఆన్, హదీసు బోధనలను వివరించేదాన్ని. వాళ్ళు కూడా ఎంతో ఆసక్తిగా విని, తమకు తెలియని ఎన్నో మంచి విషయాలను తెలుసుకునేవారు. మూఢ నమ్మకాలు, అజ్ఞానం, నిరక్షరాస్యత, అనాగరిక ఆచార, సంప్రదాయాలు వారిలో ఎక్కువగా ఉండేవి. ఇస్లాం వాస్తవ బోధనలను వారికి తెలిపి వారి జీవితంలో ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగిస్తే వారి ఇహ, పర జీవితాలు అల్లాహ్ కరుణను పొందుతాయని వారి ఇహ, పరలోకాలు ఆదర్శంగా, గౌరవంగా ఉత్తమ, ఉన్నత నైతికతతో ఉండి తద్వారా పరలోకంలో శాశ్వత సాఫల్యం లభిస్తాయని ధార్మిక సమావేశాల్లో వివరించేదాన్ని.

నా రచనలు, ప్రసంగాల ద్వారా చాలామంది తమలోని నైతిక రుగ్మతలను దూరం చేసుకొని, ఒక ముస్లిం ఎలా ఉండాలో అలా మారే విధంగా తమను తీర్చిదిద్దుకుంటున్నామని చెప్పినప్పుడు చాలా తృప్తిగా అనిపిస్తుంది. నా జీవితానికి సార్థకత లభించిన అనుభూతి కలుగుతుంది.



నేర్చుకున్నాను... నేర్పిస్తున్నాను
– షకీనా గ్లోరి, సువార్తికురాలు

నేను ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి పట్టణంలో భక్తిగల దైవసేవకుల కుటుంబంలో జన్మించాను. బాల్యం నుండే మా తల్లిదండ్రులు మాకు బైబిల్ ను బోధించేవారు. ‘‘బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైన తర్వాత దానినుండి తొలగిపోడు’’ అని బైబిల్ వాక్యప్రకారం సమాజంలో ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో వారు మాకు నేర్పించారు. తదనుగుణంగా నేను బైబిల్లో ఉన్న యేసుప్రభువు బోధలకు, వాక్యాలకు ప్రభావితమొందాను.

నీతి నియాలు పాటించి బతికితే ఈ లోకంలో బతికినంత కాలం శాంతి -సమాధానం పొందుకుంటాము. ఒకవేళ ఏదో ఒక రోజున కన్నుమూస్తే దేవుడుండే తన రాజ్యానికి చేరుకుంటాము అనే సత్యాన్ని అనేకులకు తెలియజేయాలని, భయంకర సమస్యలకు దేవుడు పరిష్కారమిస్తాడు. మీకు మేళ్లు కలిగిస్తాడు. మిమ్మును ఆదరిస్తాడు. రక్షిస్తాడు. మీ బుద్ధిని మారుస్తాడనే శుభవార్తను అందరికీ అందించాలని, సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలనే నేను నా జీవితాన్ని ఈ పనికి అంకితం చేసుకున్నాను.

ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని బీఈడీ చేసి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ కూడా కొనసాగించుచున్న నాకు దైవస్వరం వినిపించగా నా శేషజీవితమంతా దేవుని పనిలో వాడబడాలని, ఆశలు అడియాశలైన వారినెందరినో బలపరచి, వారికి ఆనందకరమైన జీవితాన్నందించాలని ఈ సేవలో సాగిపోతున్నాను.

మా తండ్రిగారైన జోసఫ్ విజయకుమార్ గారే నాకు ప్రేరణ. చాలా ఒడిదొడుకులు, అభ్యంతరాలు, ఆటంకాలు, అవరోధాలు, అవమానాలు ఎదురౌతున్నా మొక్కవోని ధైర్యంతో క్రీస్తుబోధలను మననం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను. నాకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. నా కుటుంబానికి, పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ... అందరం సమైక్యంగా ఈ పనిలో ఆనందిస్తుంటాము.

నేను అందించిన ఈ బైబిల్ ప్రవచనాలు తమ కన్నీటిని తుడిచాయని, తమలో ధైర్యాన్ని నింపాయని, తమను వెన్నుతట్టి ప్రోత్సహించాయని, మంచిమార్గంలో నడిచేలా సహాయం చేస్తున్నాయని, చెడు వ్యసనాలతో, చెడు బుద్ధులతో ఉన్న తమను విడిపించి, సరియైన, నిజమైన మార్గాన్ని చూపించాయనే సాక్ష్యాలు వింటున్నప్పుడు సంతోషం కలుగుతుంటుటుంది.

Inspiration



నాకు స్ఫూర్తి మా నానమ్మ
- సుమతి, ఐజీ, ఇంటెలిజెన్స్

ఎందుకంటే..

‘ఒక పొజిషన్ అచీవ్ చేయమనెప్పుడూ చెప్పలేదు మా నానమ్మ. అయితే ఒక పొజిషన్‌లో ఉంటే చేయగలమో చెప్పింది. మన పనులతో ఎంతమందిని ప్రభావితం చేయగలమో చెప్పింది. మా పేరెంట్స్, మా నాన్నమ్మ ఎప్పుడూ మమ్మల్ని అబ్బాయిలకు డిఫరెంట్ అని పెంచలేదు. అందుకే మేం వాళ్లతో ఈక్వల్ కాదనే భావన మాకెప్పుడూ రాలేదు. అమ్మ కానీ, నానమ్మ కానీ మాకు ఎక్కడ తగ్గాలో నేర్పారు. అది మహిళలకున్న సహజగుణమని మేం గ్రహించేలా చేశారు. నిజానికి మనకు ఎక్కడ నెగ్గాలో తెలుస్తుంది. కానీ ఎక్కడ తగ్గాలో తెలియదు. అది తెలుసుకోవాలి. సహనం మనకున్న సహజమైన లక్షణం. దాన్నెందుకు కోల్పోవాలి మనం! అది మనకున్న ఆరా! దాన్ని కాపాడుకోవాలి. ఇవన్నీ నేను మా నానమ్మ, అమ్మ ద్వారే తెలుసుకున్నాను, నేర్చుకున్నాను. సో నాకు వాళ్లే స్ఫూర్తి!’

Impact



నాకు నచ్చిన పాత్ర ఇందిర
- సుజాతా వేల్పూరి

పి.శ్రీదేవి రాసిన నవల ‘కాలాతీత వ్యక్తులు’లోని ఇందిర చాలా వినూత్నమైన పాత్ర అని నేను అనుకుంటాను. నవల చదివిన వారు ఇందిరను అంత సులువుగా మర్చిపోలేరు. ఇంకా చెప్పాలంటే ఎప్పటికీ మర్చిపోలేరు. రచయిత్రి ఆ పాత్రను అలా తీర్చిదిద్దింది. ‘ప్రకాశం, ఇది కాదు బతికే విధానం, ఇంతకంటే బాగా బతకాలి’ అని ఇందిర చెప్పే డైలాగ్ విన్నాక ఇందిరను తల్చుకుంటే భయం వేస్తుంది. ఇందిరను తల్చుకుంటే ధైర్యం వస్తుంది. ఇరవయ్యేళ్ళ వయసుకు తగని బరువు మోసే ఆ పిల్ల ఒక్కచోట కూడా కన్నీళ్ళు పెట్టుకోదు. పైగా ‘నేను బలపడి, మరొకరికి బలమివ్వాలనుకునే తత్వం నాది’ అని అనగలిగే సాహసి.

‘అందరం ఒక్కలాంటివాళ్లమే! అడుగు లేని పడవలం! ఏదో అలా ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాం! అలాగని గడియ గడియకీ కాళ్ళు చాపి ఏడవటం నా వల్ల కాదు’ అంటుందామె. కృష్ణమూర్తి ఇందిరను పెళ్ళి చేసుకుంటున్నపుడు కూడా ‘పెళ్ళి నా జీవితంలో ఒక భాగం మాత్రమే! నీతో ఎంతదూరం రమ్మన్నా వస్తాను కానీ ఏ ఘట్టంలోనూ నా వ్యక్తిత్వాన్ని చంపుకోలేను. నా అవసరాలను గౌరవించడం నేర్చుకుని నన్ను నా ఇష్టం వచ్చినట్లు ఊపిరి పీల్చుకోనివ్వు’ అని ఆ రోజుల్లోనే తన పర్సనల్ స్పేస్ తనకుండాలని చెప్తుంది.

‘నీ ఆయుర్దాయం ఎంతో అన్నిరోజులూ నిండుగా బతుకు! నిర్భయంగా బతుకు! రోజుకు పదిసార్లు చావకు. ఈ ప్రపంచంలోని వికృతాన్నీ, వికారాన్నీ అసహ్యించుకో! ఆశలూ, స్వప్నాలు, అనురాగాలు అన్నీ పెంచుకో! కానీ వాటికి శస్త్రచికిత్స అవసరమైనపుడు నిర్దాక్షిణ్యంగా కత్తిరించి అవతల పారెయ్’ అనే ఇందిర నేటికీ మనకు అవసరమైన పాఠం చెప్తున్నట్టే అనిపిస్తుంది. ఇందిర స్త్రీలాగా ప్రవర్తించదు. సగటు మనిషిలాగా ప్రవర్తిస్తుంది. ఆ ప్రవర్తనలో ప్రేమ, కోపం, ఆవేశం, లౌక్యం, దుఃఖం, నిరాశ, నిర్లిప్తత, స్వార్థం అన్నీ ఉంటాయి. అన్నీ జీవితం ప్రసాదించినవే! ‘పాతివ్రత్యం, అర్పించుకోడాలు... వంటి నాన్సెన్స్‌ని ఫెడీమని కాలితో తన్నే ఇందిర’ అని డాక్టర్ చంద్రశేఖర్ రావు గారు ప్రస్తావించే ఇందిర డ్రామా చెయ్యదు, సహజంగా ప్రవర్తిస్తుంది. అందులో స్త్రీలకుండే బలం కనిపిస్తుంది. అందుకే ఇందిర నాకిష్టం.

సినిమా

ధైర్యమే ఆయుధం

భర్త కోసం ఒకరు... మార్పు కోసం మరొకరు... ఊరి కోసం ఇంకొకరు... ఇలా సమాజంతో, వ్యతిరేక పరిస్థితులతో ధైర్యాన్నే ఆయుధంగా చేసుకుని పోరాటానికి నడుం బిగించారు కొందరు తారలు. తమ హక్కులు, లక్ష్యాల కోసం సిల్వర్ స్క్రీన్‌పై తగ్గేదే లే అంటూ విజృంభించారు.. పోరాటానికి ‘సై’ అని కొందరు నటీమణులు చేసిన ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.



క్రిమినల్... లెజెండ్

‘అరుంధతి, రుద్రమదేవి’ వంటి ఉమెన్ సెంట్రిక్ మూవీస్‌లో అనుష్క యాక్షన్ టాలెంట్‌ని ఆడియన్స్ చూశారు. కొంత గ్యాప్ తర్వాత అనుష్క నటిస్తున్న ఈ తరహా చిత్రం ‘ఘాటి’. క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 18న విడుదల కానుంది. ఓ వ్యాపారంలో ఎదుగుతున్న మహిళను కొందరు వ్యక్తులు ఓ కుట్రలో ఇరికించి, క్రిమినల్‌గా చిత్రీకరిస్తారు. ఆ సమస్యల నుంచి ఆమె బయటపడి, తనను ఇబ్బంది పెట్టినవారికి ఎలా బుద్ధి చెప్పింది? ఆ వ్యాపార సామ్రాజ్యానికి ఓ లెజెండ్‌గా ఆమె ఎలా ఎదిగింది? అన్నదే ‘ఘాటి’ సినిమా కథ అని టాక్.

మా ఇంటి బంగారం

కుటుంబాన్ని చక్కబెట్టే ఓ గృహిణి గన్ పట్టిందంటే అందుకు కొన్ని అసాధారణ పరిస్థితులే కారణమై ఉంటాయి. మరి... ఆమె ఎందుకు గన్ పట్టుకుందో ‘మా ఇంటి బంగారం’ సినిమాలో చూడాలి. ఈ సినిమాలో గృహిణిగా నటిస్తున్నారు సమంత. తన నిర్మాణ సంస్థ ట్రా లా లా పిక్చర్స్‌పై సమంత నిర్మిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం. గత ఏడాది తన బర్త్ డే (ఏప్రిల్ 28) సందర్భంగా ‘మా ఇంటి బంగారం’ను ప్రకటించారు. ఆ తర్వాత ఈ మూవీపై అప్‌డేట్ రాలేదు. అలాగే ‘ట్రా లా లా’లోనే ఓ హారర్-కామెడీ ఫిల్మ్ రూపొందుతోందని తెలిసింది. ఈ చిత్రంలో సమంత గెస్ట్ రోల్ చేశారని సమాచారం.

భర్త కోసం...

ఆల్మోస్ట్ అందరూ మహిళలే ఉన్న ఓ నిర్మాణ సంస్థ నిర్మించిన చిత్రం ‘ది ఐ’. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ లీడ్ రోల్‌లో నటించారు. డాఫ్నే ష్మోన్ దర్శకత్వంలో రూపొందిన అంతర్జాతీయ చిత్రం ఇది. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది. వేరే దేశంలో ఉన్న తన భర్త మరణ వార్త విని షాక్ అయిన ఓ మహిళ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తుంది. అక్కడ ఆమెకు కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ఓ దశలో భర్త బతికే ఉన్నాడనే అనుమానం కూడా ఆమెకు వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనే అంశాల నేపథ్యంలో ‘ది ఐ’ ఉంటుందని సమాచారం.

వీరోచిత పోరాటం

ఓ ఊరి సంరక్షణ కోసం దుష్ట శక్తులతో శివ శక్తి అనే నాగసాధువు ఎలాంటి వీరోచిత పోరాటం చేసిందనే ఇతివృత్తంతో రూపొందుతున్న సినిమా ‘ఓదెల 2’. ఈ చిత్రంలో నాగ సాధువుగా నటిస్తున్నారు తమన్నా. దర్శక-నిర్మాత సంపత్ నంది పర్యవేక్షణలో అశోక్ తేజ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది.

బ్యాగ్‌లో బాంబు

ఓ అమ్మాయి తన హ్యాండ్ బ్యాగ్‌లో కత్తి, బాంబు, తుపాకీలు పెట్టుకుని తిరుగుతుంటుంది. ఎందుకనేది థియేటర్స్‌లో ‘రివాల్వర్ రీటా’ మూవీ చూసి తెలుసుకోవాలి. కీర్తీ సురేష్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ ‘రివాల్వర్ రీటా’. జేకే చంద్రు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది.

స్టూడెంట్ స్టోరీ

రష్మికా మందన్నా తొలిసారి చేస్తున్న ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ‘ది గర్ల్‌ఫ్రెండ్’. ప్రేమలో పడకూడదనుకుంటూనే ప్రేమలో పడే ఓ కాలేజీ స్టూడెంట్ కథగా ఈ సినిమా కథనం ఉంటుందని తెలిసింది. ఈ చిత్రంలో కాలేజ్ స్టూడెంట్‌గా నటిస్తున్నారు రష్మికా మందన్నా. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా రిలీజ్‌పై త్వరలో ఓ ప్రకటన రానుంది. అలాగే ‘రెయిన్ బో’ అనే మరో లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్‌కూ రష్మిక గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మూవీపై తాజా అప్‌డేట్ రావాల్సి ఉంది.

సుబ్బు సాహసం

అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత... ఇలా ముగ్గురు హీరోయిన్లు నటించిన చిత్రం ‘పరదా’. ఊరి సంప్రదాయం, కట్టుబాట్ల కోసం సుబ్బు (అనుపమ) చేసిన సాహసోపేతమైన ప్రయాణమే ‘పరదా’. ఈ చిత్రంలోని మెయిన్ హీరోయిన్ రోల్‌లో అనుపమా పరమేశ్వరన్ నటించారు. ఈ సినిమాతో ఓ సామాజిక అంశాన్ని బలంగా చెప్పబోతున్నారట ఈ చిత్రదర్శకుడు ప్రవీణ్ కాండ్రేగుల. ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది. అలాగే ‘జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ’ అనే కోర్టు రూమ్ డ్రామాలోనూ, ‘లాక్ డౌన్’ అనే మరో ఉమెన్ సెంట్రిక్ చిత్రంలోనూ అనుపమ నటించారు.

నెగటివిటీ తగ్గాలంటే...

సమాజంలోని నెగటివిటీని తగ్గించాలకుని ఓ యువతి తనదైన శైలిలో ఏం చేసింది? అనే అంశంతో ఓ ఉమెన్ సెంట్రిక్ మూవీ నిర్మాణంలో ఉంది. సామాజిక, రాజకీయ అంశాల మేళవింపుతో రానున్న ఈ సినిమాలో హీరోయిన్ సంయుక్త లీడ్ రోల్ చేస్తున్నారు. కేఎస్‌సీ యోగేష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు సంయుక్త కూడా ఓ నిర్మాత. ఆమెకు నిర్మాతకు ఇదే తొలి చిత్రం కావడం ఓ విశేషం.

సతీ లీలావతి

‘హ్యాపీబర్త్ డే’ తర్వాత హీరోయిన్ లావణ్యా త్రిపాఠి సైన్ చేసిన మరో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ ‘సతీ లీలావతి’. తాతినేని సత్య ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం ఆరంభమైంది. కథాంశం గురించి పూర్తి వివరాలు రావాల్సి ఉంది.

బూమరాంగ్

అనూ ఇమ్మాన్యుయేల్ లీడ్ రోల్‌లో నటించిన హారర్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ ‘బూమరాంగ్’. ఇందులో శివ కందుకూరి కీలక పాత్రధారి. ఆండ్రూ బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఓ సైకో కిల్లర్ నుంచి ఒక యువతి ఎలా తప్పించుకుంది? అనే అంశంతో ఈ చిత్రం రూపొందుతోందని టాక్.

సత్యభామ కథ

పెళ్లైన ఓ అమ్మాయి తన సమస్యలను తానే ఏ విధంగా పరిష్కరించుకుంది? అనే అంశంతో రూపొందుతున్న సినిమా ‘శివంగి’. ఈ మూవీలో సత్యభామగా ఆనంది, పోలీసాఫీసర్‌గా వరలక్ష్మీ శరత్ కుమార్ నటించారు. దేవరాజ్ భరణీధరన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. అలాగే ప్రముఖ బుర్రకథ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా రూపొందుతున్న ‘గరివిడి లక్ష్మి’ సినిమాలో ఆనంది టైటిల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రానికి గౌరీ నాయుడు జమ్ము దర్శకత్వం వహిస్తున్నారు.

మహిళలు ఎదగాలి

మహిళలను గౌరవించాలి, అన్ని రంగాల్లో ఆడపిల్లలు ఎదిగేందుకు సహకరించాలి, సమాజంలో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించాలనే అంశాల ఇతివృత్తంగా రూపొందిన చిత్రం ‘నారీ’. ఈ సినిమాలో ఆమని ఓ లీడ్ రోల్ చేశారు. సూర్య వంటిపల్లి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది.

ఇవే కాదు... ఇంకా మరికొన్ని ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ నిర్మాణంలో ఉన్నాయి.

– ముసిమి శివాంజనేయులు

ఒక రోజు ముందే వినోదం

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ కాంబినేషన్‌లో రూపొందిన ‘మ్యాడ్’ (2023) ప్రేక్షకులను ఫుల్లుగా నవ్వించి, బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు సాధించింది.



ఈ హీరోల కాంబినేషన్‌లోనే ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన ‘మ్యాడ్ స్క్వేర్’ ఈ నెల 29న విడుదల కావాల్సింది. అయితే ఆ రోజు అమావాస్య కావడంతో పంపిణీదారుల విజ్ఞప్తి మేరకు ఒకరోజు ముందే 28న విడుదల చేయనున్నామని చిత్ర సమర్పకుడు సూర్యదేవర నాగవంశీ పేర్కొన్నారు. హారిక సూర్యదేవర, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. తొలి భాగానికి దర్శకత్వం వహించిన కల్యాణ్ శంకర్ మలి భాగాన్ని కూడా తెరకెక్కించారు.

వినూత్న కథతో...

ఆశిష్ గాంధీ, మానసా రాధాకృష్ణన్ జంటగా ఆదివారం ఓ చిత్రం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి ప్రసన్న కుమార్ టి, వంశీ కెమెరా స్విచ్చాన్ చేయగా, ఆర్పీ పట్నాయక్ క్లాప్ కొట్టారు. వీరశంకర్, నవీన్ ఎర్నేని, తనికెళ్ల భరణి చిత్ర దర్శక ద్వయం కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్యలకు స్క్రిప్ట్‌ను అందించారు.



అనంతరం విలేకరుల సమావేశంలో చిత్రనిర్మాత ఆర్‌యు రెడ్డి మాట్లాడుతూ – ‘‘ఈ చిత్రాన్ని నూతన దర్శకులతో ఓ వినూత్న కథతో నిర్మిస్తున్నాం. ఈ నెల 6న ఊటీలో తొలి షెడ్యూల్ ప్రారంభిస్తున్నాం. మా సోనుధి బేనర్ నుండి ఏడాదికి కొన్ని సినిమాలు విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. మాకు ఎంతో ఇచ్చిన సమాజానికి మా వంతుగా మేం కూడా ఇవ్వాలని మంచి సినిమాలు చేయాలని నిర్ణయించుకున్నాం’’ అన్నారు. ‘‘మా ప్రతిభను నిరూపించుకునే అవకాశం కల్పించిన నిర్మాత ఆర్‌యు రెడ్డిగారికి కృతజ్ఞతలు’’ అన్నారు దర్శకులు కిట్టి కిరణ్, లక్ష్మీ చైతన్య.

కామెడీ జిగేల్

త్రిగుణ్, మేఘా చౌదరి జంటగా మల్లి యేలూరి దర్శకత్వంలో రూపొందిన కామెడీ థ్రిల్లర్ మూవీ ‘జిగేల్’. డా. వై. జగన్‌మోహన్, నాగార్జున అల్లం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదల కానుంది. తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ‘‘ఈ చిత్రంలో త్రిగుణ్, మేఘాల ప్రేమకథ లవ్లీగా ఉంటుంది. అలాగే కామెడీ, సస్పెన్స్ ఆకట్టుకునేలా ఉంటాయి. ఈ కామెడీ థ్రిల్లర్ అన్ని వర్గాలవారినీ ఆకట్టుకునేలా ఉంటుంది’’ అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు.



7 అంతర్జాతీయ క్రికెట్‌లో 300 వన్డేలు పూర్తి చేసుకున్న ఏడో భారతీయ క్రికెటర్‌గా, ఓవరాల్‌గా 22వ ప్లేయర్‌గా విరాట్ కోహ్లి గుర్తింపు పొందాడు. గతంలో భారత్ తరఫున సచిన్ టెండూల్కర్ (463), ఎమ్మెస్ ధోని (350), రాహుల్ ద్రవిడ్ (344), మొహమ్మద్ అజహరుద్దీన్ (334), సౌరవ్ గంగూలీ (311), యువరాజ్ సింగ్ (304) ఈ ఘనత సాధించారు.

5 చాంపియన్స్ ట్రోఫీ జరుగుతున్న సమయంలోనే కెరీర్‌లో 300 వన్డేల మైలురాయి అందుకున్న ఐదో భారతీయ క్రికెటర్‌గా విరాట్ కోహ్లి నిలిచాడు. అజహరుద్దీన్ (1998లో), సచిన్ టెండూల్కర్ (2002లో), రాహుల్ ద్రవిడ్ (2006లో), యువరాజ్ సింగ్ (2017లో) కూడా చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఈ మైలురాయి అందుకోవడం విశేషం. ఇతర దేశాల క్రికెటర్లెవరూ చాంపియన్స్ ట్రోఫీ జరుగుతున్న సమయంలో ఈ ఘనత సాధించలేదు.

5/42 చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో భారత జట్టుపై అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన బౌలర్‌గా న్యూజిలాండ్ పేసర్ మాట్ హెన్రీ గుర్తింపు పొందాడు. గతంలో పాకిస్తాన్ బౌలర్లు నవీదుల్ హసన్ (4/25: 2004లో), షోయబ్ అక్తర్ (4/36: 2004లో)... జింబాబ్వే బౌలర్ డగ్లస్ హోండో (4/62: 2002లో) నాలుగు వికెట్ల చొప్పున తీసుకున్నారు.



10 అంతర్జాతీయ వన్డేల్లో అత్యధిక వరుస మ్యాచ్‌ల్లో టాస్ ఓడిపోయిన కెప్టెన్ల జాబితాలో రోహిత్ శర్మ మూడో స్థానంలో ఉన్నాడు. రోహిత్ వరుసగా 10 మ్యాచ్‌ల్లో టాస్ ఓడిపోయాడు. రోహిత్ టాస్ కోల్పోయిన పరంపర అహ్మదాబాద్‌లో 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో మొదలై తాజాగా చాంపియన్స్ ట్రోఫీలో న్యూజిలాండ్‌తో మ్యాచ్ వరకు కొనసాగింది. ఈ జాబితాలో తొలి రెండు స్థానాల్లో బ్రియాన్ లారా (12 సార్లు; వెస్టిండీస్), పీటర్ బోరెన్ (11 సార్లు; నెదర్లాండ్స్) ఉన్నారు.



వరుణ్ చక్రవర్తి

వరుణ్ 'మిస్టరీ' దెబ్బ

చాంపియన్స్ ట్రోఫీ తొలి రెండు మ్యాచ్‌లలో 229, 242 పరుగుల లక్ష్యాలను భారత్ అలవోకగా ఛేదించింది. ఈసారి మాత్రం ముందుగా బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. న్యూజిలాండ్ పదునైన బౌలింగ్ ముందు భారీ స్కోరు చేయడం కష్టంగా మారింది. టాప్-3 బ్యాటర్లు 30 పరుగులకే వెనుదిరగ్గా... చివరకు టీమిండియా 249 పరుగులకే పరిమితమైంది. ఈ స్కోరును నిలబెట్టుకోగలదా అనే సందేహాలు... అయితే మన స్పిన్నర్లు విన్నర్లుగా మారారు... భారత స్పిన్‌ను ఎదుర్కోవడంలో పూర్తిగా తడబడిన కివీస్ ఓటమిని ఆహ్వానించింది. చాంపియన్స్ ట్రోఫీలో తొలి మ్యాచ్ ఆడిన 'మిస్టరీ స్పిన్నర్' వరుణ్ చక్రవర్తి ముందుండి నడిపించగా... కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ విజయంలో తలా ఓ చేయి వేశారు. ఇక భారత జట్టుకు అసలైన సవాల్ మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియా రూపంలో ఎదురవుతోంది. వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత ఇరు జట్లు మళ్లీ ఇప్పుడే వన్డే మ్యాచ్‌లో తలపడనుండగా... బుధవారం జరిగే రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాను న్యూజిలాండ్ ఎదుర్కొంటుంది.



శ్రేయస్ అయ్యర్

కుప్పకూలిన న్యూజిలాండ్

- 44 పరుగులతో టీమిండియా గెలుపు
- రాణించిన శ్రేయస్ అయ్యర్
- వరుణ్ చక్రవర్తికి 5 వికెట్లు
- రేపు సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో 'ఢీ'



విలియమ్సన్

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో భారత్ లీగ్ దశను అజేయంగా ముగించింది. సెమీఫైనల్ స్థానం ఖాయమైపోయిన తర్వాత ఆడిన చివరి లీగ్ మ్యాచ్‌లోనూ గెలిచిన టీమిండియా ఆరు పాయింట్లతో గ్రూప్ 'ఎ' టాపర్‌గా నిలిచి తమ స్థాయిని ప్రదర్శించింది. ఆదివారం జరిగిన పోరులో భారత్ 44 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (98 బంతుల్లో 79; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... హార్దిక్ పాండ్యా (45 బంతుల్లో 45; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (61 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అయ్యర్, అక్షర్ నాలుగో వికెట్‌కు 22.4 ఓవర్లలో 98 పరుగులు జోడించారు. కివీస్ బౌలర్లలో మాట్ హెన్రీ (5/42) ఐదు వికెట్లతో భారత్‌ను దెబ్బ తీశాడు. అనంతరం న్యూజిలాండ్ 45.3 ఓవర్లలో 205 పరుగులకే ఆలౌటైంది. కేన్ విలియమ్సన్ (120 బంతుల్లో 81; 7 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వరుణ్ చక్రవర్తి (5/42) తన కెరీర్‌లో రెండో వన్డేలోనే ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. మంగళవారం ఇదే మైదానంలో జరిగే తొలి సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో భారత్ తలపడుతుంది. గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంలో నిలిచిన న్యూజిలాండ్ బుధవారం లాహోర్‌లో జరిగే రెండో సెమీఫైనల్లో గ్రూప్ 'బి' టాపర్ దక్షిణాఫ్రికాతో ఆడుతుంది.

కీలక భాగస్వామ్యం...

హెన్రీ, జేమీసన్ స్వింగ్ బౌలింగ్‌తో కట్టడి చేయడంతో ఆరంభంలో పరుగులు చేయడంలో భారత బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో 15 పరుగుల వ్యవధిలో గిల్ (7 బంతుల్లో 2), రోహిత్ (17 బంతుల్లో 15; 1 ఫోర్, 1 సిక్స్), కోహ్లి (14 బంతుల్లో 11; 2 ఫోర్లు) వెనుదిరిగారు. బ్యాక్‌వర్డ్ పాయింట్ దిశగా కోహ్లి బలంగా షాట్ కొట్టగా... గాల్లోకి ఎగురుతూ గ్లెన్ ఫిలిప్స్ అత్యద్భుతంగా క్యాచ్ అందుకున్న తీరు హైలైట్‌గా నిలిచింది. తన 300వ వన్డేలో తక్కువ స్కోరుకే అవుటై కోహ్లి నిరాశగా మైదానం వీడాడు. 30/3 వద్ద ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేందుకు అయ్యర్, అక్షర్ ప్రయత్నించారు. క్రీజ్‌లో నిలదొక్కుకునే ప్రయత్నంలో చాలా జాగ్రత్తగా ఆడటంతో ఒక దశలో వరుసగా 51 బంతుల పాటు బౌండరీనే రాలేదు. అయితే ఆ తర్వాత స్కోరు వేగం కాస్త పెరిగింది. రూర్కే ఓవర్లో 3 ఫోర్లు కొట్టి ధాటిని ప్రదర్శించిన అయ్యర్ 75 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అక్షర్‌ను అవుట్ చేసి రచిన్ ఈ జోడీని విడదీయగా... 10 పరుగుల వ్యవధిలో అయ్యర్, కేఎల్ రాహుల్ (29 బంతుల్లో 23; 1 ఫోర్) పెవిలియన్ చేరారు. జడేజా (20 బంతుల్లో 16; 1 ఫోర్) కూడా ఎక్కువ సేపు నిలవలేదు. అయితే చివర్లో పాండ్యా మెరుపు బ్యాటింగ్‌తో భారత్ 250 పరుగులకు చేరువగా రాగలిగింది. జేమీసన్ ఓవర్లో పాండ్యా వరుసగా 4, 4, 6 బాదాడు. భారత్ ఈ మ్యాచ్‌లో ఒక మార్పుతో బరిలోకి దిగింది. పేసర్ హర్షిత్ రాణాకు విశ్రాంతినిస్తూ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని జట్టులోకి తీసుకుంది.

విలియమ్సన్ మినహా...

ఛేదనలో కివీస్‌కు సరైన ఆరంభం లభించలేదు. అక్షర్ చక్కటి క్యాచ్‌తో రచిన్ రవీంద్ర (12 బంతుల్లో 6)ను అవుట్ చేయడంతో భారత్‌కు తొలి వికెట్ లభించింది. ఆ తర్వాత కూడా న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో ఒక్కటి కూడా చెప్పుకోదగ్గ భాగస్వామ్యం లేకపోయింది. ఒకవైపు విలియమ్సన్ పట్టుదలగా నిలబడినా... మరో ఎండ్‌లో బ్యాటర్లంతా వరుస కట్టి పెవిలియన్ చేరారు. భారత స్పిన్నర్ల బంతులను అర్థం చేసుకోలేక వరుసగా నలుగురు బ్యాటర్లు ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేరడం విశేషం. మిచెల్ (35 బంతుల్లో 17; 1 ఫోర్), లాథమ్ (20 బంతుల్లో 14), ఫిలిప్స్ (8 బంతుల్లో 12; 1 సిక్స్), బ్రేస్‌వెల్ (3 బంతుల్లో 2) విఫలం కాగా... మరో ఎండ్‌లో 77 బంతుల్లో విలియమ్సన్ హాఫ్ సెంచరీ పూర్తయింది. 40 ఓవర్లలో కివీస్ స్కోరు 165/6. మరో 60 బంతుల్లో 85 పరుగులు చేయాలి. చేయాల్సిన రన్‌రేట్ పెరిగి పోతుండగా ఒత్తిడిలో భారీ షాట్‌కు ప్రయత్నించి విలియమ్సన్ అక్షర్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోయి స్టంపౌట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు వ్యక్తిగత స్కోర్లు 1, 32, 68 వద్ద రాహుల్ (రెండు), వరుణ్ క్యాచ్‌లు వదిలేయడంతో విలియమ్సన్ బతికిపోయాడు. మాజీ కెప్టెన్ అవుటవ్వడంతో కివీస్ గెలుపుపై ఆశలు వదిలేసుకుంది. చివర్లో కెప్టెన్ మైకేల్ సాంట్నర్ (31 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు) పోరాడినా లాభం లేకపోయింది. 54 పరుగుల తేడాతో ఆ జట్టు చివరి 6 వికెట్లు కోల్పోయింది.



సాంట్నర్ క్లీన్‌బౌల్డ్


స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) యంగ్ (బి) జేమీసన్ 15; గిల్ (ఎల్బీ) (బి) హెన్రీ 2; కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 11; అయ్యర్ (సి) యంగ్ (బి) రూర్కే 79; అక్షర్ (సి) విలియమ్సన్ (బి) రచిన్ 42; రాహుల్ (సి) లాథమ్ (బి) సాంట్నర్ 23; పాండ్యా (సి) రచిన్ (బి) హెన్రీ 45; జడేజా (సి) విలియమ్సన్ (బి) హెన్రీ 16; షమీ (సి) ఫిలిప్స్ (బి) హెన్రీ 5; కుల్దీప్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు)** 249. **వికెట్ల పతనం:** 1-15, 2-22, 3-30, 4-128, 5-172, 6-182, 7-223, 8-246, 9-249. **బౌలింగ్:** హెన్రీ 8-0-42-5, జేమీసన్ 8-0-31-1, రూర్కే 9-0-47-1, సాంట్నర్ 10-1-41-1, బ్రేస్‌వెల్ 9-0-56-0, రచిన్ 6-0-31-1.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: యంగ్ (బి) వరుణ్ 22; రచిన్ (సి) అక్షర్ (బి) పాండ్యా 6; విలియమ్సన్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 81; మిచెల్ (ఎల్బీ) (బి) కుల్దీప్ 17; లాథమ్ (ఎల్బీ) (బి) జడేజా 14; ఫిలిప్స్ (ఎల్బీ) (బి) వరుణ్ 12; బ్రేస్‌వెల్ (ఎల్బీ) (బి) వరుణ్ 2; సాంట్నర్ (బి) వరుణ్ 28; హెన్రీ (సి) కోహ్లి (బి) వరుణ్ 2; జేమీసన్ (నాటౌట్) 9; రూర్కే (బి) కుల్దీప్ 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (45.3 ఓవర్లలో ఆలౌట్)** 205. **వికెట్ల పతనం:** 1-17, 2-49, 3-93, 4-133, 5-151, 6-159, 7-169, 8-195, 9-196, 10-205. **బౌలింగ్:** షమీ 4-0-15-0, పాండ్యా 4-0-22-1, అక్షర్ 10-0-32-1, వరుణ్ 10-0-42-5, కుల్దీప్ 9.3-0-56-2, జడేజా 8-0-36-1.

విదర్భ తీన్మార్...

సీజన్ ఆసాంతం నిలకడ కొనసాగించిన విదర్భ జట్టు... తుదిపోరులోనూ అదే జోరు కనబరుస్తూ చాంపియన్‌గా అవతరించింది. ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా... పరాజయమే ఎరగకుండా మూడోసారి రంజీ ట్రోఫీ విజేతగా నిలిచింది. అసమాన పోరాటంతో తొలిసారి ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో ఫైనల్ చేరిన కేరళ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకోగా... దేశవాళీ టోర్నీ చరిత్రలో ఒక సీజన్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన హర్ష్ దూబేకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కింది.



మూడోసారి రంజీ ట్రోఫీ టైటిల్ సొంతం

- కేరళతో ఫైనల్ మ్యాచ్ 'డ్రా'
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విజేత ఖరారు
- రన్నరప్‌తో సరిపెట్టుకున్న కేరళ
- హర్ష్ దూబేకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు

నాగ్‌పూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో విదర్భ జట్టు విజేతగా నిలిచింది. కేరళతో జరిగిన తుదిపోరు 'డ్రా'గా ముగియడంతో... 37 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన విదర్భ జట్టుకు ట్రోఫీ దక్కింది. రంజీ ట్రోఫీలో విదర్భ జట్టు చాంపియన్‌గా అవతరించడం ఇది మూడోసారి. 2017-18, 2018-19 సీజన్‌లలో వరుసగా ట్రోఫీ చేజిక్కించుకున్న విదర్భ జట్టు... మళ్లీ ఆరేళ్ల తర్వాత టైటిల్ దక్కించుకుంది. తాజా సీజన్‌లో ఫైనల్‌తో కలిపి మొత్తం 10 మ్యాచ్‌లాడిన విదర్భ... పరాజయం లేకుండా ట్రోఫీ కైవసం చేసుకోవడం విశేషం. సుదీర్ఘ రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి ఫైనల్‌కు చేరిన కేరళ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. చాంపియన్ విదర్భ జట్టుకు రూ. 5 కోట్లు... రన్నరప్ కేరళ జట్టుకు రూ. 3 కోట్లు ప్రైజ్‌మనీగా లభించాయి.

సొంత మైదానంలో జరిగిన తుదిపోరులో ఓవర్‌నైట్ స్కోరు 249/4తో ఆదివారం ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ జట్టు... 143.5 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 375 పరుగులు చేసింది. సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (295 బంతుల్లో 135; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రితం రోజు స్కోరుకు మరో 3 పరుగులు మాత్రమే చేసి వెనుదిరిగినా... కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (108 బంతుల్లో 25), దర్శన్ నల్కండే (98 బంతుల్లో 51 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), అక్షయ్ కర్నెవార్ (70 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) పోరాడారు. ఫలితంగా విదర్భ జట్టు భారీ స్కోరు చేయగలిగింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 37 పరుగులు కలుపుకొని ఓవరాల్‌గా విదర్భ జట్టు 412 పరుగుల ముందంజలో నిలిచింది. మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్‌లు టీ విరామం కంటే ముందే 'డ్రా'కు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీతో చెలరేగిన విదర్భ బ్యాటర్ దానిశ్ మాలేవర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', హర్ష్ దూబేకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

స్కోరు వివరాలు

విదర్భ తొలి ఇన్నింగ్స్: 379; **కేరళ తొలి ఇన్నింగ్స్:** 342; **విదర్భ రెండో ఇన్నింగ్స్:** పార్థ్ రేఖడే (బి) జలజ్ సక్సేనా 1; ధ్రువ్ షోరే (సి) అజహరుద్దీన్ (బి) నిధీశ్ 5; దానిశ్ మాలేవర్ (సి) సచిన్ బేబీ (బి) అక్షయ్ చంద్రన్ 73; కరుణ్ నాయర్ (స్టంప్డ్) అజహరుద్దీన్ (బి) ఆదిత్య 135; యశ్ రాథోడ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆదిత్య సర్వతే 24; అక్షయ్ వాడ్కర్ (బి) ఆదిత్య 25; హర్ష్ దూబే (ఎల్బీడబ్ల్యూ) అధన్ టామ్ 4; అక్షయ్ కర్నెవార్ (బి) బాసిల్ 30; దర్శన్ నల్కండే (నాటౌట్) 51; నచికేత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఆదిత్య 3; యశ్ ఠాకూర్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (143.5 ఓవర్లలో 9 వికెట్లకు)** 375. **వికెట్ల పతనం:** 1-5, 2-7, 3-189, 4-238, 5-259, 6-279, 7-283, 8-331, 9-346, **బౌలింగ్:** నిధీశ్ 15-3-48-1; జలజ్ సక్సేనా 50-11-109-1; అధన్ టామ్ 14-0-57-1; ఆదిత్య సర్వతే 44.5-12-96-4; బాసిల్ 7-2-18-1; అక్షయ్ చంద్రన్ 13-2-33-1.

"గతేడాది మేం ఫైనల్లో పరాజయం పాలయ్యాం. ఈసారి అలాంటి తప్పు చేయకూడదని ముందే అనుకున్నాం. ప్రతి ఒక్కరు తమ ఆటతీరును మెరుగు పర్చుకున్నారు. దాని ఫలితమే ఈ విజయం. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో తొలి పది మందిలో నలుగురు విదర్భ ఆటగాళ్లు ఉన్నారు. సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన హర్ష్, అత్యధిక పరుగులు చేసిన యశ్ విజయాల్లో కీలక పాత్ర పోషించారు. కెప్టెన్ హోదాలో ఈసారి రంజీ ట్రోఫీ అందుకున్న క్షణాలు అద్భుతంగా అనిపించాయి. -అక్షయ్ వాడ్కర్, విదర్భ కెప్టెన్

వీసీఏ నజరానా రూ. 3 కోట్లు

మూడోసారి రంజీ టైటిల్ నెగ్గిన తమ జట్టుకు విదర్భ క్రికెట్ అసోసియేషన్ (వీసీఏ) భారీ నజరానా ప్రకటించింది. టీమ్ మొత్తానికి రూ. 3 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామని తెలిపింది. ఒకే సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసి రికార్డు నెలకొల్పిన హర్ష్ దూబేకు రూ. 25 లక్షలు... నాలుగు సెంచరీలతో అదరగొట్టిన కరుణ్ నాయర్‌కు రూ. 10 లక్షలు... ఈ రంజీ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన యశ్ రాథోడ్‌కు రూ. 10 లక్షలు... హెడ్ కోచ్ ఉస్మాన్ ఘనీకి రూ. 15 లక్షలు... అసిస్టెంట్ కోచ్ అతుల్ రనాడేకు రూ. 5 లక్షలు... ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ నితిన్ ఖురానాకు రూ. 5 లక్షలు... స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్ యువరాజ్ సింగ్ దసోంధికి రూ. 5 లక్షలు... వీడియో ఎనలిస్ట్ అమిత్ మాణిక్‌రావుకు రూ. 5 లక్షలు ప్రకటించారు.

రిత్విక్... మళ్లీ సాధించాడు

కెరీర్‌లో రెండో ఏటీపీ-250 డబుల్స్ టైటిల్ నెగ్గిన హైదరాబాద్ టెన్నిస్ ప్లేయర్



విన్నర్స్ ట్రోఫీతో రిత్విక్

సాక్షి, హైదరాబాద్: అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగి... అంచనాలకు మించి రాణించి... హైదరాబాద్ టెన్నిస్ యువతార బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ అద్భుతం చేశాడు. చిలీ దేశ రాజధాని సాంటియాగోలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ)-250 టోర్నీలో రిత్విక్ డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. లాటిన్ అమెరికాలో క్లే కోర్టులపై ఏటీపీ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ ప్లేయర్‌గా రిత్విక్ గుర్తింపు పొందాడు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో రిత్విక్ (భారత్)-నికోలస్ బరియెంతోస్ (కొలంబియా) ద్వయం 6-3, 6-2తో టాప్ సీడ్ మాక్సిమో గొంజాలెజ్-ఆండ్రెస్ మొల్తాని (అర్జెంటీనా) జోడీని బోల్తా కొట్టించి టైటిల్ దక్కించుకుంది. విజేతగా నిలిచిన రిత్విక్-బరియెంతోస్‌లకు 35,980 డాలర్ల (రూ. 31 లక్షల 47 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 24 ఏళ్ల రిత్విక్ కెరీర్‌లో ఇది రెండో ఏటీపీ-250 డబుల్స్ టైటిల్. గత ఏడాది అక్టోబర్‌లో కజకిస్తాన్‌లో జరిగిన అల్మాటీ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో భారత్‌కే చెందిన అర్జున్ ఖడేతో కలిసి రిత్విక్ తొలి డబుల్స్ టైటిల్ గెలిచాడు. తాజా టైటిల్‌తో రిత్విక్ సోమవారం విడుదలయ్యే ఏటీపీ డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ఎనిమిది స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 66వ ర్యాంక్‌ను అందుకోనున్నాడు.

11 ఏస్‌లతో మెరిసి...

63 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బరియెంతోస్ ద్వయం పూర్తి ఆధిపత్యం చలాయించింది. 11 ఏస్‌లు సంధించిన ఈ జోడీ కేవలం ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. ఫస్ట్ సర్వ్‌లోని 30 పాయింట్లకుగాను 26 పాయింట్లు... సెకండ్ సర్వ్‌లో 13 పాయింట్లకుగాను 10 పాయింట్లు ఈ జంట గెలిచింది. మ్యాచ్ మొత్తంలో ఒక్క బ్రేక్ పాయింట్ అవకాశం కూడా ఇవ్వని ఈ ఇండో-కొలంబియన్ జంట ప్రత్యర్థి ద్వయం సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. ఈ టోర్నీలో అన్‌సీడెడ్‌గా పోటీపడ్డ రిత్విక్-బరియెంతోస్ తొలి రౌండ్‌లో 7-6 (7/5), 7-6 (9/7)తో డ్రెజెవ్‌స్కీ-పీటర్ మత్సుజెవ్‌స్కీ (పోలాండ్)లపై, క్వార్టర్ ఫైనల్లో 3-6, 7-6 (7/2), 10-8తో మార్సెలో డెమోలైనర్-మార్సెలో జొర్మాన్ (బ్రెజిల్)లపై, సెమీఫైనల్లో 4-6, 7-6 (9/7), 10-5తో మూడో సీడ్ గిడో ఆంద్రెజీ (అర్జెంటీనా)-థియో అరిబెజ్ (ఫ్రాన్స్)లపై గెలుపొందారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
3-3-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,414	420
73,198	22,125

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	18,854	△	309
డోజోన్స్	43,841	△	601
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,810	△	54
డాక్స్	22,551		0
షాంఘై	3,321	▽	67
నికాయ్	37,156	▽	1,100

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	108.70	111.53
€	యూరో	ఒకటి	89.55	92.21
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.75	59.22
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.26	55.47
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.59	67.27
SAR	సౌదీ రియాల్	పదిహేను	22.35	23.91
UAE D	యూఏఈ దిర్హామ్	పదిహేను	22.93	24.71
¥	చైనా యువాన్	పదిహేను	11.15	12.97

ఫండ్స్‌లో 'సిప్' చేస్తున్నారా..?

"స్మాల్, మిడ్‌క్యాప్‌లో సిప్‌లను ఇక నిలిపేయాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నా. ఎందుకంటే వాటి వేల్యుయేషన్లు చాలా అధిక స్థాయిలో ఉన్నాయి"

మ్యూచువల్ ఫండ్స్‌లో దశాబ్దాల అనుభవం ఉన్న వెటరన్ ఫండ్ మేనేజర్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్ సీఈవో ఎస్.నరేన్ తాజాగా చేసిన సంచలనాత్మక వ్యాఖ్యలు ఇవి. దీంతో స్మాల్, మిడ్‌క్యాప్ విభాగంలో మరింత అమ్మకాల ఒత్తిడి పెరిగిపోయింది. నరేన్ వ్యాఖ్యలు ఇన్వెస్టర్లలో ఆందోళనకు దారితీశాయి. సిప్‌పై సందేహాలు ఏర్పడ్డాయి.

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈక్విటీ ఫండ్స్‌లోకి నెలవారీ రూ.26 వేల కోట్లకు పైనే పెట్టుబడులు వస్తున్నాయి. దీర్ఘకాల ఆర్థిక లక్ష్యాలకు కావాల్సినంత సమకూర్చుకునేందుకు సిప్ మెరుగైన సాధనమన్న నిపుణుల సూచనలు, ఫండ్స్ పరిశ్రమ ప్రచారంతో ఇన్వెస్టర్లలో దీనిపై ఆకర్షణ పెరిగిపోయింది. వేతన జీవులతోపాటు హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్ (హెచ్‌ఎన్‌ఐలు/ధనవంతులు) సైతం సిప్‌కు జై కొడుతున్నారు. అన్ని కాలాలకూ అనువైన సాధనంగా సిప్‌ను భావిస్తుంటే, దీనిపై నరేన్ వ్యాఖ్యలు అయోమయానికి దారితీశాయి. ఈ తరుణంలో అసలు సిప్ దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఏ మేరకు ఉపకరిస్తుంది? ఇందులో ప్రతికూలతలు ఉన్నాయా? తదితర అంశాలపై నిపుణులు ఏమంటున్నారో తెలిపే కథనమిది... – సాక్షి, బిజినెస్ డెస్క్

వెంటనే రాబడులు ఆశించొద్దు

- కనీసం 10–20 ఏళ్లు ఆగాల్సిందే..
- మార్కెట్లో పతనాలు, ర్యాలీలు సాధారణం
- పెట్టుబడి వృద్ధికి తగినంత సమయం ఇవ్వాలి
- స్వల్పకాల అస్థిరతలను పట్టించుకోనక్కర్లేదు..
- రిస్కులు విశ్లేషించిన తర్వాతే నిర్ణయం







"ఓర్పు అవసరం. విత్తిన వెంటనే ఫలాన్ని అందుకోలేరు"
- సోరెన్ కీర్కెగార్డ్ (డెన్మార్క్ తత్వవేత్త)

అనుకూలం/అననుకూలం



- 10 ఏళ్లు అంతకుమించిన కాలానికి, అవసరమైతే 20 ఏళ్లపాటు పెట్టుబడిని కొనసాగించే వెసులుబాటు ఉన్న వారికే సిప్ అనుకూలం.
- అధిక రిస్క్ తీసుకునే వారే మిడ్, స్మాల్ క్యాప్‌లో సిప్ చేసుకోవాలి.
- సిప్‌తో సగటు కొనుగోలు ధర తగ్గుతుందన్నది సాధారణంగా చెప్పే భాష్యం. కానీ, ఈక్విటీలు కొంత కాలం పాటు భారీ దిద్దుబాటు అన్నదే లేకుండా అదే పనిగా ర్యాలీ చేస్తూ వెళ్లి.. అక్కడి నుంచి భారీ పతనంతో కొన్నేళ్లపాటు బేర్ గుప్పిట కొనసాగితే రాబడులు కళ్లజూసేందుకు కొన్నేళ్లపాటు వేచి చూడాల్సి రావచ్చు.
- సిప్ మొదలు పెట్టిన తర్వాత మార్కెట్లు కుదేలైతే.. పెట్టుబడి విలువ క్షీణతను ఎంత వరకు భరించగలరు? అని ప్రశ్నించుకోవాలి. 50–60 శాతం పడిపోయినా ఓపిక వహించే వారికే అనుకూలం.
- 'ఈక్విటీ పెట్టుబడులు సబ్జెక్ట్ టు మార్కెట్ రిస్క్' అన్న హెచ్చరికను కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలి. మార్కెట్ల పనితీరు మెరుగ్గా ఉంటేనే సిప్‌పై మెరుగైన రాబడి వస్తుంది. అంతేకానీ సిప్‌పై లాభానికి గ్యారంటీ లేదు.

సిప్ అంటే..?



నిర్ణీత మొత్తం, నిర్ణీత రోజులకు ఒకసారి చొప్పున ఎంపిక చేసుకున్న పథకంలో ఇన్వెస్ట్ చేయడానికి వీలు కల్పించేదే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్). రోజు/వారం/పక్షం/నెల/మూడు నెలలకోసారి సిప్ చేసుకోవడానికి ఫండ్స్ అనుమతిస్తున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల వద్ద 10.26 కోట్ల సిప్ ఖాతాలుంటే.. వీటి పరిధిలో జనవరి చివరికి మొత్తం రూ.13.12 లక్షల కోట్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం) ఉన్నాయి. మొత్తం ఈక్విటీ ఫండ్స్ నిర్వహణ ఆస్తుల్లో సిప్‌కు సంబంధించే 40 శాతానికి పైగా ఉన్నాయి.

పొదుపు-మదుపులో క్రమశిక్షణ



సిప్‌తో నిర్బంధ పొదుపు, మదుపు సాధ్యపడుతుంది. ఇన్వెస్టర్ ప్రమేయం లేకుండా ప్రతి నెలా నిర్ణీత తేదీన నిర్ణీత మొత్తం పెట్టుబడిగా మారిపోతుంది. సిప్ కాకుండా.. ఇన్వెస్టర్ వీలు చూసుకుని ఏక మొత్తంలో పెట్టుబడి పెట్టాలంటే ఎక్కువ సందర్భాల్లో సాధ్యపడకపోవచ్చు. దీర్ఘకాల లక్ష్యాల సాధనకు కావాల్సింది క్రమశిక్షణ. అది సిప్ ద్వారా సాధ్యపడుతుంది.

దీర్ఘకాలంలో సంపద సృష్టి



10 ఏళ్లలో కారు కొనుగోలు. 15–20 ఏళ్లలో పిల్లల ఉన్నత విద్య, 25 ఏళ్లకు పిల్లల వివాహాలు, అప్పటికి సొంతిల్లు.. ఇలా ముఖ్యమైన లక్ష్యాలను ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులతో సాకారం చేసుకోవచ్చు. ఇలా ప్రతి లక్ష్యానికి నిర్ణీత కాలం అంటూ ఉంది. అన్నేళ్లలో అంత సమకూర్చుకునేందుకు ప్రతి నెలా, ప్రతి ఏటా ఎంత చొప్పున ఇన్వెస్ట్ చేయాలన్నది నిపుణుల సాయంతో తెలుసుకోవాలి. వారు చెప్పిన విధంగా.. మార్కెట్ అస్థిరతలను పట్టించుకోకుండా నియమబద్ధంగా సిప్ పెట్టుబడి చేసుకుంటూ వెళ్లిపోవడమే. దీనివల్ల కాంపౌండింగ్ ప్రయోజనం లభిస్తుంది.

కాలాతీతం..

ఈక్విటీ మార్కెట్లు ఎప్పుడు ఎటు వైపు చలిస్తాయో ఇదమిత్థంగా ఎవరూ చెప్పలేరు. ఈ స్థాయి నుంచి ఇంకా పెరుగుతాయని, ఫలానా స్థాయి నుంచి కరెక్షన్‌కు వెళతాయని.. దిద్దుబాటులో ఫలానా స్థాయిల నుంచి మద్దతు తీసుకుని తిరిగి ర్యాలీ చేస్తాయని.. గమనాన్ని ఎవరూ కచ్చితంగా అంచనా వేయలేరు. మార్కెట్లు సహేతుక స్థాయిలో దిద్దుబాటుకు గురైనప్పుడు ఇన్వెస్ట్ చేస్తే అక్కడి నుంచి దీర్ఘకాలంలో పెట్టుబడిపై అద్భుత రాబడులు వస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, దిద్దుబాటు సమయంలో ఎప్పుడు, ఏ స్థాయిల వద్ద ఇన్వెస్ట్ చేయాలనేది సాధారణ రిటైల్ ఇన్వెస్టర్లకు అర్థం కాని విషయం. లమ్సమ్ (ఏకమొత్తం) ఇన్వెస్ట్ చేస్తుంటే, ఒకవేళ మార్కెట్లు గరిష్టాల్లో ఆ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టడం సరైన నిర్ణయం అనిపించుకోదు. ఎందుకంటే అక్కడి నుంచి మార్కెట్లు పతనాన్ని చూస్తే.. రాబడి చూడడానికి చాలా కాలం పట్టొచ్చు. విసిగిపోయిన ఇన్వెస్టర్ నష్టానికి తన పెట్టుబడిని వెనక్కి తీసుకునే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి సమస్యలన్నింటికీ పరిష్కారమే సిప్.



మార్కెట్ ర్యాలీ చేస్తోందా? లేక పతనం అవుతోందా? అన్నదానితో సంబంధం లేదు. ఒక పథకంలో ప్రతి నెలా 1వ తేదీన రూ.5,000 ఇన్వెస్ట్ చేయాలని సిప్ దరఖాస్తు సమర్పిస్తే.. కచ్చితంగా ప్రతి నెలా అదే తేదీన బ్యాంక్ ఖాతా నుంచి ఆ మొత్తం డెబిట్ అయి పెట్టుబడి కింద మారుతుంది. దీనివల్ల కొనుగోలు వ్యయం సగటుగా మారుతుంది. ఉదాహరణకు ఎఫ్ అనే పథకంలో రూ.2,000 సిప్ చేస్తున్నారు. ఆ ఫండ్ యూనిట్ ఎన్ఏవీ 2025 జనవరి 1న రూ.40గా ఉంది. దీంతో 50 యూనిట్లు వస్తాయి. ఫిబ్రవరి 1కి కరెక్షన్ వల్ల అదే ఫండ్ ఎన్ఏవీ 34కు తగ్గింది. దీంతో 58.82 యూనిట్లు వస్తాయి. జనవరి నెల సిప్‌తో పోల్చితే ఫిబ్రవరిలో దిద్దుబాటు వల్ల 8.82 యూనిట్లు అదనంగా వచ్చాయి. మార్చి1న ఫండ్ యూనిట్ ఎన్ఏవీ ఇంకా తగ్గి రూ.32కు దిగొస్తే.. అప్పుడు 62.5 యూనిట్లు వస్తాయి. ఈక్విటీ విలువల్లో మార్పులకు అనుగుణంగా ఫండ్ ఎన్ఏవీ మారుతుంటుంది. దీనికి అనుగుణంగా సిప్ కొనుగోలు సగటు ధర తగ్గుతుంది. దీనివల్ల 10–15–20 ఏళ్లు అంతకుమించిన కాలాల్లో మంచి రాబడులకు అవకాశం ఉంటుందని గత చరిత్ర చెబుతోంది.

స్వల్ప మొత్తం...



చాలా పథకాల్లో ఏకమొత్తంలో పెట్టుబడి పెట్టాలంటే కనీసం రూ.5,000 అవసరం, కొన్ని పథకాలకు ఇది రూ.1,000గా ఉంది. అదే సిప్ రూపంలో అయితే రూ.500 స్వల్ప మొత్తంతో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఇటీవలే రూ.250 సిప్‌ను (జన్‌నివేష్) ప్రారంభించింది. రోజువారీ/వారం వారీ అయితే రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

సౌలభ్యం..



సిప్ కోసం సమ్మతి తెలిపామంటే.. కచ్చితంగా పెట్టుబడి పెట్టి తీరాలనేమీ లేదు. వీలు కానప్పుడు, లేదా పథకం పనితీరు ఆశించిన విధంగా లేనప్పుడు ఆ సిప్‌ను నిలిపివేసే స్వేచ్ఛ, వెసులుబాటు ఇన్వెస్టర్లకు ఎప్పుడూ ఉంటుంది.

కేవలం ఈక్విటీలకేనా..?

సిప్ ప్రయోజనం ఎక్కువగా ఈక్విటీ పెట్టుబడులపైనే లభిస్తుంది. డెట్ పెట్టుబడులపై రాబడి వడ్డీ రేట్లపై ఆధారపడి ఉంటుంది. ఈ వడ్డీ రేట్లు ఈక్విటీలంత చంచలంగా ఉండవు. నిర్ణీత సైకిల్ ప్రకారం రేట్లు చలిస్తుంటాయి. డెట్ ఫండ్స్‌లోనూ సిప్ చేసుకోవచ్చు. దీనివల్ల ఈక్విటీల మాదిరి అస్థిరతలను అధిగమించి, రాబడులు పెంచుకునే ప్రత్యేక ప్రయోజనం ఉండదు. డెట్, ఈక్విటీ కలయికతో కూడిన హైబ్రిడ్ ఫండ్స్, ఈక్విటీ ఫండ్స్, గోల్డ్ ఫండ్స్‌లో సిప్‌తో మెరుగైన ప్రతిఫలం పొందొచ్చు.

మార్కెట్‌తో ముడిపడి..

ప్రతి నెలా రూ.1,000 చొప్పున గత ఐదేళ్లలో రూ.60 వేలు ఈక్విటీ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. ఏటా 15 శాతం కాంపౌండెడ్ రాబడి వస్తే ఐదేళ్లకు ఆ మొత్తం రూ.90 వేలకు చేరుతుంది. సరిగ్గా ఆ సమయంలో మార్కెట్ 25 శాతం పడిపోయిందనుకుంటే.. రూ.90 వేల పెట్టుబడి కాస్తా.. రూ.67,500కు తగ్గుతుంది. నికర రాబడి రూ.7,500కు తగ్గిపోతుంది. దీంతో వచ్చే వార్షిక కాంపౌండెడ్ రాబడి 4.5 శాతమే. డెట్ సెక్యూరిటీల కంటే తక్కువ. చారిత్రక డేటాను పరిశీలిస్తే లార్జ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌లోనూ పలు సందర్భాల్లో ఐదేళ్ల సిప్ రాబడులు 5 శాతం కాంపౌండెడ్‌గానే (సీఏజీఆర్) ఉన్నట్టు తెలుస్తుంది. ప్రతికూల రాబడులు వచ్చిన సందర్భాలూ ఉన్నాయి. అదే మిడ్, స్మాల్‌క్యాప్ పెట్టుబడులపై ఈ ప్రభావం ఇంకా అధికంగా ఉంటుంది.

అధిక రాబడులు ఎలా ఒడిసిపట్టాలి..?



సిప్ చేస్తూనే.. మార్కెట్ పతనాల్లో పెట్టుబడిని రెట్టింపు చేయాలి. ఉదాహరణకు ప్రతి నెలా రూ.5,000 సిప్ చేస్తుంటే.. మార్కెట్ దిద్దుబాటు సమయంలో రూ.10,000 చొప్పున ఇన్వెస్ట్ చేయాలి. దిద్దుబాటు ముగిసి, బుల్ ర్యాలీ మొదలైన తర్వాత అదనపు సిప్‌ను నిలిపివేసుకోవచ్చు. 10 ఏళ్లకు మించిన సిప్ పెట్టుబడులపై రాబడిని స్వల్ప స్థాయి కరెక్షన్లు తుడిచి పెట్టేయలేవు. అదే 15–20 ఏళ్లు, అంతకుమించిన దీర్ఘకాలంలో రాబడులు మరింత దృఢంగా ఉంటాయి. ఒకవేళ పెట్టుబడిని ఉపసంహరించుకునే సమయంలో మార్కెట్ కరెక్షన్‌లోకి వెళితే, తిరిగి కోలుకునే వరకు లక్ష్యాన్ని వాయిదా వేసుకోవడమే మార్గం. ఇలాంటి పరిస్థితిని నివారించాలంటే.. ఆర్థిక లక్ష్యానికి రెండేళ్ల ముందు నుంచే క్రమంగా సిప్ పెట్టుబడులను విక్రయిస్తూ డెట్‌లోకి పెట్టుబడులు మళ్లించాలి. చివరి మూడేళ్ల పాటు ఈక్విటీ పథకంలో కాకుండా డెట్ ఫండ్‌లో సిప్ చేసుకోవాలి.

ప్రత్యామ్నాయాలు..

పెట్టుబడులు అన్నింటినీ ఈక్విటీలకు కేటాయించుకోకూడదు. ఈక్విటీ, డెట్, బంగారం, రీట్, ఇన్విట్‌లతో కూడిన పోర్ట్‌ఫోలియో ఉండాలి. ఈక్విటీ ఫండ్స్, డెట్ ఫండ్స్, గోల్డ్ ఫండ్స్‌లో వేర్వేరుగా పెట్టుబడి పెట్టుకోవాలి. ఆర్థిక ప్రతికూల పరిస్థితుల్లో పెట్టుబడుల ఉపసంహరణ అవసరమైతే ఈక్విటీ పెట్టుబడులను కదపకుండా.. డెట్, గోల్డ్ తదితర ఫండ్స్ నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకోవచ్చు.

సిప్ ఎప్పుడు స్టాప్ చేయాలి?



- ఒక పథకం గతంలో మెరుగైన రాబడి ఇచ్చిందని అందులో ఎక్కువ మంది ఇన్వెస్ట్ చేస్తుంటారు. భవిష్యత్తులోనూ అదే స్థాయి రాబడిని ఆ పథకం నుంచి ఆశిస్తుంటారు. ఒక పథకం 3, 5, 10 ఏళ్లలో సగటున మెరుగైన ప్రతిఫలం ఇచ్చి ఉండొచ్చు. కానీ ఆయా కాలాలను మరింత లోతుగా విశ్లేషిస్తే మధ్యలో ఒక్కో ఏడాది తక్కువ, ప్రతికూల రాబడులు ఇచ్చిన సందర్భాలూ ఉంటాయి. సిప్ మొదలు పెట్టిన తొలి ఏడాదే రాబడిని ఆశించడం అన్ని వేళలా అనుకూలం కాదు. కనీసం రెండు మూడేళ్లకు గానీ పథకం అసలు పనితీరు విశ్లేషణకు అందదు. అందుకే ఒక పథకం ఎంపిక చేసుకునే ముందు.. ఆ విభాగంలోని ఇతర పథకాలతో పోల్చి చూసినప్పుడు రాబడి మెరుగ్గా ఉందా? కనీసం సమానంగా అయినా ఉందా అన్నది నిర్ధారించుకోవాలి.
- ఒక ఫండ్ మేనేజర్ పనితీరు నచ్చి పథకంలో సిప్ చేయడం మొదలు పెట్టారు. తర్వాతి కాలంలో ఆ మేనేజర్ మరో సంస్థకు మారిపోయారు. అప్పుడు కొత్తగా వచ్చిన ఫండ్ మేనేజర్ చరిత్రను ట్రాక్ చేయాలి.
- పై రెండు ఉదాహరణల్లోనూ పథకం పనితీరు ఆశించిన విధంగా లేకపోతే సిప్ నిలిపివేయొచ్చు.

నరేన్ ఏం చెబుతున్నారు?



అర్థం, పర్థం లేని అధిక విలువలకు చేరిన అస్సెట్ క్లాస్‌లో (అది స్మాల్ లేదా మిడ్ లేదా మరొకటి అయినా) ఇన్వెస్ట్ చేస్తే ఆ తర్వాత కొన్నేళ్ల పాటు ఆ సిప్‌లపై రాబడి రాదన్నది నరేన్ విశ్లేషణగా ఉంది. ఇందుకు 2006 నుంచి 2013 మధ్య కాలాన్ని ప్రస్తావించారు. ఆ కాలంలో స్మాల్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో సిప్ చేసిన వారికి ఎలాంటి రాబడులు రాలేదని చెప్పారు. కనీసం 20 ఏళ్లపాటు తమ పెట్టుబడులను కొనసాగించే వారికే స్మాల్, మిడ్‌క్యాప్ పెట్టుబడులకు మంచి వేదికలు అవుతాయన్నారు. అంతకాలం పాటు ఆగలేని వారికి మల్టీక్యాప్ ఫండ్స్, హైబ్రిడ్ ఫండ్స్ లేదా మల్టీ అస్సెట్ ఫండ్స్ అనుకూలమని చెప్పారు.

నరేన్ అభిప్రాయాలతో ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ సీఈవో రాధికా గుప్తా విభేదించారు. "2006 గరిష్టాల నుంచి 2013 కనిష్టాల మధ్య రాబడులను చూస్తే అంత మంచిగా కనిపించవు. కానీ, మార్కెట్లో అలాంటివి సాధారణమే. మార్కెట్లో సంపద సృష్టి జరగాలంటే కనీసం 10 ఏళ్లు అంతకుమించిన కాలానికి సిప్ ద్వారా పెట్టుబడి పెట్టుకోవడం అవసరం" అని రాధికా గుప్తా సూచించారు.

ప్రతికూల రాబడులు



ఇటీవలి మార్కెట్ పతనంతో 26 స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఏడాది కాల సిప్ పెట్టుబడులపై రాబడి ప్రతికూలంగా మారింది. అంటే నికర నష్టంలోకి వెళ్లింది. క్వాంట్ స్మాల్‌క్యాప్ ఫండ్‌లో సిప్ పెట్టుబడిపై ఎక్స్ఐఆర్ఆర్ (రాబడి) మైనస్ 22.45 శాతంగా మారింది. మహీంద్రా మాన్యులైఫ్ స్మాల్‌క్యాప్ ఫండ్‌లో మైనస్ 21.84 శాతంగా మారింది. ఫ్రాంక్లిన్ ఇండియా స్మాలర్ కంపెనీస్ ఫండ్ ఎక్స్ఐఆర్ఆర్ మైనస్ 18.25 శాతంగా ఉంది. ఇవే పథకాలు రెండేళ్లు, మూడేళ్లు, ఐదేళ్ల సిప్‌లపై డబుల్ డిజిట్ రాబడులు అందించడం గమనార్హం.

దశాబ్దాల పాటు కుదేలైతే..?



జపాన్ 'నికాయ్ 225' ఇండెక్స్ 1989 డిసెంబర్‌లో చూసిన 38,271 గరిష్ట స్థాయి నుంచి 2009 ఫిబ్రవరిలో 7,416 కనిష్ట స్థాయికి పతనమైంది. నెమ్మదిగా కోలుకుంటూ 35 ఏళ్ల తర్వాత.. 2024 మార్చిలో తిరిగి 1989 నాటి గరిష్ట స్థాయిని అధిగమించింది. రియల్ ఎస్టేట్ బబుల్ బద్దలు కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. 1989 డిసెంబర్ నాటి ముందు వరకు సిప్ లేదా లమ్సమ్ రూపంలో జపాన్ స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసుకుని, దీర్ఘకాలం పాటు వేచి చూసే అవకాశం లేని వారు.. ఆ తర్వాత నష్టానికి అమ్ముకోవాల్సిన పరిస్థితిలో ఉండిపోయారు. స్టాక్ మార్కెట్ ర్యాలీ ఆర్థిక వృద్ధిపైనే ఆధారపడి ఉంటుంది. జపాన్ ఆర్థిక వ్యవస్థ దీర్ఘకాలం పాటు స్తబ్దుగా కొనసాగడం వల్లే ఇన్నేళ్లపాటు అక్కడి మార్కెట్ ర్యాలీ చేయలేదు. ప్రస్తుతం చైనాలోనూ ఇలాంటి వాతావరణమే నడుస్తోంది. అలాంటి పరిస్థితులు భారత్ మాదిరి వర్ధమాన దేశాలకు అరుదు.

చైనాలో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్ ఉన్నాయా?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్





పెట్టుబడుల్లో 50 శాతం నుంచి 60 శాతం మేర స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా..?
– శివకుమార్

ఈక్విటీల్లో దీర్ఘకాల పెట్టుబడులకు పదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం సరైనది. అయితే 50–60 శాతం పెట్టుబడులను మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్‌లో ఇన్వెస్ట్ చేసే ఫండ్స్‌తో పోర్ట్‌ఫోలియో నిర్మించుకోవడం సూచనీయం కాదు. దీనికి బదులు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిది. ఇలా చేస్తే మిడ్, స్మాల్‌క్యాప్ పెట్టుబడులు 25–30 శాతానికి పరిమితం అవుతాయి. లార్జ్‌క్యాప్ పెట్టుబడులు 70 శాతం మేర ఉంటాయి. వృద్ధికితోడు, స్థిరత్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. రిస్క్ ఎక్కువగా ఉండే సాధనాలకు తక్కువ కేటాయింపులు చేసుకోవాలి. మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ అనేవి దీర్ఘకాలంలో ఫ్లెక్సీక్యాప్ కంటే ఎక్కువ రాబడులను ఇస్తాయి. కానీ, స్వల్పకాలంలో తీవ్ర అస్థిరతల మధ్య చలిస్తాయి. కనుక వీటిల్లో రిస్క్ చాలా ఎక్కువగా ఉంటుంది. వీటికి 50–60 శాతం కేటాయింపులు చేయడం వల్ల పెట్టుబడుల్లో అధిక భాగం అస్థిరతలకు గురవుతుంది.

చైనా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టాలని ఉంది. ఇందుకు ఏవైనా మ్యూచువల్ ఫండ్స్ పథకాలు అందుబాటులో ఉన్నాయా? – యోగితా రాణా

ఈక్విటీ పెట్టుబడులను భౌగోళికంగా వైవిధ్యం చేసుకోవాలన్న మీ ఆలోచన అభినందనీయం. అయితే ఈ వైవిధ్యం కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకూడదు. కేవలం చైనాలో ఇన్వెస్ట్ చేసేవి లేదా కేవలం యూఎస్‌లో ఇన్వెస్ట్ చేసే వాటితో కాన్సన్‌ట్రేషన్ రిస్క్ (పెట్టుబడి ఒకే చోట ఉండిపోవడం) ఏర్పడుతుంది. విదేశాల్లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే అది చక్కటి వైవిధ్యంతో ఉండాలి. ఇన్వెస్టర్లు కేవలం ఒకే ప్రాంతంలో ఇన్వెస్ట్ చేసే వాటికి దూరంగా ఉండడం మంచిది. యూఎస్ ఫండ్స్‌కు ఇందులో కొంత మినహాయింపు ఉంది. యూఎస్‌కు చెందిన అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల్లో అవి ఇన్వెస్ట్ చేస్తుంటాయి. యూఎస్ కంపెనీలను పరిశీలిస్తే అవి కేవలం యూఎస్‌కే పరిమితం కాకపోవడాన్ని గుర్తించొచ్చు. ముఖ్యంగా టెక్నాలజీ దిగ్గజ కంపెనీలకు (గూగుల్, మెటా, యాపిల్ తదితర) అంతర్జాతీయంగా కస్టమర్లు ఉంటారు. ఆయా కస్టమర్లు కేవలం యూఎస్‌లోనే ఉండరు. కనుక యూఎస్‌కు చెందిన ఫండ్ ఒకే ప్రాంతానికి చెందినది అయినప్పటికీ, అంతర్జాతీయ ఎక్స్‌పోజర్‌ను ఇస్తుంది. ఇన్వెస్టర్లు తమ మొత్తం పెట్టుబడుల్లో 5–10% మించకుండా చైనా స్టాక్స్‌కు కేటాయించుకునేట్టు అయితే.. యాక్సిస్ గ్రేటర్ చైనా ఈక్విటీ ఎఫ్ఓఎఫ్ డైరెక్ట్ ఫండ్, ఎడెల్‌వీజ్ గ్రేటర్ చైనా ఈక్విటీ ఆఫ్‌షోర్ డైరెక్ట్, మిరే అస్సెట్ హ్యాంగ్‌సెంగ్ టెక్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్ డైరెక్ట్, మిరే అస్సెట్ హ్యాంగ్‌సెంగ్ టెక్ ఈటీఎఫ్, నిప్పాన్ ఇండియా ఈటీఎఫ్ హ్యాంగ్‌సెంగ్ బీస్ పథకాలు అందుబాటులో ఉన్నాయి.

యాక్సిస్ 'బాండ్ ఇండెక్స్ ఫండ్'

యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా యాక్సిస్ నిఫ్టీ ఏఏఏ బాండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ – మార్చ్ 2028 ఇండెక్స్ ఫండ్‌ను ప్రవేశ పెట్టింది. ఇది, నిఫ్టీ ఏఏఏ ఫైనాన్షియల్ సర్వీసెస్ బాండ్ మార్చ్ 2028 ఇండెక్స్‌లోని సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసే ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్. ఒక మోస్తరు వడ్డీ రేటు రిస్కు, మిగతా సాధనాలతో పోలిస్తే తక్కువ క్రెడిట్ రిస్కు ఉంటుంది. దీనికి ఫండ్ మేనేజరుగా హార్దిక్ షా వ్యవహరిస్తారు. ఈ న్యూ ఫండ్‌కి నిఫ్టీ ఏఏఏ ఫైనాన్షియల్ సర్వీసెస్ బాండ్ మార్చ్ 2028 ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుంది. కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఎలాంటి ఎగ్జిట్ లోడ్ ఉండదు. మార్చ్ 4 వరకు ఎన్ఎఫ్ఓ అందుబాటులో ఉంటుంది. ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగంలో అత్యంత నాణ్యమైన, ఏఏఏ-రేటింగ్ ఉన్న సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ఈ కొత్త స్కీము అవకాశం కల్పిస్తుందని యాక్సిస్ ఏఎంసీ ఎండీ – సీఈవో బి. గోప్‌కుమార్ తెలిపారు. రిస్కులు, రాబడుల మధ్య సమతౌల్యాన్ని కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైనదిగా ఉంటుందని వివరించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టారిఫ్‌లు, ప్రపంచ పరిణామాలే దిక్సూచి! | కస్టమర్ ఖాతాలోకి 81 లక్షల కోట్ల డాలర్లు!!

అంబర్ ఎంటర్‌ప్రైజెస్ — బ్రోకరేజ్: బీఎన్‌పీ పారిబా ఇండియా — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 5,627 టార్గెట్: రూ. 8,510

ఎందుకంటే: ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీ దిగ్గజం అంబర్ ఎంటర్‌ప్రైజెస్ ఈ ఏడాది అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో ఆదాయం, మార్జిన్లరీత్యా పటిష్ట ఫలితాలు సాధించింది. వేసవి సీజన్ ముందున్న నేపథ్యంలో ఆదాయ వృద్ధి కొంత మందగించవచ్చు. అయితే సమీకృత బీటూబీ సంస్థగా మార్పులకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో వ్యవస్థాగతంగా సానుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. అధిక టీఏఎం, మెరుగైన మార్జిన్లు, అత్యుత్తమ ఆర్‌వోఈకుతోడు భారీ ఆర్జనకు అవకాశముంది. కమర్షియల్ ఏసీల విభాగంలో కంపెనీ పటిష్టపడుతోంది. ఇటీవల కొత్త కస్టమర్‌ను ఆకట్టుకుంది. క్యూ3 ఫలితాల విడుదల సందర్భంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25)లో ఆదాయం, నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లలో వృద్ధిని కంపెనీ యాజమాన్యం అంచనా వేసింది. ఇందుకు బలపడిన ఆర్డర్‌బుక్‌సహా.. పునరుత్పాదక ఇంధన విభాగంలో కొత్త కస్టమర్లు, పీసీబీఏ విభాగంలో వాణిజ్య వాహనాలు, డిఫెన్స్ నుంచి డిమాండు దోహదపడనున్నట్లు పేర్కొంది. కంపెనీ ప్రస్తుతం కొత్త పరికరాల తయారీలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకం కోసం ఎదురుచూస్తోంది. దీనికి అనుగుణంగా కొరియన్ భాగస్వామ్య కంపెనీ(జేవీ) ద్వారా విస్తరణకు తెరతీయనుంది. పీఎల్ఐ పథకానికి అనుగుణంగా పెట్టుబడులను చేపట్టే యోచనలో ఉంది. యాసెంట్ సర్క్యూట్ల కన్సాలిడేషన్ కారణంగా ఎలక్ట్రానిక్స్ విభాగం ఆదాయంలో వృద్ధి నమోదుకాగలదని యాజమాన్యం భావిస్తోంది. కంపెనీకి కీలకమైన పీసీబీఏ బిజినెస్ ఇందుకు మద్దతివ్వనున్నట్లు అంచనా వేస్తోంది. యాసెంట్ సర్క్యూట్ల తయారీ కోసం చేపట్టిన హోసూరు ప్లాంటు విస్తరణ.. ప్రణాళికలకు అనుగుణంగా కొనసాగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2025–26) చివరి త్రైమాసికానికల్లా(క్యూ4) ప్లాంటు ఉత్పత్తికి సిద్ధంకాగలదని కంపెనీ అంచనా వేస్తోంది.



జేకే సిమెంట్ — బ్రోకరేజ్: ఇన్‌క్రెడ్ ఈక్విటీస్ — హోల్డ్

ప్రస్తుత ధర: రూ. 4,396 టార్గెట్: రూ. 4,900

ఎందుకంటే: ఈ ఏడాది(2024–25) క్యూ3లో ప్రయివేట్ రంగ కంపెనీ జేకే సిమెంట్ గ్రే సిమెంట్ అమ్మకాల పరిమాణం వార్షికంగా 4 శాతం పుంజుకుంది అక్టోబర్– డిసెంబర్‌లో 4.87 మిలియన్ టన్నులను తాకింది. విస్తరణ నేపథ్యంలో ప్రధానంగా మధ్యభారత ప్రాంతంలో అమ్మకాలు బలపడ్డాయి. ధరలతోపాటు.. ప్రీమియం ప్రొడక్టుల విక్రయాలు(16 శాతం) పుంజుకోవడంతో గ్రే సిమెంట్‌కు మెరుగైన ధరలు లభిస్తున్నట్లు తెలియజేసింది. జేకే సిమెంట్ వర్క్స్(ఫుజైరా) రికవర్ కావడంతో వైట్ సిమెంట్ అమ్మకపు ధరలు సైతం బలపడ్డాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 1,900 కోట్ల పెట్టుబడి వ్యయాలు వెచ్చిస్తోంది. తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) రూ. 1,400 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26)లోనూ మరో రూ. 1,900 కోట్ల పెట్టుబడులు వెచ్చించనుంది. ఇటీవలే కొనుగోలు చేసిన సైఫ్‌కో సిమెంట్స్‌పై ఈ నిధుల్లో రూ. 170 కోట్లు వినియోగించనుంది. జేఅండ్‌కేలోగల ఈ ప్లాంటు వార్షిక సామర్థ్యం 0.42 మిలియన్ టన్నులు(ఎంటీపీఏ). విస్తరణ పనుల నేపథ్యంలో 2026కల్లా 6 మిలియన్ టన్నుల గ్రే సిమెంట్ తయారీ సామర్థ్యం జత కలవనున్నట్లు కంపెనీ అంచనా. దీంతో మొత్తం సామర్థ్యం 30 ఎంటీపీఏకు చేరనుంది. తదుపరి దశలో 2030కల్లా సిమెంట్ తయారీ సామర్థ్యాలను 50 ఎంటీపీఏకు పెంచుకునే ప్రణాళికల్లో ఉంది. భవిష్యత్‌లో రాజస్తాన్(జైసల్మేర్), కర్ణాటక(ముద్దోల్), మధ్యప్రదేశ్(పన్నా), ఒడిషా(టొషాలి)లో విస్తరణకు వీలుంది. పటిష్ట డిమాండ్, ఉత్తమ ధరలకు వీలున్న ప్రాంతాలలో కంపెనీ విస్తరిస్తుండటం సానుకూల అంశంగా భావిస్తున్నాం. అయితే ప్రస్తుతం టన్నుకి ఎకనామిక్ విలువ(ఈవీ/టన్ను) ఆధారంగా చూస్తే షేరు ధరలో భారీ వృద్ధికి అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో పరిమిత టార్గెట్ ధరను అంచనా వేస్తున్నాం.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



యాదగిరి క్షేత్రంలో ధ్వజారోహణం

వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన ఆదివారం ఉదయం ఆలయ ఉత్తర మాడ వీధిలో ఏర్పాటు చేసిన యాగశాలలో అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ముఖ మండపంలోని ధ్వజ స్తంభం వద్ద ధ్వజారోహణం వేడుకను పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం చేపట్టారు. వేద మంత్రాలు, భాజాభజంత్రీలతో గరుత్మంతుడిని చిత్రీకరించిన పటాన్ని ధ్వజస్తంభానికి కట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన గరుడ ముద్దలను గరుత్మంతుడి పటం చెంత ధ్వజ స్తంభం పైకి ఎగుర వేసే పూజలు చేపట్టారు. ఈ గరుడ ప్రసాదం తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఇక రాత్రికి ఆలయంలో నిత్య పూజలు చేపట్టి, భేరీ పూజ నిర్వహించారు. అనంతరం ఉత్సవాలకు 33 కోట్ల దేవతలను మంత్రపూర్వకంగా ఆహ్వానించే పూజను చేశారు. ఆయా వేడుకల్లో అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు, డీఈఓ భాస్కర్‌శర్మ, అధికారులు, ఆచార్యులు, రుత్వికులు, పారాయణీకులు పాల్గొన్నారు. కాగా సోమవారం నుంచి ఆలయంలో శ్రీస్వామికి ఇష్టమైన వాహనాలపై అలంకార సేవలను ఆచార్యులు ప్రారంభించనున్నారు.



విమానం మిస్సవుతుందనే భయం లేదు. నిశ్చింతగా బయలుదేరవచ్చు. గంటల తరబడి క్యూలైన్లలో పడిగాపులు కాయాల్సిన అవసరం లేదు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఇమిగ్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫాస్ట్ ట్రాక్ ఇమిగ్రేషన్ - ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీఐ-టీటీపీ) హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సత్ఫలితాలిస్తోంది. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా విదేశాలకు క్రమం తప్పకుండా ప్రయాణించేవారికి ఇది ఎంతో ఉపయోగపడుతోంది. సాధారణ ఇమిగ్రేషన్ క్యూలైన్‌లకు వెళ్లవలసిన అవసరం లేకుండా ఫాస్ట్‌ట్రాక్ ఇమిగ్రేషన్ ప్రయాణికుల కోసం ప్రత్యేకంగా ప్రవేశ, నిష్క్రమణ ఈ-గేట్‌లను ఏర్పాటు చేశారు.

- సాక్షి, హైదరాబాద్

ఈజీగా ఇంటర్నేషనల్ జర్నీ

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజూ సుమారు 70 వేల మందికి పైగా డొమెస్టిక్ (దేశీయ), ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ) ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో 10 వేల మందికి పైగా విదేశాలకు వెళ్లి వచ్చేవారు ఉన్నారు. వీరిలో తరచూ ప్రయాణించేవారికి ఈ ఫాస్ట్‌ట్రాక్ విధానం ఎంతో ఉపయుక్తంగా ఉంది. టూరిస్టులు, రెండుమూడేళ్లకోసారి విదేశీ ప్రయాణం చేసేవాళ్లు ఈ సేవలను వినియోగించుకోలేరని, తరచూ రాకపోకలు సాగించే నమ్మకమైన ప్రయాణికుల కోసమే

నమ్మకమైన ప్రయాణికుల కోసమే..

దీనిని అందుబాటులోకి తెచ్చామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారి ఒకరు తెలిపారు. 'ఇది భారతీయ పాస్ట్‌పోర్ట్‌లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డులు కలిగిన వాళ్ల కోసం ప్రవేశపెట్టిన సాంకేతిక వ్యవస్థ. ఇమిగ్రేషన్ చెక్ కోసం క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను ముగించి రాకపోకలు సాగించవచ్చు'అని ఆయన చెప్పారు. ఇప్పటివరకు 500 మందికి పైగా ఎఫ్‌టీఐ–టీటీపీలో వివరాలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రోజూ 10 – 15 మంది వరకు ఈ సేవలను వినియోగించుకుంటున్నారని, రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. వీరికోసం ప్రత్యేకంగా 8 గేట్లను వినియోగిస్తున్నామని తెలిపారు.

సత్ఫలితాలిస్తున్న ఫాస్ట్‌ట్రాక్ ఇమిగ్రేషన్

- క్యూలో పడిగాపులు లేకుండా చెక్ ఇన్
- తరచూ విదేశాలకు వెళ్లివచ్చేవారి కోసం ప్రారంభం
- వీరికోసం ప్రత్యేకంగా ఈ-గేట్‌ల ఏర్పాటు

ఫాస్ట్‌ట్రాక్ ఇమిగ్రేషన్ వ్యవస్థను ఉపయోగించుకోవాలంటే www.ftittp.mha.gov.in వెబ్‌సైట్‌లో ప్రయాణికులు తమ వివరాలు నమోదు చేసుకోవాలి. పాస్‌పోర్ట్ కనీసం 6 నెలల చెల్లుబాటును కలిగి ఉండాలి. దరఖాస్తు సమయంలోనే పాస్‌పోర్ట్‌ను అప్‌లోడ్ చేసి, ఇతర అన్ని వివరాలు నమోదు చేయాలి. భద్రతాపరమైన తనిఖీల

దరఖాస్తు ఇలా..

అనంతరం ఎఫ్‌టీఐ–టీటీపీ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఈ సమాచారాన్ని ఇమిగ్రేషన్ బ్యూరో పరిశీలించి ఆమోదిస్తే, ఆ సమాచారం ప్రయాణికుల మొబైల్ ఫోన్‌కు ఎస్సెమ్మెస్ రూపంలో వస్తుంది. ఈ మెయిల్‌కు కూడా సందేశం వస్తుంది. వేలిముద్రలు, ఫొటో వంటి బయోమెట్రిక్ వివరాలను నమోదు చేసేందుకు ఎయిర్‌పోర్టులోని ప్రత్యేక కౌంటర్లలో సంప్రదించవలసి ఉంటుందని అధికారులు తెలిపారు.

సేవలు ఇలా..



- ఫాస్ట్‌ట్రాక్ ఇమిగ్రేషన్ సదుపాయం కలిగిన ప్రయాణికులు వీసా తనిఖీ పూర్తయిన తరువాత బోర్డింగ్ పాస్ కోసం రిజిస్టర్డ్ ప్యాసింజర్ చెక్-ఇన్ కౌంటర్‌లో సంప్రదించాలి.
- బోర్డింగ్ పాస్ తీసుకున్న తరువాత ఇమిగ్రేషన్ కోసం వీరికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ-గేట్‌ల వద్దకు వెళ్లాలి.
- మొదటి గేట్ వద్ద పాస్‌పోర్ట్, బోర్డింగ్ పాస్ స్కానింగ్ పూర్తవుతుంది. దీంతో రెండో ఈ-గేట్‌కు అనుమతి లభిస్తుంది.
- రెండో ఈ-గేట్ వద్ద ప్రయాణికుడి ముఖాన్ని స్కాన్ చేస్తారు. ధ్రువీకరణ అనంతరం ఇమిగ్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

ప్రయోజనాలు ఇవీ..



- సాధారణ ఇమిగ్రేషన్ ప్రక్రియలో వివిధ దేశాలకు వెళ్లే ప్రయాణికులంతా ఒకే క్యూలైన్‌లో వెళ్లవలసి ఉంటుంది. అందువల్ల ఎక్కువ సమయం పడుతుంది. ఒక్కోసారి అంతర్జాతీయ ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే గంటకు పైగా పడిగాపులు తప్పవు.
- అంతర్జాతీయ ప్రయాణికులు విమానం బయలుదేరడానికి 3 గంటల ముందే ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలి. ఆ తరువాత సంబంధిత ఎయిర్‌లైన్స్‌లో క్యూలో వేచి ఉండి బోర్డింగ్ పాస్ తీసుకోవాలి. అదే సమయంలో లగేజ్ చెక్ -ఇన్ ఉంటుంది. ఆ తరువాత వరుసగా భద్రతా తనిఖీలు, ఇమిగ్రేషన్ లైన్‌లలోకి వెళ్లాలి. ఈ ప్రక్రియ పూర్తవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఎఫ్‌టీఐ టీటీపీ వ్యవస్థలో ముందే వివరాలు నమోదు చేసుకోవడం వల్ల సాధారణ భద్రతా తనిఖీల అనంతరం నేరుగా ఈ-గేట్ ద్వారా ఇమిగ్రేషన్ పూర్తి చేసుకొని వెళ్లవచ్చు. డిజియాత్ర మొబైల్ యాప్ ఉన్న ప్రయాణికులు బోర్డింగ్‌పాస్‌ను ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు.

పుస్తకాలతో కుస్తీ



రాత్రిపగలూ ప్రిపరేషన్‌లోనే ఇంటర్, టెన్త్ విద్యార్థులు

- 5 నుంచి ఇంటర్, 21 నుంచి పది పరీక్షలు మొదలు
- పిల్లల చదువుల కోసం తల్లిదండ్రుల నిద్ర త్యాగం
- స్కూళ్లు, కాలేజీల్లో స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్, పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయం దగ్గరపడటంతో విద్యార్థులు నిద్రాహారాలు మాని పుస్తకాలతో కుస్తీలు పడుతున్నారు. పిల్లల పరీక్షలపైనే తల్లిదండ్రులు దృష్టి పెట్టారు. హాస్టళ్లలో రాత్రింబవళ్లూ స్టడీ అవర్స్ నడుస్తున్నాయి. ప్రైవేటు కాలేజీలు, స్కూళ్ల హాస్టల్స్‌లో విద్యార్థులను చదివించడం కోసం ప్రత్యేక సిబ్బంది పని చేస్తున్నారు.

విస్తృతంగా స్టడీ మెటీరియల్స్

ఈ నెల 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు మొదలవుతున్నాయి. మొదటి, రెండో సంవత్సరం కలిపి 9,96,541 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రంలోని 417 ప్రభుత్వ కాలేజీల్లో 1.24 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీళ్లకు ఇంటర్ బోర్డ్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసింది. నెల రోజుల క్రితమే అన్నిచోట్లా సిలబస్ పూర్తయింది. 15 రోజులుగా రివిజన్ చేయిస్తున్నారు. ఉదయం, సాయంత్రం గంటపాటు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నారు. వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి ముఖ్యమైన ప్రశ్నలపై తర్ఫీదు ఇస్తున్నారు. టెన్త్ పరీక్షలు ఈ నెల 21 నుంచి మొదలవుతాయి. 5.50 లక్షల మంది ఈ పరీక్షలు రాయనున్నారు. ఇందులో 1.40 లక్షల మంది ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్నారు. వందశాతం పాస్ ఫలితాలపై స్కూళ్లు దృష్టి పెట్టాయి. విద్యాశాఖ అన్ని సబ్జెక్టులకూ స్టడీ మెటీరియల్స్‌ను స్కూళ్లకు పంపింది.

నిద్రలేని రాత్రులు

గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో విద్యార్థులకు నిద్ర కూడా కరవవుతోంది. ఉదయం 4 గంటలకే విద్యార్థులను నిద్ర లేపి గంటపాటు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత సబ్జెక్టు అధ్యాపకులు ముఖ్యమైన చాప్టర్స్‌పై ప్రశ్నలు వేస్తున్నారు. సరైన సమాధానం రాకపోతే ఆ చాప్టర్‌పై శిక్షణ పెంచుతున్నారు. ఎవరు ఎక్కడ బలహీనంగా ఉన్నారు? వారిని ఏ విధంగా ప్రిపేర్ చెయ్యాలనే అంశాలపై స్కూళ్లు, కాలేజీల యాజమాన్యాలు రోజూ నివేదికలు కోరుతున్నాయి. పరీక్షలు అయ్యే వరకు ఎవరూ సెలవు పెట్టొద్దని ఆదేశాలు వెళ్లాయి. సబ్జెక్టు టీచర్లకు ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు పోటీ పెడుతున్నాయి. ఎక్కువ మంది మంచి జీపీఏ, ర్యాంకులతో పాసయ్యేలా చేస్తే ప్రత్యేక ఇన్సెంటివ్స్ ఇస్తామని ఆశ చూపుతున్నాయి. ఈసారి ప్రభుత్వ స్కూల్ టీచర్లకు కూడా టార్గెట్లు పెట్టారు. సబ్జెక్టులవారీగా మంచి స్కోర్ చేసిన స్కూళ్లను ఎంపిక చేసి అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. తల్లిదండ్రులు కూడా ఇదే స్థాయిలో పిల్లల చదువుపై దృష్టి పెట్టారు. పిల్లలకంటే ముందే నిద్రలేచి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లలను కనిపెట్టుకుని ఉంటున్నారు.

పరీక్షలపైనే దృష్టి

ఇది కీలక సమయం. పిల్లలకు పరీక్షలయ్యే వరకు ఏ పనికీ వెళ్లదల్చుకోలేదు. వారిని ఎలా చదివించాలనే అంశాలపైనే దృష్టి పెడుతున్నాం. వాళ్లకు ఏం కావాలో దగ్గరుండి చూసుకుంటున్నాం. కంటిమీద కునుకు లేకున్నా వాళ్ల భవిష్యత్ కోసమే పనిచేస్తున్నాం.

-ఎస్‌కే జబ్బర్ (విద్యార్థి తండ్రి, జడ్చర్ల)

మార్కులు పెంచేలా ప్రిపరేషన్



ఒకటికి పదిసార్లు ముఖ్యమైన ప్రశ్నలపై తర్ఫీదు ఇస్తున్నాం. సబ్జెక్టువారీగా అధ్యాపకులను అందుబాటులో ఉంచుతున్నాం. విద్యార్థులకు ఇబ్బందిగా ఉన్న చాప్టర్స్‌పై ఎక్కువగా దృష్టి పెడుతున్నాం. త్వరగా గుర్తుండిపోయేలా శిక్షణలో జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

-ఆర్ పార్వతిరెడ్డి (హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్, ఖమ్మం)

మెరుగైన ఫలితాల కోసం



ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులూ మంచి ర్యాంకులు పొందేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారు. ముఖ్యమైన ప్రశ్నలతో పాటు, గతంలో వచ్చిన ప్రశ్నలను గుర్తించి.. ఈసారి తేలికగా పరీక్షలు రాసేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

- మాచర్ల రామకృష్ణగౌడ్ (ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు)

క్షణం తీరిక ఉండటం లేదు



పరీక్షలకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థులు, టీచర్లకు క్షణం కూడా తీరిక ఉండటం లేదు. ప్రభుత్వం సరఫరా చేసిన దీపికల ద్వారా విద్యార్థి తేలికగా పరీక్షలకు సన్నద్ధమయ్యేలా చూస్తున్నాం.

- ఆర్ రాజగంగారెడ్డి (ప్రభుత్వ గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

భారత్ ప్రపంచశక్తిగా ఎదగాలి

- పరిశోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- ఐఐటీహెచ్‌లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బీజేపీ ఎంపీ రఘునందనరావు తదితరులు

సాక్షి, హైదరాబాద్ : పరిశోధన శక్తిని పెంపొందించడం ద్వారానే ప్రపంచంతో భారత్ పోటీ పడుతుందని భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని, ఐఐటీలు, ఐఐఎంలు నడుం బిగించాలని ఆయన సూచించారు. హైదరాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ–హైదరాబాద్)ను ఆయన ఆదివారం సందర్శించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత భవిష్యత్‌ను, గొప్పశక్తిగా ఎదగాలన్న ఆకాంక్షను ప్రతిఒక్కరూ లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. పశ్చిమ దేశాల పురోగతిని గమనించాలని కోరారు. మనది వైవిధ్య భారతమని ఉద్ఘాటించారు. భారత్‌లోని అన్ని భాషలు, సంస్కృతులకు గౌరవం లభిస్తోందన్నారు. దేశంలోని 22 భాషలను రక్షించేందుకు జరుగుతున్న ప్రయత్నాన్ని వివరించారు. ఇది అన్ని భాషలకు గర్వకారణమని, మన భాషలకు విశ్వవ్యాప్త పరిధి ఉందన్నారు. మన సాహిత్యం, రామాయణం, మహాభారతం, భగవద్గీత, భారత ఇతిహాసాలు ప్రపంచ గుర్తింపు పొందాయని చెప్పారు. ప్రపంచంలోని విశ్వవిద్యాలయాలకు మన యూనివర్సిటీలు ఏమాత్రం తీసిపోవని, అయినా ఆ స్థాయిలో ఎందుకు గుర్తింపు పొందడం లేదనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. ప్రపంచంలోనే అత్యున్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు భారత పరిశోధనలు, విశ్వవిద్యాలయాల పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. పార్లమెంట్‌లో మేధో మథనంపై జరిగే చర్చలకు ఐఐటీ విద్యార్థులు, ప్రొఫెసర్లను ఆహ్వానిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐటీ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి ఐఐటీ ఆవరణలో మొక్కను నాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధ్యాపకులను ప్రశంసించారు.

ఉప రాష్ట్రపతి దంపతులకు ఘన స్వాగతం

ఐఐటీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా స్వాగతం పలికింది. ఆదివారం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న వారికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌లు కూడా గవర్నర్‌కు తోడుగా వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణ సందర్భంలో కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లి ఉప రాష్ట్రపతి దంపతులకు వీడ్కోలు పలికారు.



హోలీకి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: హోలీ పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు చర్లపల్లి–షాలిమార్ (07703/07704) ప్రత్యేక రైలు ఈ నెల 9, 16 తేదీల్లో సాయంత్రం 7.45 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి.. రెండోరోజు తెల్లవారుజామున 2 గంటలకు షాలిమార్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 11, 18 తేదీల్లో ఉదయం 5 గంటలకు షాలిమార్ నుంచి బయలుదేరి.. మర్నాడు ఉదయం 8.10 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. మరో రైలు చర్లపల్లి–షాలిమార్ (07705/07706) ఈ నెల 7, 21 తేదీల్లో ఉదయం 7.15 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి.. మర్నాడు ఉదయం 10.30 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 8, 22 తేదీల్లో మధ్యాహ్నం 12.35 గంటలకు బయల్దేరి.. మర్నాడు సాయంత్రం 4.40 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. వేసవి సెలవుల సందర్భంగా రాజ్‌కోట్–మహబూబ్‌నగర్ మధ్య 36 ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు సీపీఆర్వో తెలిపారు. ఈ మేరకు రాజ్‌కోట్–మహబూబ్‌నగర్ (09575/09576) ప్రత్యేక రైలు.. మార్చి 3, 10, 17, 24. 31, ఏప్రిల్ 7, 14, 21, 28, మే 5, 12, 19, 26, జూన్ 2, 9, 16, 23, 30 తేదీల్లో.. తిరుగు ప్రయాణంలో మార్చి 4, 11, 18, 25, ఏప్రిల్ 1, 8, 15, 22, 29, మే 6, 13, 20, 27, జూన్ 3, 10, 17, 24, జూలై 1 తేదీల్లో మహబూబ్‌నగర్ నుంచి రాజ్‌కోట్‌కు బయలుదేరనుంది.



నకిలీ క్లినిక్‌లపై డీసీఏ కొరడా

సాక్షి, హైదరాబాద్: నకిలీ క్లినిక్‌లు నిర్వహిస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న వారిపై రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. ఎక్కడనుంచి ఫిర్యాదు వచ్చినా రంగంలోకి దిగుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 152 మంది నకిలీ క్లినిక్‌ల నిర్వాహకులను గుర్తించినట్టు ఆదివారం డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ నుంచి లైసెన్స్‌లు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన మందులను కూడా స్వాధీనం చేసుకుంటున్నట్టు చెప్పారు. తాజాగా శనివారం నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో కుర్మ మల్లేశ్ అనే నకిలీ వైద్యుడిని గుర్తించినట్టు తెలిపారు. అతడి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన రూ.20 వేల విలువైన 34 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులు నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని, నిందితులకు ఐదేళ్ల వరకు జైలు శిక్ష తప్పదని కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్

- జల్‌శక్తి, గృహ నిర్మాణ శాఖల మంత్రులతో సమావేశాలు
- ఏపీ కృష్ణా జలాల అక్రమ వినియోగంపై ఫిర్యాదు
- సీతారామ ప్రాజెక్టుకు అనుమతులు, ఇతర ప్రాజెక్టులకు నిధులపై జరగనున్న చర్చ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కార్యదర్శి దెబశ్రీ ముఖర్జీతో పాటు, కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో వేర్వేరుగా సమావేశం కానున్నారు. సీఆర్ పాటిల్‌తో జరగనున్న సమావేశంలో ప్రధానంగా రాష్ట్ర సాగునీటి రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించి వినతి పత్రం అందజేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటాకు మించి కృష్ణా జలాలను వాడుకోవటమే కాకుండా ఇంకా శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి నీళ్లు తీసుకుంటోందని మరోసారి కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేయనున్నారు. ఏపీ నీళ్ల తరలింపుపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ప్రేక్షక పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేయనున్నారు.

సీతారామకు సత్వర అనుమతులు

సీతారామ- సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సత్వరం అనుమతులు జారీ చేయాలని మరోసారి కేంద్రానికి సీఎం విజ్ఞప్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)లోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) అనుమతి రావాల్సి ఉంది. డిజైన్లను పరిశీలించిన తర్వాతే అనుమతిస్తామని ఇటీవల జరిగిన టీఏసీ సమావేశంలో కేంద్రం స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీఓ), అంతర్రాష్ట్ర జల విభాగం అధికారులు ప్రాజెక్టు డిజైన్లను సీడబ్ల్యూసీకి సమర్పించారు. సీతమ్మసాగర్ బరాజ్ డిజైన్లతో పాటు మరో లిఫ్టు డిజైన్లను టీఏసీ పరిశీలిస్తోంది. ఇది పూర్తయిన వెంటనే మళ్లీ టీఏసీ సమావేశం నిర్వహించి ప్రాజెక్టుకు అనుమతులు జారీ చేయాలని కేంద్ర మంత్రిని కోరనున్నారు. సమ్మక్క సాగర్‌కు అనుమతుల ప్రక్రియను సైతం వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రోగ్రామ్ (ఏఐబీపీ) కింద చిన్న కాళేశ్వరం, చనాకా కొరటా, మత్తడివాగు ప్రాజెక్టులకు అనుమతులిచ్చి సత్వరం నిధులు విడుదల చేయాలని కోరనున్నారు. డ్యామ్ రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (డ్రిప్) కింద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 28 సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులిచ్చి రూ.550 కోట్లు కేటాయించాలని విన్నవించనున్నారు. జలాశయాల్లో పూడిక తొలగింపునకు ప్రత్యేక నిధులతో పాటు పాలమూరు–రంగారెడ్డి వంటి ప్రాజెక్టులకు ఇరిగేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు.

మీ ప్రయత్నాలు ఫలించాయి

కోటాకు మించి కృష్ణా జలాలను వినియోగించుకున్న ఏపీని కట్టడి చేసేందుకు మీరు తీసుకున్న చర్యలు కొంతవరకు ఫలించాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆ శాఖ ఉన్నతాధికారులు తెలియజేశారు. పరస్పర అంగీకారంతో కృష్ణా జలాలు వినియోగించుకోవాలని ఇటీవల జరిగిన కృష్ణా బోర్డు అత్యవసర సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య అవగాహన కుదిరిందని ఈఎన్‌సీ (జనరల్) అనిల్‌కుమార్ మంత్రికి వివరించారు. తాగునీటికి తొలి ప్రాధాన్యతనిచ్చి మిగిలిన నీళ్లను పంటలను కాపాడుకునేందుకు వినియోగించుకోవాలని నిర్ణయించినట్టు తెలిపారు. వారం తర్వాత తమ నీటి అవసరాలు తగ్గిపోతాయని, దీంతో నీళ్లు తీసుకోబోమని ఏపీ హామీ ఇచ్చిందని తెలియజేశారు. మంత్రి ఉత్తమ్ ఆదివారం జలసౌధలో ఢిల్లీ పర్యటనకు ఏర్పాట్లపై నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ అంశంపై చర్చ జరిగింది.

4 నిమిషాలు.. రూ.29.69 లక్షలు!

- కారులో వచ్చి ఏటీఎంలోకి చొరబాటు
- గ్యాస్ కట్టర్లతో కట్ చేసి సినీ ఫక్కీలో అర్ధరాత్రి భారీ చోరీ
- రంగారెడ్డి జిల్లా రావిర్యాల్‌లో ఘటన



పగులగొట్టిన ఏటీఎం

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖాలకు మాస్కులు.. చేతులకు గ్లౌస్‌లు.. వెంట ఇనుప రాడ్లు, గ్యాస్ కట్టర్లు.. దర్జాగా స్విఫ్ట్ కారులో వచ్చి ఏటీఎంలోకి చొరబాటు.. కట్ చేస్తే సినీ ఫక్కీలో నాలుగంటే నాలుగే నిమిషాల్లో రూ.29,69,900 కొట్టేశారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ చోరీ ఘటన జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాలలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు తెల్లని కారులో ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు చేరుకున్నారు. ముందుగా ఒక వ్యక్తి కారులోంచి దిగి ఏటీఎంలోకి ప్రవేశించాడు. అలారం మోగకుండా వైర్లు కత్తిరించాడు. తర్వాత విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. మరో ఇద్దరు వెంటనే కారు దిగి వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్లు, గ్యాస్ కట్టర్లతో రాత్రి 1:55 గంటలకు ఏటీఎం లోపలికి ప్రవేశించారు. ఒక వ్యక్తి సీసీ కెమెరాలపై స్ప్రే కొట్టాడు. దీంతో సీసీ కెమెరాలు బ్లర్ అయిపోయి రికార్డింగ్ ఆగిపోయింది. వెంటనే గ్యాస్ కట్టర్లతో ఏటీఎంను కట్ చేసి, అందులో ఉన్న రూ.29.69 లక్షల నగదు అపహరించుకుపోయారు.

ముందే రెక్కీ?

ఈ చోరీకి ఒకటి రెండు రోజుల ముందే దుండగులు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్లాన్ ప్రకారం నాలుగు నిమిషాల్లో పని పూర్తి చేయడంతో దొంగలను ప్రొఫెషనల్స్‌గా భావిస్తున్నారు. కాగా, దుండగుల కారు పహాడీషరీఫ్ వైపు నుంచి వచ్చి మళ్లీ అటే వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

చోరీ జరిగిన పది నిమిషాల్లోనే కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆదిభట్ల పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి చేరుకోగా అప్పటికే దొంగలు పరారయ్యారు. ఆదిబట్ల ఎస్ఐ వెంకటేశ్, సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, క్రైం డీసీపీ అరవింద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు .

ఐదు బృందాలతో గాలింపు

రావిర్యాలలో జరిగిన ఈ చోరీ ఘటనను రాచకొండ పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఆదిభట్ల పోలీసులు, క్రైమ్ సిబ్బంది, ఎస్ఓటీ, సైబర్ క్రైమ్ సిబ్బందిని కలిపి మొత్తం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే సీసీ కెమెరాల ఆధారంగా దొంగలు వెళ్లిన స్థలాలను, వారి కారు నంబర్‌ను గుర్తించే పనిలో పడ్డారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

చరిత్రకు సజీవ సాక్ష్యం.. రాజావారి కోట



జాతీయ పతాకం రూపుదిద్దుకుంది నడిగూడెంలో ఇక్కడే

నడిగూడెం: సూర్యాపేటజిల్లా నడిగూడెం రాజావారి కోటకు ప్రత్యేక స్థానముంది. ఇది ఎన్నో విశిష్టతలున్న గడీగా పేరొందింది. నాయిని వెంకటరంగారావు, నాయిని వెంకట రామారావు, నాయిని వెంకట నర్సింహారావు వంటి ఈ సంస్థాన వారసుల పేర్లు ఎవరికీ తెలియదు. కానీ ఈ కోటలో వ్యవసాయాధికారిగా పనిచేసిన వ్యక్తి పేరు మాత్రం భారతదేశమంతా తెలుసు. ఆయనే జాతీయజెండా రూపకర్త పింగళి వెంకయ్య. మునగాల పరగణా పాలనాకేంద్రమైన నడిగూడెం కింద 43 గ్రామాలుండేవి. రేపాల, జగన్నాథపురం, విజయరాఘవాపురం, సీతానగరం, నేలమర్రి, తాడ్వాయి, వెంకట్రాంపురం, వెల్దండ, కొక్కిరేణి, నడిగూడెం, బృందావనపురం, వేణుగోపాలపురం, నారాయణపురం, సిరిపురం, చాకిరాల, శ్రీరంగాపురం, రామాపురం, కరివిరాల ఇలా అనేక గ్రామాలున్నాయి. నడిగూడెం ఇప్పుడు సూర్యాపేట జిల్లాలో మండల కేంద్రంగా ఉంది.

17వ శతాబ్దంలో కర్ణాటక నవాబుకు, నిజాం రాజుకు మధ్య యుద్ధం జరిగినప్పుడు బ్రిటిష్‌వారు నిజాం రాజుకు సహాయపడగా, ఫ్రెంచ్, పోర్చుగీసు వారు కర్ణాటక నవాబుకు సహాయపడ్డారు. ఈ యుద్ధంలో నిజాం నవాబు విజయం సాధించారు. నిజాంను ఆంగ్లేయులు తమ సహాయానికి ప్రతిఫలంగా పరిటాల, లింగగిరి పరగణాలను అడిగారు. పరిటాల ఆనాడు వజ్రాల పరిశ్రమలకు ప్రఖ్యాతి గాంచింది. అందువల్ల నిజాం నవాబు పరిటాలను ఇవ్వడానికి ఇష్టపడక దానికి బదులుగా మునగాల పరగణానిచ్చారు. దీంతో బ్రిటిష్‌వారు నర్సింహారావును జమీందారుగా నియమించి వారి ద్వారా శిస్తు వసూలు చేస్తూ వచ్చారు. ఈయనకు శాశ్వత ఫైసలా కింద జమీందారు హక్కులను బదలాయించారు. 1802 నుంచి1900 వరకు మునగాల, నడిగూడెం సంస్థానాలను ఎంతోమంది జమీందార్లు పాలించినా, 1900లో నాయిని వెంకటరంగారావు బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మాత్రమే దీని గురించి ఎక్కువగా సమాచారం దొరికింది.

ఇదీ గడి చరిత్ర..

ఐదున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ గడీ(రాజావాటి కోట) ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. దీనిని ఆ కాలంలో డూప్లెక్స్‌గా విలాసవంతమైన గదులతో నిర్మించారు. ఆ రోజుల్లోనే విలాసవంతమైన వస్తువులను తయారు చేయించారు. మైసూరు నుంచి కూలీలు, బర్మా నుంచి విలువైన రంగూన్ టేకును తెప్పించి తయారు చేయించారు. కర్రలతో చేసిన మెట్లు ఎంతో కళాత్మకంగా ఉన్నాయి. గడీ అంతర్భాగంలో చెక్కతో దివాన్లు, కిటికీలు, తలుపులు, బీరువాలు, కార్పెంటరీ నైపుణ్యాన్ని ప్రతిబింబించేలా ఉన్నాయి. గడీ చుట్టూ 40 అడుగుల ఎత్తులో ప్రహరీని బండరాళ్లతో నిర్మించారు.



నడిగూడెంలో రాజావారు నిర్మించిన కోట

అది నేటికీ చెక్కు చెదరకుండా ఉంది. ఇక్కడి బురుజును ప్రత్యేకమైన రీతిలో, గడీని మొత్తం డంగు సున్నంతో నిర్మించారు. లోపల విశాలమైన గదులెన్నో ఉన్నాయి. పెద్ద గుర్రపుశాలలున్నాయి. శిస్తు వసూళ్లకు ఆ రోజుల్లో గుర్రాలనే ఎక్కువగా వాడేవారట.

దివాన్‌గా కొమర్రాజు లక్ష్మణరావు

నాయిని వెంకటరంగారావు కోర్ట్ ఆఫ్ వార్డ్స్ నుంచి జమీందారుగా బాధ్యతల్ని స్వీకరించగానే ప్రఖ్యాత చిత్రకారుడు కొమర్రాజు లక్ష్మణరావుని దివాన్‌గా నియమించారు. రాజావారు సాహితీ ప్రియుడు కావడంతో చాలామంది కవులను తీసుకొచ్చి పోషించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అనేకమంది కవులకు సన్మానాలు చేసేవారు. రచయితలను ప్రోత్సహించేవారు. రాజావారు కొమర్రాజు లక్ష్మణరావు కలిసి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఏర్పాటు చేశారు. వీరిద్దరూ తెలంగాణలో గ్రంథాలయోద్యమానికి ఎంతో కృషి చేశారు. హైదరాబాద్‌లో శ్రీకృష్ణ దేవరాయల భాషా నిలయం, హన్మకొండలో రాజరాజనరేంద్ర భాషా నిలయాన్ని స్థాపించారు. గుంటూరులో ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపనకు, వెంకటపార్వతీశ కవులు స్థాపించిన ఆంధ్రప్రచారిణి గ్రంథాలయాలు, తెలంగాణ శాసనాలను సేకరించి ప్రచురించడానికి పెద్ద మొత్తంలో విరాళాలకు ఇచ్చారు.

పింగళి ఇక్కడే పనిచేశారు

కృష్ణా జిల్లాకు చెందిన వ్యవసాయ పట్టభద్రుడు పింగళి వెంకయ్య నడిగూడెం రాజావారి ఆస్థానంలో వ్యవసాయ శాఖాధిపతిగా పనిచేశారు. ఆధునిక పద్ధతులను రైతులకు అలవర్చారు. ఈ ప్రాంతంలో అప్పట్లో తొలిసారిగా పత్తిసాగు నేర్పించారు. పత్తి పంటను ఈ ప్రాంత వాసులకు పరిచయం చేయడంతో పింగళి వెంకయ్యను పత్తి వెంకయ్యగా పిలిచేవారట. ఈ పత్తి సాగుపై ఆయన ఇక్కడ చేసిన గణనీయమైన పరిశోధనలకుగాను బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు రాయల్ అగ్రికల్చర్ సొసైటీలో సభ్యత్వం కూడా ఇచ్చారు. 1921 నుంచి ఐదేళ్లపాటు ఇక్కడే పనిచేశారు. ఇక్కడ పని చేసేటప్పుడు జాతీయ జెండాను రూపొందించారు. మూడు రకాల నమూనాలను రూపొందించిన అనంతరం ఆయన విజయవాడ వెళ్లారు.

ఇదీ రాజావారి చరిత్ర

1900 సంవత్సరానికి పూర్వం మునగాల పరగణాను కీసర వంశస్తులు పాలించేవారు. వారి నుంచి రాయిని వారికి వచ్చింది. మొదటగా రేపాల కేంద్రంగా పాలన కొనసాగింది. తర్వాత గ్రామాలను విస్తరిస్తూ సిరిపురం వరకు వచ్చింది. తర్వాత నడిగూడెం వారి పాలనకు ప్రధాన ప్రాంతం కావడంతో దీనినే కేంద్రంగా చేసుకున్నారు. కీసర వారికి అపారమైన భక్తి. రేపాలలో నర్సింహస్వామి ఆలయాన్ని వారే నిర్మించారు. కీసర రాజావారు చనిపోయాక ఆయన భార్య సుభద్రమ్మ పాలనను కొనసాగించారు. నాడు రేపాల కోటలో ఉండొద్దని పండితులు చెప్పడంతో సిరిపురం వెళ్లారు. తర్వాత ఈ ఆస్థానాన్ని నాయిని వంశస్తులకు అప్పగించారు. నాయిని వంశానికి చెందిన లచ్చమ్మ ఒకే కూతురు. ఆమెను వరంగల్ జిల్లా నెల్లకుదుకు ఇచ్చారు. ఆమె నడిగూడెంలో పాలన కొనసాగిస్తుండగా ఆమె మరిది వరదారెడ్డి కొడుకు నాయిని వెంకటరంగారావును దత్తత తీసుకున్నారు. ఆయన అప్పుడు బందరులో హిందూ కళాశాలలో విద్యనభ్యసిస్తున్నారు. కోటను మాత్రం 1885లో నిర్మించినట్టు పూర్వీకులు చెబుతున్నారు.

దాతృత్వాన్ని చాటుకున్న నాయిని వంశస్తులు

రాజావారి వంశస్తులకు ముగ్గురు కొడుకులు. ఇద్దరు కూతుళ్లు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అయినా 50 ఏళ్ల కిందట నడిగూడెంలో తన తల్లి బుచ్చమ్మ పేరిట 16 పడకల సివిల్ ఆస్పత్రిని ఐదున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. రాజావారి పేరిట గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మూడున్నర ఎకరాల విస్తీరణంలో పశువుల ఆస్పత్రిని నిర్మించారు. వైద్యుడు ఉండేందుకు ప్రత్యేకంగా వసతి గృహాన్ని కూడా నిర్మించి వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. రాజావారి ప్రత్యేక విశ్రాంతి గదిని ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు ఇచ్చారు.

చారిత్రక కట్టడాలను ప్రభుత్వం కాపాడాలి



సుమారు 110 ఏళ్ల కిందట నిర్మించిన పురాతన కట్టడాలను ప్రభుత్వం కాపాడాలి. ఎంతో చరిత్ర ఉన్న నడిగూడెం కోటను ఇంకా అభివృద్ధి చేస్తే బాగుంటుంది. ఇప్పటికే రాజావారి కోటలో డాక్రి సంస్థ పెద్ద ఎత్తున గ్రంథాలయం ఏర్పాటు చేసింది. దాదాపు రెండు లక్షలకుట పైగా పుస్తకాలున్నాయి. జాతీయ జెండాను ఇదే కోటలో తయారు చేయడం పట్ల నడిగూడెంవాసిగా గర్వ పడుతున్నాం.

– చిల్లంచర్ల సత్యనారాయణ, సీనియర్ సిటిజన్, నడిగూడెం



యాదగిరిగుట్టలో రద్దీ



యాదగిరిగుట్ట: శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆదివారం భారీగా భక్తులు దర్శించుకున్నారు. ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారిని 40 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.65,20,139 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

బ్రహ్మోత్సవాల్లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ సన్నిధిలో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రధానాలయ ఉత్తరమాడ వీధిలో ఏర్పాటు చేసిన వేదికపై ఆదివారం కళాకారులు కూచిపూడి, భరతనాట్యంతో పాటు వివిధ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. ఇక సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు శ్రీనృసింహ వైభవ ఆధ్యాత్మిక ప్రవచనం రెండో రోజు కొనసాగింది.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద రద్దీ



బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు భారీగా బారులుతీరాయి. సెలవురోజు కావడం, వివాహాలు పెద్ద ఎత్తున జరగడం, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు భారీగా తరలి రావడంతో రాకపోకలు సాగాయి. ఈ క్రమంలో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు భువనగిరి వైపు, సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు హైదరాబాద్ వైపు వాహనాలు బారులుతీరాయి.



ప్రకృతి విసిరిన బాణం

పురాణ గాథలపై తీసే సినిమాల్లో యుద్ధ సన్నివేశాల్లో బాణాలు దూసుకొచ్చినట్లు చూపిస్తుంటారు. అచ్చం అలాంటి దృశ్యాన్ని ములుగు జిల్లా వాజేడు మండల పరిధి రెవెన్యూ గ్రామం కాసారంలో ప్రకృతి ఆవిష్కరించింది. ఆదివారం సాయంత్రం సూర్యుడి నుంచి ఒక రేఖ దూసుకువచ్చి పంట పొలాల్లో భూమిని తాకుతున్నట్లు కనిపించింది.

- వాజేడు

మీనాక్షికి.. కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి

- రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్మన్ సిద్దేశ్వర్

సాక్షి, హైదరాబాద్: మీనాక్షి నటరాజన్‌ను కించపరుస్తూ మాట్లాడిన మాజీ మంత్రి కేటీఆర్.. వెంటనే ఆమెకు క్షమాపణలు చెప్పాలని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమళ్ల సిద్దేశ్వర్ డిమాండ్ చేశారు. గాంధేయవాదంతో పనిచేస్తూ.. రాజకీయాల్లో ఉన్నత విలువలున్న నాయకురాలిగా గుర్తింపు పొందిన మీనాక్షి గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని స్పష్టం చేశారు. ఆయన ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్ తరహాలో అమెరికా నుంచి రాత్రికి రాత్రి వచ్చి మీనాక్షి మంత్రి కాలేదని ఎద్దేవా చేశారు. గత పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయాలని అధిష్టానం కోరినా.. పార్టీ కోసమే పనిచేస్తానని మీనాక్షి తప్పుకున్నారని చెప్పారు. మీనాక్షిని రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమించడంతో బీఆర్ఎస్ నేతల లాగులు తడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఆదర్శ భావాలు కలిగిన మహిళ మాట్లాడిన మాటలను.. ఇతరులకు ఆపాదించి మాట్లాడడం తెలివి కాదన్నారు. సోయి తెచ్చుకుని మాట్లాడటం కేటీఆర్ నేర్చుకోవాలని సిద్దేశ్వర్ హితవు పలికారు.

జపాన్ మారథాన్‌లో వెలిగిన 'జ్యోతి'



భూపాలపల్లి అర్బన్: జపాన్ దేశం టోక్యో నగరంలో ఆదివారం జరిగిన 42 కిలోమీటర్ల మారథాన్‌లో బీఆర్ఎస్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పాల్గొని ఫినిషర్ మెడల్ సాధించారు. ఆమె ఇప్పటి వరకు ప్రపంచంలోని 6 ప్రతిష్టాత్మక మారథాన్‌లలో పాల్గొన్నారు.

కోతుల నుంచి రక్షణకు..



అన్నదాన శిబిరం టెంట్‌కు ఏర్పాటు చేసిన కొండముచ్చు ఫ్లెక్సీ



పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొండముచ్చుల ఫ్లెక్సీలు

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దంతూర్ గ్రామంలో కోతుల నుంచి రక్షణకు కొండముచ్చు ఫ్లెక్సీలతో పరిష్కారం కనుగొన్నారు. శ్రీ బసవలింగేశ్వర స్వామి కల్యాణం సందర్భంగా శనివారం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కోతుల నుంచి రక్షణకు ఆలయ నిర్వాహకులు అన్నదాన శిబిరం వద్ద టెంట్‌కు కొండముచ్చు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. పోచంపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలోని మామిడి, చింత, జామ, దానిమ్మ చెట్లను కూడా కోతులు ధ్వంసం చేస్తుండటంతో.. పోలీసులు రెండు పెద్ద కొండముచ్చు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కొండముచ్చు బొమ్మతో భయపడి కోతుల రాక కాస్త తగ్గిందని పోలీసులు పేర్కొంటున్నారు.



ఘనంగా శ్రీపాదరావు జయంతి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ శాసనసభ స్పీకర్, దివంగత కాంగ్రెస్ నేత దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతిని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషన్ గౌరవ్ ఉప్పల్.. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేసిన శ్రీపాదరావు ఆ పదవికే వన్నె తెచ్చారని కొనియాడారు. 1999లో నక్సలైట్ల దుశ్చర్యకు బలైనా.. ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు నివాళి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా.. ఆయనకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు ఘనంగా నివాళులర్పించారు. శాసనసభ లాంజ్‌లో ఆదివారం శ్రీపాదరావు చిత్రపటానికి ఇద్దరూ పూలమాలలు వేసి అయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సి.మధుసూదనాచారి, జగిత్యాల, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, సంజీవరెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

'జూ'లో సండే సందడి

నేనూ చెట్టెక్కుతా..



సెల్ఫీ కోసం ట్రై చేశారో..



విశాఖలోని ఇందిరాగాంధీ జూ పార్క్‌లో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. సెలవు రోజు కావడంతో పెద్ద సంఖ్యలో సందర్శకులు జూకు వచ్చారు. వన్యప్రాణులు ఎన్‌క్లోజర్స్‌లో హుషారుగా తిరుగుతూ వారిని అలరించాయి. పిల్లలు, పెద్దలు వాటివద్ద సరదాగా గడిపారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వేట లేనప్పుడు బోట్లు ఇలా..



పైన నీలి ఆకాశం.. కింద నీలి అఖాతం.. ఈ రెంటి నడుమ ఆశలతో ముడిపడిన మత్స్యకారుడి జీవనం..బోటు తీసుకుని సముద్రంపైకి బయల్దేరితే ఒక సైనికుడికి ఉన్నంత సన్నద్ధత. వేట సక్రమంగా జరిగి తీరానికి చేరితే ఆనందంతో బోటుకు లంగరేసి ఇంటిముఖం పడతారు. వేటలేని రోజుల్లో ఒడ్డున నిలిపి ఉంచిన బోట్లు ఇలా తీరానికే అందం తీసుకొస్తాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

శరవేగంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే

ఖమ్మం- తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మధ్య నిర్మాణం ● జూన్ నాటికి పూర్తి



దేవరపల్లి వద్ద పూర్తయిన గ్రీన్ ఫీల్డ్ హైవే

దేవరపల్లి: రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో నాలుగు నెలల్లో ఈ జాతీయ రహదారి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఎక్కడా గ్రామాలను తాకకుండా పచ్చని పంట పొలాల మధ్య నుంచి దీనిని నిర్మిస్తున్నారు. ఈ హైవే నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర నుంచి తెలంగాణకు రవాణా సదుపాయం మెరుగుపడడంతో పాటు సమయం, దూరం ఆదా అవుతాయి.

162 కిలోమీటర్ల పొడవు... రూ.2,200 కోట్ల వ్యయం

తెలంగాణలోని ఖమ్మం నుంచి తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి వరకూ రూ.2,200 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) సుమారు 162 కిలోమీటర్ల పొడవున ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మిస్తోంది. ఇది పూర్తయితే దేవరపల్లి - ఖమ్మం మధ్య సుమారు 70 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. దీని నిర్మాణానికి 2022 ఏప్రిల్‌లో అప్పటి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. గత ఏడాది సెప్టెంబర్ నాటికి ఈ హైవే నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా అధిక వర్షాలు, తుపానుల కారణంగా పనుల్లో జాప్యం జరిగింది.

రూ.2 కోట్లకు ఎకరం ధర

ఇప్పటికే రెండు హైవేలు ఉండటం, మరో హైవే వస్తుండటంతో దేవరపల్లి ప్రాంతంలో ఇప్పటికే భూముల ధరలు ఊహించని విధంగా పెరిగాయి. ఎకరం రూ.2 కోట్లు పైగా పలుకుతోంది. మూడు జాతీయ రహదారులు అందుబాటులోకి రావడంతో మెట్ట ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. పంట ఉత్పత్తులను దూర ప్రాంతాల్లోని మార్కెట్లకు రవాణా చేయడం ద్వారా రైతులు గిట్టుబాటు ధర పొందే అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఈ ప్రాంతం నుంచి రైతులు హైదరాబాద్, విశాఖపట్నం, విజయనగరం, కోల్‌కతా వంటి ప్రాంతాలకు వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నిమ్మ, అరటి, కోకో, జీడిగింజల వంటి పంట ఉత్పత్తులు వస్తుంటాయి.

ఆంధ్రాలో హైవే సాగుతుందిలా..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో చింతలపూడి సమీపంలోని రేచర్ల నుంచి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి టి.నర్సాపురం, వేపుగుంట, గుర్వాయిగూడెం, బొర్రంపాలెం, జంగారెడ్డిగూడెం వద్ద మద్ది ఆంజనేయస్వామి ఆలయం సమీపాన ఎర్రకాలువ మీదుగా కొయ్యలగూడెం మండలం రాజవరం, యర్రంపేట, దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయగూడెం, గోపాలపురం మండలం వాదాలకుంట, వెదుళ్లకుంట గ్రామాల మీదుగా దేవరపల్లి వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిని కలుస్తుంది. జంగారెడ్డిగూడెం వద్ద పుట్లగట్లగూడెం-గుర్వాయగూడెం వద్ద జంక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికి 83 ఎకరాలు సేకరించారు. ఖమ్మం-దేవరపల్లి మధ్య 8 టోల్‌ప్లాజాలు, 51 మైనర్, 9 మేజర్ బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు.



దేవరపల్లి వద్ద మూడు జాతీయ రహదారులు కలుస్తున్న ప్రాంతంలో నిర్మిస్తున్న డ్రమ్‌ఫుట్

ఉమ్మడి 'పశ్చిమ'లో 72 కిలోమీటర్లు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను హైదరాబాద్‌కు చెందిన డెకెం సంస్థ చేపట్టింది. తెలంగాణలో ఖమ్మం నుంచి రేచర్ల వరకూ ఒకే ప్యాకేజీగా పనులు జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 72 కిలోమీటర్ల పొడవును మూడు ప్యాకేజీల్లో ఈ పనులు జరుగుతున్నాయి. సేకరించిన భూములకు రైతులందరికీ పరిహారం అందించారు.

భూసేకరణకు అడ్డంకులు

గ్రీన్‌ఫీల్డ్ హైవేకి అవసరమైన భూసేకరణకు కొయ్యలగూడెం మండలం పొంగుటూరు వద్ద బ్రేక్ పడింది. ఆ గ్రామానికి చెందిన రైతు కోర్టుకు వెళ్లడంతో మూడెకరాల భూసేకరణ నిలిచిపోయింది. న్యాయస్థానం తీర్పు రిజర్వులో పెట్టి దాదాపు ఏడాది కావస్తోంది. తీర్పు కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారంతో కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ దీని నిర్మాణ పనులు చేపట్టింది. ఈ నేపథ్యంలో మొన్నటి వరకూ సాధారణ జంక్షన్‌గా ఉన్న దేవరపల్లి ఇప్పుడు మూడు జాతీయ రహదారుల జంక్షన్‌గా కొత్త రూపు సంతరించుకుంటోంది. కోల్‌కతా- చెన్నై 16వ నంబర్ జాతీయ రహదారి దేవరపల్లి మీదుగానే సాగుతోంది. అలాగే, దేవరపల్లి - ఖమ్మం జిల్లా తల్లాడ మధ్య ఇప్పటికే 316డి హైవే ఉంది. ఇప్పుడు కొత్తగా దేవరపల్లి - ఖమ్మం మధ్య కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తున్నారు. ఇది 16వ నంబర్ జాతీయ రహదారిని దేవరపల్లి వద్ద గోపాలపురం రోడ్డులోని డైమండ్ జంక్షన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో కలుస్తుంది. ఈ ప్రాంతంలో మూడు హైవేలు కలుస్తూండటంతో వాటిని విభజిస్తూ నూతన టెక్నాలజీతో అవుటర్ రింగ్ రోడ్డు (డ్రమ్‌ఫుట్) నిర్మిస్తున్నారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ప్రభుత్వం సుమారు 1,100 ఎకరాలు సేకరించింది.

85 శాతం పూర్తి



ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటి వరకూ రేచర్ల నుంచి గుర్వాయగూడెం వరకూ 85 శాతం, అక్కడి నుంచి దేవరపల్లి వరకూ 85 శాతం పనులు పూర్తయ్యాయి. వంతెనలు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తయ్యాయి. దేవరపల్లి వద్ద డ్రమ్‌ఫుట్ నిర్మాణం జరుగుతోంది. మొత్తంగా 85 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే జూన్ నాటికి ఈ రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

- సురేంద్రనాథ్, పీడీ, నేషనల్ హైవేస్, రాజమహేంద్రవరం

తెగిపడిన బాలుడి చేతివేళ్లు

ద్విచక్రవాహనం చైన్‌లో చేయి పెట్టడంతో ఘటన

తగరపువలస (విశాఖ): గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లోని భీమిలి జోన్ సంతపేటలో ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనం చైన్‌లో చేయి పెట్టడం వలన నాలుగేళ్ల బాలుడు జతిన్‌కు కుడి చేతి మూడు వేళ్లు తెగిపోయాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం బాలుడి తండ్రి ద్విచక్రవాహనం శుభ్రం చేస్తూ ఇంజన్ స్టార్ట్ చేశాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న బాలుడు తిరుగుతున్న చైన్‌లో చేయి పెట్టగా వేళ్లు తెగిపోయాయి. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అత్యవసర చికిత్స నిమిత్తం బెంగళూర్ తీసుకువెళ్లారు.

కారు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

- వివాహానికి వెళ్లి వస్తుండగా లారీని ఢీకొట్టిన కారు
- ఏలూరు జిల్లాలో ఘటన



దెందులూరు: వివాహానికి వెళ్లి తిరిగివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరానికి చెందిన ఊట్ల రామకృష్ణ కుటుంబసభ్యులు ఐదుగురు తమ సొంత కారులో పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో జరిగే వివాహానికి వెళ్లారు. వివాహానంతరం తిరిగి వస్తుండగా శనివారం రాత్రి రెండు గంటల సమయంలో ఏలూరు జిల్లా దెందులూరు మండలం సత్యనారాయణపురం గుండేరు వాగు వద్ద లారీని దాటివెళ్లే ప్రయత్నంలో కారు అదుపుతప్పి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఊట్ల రామకృష్ణకు తలపై, ఆయన భార్య అరుణకు కాలిపై గాయాలయ్యాయి. ఈ ఘటనలో రామకృష్ణ నాన్నమ్మ అనంతలక్ష్మి, అరుణ అమ్మమ్మ సామ్రాజ్యం, కుటుంబసభ్యుడు ఇరుసుమల్లి మణికంఠ గాయాలపాలయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

విద్యా సమాచారం

నాణ్యమైన పరిశోధనలతోనే విశ్వవిద్యాలయానికి గుర్తింపు



విశాఖ విద్య: విశ్వవిద్యాలయంలో జరిగే పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీకి ఎనలేని గుర్తింపును తీసుకొస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ నూతన వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన పరిశోధకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. నాణ్యమైన పరిశోధనలతో విశ్వవిద్యాలయానికి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రామాయణ ఇతిహాసం ప్రదర్శన



బుచ్చినాయుడుకండ్రిగ: పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థుల కోసం మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు రామాయణం ఇతిహాసాన్ని ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీమురళి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశంలోని ఉపవాచకమైన రామాయణంలో కాండాలు, పాత్రల స్వభావం, వ్యాసరూప ప్రశ్న, జాతీయాలతో పాటు 24 మార్కులు ఉంటాయని తెలిపారు.


ఉత్సాహంగా ఇంటర్‌జోన్ స్పోర్ట్స్ మీట్



తిరుపతి కల్చరల్: న్యూబాలాజీ కాలనీలోని భాష్యం సీవో క్యాంపస్‌లో భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాలలో విద్యార్థులకు ఇంటర్‌జోన్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి నారాయణాద్రి హాస్పిటల్ ఎండీ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు.

ఆధ్యాత్మిక సమాచారం

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



గురజాల: పల్నాడు జిల్లా గురజాల నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో పలనాటి తిరుమలగా పేరుగాంచిన శ్రీ అలమేలు మంగా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం కనులపండువగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో అలమేలు మంగా పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

వైభవం.. గిరి ప్రదక్షిణం



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరస్వామివారి కైలాస గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా సాగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతా గణాలు, రుషులకు పార్వతీ పరమేశ్వరులు ఘనంగా వీడ్కోలు పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు.

బంగారు తిరుచ్చిపై సుందరరాజస్వామి



తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి అనుబంధ ఆలయంలో కొలువైన శ్రీ సుందరరాజ స్వామివారు ఆదివారం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరాభాద్ర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గణనాథుడి సన్నిధి.. జన సందడి



కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆదివారం భక్తజనంతో కిక్కిరిసింది. వేకువ జామున స్వామిని సుప్రభాతసేవలో మేల్కొలిపి అభిషేక, పూజలు చేశారు. ఆ తర్వాత భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. దీంతో భక్తులు క్యూకట్టారు. భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు జన సందడి కనిపించింది.

10 నుంచి బ్రహ్మోత్సవాలు



తిరుపతి కల్చరల్: కాకినాడ జిల్లా పిఠాపురం శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన సాయంత్రం 6 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తారు. 10న ఉదయం 10.10 నుంచి 10.30 గంటల మధ్య చేపట్టే ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి.

రాట్నాలమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



పెదవేగి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాలకుంటలో కొలువైన రాట్నాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దేవస్థానానికి విచ్చేసి, మొక్కుబడులు తీర్చుకున్నారు.

పెద్దింట్లమ్మా.. పాహిమాం



కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. నీ చల్లని దీవెనలు అందించమ్మా అంటూ భక్తులు అమ్మను ఆర్తితో వేడుకున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో పెద్దింట్లమ్మ జాతర ఆదివారానికి రెండో రోజుకు చేరింది. సెలవు దినం కావడంతో సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి ఆలయం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చినవెంకన్న దివ్య క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో దూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి.

9 నుంచి రంగడి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : సింహపురి క్షేత్రపాలకుడు రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయని దేవస్థానం ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు, వాల్‌పోస్టర్లను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు.

అంకాళ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

రాపూరు: నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో ఉన్న అంకాళ పరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగిసేవ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టారు.


ద్వారక

ప్రకృతి మన తెలుగువాళ్లకు వెయ్యి కిలోమీటర్ల తీరాన్నిచ్చింది.
గుజరాత్‌కి మాత్రం 16 వందల కిలోమీటర్ల తీరాన్నిచ్చింది.
ఆ తీరమే ఆ రాష్ట్రానికి పెద్ద ఆదాయవనరుగా మారింది.
ఆ అరేబియా తీరమే విదేశీ వర్తకానికి దారులు వేసింది.
ఆ తీరానే శ్రీకృష్ణుడు... మన జాతిపిత గాంధీజీ పుట్టారు.
సోమనాథుడు వెలిశాడు... గోరీ మనదేశం మీద దండెత్తాడు.
ఆ తీరం పర్యాటకపరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.
ద్వారక నుంచి సోమనాథ్ వరకు ప్రయాణమే
ఈ వారం పర్యాటకం.

అరబిక్ కడలి సౌందర్య వీక్షణం

అదిగో ద్వారక...

బేట్ ద్వారక... ఇది ద్వారక తీరం నుంచి కనిపించే దీవి. సముద్ర తీరాన విహరించడంతోపాటు సముద్రం మధ్యలో పడవలో పయనించడాన్ని కూడా ఆస్వాదించవచ్చు. కృష్ణుడి ద్వారకను చూసి ఆ నేల మీద నడిస్తే కలిగే పులకింతను మాటల్లో చెప్పలేం. పురాణకాలంలో కూడా ప్రజలు ద్వారక ప్రధాన పట్టణం నుంచి బేట్ ద్వారకకు పడవలో ప్రయాణం చేసినట్లు గ్రంథాల్లో ఉంది. చారిత్రక యుగంలో కూడా ద్వారక గురించి సింధు నాగరకత, హరప్పా నాగరకత, మౌర్య సామ్రాజ్య రచనల్లో కనిపిస్తుంది. ఈ తీరం నుంచి రోమన్‌తో వర్తక వాణిజ్యాలు జరిగేవి. ఇక్కడి మ్యూజియాలలో ప్రశాంతంగా గడిపే సమయాన్ని దృష్టిలో పెట్టుకుని టూర్ ప్లాన్ చేసుకోవాలి. ఓఖా– బేట్ ద్వారకలను కలిపే బ్రిడ్జి 'సుదర్శన సేతు' మీద ఆగి ఫొటో తీసుకోవడం మరిచిపోవద్దు.




చౌపాటీ బీచ్

గాంధీజీ పుట్టాడు

చౌపాటీ బీచ్... ఇది పోర్‌బందర్‌లోని అరేబియా తీరం. పోర్‌బందర్ అంటే మన జాతిపిత గాంధీజీ పుట్టిన ఊరు. అంతకంటే ముందు పౌరాణిక కథనాలను చూస్తే ఇది శ్రీకృష్ణుడి స్నేహితుడు సుధాముడు పుట్టిన ప్రదేశం కూడా. గాంధీజీ ఇంటితో పాటు సుధాముడి ఆలయాన్ని కూడా చూడవచ్చు. ఈ ఆలయంలో అటుకులను ప్రసాదంగా ఇస్తారు. పోర్‌బందర్ జిల్లాకేంద్రమే, కానీ పట్టణంలో పెద్ద హడావుడి ఉండదు. తీర ప్రాంతం మాత్రం అభివృద్ధికి చిరునామాగా కనిపిస్తుంది. పోర్టు ఉండడంతో దాని అనుబంధ పరిశ్రమలు కూడా ఉంటాయి. ఖండాంతరాల నుంచి వచ్చిన ఫ్లెమింగోలు కూడా వేసవిలో ఇక్కడ సేదదీరుతుంటాయి. వాటి కోలాహలాన్ని కూడా ఆస్వాదించవచ్చు.


చోర్‌వాడ్ బీచ్

అంబానీ సొంతూరు

చోర్‌వాడ్ బీచ్... ఇది సోమనాథ్‌కు 40కి.మీ.ల దూరంలో ఉంది. ఇక్కడ బీచ్ క్లీన్‌గా ఉంటుంది. సూర్యాస్తమయాన్ని ఆస్వాదించడానికి, చక్కటి ఫొటోలు తీసుకోవడానికి బాగుంటుంది. అరేబియా సముద్రం ఈతకు అనువైనదే. కానీ చోర్‌వాడ్ దగ్గర మాత్రం ఈత క్షేమం కాదు. ఇక్కడ బీచ్ విజిట్ పూర్తయిన తర్వాత ధీరూబాయ్ అంబానీ ఇంటిని చూడడం మర్చిపోవద్దు. నిజమే... ఇది అంబానీల సొంతూరు. ఈ ప్రదేశానికి చోర్‌వాడ్ అనే పేరు ఎందుకు వచ్చిందా అనే సందేహం తొలుస్తూనే ఉందా? అరేబియా తీరం నుంచి విదేశీ వ్యాపారం విరివిగా జరిగేది. సముద్రంలో ఓడల్లో సరుకుల రవాణా జరుగుతోందంటే అసంకల్పిత చర్యగా ఆ సరుకును దొంగలించే దొంగలు కూడా సిద్ధమై పోతారు. ఆ సముద్రపు దొంగలు నివాసం ఏర్పరుచుకున్న ప్రదేశం ఇది. దొంగల నివాస ప్రదేశం అనే అర్థంలోనే పేరు స్థిరపడిపోయింది.



జ్ఞాపకాలు దండి

దండి సత్యాగ్రహం గురించి చిన్నప్పుడు చదువుకున్నాం. గాంధీజీ 1930లో ఉప్పు సత్యాగ్రహం మొదలు పెట్టింది ఇక్కడి నుంచే. అహ్మదాబాద్‌లోని సబర్మతి ఆశ్రమం నుంచి దండుగా బయలుదేరి ఈ ప్రదేశంలో సముద్రపు నీటిని సేకరించి మరిగించి ఉప్పు తయారు చేశాడు. ఆ సంఘటనకు చిహ్నంగా ఇక్కడ గాంధీజీ ఉప్పు రాశి పోస్తున్న విగ్రహం ఉంటుంది. ఈ తీరంలో విహరించడంతో పాటు దండి సత్యాగ్రహం సమయంలో గాంధీజీ బస చేసిన సైఫీ బంగ్లాను కూడా చూసి ఒక ఫొటో తీసుకోవచ్చు.


మాధవ్‌పూర్ బీచ్

రుక్మిణి కల్యాణం

మాధవ్‌పూర్ బీచ్... ఇది పోర్‌బందర్ నుంచి వెరావల్‌కు వెళ్లే హైవే మీద ఉంటుంది. సముద్ర తీరాన హైవే ఉంటుంది. కాబట్టి రోడ్డు మీద ప్రయాణిస్తూ అరేబియా సముద్రపు నీటి నీలం గాఢతను చూడవచ్చు. ఆకాశానికి– సముద్రానికి మధ్య రేఖ ఎక్కడో తెలుసుకోవడం ఓ పెద్ద పజిల్. అన్నట్లు ఇక్కడ తాబేళ్ల సంతానోత్పత్తి కేంద్రం ఉంది. స్థానికులను అడిగితే దారి చూపిస్తారు. పోర్‌బందర్ వరకు కొబ్బరి నీరు దొరకవు. కానీ మాధవ్‌పూర్ నుంచి సముద్ర తీరాన కొబ్బరి బోండాలు కనిపిస్తాయి. సముద్ర తీరాన కామెల్ రైడ్ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. పెద్ద వాళ్లు మొహమాట పడకుండా ఒంటె విహారాన్ని ఆస్వాదించాలి. రుక్మిణీదేవిని శ్రీకృష్ణుడు తీసుకుని వెళ్లిన ప్రదేశం ఇదేనని చెబుతారు. ఇక్కడ ఓషో ఆశ్రమం కూడా ఉంది.

ఓఖా- మాధీ బీచ్...

ఇది ద్వారక వెళ్లే దారిలో వస్తుంది. హైవే మీద వాహనాన్ని ఆపుకుని దిగి పావు కిలోమీటరు నడిస్తే పాదాలు సముద్రపు నీటిలో ఉంటాయి. ఇక్కడ వర్తక వాణిజ్యాలేవీ జరగవు. కాబట్టి నీరు స్వచ్ఛంగా ఉంటుంది. ఇతర ప్రమాదాలు కూడా ఏవీ జరగవు. కాబట్టి సముద్రంలో స్నానం, స్విమ్మింగ్ సరదా తీరుతుంది. ఇక్కడ జనం రద్దీ తక్కువ. కాబట్టి ఏకాంతపు పర్యటనకు ఇది మంచి ప్రదేశం. సూర్యాస్తమయాన్ని వీక్షించడంతోపాటు రాత్రి బస ప్లాన్ చేసుకోవడానికి అనువైన ప్రదేశం.


ఓఖా–మాధీ బీచ్

కృష్ణుడికి బాణం దెబ్బ


వెరావల్ బీచ్

వెరావల్ బీచ్... ఇది సోమనాథ్‌కు నాలుగుకిలోమీటర్ల దూరాన ఉంది. ఇది శ్రీకృష్ణుడు ప్రాణత్యాగం చేసిన ప్రదేశం. కృష్ణుడు ఒక చెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో జర అనే వేటగాడు జింక కాలుగా భావించి బాణం వేశాడని, కృష్ణుడు గాయపడి ప్రాణత్యాగం చేశాడని చెబుతారు. ఈ ప్రదేశం భాల్క తీర్థంతో సందర్శన స్థలంగా అభివృద్ధి చెందింది. ఈ సంఘటన క్రీ. పూర్వం 3102, ఫిబ్రవరి 17 లేదా 18వ తేదీగా భావిస్తారు. కృష్ణుడి మరణంతో ద్వాపర యుగం అంతమైందని, మరుక్షణం నుంచి కలియుగం ప్రారంభమైందని చెబుతారు. వెరావల్ తీరంలో ప్రాచీన కాలం నుంచి వర్తక వాణిజ్యం జరిగేది.

సోమనాథ్ బీచ్... ద్వాదశ జ్యోతిర్లింగాల్లో మొదటిది సోమనాథ్ జ్యోతిర్లింగం. ఈ ప్రదేశం విదేశీ దాడులకు ముఖద్వారం అని చెప్పవచ్చు. మహమ్మద్ గోరీ అనేకసార్లు మనదేశం మీద దాడులు చేశాడు. అరేబియా సముద్రం మీద వచ్చి ఈ తీరం నుంచే భారత భూభాగంలోకి అడుగుపెట్టేవాడు. ఆలయ సంపద దోపిడీతోపాటు ఈ ఆలయాన్ని ధ్వంసం చేయడం వంటివన్నీ చరిత్రపుటల్లో దాక్కున్నాయి. ఈ ఆలయం ఎన్నిసార్లు పునర్నిర్మాణం చేసుకుందో తెలియాలంటే చరిత్ర పుస్తకాలు చదవాల్సిందే. ఇప్పుడు మనం చూస్తున్న మారు– గుర్జర శైలి నిర్మాణం నిర్మాణం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత గాంధీజీ అనుమతితో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన ప్రయత్నం.


గాయపడిన ఆలయం

అందుకే ఆయన గౌరవార్థం ఆలయ ప్రాంగణంలో వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అరేబియా సముద్రం చిరు అలలతో మంద్రమైన సవ్వడితో ఆలరిస్తుంది. కానీ ఇక్కడ మాత్రం కొంత అలజడిగా ఉంటుంది. అలలు వేగంగా వచ్చి ఆలయ గోడలను తాకుతుంటాయి.


సోమనాథ్ ఆలయం

సౌరాష్ట్ర కశ్మీరం

మహువా బీచ్... ప్రశాంతతకు మారు పేరు ఈ ప్రదేశం. ఏడాదంతా చల్లగా ఉంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే కేరళలో ఉన్నామా అనిపిస్తుంది. కొబ్బరిచెట్లు విస్తారంగా ఉంటాయి. ఈత చెట్లు కూడా. రెండు–మూడు గంటల కోసం వెళ్లడం కంటే రాత్రి బస ఇక్కడే ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. ఇక్కడ సముద్ర తీరాన భవానీ మాత ఆలయం ఉండడంతో స్థానికులు భవానీ బీచ్ అంటారు.


మహువా బీచ్

మన పర్షియా

ఉద్వాద బీచ్... ఇది భారత భూభాగమే కానీ ఇక్కడ పర్యటిస్తుంటే పర్షియా సామ్రాజ్యంలో ఉన్నట్లు అనిపిస్తుంది. మనదేశంలో జొరాస్ట్రియన్ మత వికాసానికి నిదర్శనం. ఇక్కడి ఇళ్లన్నీ ప్రాచీన పర్షియన్ నిర్మాణశైలిలో ఉంటాయి. మరమ్మతులు చేసేటప్పుడు వాటి నిర్మాణ ప్రత్యేకతను కోల్పోనివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఆలయం కూడా ప్రపంచంలో ఉన్న ఎనిమిది ప్రముఖ జొరాస్ట్రియా ఆలయాల్లో ఒకటి. ఆలయాల్లో అగ్నిమంట చల్లారనివ్వకుండా కాపాడుకోవడం వారి క్రతువుల్లో ప్రధానం. విజయాగ్ని ఆరని ఆలయాల జాబితాలో ఇక్కడ ఉన్న ఆటాశ్ మెహ్రామ్ కూడా ఒకటిగా చెప్పుకుంటారు. ప్రాచీన వారసత్వాన్ని పరిరక్షించుకోవడంలో వారు చూపిస్తున్న శ్రద్ధ కనిపిస్తుంది. అందుకే ఇది వరల్డ్ హెరిటేజ్ సైట్ జాబితాలో చేరింది.


ఆటాశ్ మెహ్రామ్ ఆలయం



బాగా అసంతృప్తిగా ఉన్న మీ కస్టమర్లే మీరు ఎక్కువగా నేర్చుకోవడానికి, మీ కంపెనీ అభివృద్ధికి కారణమవుతారు.

- బిల్‌గేట్స్, అమెరికన్ వ్యాపార వేత్త

సాక్షి ప్లస్
సోమవారం । 3-3-2025

బిజినెస్ రీల్

కస్టమర్ ఖాతాలోకి 81 లక్షల కోట్ల డాలర్లు!!

సిటీగ్రూప్ భారీ పొరపాటు



న్యూఢిల్లీ: బ్యాంకింగ్ సిస్టమ్స్‌లో లోపాల వల్ల కస్టమర్ల ఖాతాల్లోకి వేరే వాళ్ల డబ్బులొచ్చి పడుతుండటం, బ్యాంకులు నాలిక్కర్చుకుని మళ్లీ వెనక్కి తీసుకునే ఉదంతాలు మనకు అప్పుడప్పుడు కనిపిస్తూనే ఉంటాయి. సాధారణంగా ఇది వేలు, లక్షల రూపాయల స్థాయిలో ఉంటుంది. అమెరికన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం సిటీ గ్రూప్‌లోనూ అలాంటిదే జరిగింది. కాకపోతే, ఒకటి రెండూ లక్షలు కాదు ఏకంగా లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో! సంబంధిత వర్గాల కథనం ప్రకారం.. 2023 ఏప్రిల్‌లో సిటీ గ్రూప్ ఉద్యోగి ఓ కస్టమర్ ఖాతాలోకి 280 డాలర్లు క్రెడిట్ చేయబోయి.. అక్షరాలా 81 లక్షల కోట్ల డాలర్లను క్రెడిట్ చేశారు. లావాదేవీలను పర్యవేక్షించాల్సిన మరో ఉద్యోగి కూడా దాన్ని క్లియర్ చేశారు. ఈ దెబ్బతో సిటీగ్రూప్ ఖజానా ఖాళీ అయిపోయింది. దాదాపు గంటన్నర తర్వాతెప్పుడో జరిగిన పొరపాటును ఇంకో ఉద్యోగి గుర్తించడంతో, ఇది బైటపడింది. చివరికి ఆ లావాదేవీని రివర్స్ చేసి, ఆ మొత్తాన్ని వెనక్కి తీసుకుని హమ్మయ్య అనుకున్నారు. నిజానికి సిటీ గ్రూప్ గత ఏడాది కాలంగా సుమారు 100 కోట్ల డాలర్ల మొత్తానికి సంబంధించి ఇలాంటి పది పొరపాటు లావాదేవీలను తృటిలో తప్పించుకుంది. వాస్తవానికి ఇలాంటి పొరపాట్ల సంఖ్య పదమూడు నుంచి పదికి తగ్గిందట. ఇలాంటి పొరపాట్లను నివారించడంలో ఆశించినంత పురోగతి సాధించనందుకు గాను సిటీగ్రూప్‌కు నియంత్రణ సంస్థ 13.6 కోట్ల డాలర్ల జరిమానా విధించగా, రిస్కులు.. డేటా వైఫల్యాలకు గాను 40 కోట్ల డాలర్ల పెనాల్టీ కూడా పడింది.

కరూర్ వైశ్యా బ్యాంక్ 6 కొత్త శాఖలు



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని పొద్దుటూర్‌తో పాటు తమిళనాడులో కొత్తగా ఆరు శాఖలను ప్రారంభించినట్లు ప్రైవేట్ రంగ కరూర్ వైశ్యా బ్యాంక్ వెల్లడించింది. ఇవి సేవింగ్స్, కరెంట్ అకౌంట్స్, డిపాజిట్లు, రుణాలు తదితర బ్యాంకింగ్ సర్వీసులను సమగ్రంగా అందిస్తాయని బ్యాంక్ తెలిపింది. 2024–25లో కొత్తగా 35 శాఖలను ప్రారంభించినట్లు, మొత్తం బ్రాంచీల సంఖ్య 877కి చేరినట్లు వివరించింది. కస్టమర్లకు అనుకూలంగా ఉండేలా తమ మొబైల్ బ్యాంకింగ్ యాప్ కేవీబీ డిలైట్‌ను 150 పైచిలుకు ఫీచర్లతో మెరుగుపర్చినట్లు పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం ఆఖరు నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపార పరిమాణం రూ. 1,81,993 కోట్లకు చేరింది. తొమ్మిది నెలల కాలానికి నికర లాభం రూ. 1,428 కోట్లుగా నమోదైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-3-2025

విశాఖ	482–00
చిత్తూరు	463–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450–00
విజయవాడ	450–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

అమెరికా టారిఫ్‌లు.. ప్రపంచ పరిణామాలే దిక్సూచి!

- ఇన్వెస్టర్ల బలహీన సెంటిమెంట్ కొనసాగవచ్చు...
- తీవ్ర ఒడిదుడుకులకు ఆస్కారం...
- ఈ వారం మార్కెట్ గమనంపై నిపుణుల అభిప్రాయం

న్యూఢిల్లీ: భారీ పతన బాటలో కొనసాగుతున్న దేశీ మార్కెట్లలో ఒడిదుడుకులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల మోతకు తోడు కొనసాగుతున్న విదేశీ ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాల పరంపర... ఇన్వెస్టర్లలో బలహీన సెంటి'మంట'కు ఆజ్యం పోస్తోంది. ఈ వారంలో కూడా యూఎస్ టారిఫ్ సంబంధిత పరిణామాలు, ప్రపంచ మార్కెట్ల ట్రెండ్, ఎఫ్‌పీఐల ట్రేడింగ్ కార్యకలాపాలే మార్కెట్ల గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

బలహీనంగానే...

'ట్రంప్ టారిఫ్ పాలసీతో పాటు గత వారంలో విడుదలైన నిరుద్యోగ గణాంకాలు (అయిదు నెలల గరిష్టం) మార్కెట్ గమనంపై ప్రభావం చూపుతాయి. సమీప కాలంలో మార్కెట్లో బలహీన ధోరణి కొనసాగవచ్చు. ప్రపంచ వాణిజ్య విధానాల్లో అస్థిరతలు సద్దుమణిగి, వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీల లాభాల్లో రికవరీ కనిపిస్తేనే మార్కెట్ మళ్లీ గాడిలో పడతాయి' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా బలహీన సెంటిమెంట్‌కు తోడు దేశీయంగా కీలక అంశాలు (ట్రిగ్గర్లు) ఏవీ లేనందున మన మార్కెట్లలో నష్టాలు కొనసాగే అవకాశం ఉందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ (వెల్త్ మేనేజ్‌మెంట్) సిద్ధార్థ ఖేమ్కా పేర్కొన్నారు. వాణిజ్య యుద్ధ భయాలతో మార్కెట్లు వణుకుతున్నాయని, ఎఫ్‌పీఐల అమ్మకాల జోరు దీనికి మరింత ఆజ్యం పోస్తోందని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అభిప్రాయపడ్డారు.

గణాంకాల ఎఫెక్ట్...

గత వారాంతంలో విడుదలైన జీడీపీ గణాంకాల ప్రభావం సోమవారం మార్కెట్‌పై కొంత ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (క్యూ3)లో జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే. గతేడాది క్యూ3తో పోలిస్తే భారీగా తగ్గినప్పటికీ.. క్యూ2తో పోలిస్తే (5.6 శాతం) సీక్వెన్షియల్‌గా కాస్త పుంజుకోవడం విశేషం. అమెరికా టారిఫ్ వార్ ఆందోళనల నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత గడ్డు పరిస్థితులను ఎదుర్కోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఫిబ్రవరి జీఎస్‌టీ వసూళ్లు 9.1 శాతం ఎగబాకి రూ.1.84 లక్షల కోట్లకు చేరడం ఆర్థిక వ్యవస్థ రికవరీపై ఆశలు రేకెత్తిస్తోంది. ఈ వారంలో విడుదల కానున్న హెచ్‌ఎస్‌బీసీ తయారీ, సేవల రంగ పీఎంఐ డేటాపై కూడా ఇన్వెస్టర్లు నిశితంగా గమనించనున్నారు.

విదేశీ ఇన్వెస్టర్ల ధోరణి కూడా కీలకమే...



ఫిబ్ర'వర్రీ'...

గత కొన్ని నెలలుగా నేల చూపులు చూస్తున్న మన మార్కెట్లకు ఫిబ్రవరిలో మరింత షాక్ తగిలింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 1,384 పాయింట్లు (5.88 శాతం) పతనం కాగా, బీఎస్‌ఈ సెన్సెక్స్ 4,302 (5.55%) పాయింట్లు కోల్పోయింది. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ రికార్డ్ గరిష్టాన్ని (85,978) తాకి, అక్కడి నుంచి రివర్స్ గేర్‌లోనే వెళ్తోంది. ఇప్పటిదాకా 12,780 పాయింట్లు (14.86 శాతం) కుప్పకూలింది. ఇక నిఫ్టీ కూడా అప్పటి గరిష్ఠం (26,277) నుంచి 4,153 పాయింట్లు (15.8 శాతం) దిగజారింది. కాగా, ఒక్క గత వారంలోనే సెన్సెక్స్ 2.8 శాతం, నిఫ్టీ 2.94 శాతం క్షీణించడం గమనార్హం.

రూ. 34,574 కోట్లు వెనక్కి...

విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనం మరింత జోరందుకుంది. ఫిబ్రవరి నెలలో దేశీ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐలు రూ.34,574 కోట్లు వెనక్కి తీసుకున్నారు. దీంతో ఈ ఏడాది తొలి రెండు నెలల్లో మొత్తం అమ్మకాలు రూ.1.12 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ప్రధానంగా ట్రేడ్ వార్ ఆందోళనలతో పాటు కంపెనీల లాభాలపై ఆందోళనలు దీనికి కారణంగా నిలుస్తున్నాయి. 'భారత్ మార్కెట్లో ఈక్విటీ వేల్యుయేషన్లు చాలా అధికంగా ఉండటం, కార్పొరేట్ల ఆర్థిక ఫలితాలపై ఆందోళనల ప్రభావంతో ఎఫ్‌పీఐల తిరోగమనం కొనసాగుతోంది' అని వాటర్‌ఫీల్డ్ అడ్వయిజర్స్ సీనియర్ డైరెక్టర్ విపుల్ భోవర్ పేర్కొన్నారు.



టాప్-10 కంపెనీల్లో రూ.3 లక్షల కోట్లు హుష్

గత వారంలో ప్రధాన సూచీలు దాదాపు 3 శాతం కుప్పకూలడంతో దేశీ స్టాక్ మార్కెట్లో టాప్–10 కంపెనీల మార్కెట్ విలువ రూ.3,09,245 కోట్లు ఆవిరైంది. టీసీఎస్ మార్కెట్ క్యాప్ అత్యధికంగా రూ.1,09,211 కోట్లు క్షీణించి రూ.12,60,505 కోట్లకు పడిపోయింది. దీంతో టాప్–10లో 2వ స్థానం నుంచి మూడో స్థానానికి దిగజారింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెండో ర్యాంకును అందుకుంది. దీని మార్కెట్ క్యాప్ రూ.30,258 కోట్లు జంప్ చేసి, 13,24,411 కోట్లకు ఎగబాకింది. ఇక ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.52,697 కోట్లు తగ్గి, రూ.7,01,002 కోట్లకు చేరింది. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ కూడా 39,230 కోట్లు నష్టపోయి రూ.8,94,993 కోట్లకు దిగొచ్చింది.

ఇంకా కష్టపడితేనే లక్ష్యాలు సాధించగలం

- అప్పుడే 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదుగుతాం
- వినోదాలతో, స్టార్లను ఫాలో అవుతూనో కూర్చుంటే కుదరదు
- నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే భారతీయులు మరింత ఎక్కువగా కష్టపడితేనే సాధ్యమని నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ తెలిపారు. ఇందుకోసం అవసరమైతే వారానికి 80 గంటలైనా, 90 గంటలైనా పనిచేయాల్సిందేనన్నారు. ''నేను కష్టించి పని చేయాలని విశ్వసిస్తాను. భారతీయులు ఇంకా కష్టపడి పనిచేయాలి. అది వారానికి 80 గంటలు కావచ్చు లేదా 90 గంటలు కావచ్చు. ఇప్పుడు 4 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న మన ఆర్థిక వ్యవస్థ 30 ట్రిలియన్ డాలర్ల భారీ లక్ష్యానికి చేరుకోవాలనుకున్నప్పుడు, వినోదాలతో గడిపేస్తూనో, లేకపోతే ఏదో కొందరు సినిమా స్టార్ల అభిప్రాయాలను అనుసరిస్తూనో కూర్చుంటే సాధించలేము'' అని వ్యాఖ్యానించారు. పటిష్టమైన పని విధానాలతోనే జపాన్, దక్షిణ కొరియా, చైనా ఆర్థిక విజయం సాధించాయని, ప్రపంచ స్థాయి ఎకానమీగా ఎదగాలంటే భారత్ కూడా అలాంటి ఆలోచనా ధోరణిని అలవర్చుకోవాలని చెప్పారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ దాదాపు 4 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో ఉంది. ఎన్ని గంటల పని వేళలు ఉండాలనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో కాంత్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొందరు కార్పొరేట్ దిగ్గజాలు వారానికి 70–90 గంటలు పని చేయాలంటే, ఎన్ని గంటలు పని చేశామనేది కాదు ఎంత నాణ్యంగా పని చేశామనేది ముఖ్యమని మరికొందరు దిగ్గజాలు అభిప్రాయపడుతున్న సంగతి తెలిసిందే.

ఫ్యాషనైపోయింది..

''ఎక్కువగా కష్టపడకూడదంటూ మాట్లాడటం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారిపోయింది. పనుల్లో జాప్యం జరగకుండా, ఖర్చులు పెరిగిపోకుండా, ప్రపంచ స్థాయి నాణ్యతతో, గడువు కన్నా ముందుగా ప్రాజెక్టులను పూర్తి చేయాలంటే భారత్ కష్టపడి పని చేయాల్సిందే. ఇక పని–కుటుంబ జీవితం మధ్య సమతౌల్యం పాటించాలనే విషయానికొస్తే.. నేను ప్రతి రోజూ వ్యాయామం చేస్తాను. గోల్ఫ్ ఆడతాను. ఇవన్నీ చేస్తూనే నేను ప్రతి రోజూ కష్టపడి పని కూడా చేస్తాను. మీకు వ్యక్తిగతంగా ఒకటిన్నర గంటలు మీకోసమే పక్కన పెట్టుకున్నా మీకు రోజులో ఇంకా 22.5 గంటలు ఉంటాయి. పని–కుటుంబ బాధ్యతల మధ్య సమతౌల్యం పాటించడానికి బోలెడంత సమయం ఉంటుంది. కష్టపడకపోవడమనేదాన్ని ఏదో ఫ్యాషన్‌గా మార్చొద్దు. పెద్దగా శ్రమించకుండానే భారత్ గొప్ప దేశంగా ఎదగగలదంటూ యువతకు తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయి. కష్టపడకుండా ఏ దేశమూ ఎదగలేదు'' అని అమితాబ్ కాంత్ స్పష్టం చేశారు.

స్థానిక కంటెంట్‌తో షార్ట్ వీడియోలకు డిమాండ్

- ప్రాంతీయంగా ఆదరణ
- షేర్‌చాట్ సీఎఫ్‌వో చరణ్




న్యూఢిల్లీ: భారత్‌లో స్వల్ప నిడివి వీడియోలకు (షార్ట్ వీడియోలు) బూమింగ్ ఇప్పుడే మొదలైందని షేర్‌చాట్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) మనోహర్‌సింగ్ చరణ్ పేర్కొన్నారు. సృజనాత్మకతతో కూడిన స్థానిక కంటెంట్‌ను చిన్న పట్టణాల్లోనూ ఆదరిస్తుండడం డిమాండ్‌ను పెంచుతున్నట్టు చెప్పారు. ప్రాంతీయ ప్రాధాన్యం కలిగిన విభిన్నమైన సేవలు స్థిరమైన డిమాండ్‌కు దోహదపడుతున్నట్టు, ప్రేక్షకులకు చేరువ అయ్యేందుకు బ్రాండ్లకు కొత్త అవకాశాలు తీసుకొస్తున్నట్టు చెప్పారు. దేశ జనాభాలో ఇంటర్నెట్ చేరువ 60%కి వచ్చినట్టు, 65 కోట్ల ఇంటర్నెట్ యూజర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇంటర్నెట్‌కు అనుసంధానమైన వారు సోషల్ మీడియా, షార్ట్ వీడియోలకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్టు చెప్పారు.

లాభాలకు చేరువలో..: కన్సాలిడేటెడ్ స్థాయిలో ఎబిటా పాజిటివ్‌కు కంపెనీ చేరువలో షేర్‌చాట్ ఉన్నట్టు చరణ్ తెలిపారు. లాభాల్లోకి ప్రవేశించనున్న నేపథ్యంలో నియామకాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్టు చెప్పారు. గూగుల్ మద్దతుతో నడుస్తున్న షేర్‌చాట్ వచ్చే రెండేళ్లలో ఐపీవోకు వచ్చే ప్రణాళికలతో ఉంది. ఆదాయంలో 33% వృద్ధిని సాధించగా, నష్టాలు మూడింట ఒక వంతుకు తగ్గిపోయినట్టు ప్రకటించారు. స్టాండలోన్ ప్రాతిపదికన షేర్‌చాట్ ఎబిటా స్థాయిలో లాభాల్లోకి వచ్చినట్టు వెల్లడించారు.

ఉద్యోగాలు పెరుగుతున్నాయి, ప్చ్.. జీతాలే..

- ద్రవ్యోల్బణానికి తగ్గట్లుగా పెరగడం లేదు
- నైపుణ్యాల కొరతే ఇందుకు కారణం
- నీతి ఆయోగ్ సభ్యుడు విర్మానీ



న్యూఢిల్లీ: దేశంలో ఉద్యోగాలు పెరుగుతున్నప్పటికీ, ద్రవ్యోల్బణానికి తగ్గట్లుగా జీతాలు మాత్రం పెరగడం లేదని నీతి ఆయోగ్ సభ్యుడు అరవింద్ విర్మానీ వ్యాఖ్యానించారు. గత ఏడేళ్లుగా ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. ఇందుకు నైపుణ్యాల కొరతే ప్రధాన కారణమని తెలిపారు. అత్యధిక జనాభాను భారత్ ప్రయోజనకరమైన అంశంగా మల్చుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం బోధన, శిక్షణను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే డేటా ప్రకారం వర్కర్లు–జనాభా నిష్పత్తి గత ఏడేళ్లుగా పెరుగుతోంది. అంటే జనాభా వృద్ధికి మించి ఉద్యోగాల సంఖ్య పెరుగుతోంది. కాబట్టి ఉద్యోగాలు పెరగడం లేదనడం తప్పు. క్యాజువల్ వర్కర్ల వాస్తవ వేతనాలూ పెరిగాయని, వారి పరిస్థితులూ మెరుగుపడ్డాయని గణాంకాలు చెబుతున్నాయి. కానీ రెగ్యులర్ జీతాల ఉద్యోగాలే పెద్ద సమస్యగా ఉంటోంది. ఈ కేటగిరీలో ఏడేళ్లుగా ద్రవ్యోల్బణానికి తగ్గట్లుగా వాస్తవ వేతనాలు పెరగలేదు' అని విర్మానీ చెప్పారు. మిగతా దేశాల గణాంకాలతో పోల్చి చూసినప్పుడు, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంపై భారత్ మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనిపిస్తోందని తెలిపారు.

జిల్లా స్థాయిలో ఫోకస్ చేయాలి..

కేంద్ర ప్రభుత్వం దీనిపై తగు చర్యలు తీసుకుంటోందని, రాష్ట్రాలు కూడా ఈ దిశగా కసరత్తు చేయాలని చెప్పారు. ఉద్యోగాల కల్పన జిల్లా స్థాయిలో జరుగుతుంది కాబట్టి అక్కడ దృష్టి పెట్టాలన్నారు. ఇప్పటికే పని చేస్తున్న వారికే కాకుండా కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న వారికి కూడా నైపుణ్యాలు అవసరమేనని విర్మానీ చెప్పారు. 'ఉద్యోగం, నైపుణ్యాలనేవి ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. నైపుణ్యాలుంటే ఉద్యోగం దక్కించుకోవడం సులభమవుతుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మనం అన్ని అంశాల్లోనూ మెరుగుపడాలి. అవకాశాలను అందిపుచ్చుకోవాలి' అని వివరించారు.

ఇలా కూడా ఆరా తీస్తారు..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఆదాయపు పన్ను డిపార్టుమెంటు వారు, ఒక్కో అస్సెస్సీకి సంబంధించిన అసెస్‌మెంట్ పూర్తి చేసినప్పుడు సమాచారం అడగడానికి అధికారాలు ఉన్నాయి. ఇప్పుడు అమల్లో ఉన్న చట్టం ప్రకారం 142 (1) సెక్షన్ కింద విస్తృత అధికారాలు ఉన్నాయి. ఈ మధ్యే ఒక అస్సెస్సీకి నోటీసులు వచ్చాయి. ''మీరు మీ ఇంటి ఖర్చుల నిమిత్తం, సొంత వాడకాలు లేదా విత్‌డ్రాయల్స్ చాలా తక్కువగా చూపించారు. కాబట్టి మీ కుటుంబ సభ్యుల వివరాలు, వారి ప్రొఫైల్ వివరాలు, వారి పర్మనెంట్ అకౌంట్ నంబర్లు, వారి వార్షికాదాయం వివరాలు ఇవ్వండి'' అనేది దాని సారాంశం. ఇవే కాకుండా ఈ కింది వివరాలు కూడా ఇవ్వాల్సి వచ్చింది.

- నెలవారీ రేషన్ వివరాలు. ఎంత కొన్నారు, ఏ రేటుకు కొన్నారు.
- గోధుమ పిండి ఎంత కొన్నారు.. బియ్యం ఎంత?
- పప్పు ధాన్యాలెంత కొన్నారు..ఎంతకి కొన్నారు?
- నూనె ఎంత వాడారు.. ఎంతకు కొన్నారు?
- వంట గ్యాస్ వినియోగం వివరాలు.
- కరెంటు బిల్లెంత
- కొన్న బట్టల వివరాలు
- షూస్, పాలిష్, జోళ్ల వివరాలు
- క్షవరానికి ఎంత ఖర్చుపెట్టారు
- కాస్మెటిక్స్, స్ప్రేలు
- ఏయే వేడుకలు చేసుకున్నారు. ఖర్చెంత?
- పిల్లల చదువులు, పుస్తకాలు, స్కూల్ ఫీజుల వివరాలు
- మీరు చెల్లించే అద్దె వివరాలు
- కారు నిర్వహణ ఖర్చులు, ఇన్సూరెన్స్ ఎంత?
- హెల్త్ ఇన్సూరెన్స్ వివరాలు
- బిల్డింగ్ నిర్వహణ, ఇన్సూరెన్స్ వివరాలు
- జీవిత బీమా ప్రీమియం చెల్లింపులు
- చుట్టాలకు, స్నేహితులకు బహుమతులు ఏమిచ్చారు. వాటి విలువెంత?
- రెస్టారెంట్ల ఖర్చులెంత?
- గెట్ టుగెదర్‌లాంటి కార్యక్రమాల ఖర్చులు
- సంఘంలోని కార్యకలాపాలు, ఖర్చులు
- రోజువారీ ఖర్చులు

ఇలా అన్నింటి వివరాలూ ఇవ్వాలి. ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులున్నారో, వారందరి ఆదాయపు వివరాలు, ఖర్చుల వివరాలు, రుజువులతో సహా ఇవ్వాలి.

చివర్లో కొసమెరుపు .. కాదు కాదు.. బెదిరింపు ఏమిటంటే, ''ఈ వివరాలు ఇవ్వకపోతే మీరు ప్రతి సంవత్సరం ఇంటి ఖర్చుల నిమిత్తం రూ. 10,00,000 విత్‌డ్రా చేసినట్లుగా భావిస్తాము'' అని.

అలా భావిస్తే.. భావించారు.. అక్కడితో ఊరుకోరు. ఆ మొత్తం మీద పన్ను కూడా వేస్తారు.

అయితే, సాక్షి పాఠకలోకానికి ఈ అంశం కొత్త కాదు. మనం గతంలో ఎన్నోసార్లు చెప్పుకున్నాం. ఏ ఖర్చుకైనా ''సోర్స్'' ఉండాలి. సోర్స్‌కు సరైన వివరణ లేకపోతే ఆ ఖర్చును ఆదాయంగా భావిస్తారు.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలంలో సంపద సృష్టి!

మిరే అస్సెట్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్



ఈక్విటీలు ఎప్పుడూ అస్థిరతలతో చలిస్తుంటాయి. కొంత కాలం పాటు ర్యాలీ చేసి, కొంత కాలం దిద్దుబాటుకు గురవుతుంటాయి. భారత్ వేగంగా వృద్ధి చెందుతూ, అభివృద్ధి చెందిన దేశం కావాలన్న ఆకాంక్షలతో అడుగులు వేస్తోంది. కనుక దీర్ఘకాలంలో ఈక్విటీల్లో మెరుగైన రాబడులకే ఎక్కువ అవకాశాలున్నాయి. ఇన్వెస్టర్లు ముఖ్యమైన ఆర్థిక లక్ష్యాల కోసం ఈక్విటీల్లో, అది కూడా లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ విభాగంలో పెట్టుబడి పెట్టుకోవడం ద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు పొందే అవకాశాలుంటాయన్నది నిపుణుల సూచన. ఈ రెండు విభాగాల్లో పెట్టుబడికి వీలు కల్పిస్తున్నదే మిరే అస్సెట్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్. కనీసం 10 ఏళ్లు అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు ఈ పథకంలో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) పెట్టుబడులను పరిశీలించొచ్చు.



రాబడులు

ఈ పథకం గడిచిన ఏడాదిలో ఒక శాతం నష్టాన్నిచ్చింది. ఇటీవలి కాలంలో స్టాక్స్ గణనీయంగా దిద్దుబాటుకు గురి కావడం చూస్తున్నాం. దీని ఫలితమే ఏడాది కాలంలో రాబడి కాస్తా నష్టంగా మారిపోవడం. మూడేళ్ల కాలాన్ని పరిశీలిస్తే 12 శాతానికి పైనే వార్షిక రాబడి ఈ పథకంలో ఇన్వెస్టర్లకు లభించింది. అదే ఐదేళ్లలో ఏటా 17 శాతం పెట్టుబడులపై రాబడి తెచ్చిపెట్టింది. ఏడేళ్లలోనూ 14.63 శాతం, పదేళ్లలో 16 శాతం చొప్పున వార్షిక రాబడులను అందించింది. ఈ పథకం గతంలో మిరే అస్సెట్ ఎమర్జింగ్ బ్లూచిప్ ఫండ్ పేరుతో పనిచేసింది. 2010 జూలైలో పథకం ప్రారంభం కాగా, నాటి నుంచి చూస్తే ఇప్పటి వరకు వార్షిక రాబడి 19 శాతంగా ఉండడం గమనార్హం.

పెట్టుబడుల విధానం

పేరులో ఉన్నట్టుగా ఈ పథకం లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంటుంది. కంపెనీల భవిష్యత్ వృద్ధి సామర్థ్యాలపై ఈ పథకం ప్రధానంగా దృష్టి పెడుతుంది. భవిష్యత్‌లో దిగ్గజాలుగా ఎదిగే సామర్థ్యాలున్న కంపెనీలను ముందుగానే ఎంపిక చేసి ఇన్వెస్ట్ చేస్తుంది. దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగిస్తుంటుంది. ఈ పథకం సాధారణంగా 35–65 శాతం మధ్య లార్జ్‌క్యాప్ కంపెనీలకు (మార్కెట్ విలువ పరంగా 100 అగ్రగామి కంపెనీలు) కేటాయిస్తుంటుంది. మిడ్‌క్యాప్ కంపెనీలకు (మార్కెట్ విలువ పరంగా 101 నుంచి 250వరకు ఉన్నవి) కేటాయింపులు 35–65 శాతం మధ్య నిర్వహిస్తుంటుంది. భవిష్యత్ బ్లూచిప్ కంపెనీల్లో ముందే పెట్టుబడికి ఈ పథకం వీలు కల్పిస్తుంది. బోటమ్‌అప్, వ్యాల్యూ ఇన్వెస్టింగ్ విధానాలను అనుసరించి స్టాక్స్‌ను ఎంపిక చేస్తుంటుంది. అధిక నాణ్యమైన కంపెనీల్లో సహేతుక ధరల వద్దే పెట్టుబడులు పెడుతుంది. ఈ పథకం మొదలైన నాటి నుంచి నీలేష్ సురానా ఫండ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	4.61
యాక్సిస్ బ్యాంక్	4.14
ఎస్‌బీఐ	3.24
ఎల్‌అండ్‌టీ	2.43
ఇన్ఫోసిస్	2.32
ఐసీఐసీఐ బ్యాంక్	2.30
టాటా పవర్	1.82
రిలయన్స్ ఇండస్ట్రీస్	1.79
ఎస్ఆర్ఎఫ్	1.72
వన్97 కమ్యూనికేషన్స్	1.68

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.36,514 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99.31 శాతాన్ని ఇప్పటికే ఇన్వెస్ట్ చేసింది. మిగిలినది నగదు రూపంలో కలిగి ఉంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 103 స్టాక్స్ ఉన్నాయి. ప్రస్తుతం లార్జ్‌క్యాప్‌లో 63 శాతం పెట్టుబడులు ఉన్నాయి. మిడ్‌క్యాప్‌లో 34 శాతానికి పైనే ఇన్వెస్ట్ చేసింది. స్మాల్‌క్యాప్ కంపెనీలకు 2.49 శాతం కేటాయింపులు చేసింది. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 28 శాతం పెట్టుబడులు కేటాయించింది. ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో 13.71 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 13 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 11 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

సమష్టిగా... సగర్వంగా...



యశ్ రాథోడ్



కరుణ్ నాయర్

హర్ష్ దూబే

జట్టులో స్టార్స్ ఎవరూ లేకున్నా... సమష్టితత్వమే విజయ మంత్రంగా ముందుకు సాగితే అద్భుతాలు చేయవచ్చని... అవసరమైన ప్రతి సందర్భంలో ఎవరో ఒకరు బాధ్యతలు తీసుకునేలా తర్ఫీదునిస్తే ఫలితాలు వాటంతటే అవే వస్తాయని విదర్భ క్రికెట్ జట్టు మరోసారి నిరూపించింది. ఆరేళ్ల క్రితం వరుసగా రెండు సీజన్లలో రంజీ ట్రోఫీ టైటిల్ సాధించిన విదర్భ ఆ తర్వాత తడబడింది. కానీ ఈసారి మాత్రం అందరూ తమవైపు చూసేలా ఆడుతూ చివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోకుండా రంజీ రారాజు తామేనని చాటుకుంది. బ్యాటింగ్‌లో యశ్ రాథోడ్, కరుణ్ నాయర్, దానిశ్ మాలేవార్, అక్షయ్ వాడ్కర్ మెరిస్తే... బంతితో హర్ష్ దూబే రికార్డులు తిరగరాశాడు. వెరసి విదర్భ మూడోసారి రంజీ ట్రోఫీని ముద్దాడింది. - సాక్షి క్రీడావిభాగం

గతేడాది రంజీ ట్రోఫీ ఫైనల్లో ముంబై చేతిలో ఓడిన విదర్భ జట్టు... ఈ సీజన్ కోసం పెద్ద కసరత్తే చేసింది. ఆటగాళ్లకు ప్రత్యేక శిక్షణ నుంచి మొదలు కొని... తుది జట్టు ఎంపిక వరకు ప్రతి దానిపై దృష్టి పెట్టి మెరుగైన ఫలితాలు సాధించింది. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా దేశవాళీల్లో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న విదర్భ జట్టు.. సమష్టి కృషితో కదంతొక్కి మూడోసారి రంజీ చాంపియన్‌గా ఆవిర్భవించింది. ఈ సీజన్‌లో ఆడిన 10 మ్యాచ్‌ల్లో ఒక్కటంటే ఒక్క దాంట్లోనూ ఓటమి రుచిచూడని విదర్భ... తొమ్మిది దశాబ్దాల రంజీ ట్రోఫీ చరిత్రలో తొలిసారి రెండు విడతలుగా మ్యాచ్‌లు నిర్వహించినా ఎక్కడా లయ కోల్పోలేదు. యువ ఆటగాళ్లపై నమ్మకముంచడం... వారికి బాధ్యతలు ఇచ్చి మెరుగైన ప్రదర్శన రాబట్టుకోవడం వల్లే విదర్భ మూడోసారి విజేతగా నిలవగలిగింది. ఫలితంగానే 22 ఏళ్ల హర్ష్ దూబే అత్యధిక వికెట్ల వీరుల జాబితాలో అగ్రస్థానం దక్కించుకోగా... 24 ఏళ్ల యశ్ రాథోడ్ అత్యధిక పరుగులు చేసిన వారిలో 'టాప్'గా నిలిచాడు. కేవలం యువ ఆటగాళ్ల మీదే భారం వేయకుండా అనుభవజ్ఞులకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో విదర్భ మేనేజ్‌మెంట్ సఫలీకృతమైంది. భారత జట్టు తరఫున 6 టెస్టులు, 2 వన్డేలు ఆడిన సీనియర్ ప్లేయర్ కరుణ్ నాయర్ ఈ సీజన్‌లో విదర్భ తరఫున విజృంభించాడు. రంజీ సీజన్ మధ్యలో జరిగిన విజయ్ హజారే వన్డే టోర్నీలో 5 శతకాలు బాదిన నాయర్... రంజీ ట్రోఫీలో మరో నాలుగు సెంచరీలతో చెలరేగాడు.

సంపూర్ణ ఆధిపత్యం...

లీగ్ దశలో ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఆరింట గెలిచి... ఒక దాన్ని 'డ్రా' చేసుకొని 40 పాయింట్లతో నాకౌట్‌కు చేరిన విదర్భ జట్టు క్వార్టర్ ఫైనల్లో తమిళనాడుపై 198 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇక కీలక సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ముంబైపై 80 పరుగుల తేడాతో గెలిచి... గతేడాది ఫైనల్లో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకుంది. మరోవైపు జమ్మూకశ్మీర్‌తో క్వార్టర్ ఫైనల్లో ఒక పరుగు, గుజరాత్‌తో సెమీఫైనల్లో రెండు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించి ముందంజ వేసిన కేరళ జట్టు చివరకు తుదిపోరులో అదే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. తుదిపోరులో ఒక దశలో కేరళ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కడం ఖాయమే అనుకుంటున్న సమయంలో హర్ష్ దూబే మ్యాచ్‌ను మలుపుతిప్పాడు. ఈ సీజన్‌లో ఆల్‌రౌండర్‌గా అదరగొట్టిన హర్ష్ 69 వికెట్లు పడగొట్టి... ఒక రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్రకెక్కాడు. బ్యాటింగ్‌లోనూ మెరిసిన అతడు 476 పరుగులు చేశాడు. ఇందులో 5 అర్ధశతకాలు ఉన్నాయి. దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సలహాలతో ఆల్‌రౌండర్‌గా మరింత రాటుదేలుతున్న హర్ష్... భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తదుపరి లక్ష్యమని అన్నాడు.

రంజీ ట్రోఫీతో విదర్భ జైత్రయాత్ర

- పరాజయం లేకుండా విజేతగా నిలిచిన వైనం
- మూడోసారి దేశవాళీ క్రికెట్ కిరీటం సొంతం
- 'టాప్' లేపిన యశ్ రాథోడ్, హర్ష్ దూబే
- కదంతొక్కిన కరుణ్ నాయర్, అక్షయ్ వాడ్కర్

అదరగొట్టిన యశ్ రాథోడ్

విదర్భ జట్టు మూడోసారి రంజీ విజేతగా నిలవడంలో యువ బ్యాటర్ యశ్ రాథోడ్ పాత్ర కీలకం. ఈ సీజన్‌లో 10 మ్యాచ్‌లాడిన యశ్... 53.33 సగటుతో 960 పరుగులు సాధించాడు. ఇందులో 5 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్ల జాబితాలో యశ్ 'టాప్' ప్లేస్‌లో నిలిచాడు. ఈ సీజన్ ఆరంభానికి ముందే విదర్భ జట్టుతో చేరిన సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్... 53.93 సగటుతో 863 పరుగులు సాధించాడు. ఇందులో 4 శతకాలు, 2 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో నాయర్ నాలుగో స్థానంలో నిలిచాడు. కేరళతో ఫైనల్లో అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 86, 135 పరుగులు చేసి విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఫైనల్లో రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 153, 73 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కించుకున్న 21 ఏళ్ల మాలేవర్... సీజన్‌లో 52.20 సగటుతో 783 పరుగులు సాధించాడు. అందులో 2 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో 215 పరుగులు జతచేసిన కరుణ్ నాయర్, మాలేవర్ జోడీ... రెండో ఇన్నింగ్స్‌లో 183 పరుగులు చేసింది. దీంతో కేరళ జట్టు తిరిగి కోలుకునే అవకాశం లేకుండా పోయింది. 10 మ్యాచ్‌ల్లో 45.12 సగటుతో 722 పరుగులు చేసిన విదర్భ సారథి అక్షయ్ వాడ్కర్... సమష్టికృషికి దక్కిన అత్యుత్తమ ఫలితం ఇదని అన్నాడు. జట్టులో ప్రతి ఒక్క ఆటగాడు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడంతోనే మూడోసారి రంజీ ట్రోఫీ చేజిక్కించుకున్నామని పేర్కొన్నాడు.

అక్షయ్ వాఖరే రిటైర్మెంట్

రంజీ ఫైనల్ అనంతరం విదర్భ సీనియర్ స్పిన్నర్ అక్షయ్ వాఖరే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దేశవాళీల్లో 105 మ్యాచ్‌లాడిన ఈ కుడిచేతి వాటం స్పిన్నర్ 344 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. 'రంజీ చాంపియన్ జట్టులో భాగస్వామి కావడం ఆనందంగా ఉంది. విజేతగా వీడ్కోలు పలకడం కంటే ఇంకేం కావాలి. 100 మ్యాచ్‌ల అనంతరం తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. కానీ జట్టు అవసరాల దృష్ట్యా సీజన్ ముగిసేవరకు కొనసాగాను' అని 39 ఏళ్ల వాఖరే వెల్లడించాడు.



అక్షయ్ వాడ్కర్

స్టార్లు లేకపోయినా...

పెద్దగా పేరున్న ఆటగాళ్లు జట్టులో లేకపోయినా... కేవలం 'టీమ్ వర్క్'పైనే ఆధారపడ్డ విదర్భ జట్టు సీజన్ ఆసాంతం చక్కటి ప్రదర్శన కనబర్చి దేశవాళీల్లో మెరుగైన జట్టుగా పరిణతి చెందింది. ఉస్మాన్ ఘనీ కోచింగ్‌లో ఆరితేరిన విదర్భ జట్టు ఏ స్థాయిలోనూ పట్టు సడలించలేదు. 'ఈసారి జట్టులో అటు యువ ఆటగాళ్లు, ఇటు అనుభవజ్ఞులు ఉండేలా చూసుకున్నాం. ఇది జట్టంతా కలిసి తీసుకున్న నిర్ణయం. కేవలం ట్రోఫీ గెలవడమే కాదు. మున్ముందు జాతీయ జట్టుకు నాణ్యమైన ఆటగాళ్లను అందించాలనే లక్ష్యంతో పనిచేశాం. హర్ష్ దూబేకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. ప్రతి ఆటగాడికి అది ముఖ్యం. కేవలం బౌలర్‌గానే కాకుండా... అతడు బ్యాట్‌తోనూ పలు కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. సీజన్ ఆసాంతం రాణించడం వల్లే అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. రంజీ ఫైనల్ తర్వాత ఫస్ట్ క్లాస్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన అక్షయ్ వాఖరే... కీలక మ్యాచ్‌ల్లో హర్ష్‌కు దిశానిర్దేశం చేశాడు. బ్యాటింగ్‌లో యశ్ రాథోడ్ చక్కటి ప్రదర్శన కనబర్చాడు. అతడిలో చాలా నైపుణ్యం ఉంది. కరుణ్ నాయర్ అనుభవం మాకెంతో పనికి వచ్చింది. యువ ఆటగాళ్లతో కలిసి అతడు చక్కటి భాగస్వామ్యాలు నమోదు చేయడమే విజయానికి బాటలు వేసింది. గతేడాది జట్టులో ఉన్నప్పటికీ మ్యాచ్ ఆడే అవకాశం దక్కని దానిశ్ మాలేవర్ ఈసారి నిరూపించుకున్నాడు. ఫైనల్లో అతడి తెగువ అసమానం. ఇలా ప్రతి ఒక్కరూ విజయంలో తమ వంతు పాత్ర పోషించారు' అని ఉస్మాన్ వెల్లడించాడు.

అఫ్గానిస్తాన్‌ను చూసి నేర్చుకోండి

విండీస్ జట్టుకు వివ్ రిచర్డ్స్ హితవు



ముంబై: ప్రస్తుతం జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో వెస్టిండీస్ జట్టుకు పాల్గొనే అర్హత లేకపోవడం బాధ, ఒకింత చిరాకు పరుస్తోందని కరీబియన్ దిగ్గజం వివియన్ రిచర్డ్స్ చెప్పారు. తాజా మెగా టోర్నీలో వన్డే ప్రపంచకప్ మాజీ చాంపియన్లు విండీస్, శ్రీలంక జట్లు అర్హత సాధించలేకపోయాయి. దీనిపై ఆయన మాట్లాడుతూ... క్రికెట్‌లో రోజురోజుకు పరిణతి సాధిస్తూ... ప్రదర్శన మెరుగుపర్చుకుంటున్న అఫ్గానిస్తాన్ జట్టును చూసి తమ ఆటగాళ్లు ఎంతో నేర్చుకోవాలని హితవు పలికారు. 'మైదానంలో దిగినపుడు అఫ్గాన్ ఆటగాళ్లలో కసి కనిపిస్తుంది. వారి పోరాటం ముచ్చటేస్తుంది. ఎందుకంటే అంతర్జాతీయ క్రికెట్‌లోకి వచ్చి ఎన్నో ఏళ్ళు కాలేదు. అయినాసరే... దశాబ్దాలుగా ఆడుతున్న మిగతా జట్ల కంటే ఎంతో మెరుగ్గా అఫ్గాన్ ఆడుతోంది. ఏటికేడు ప్రగతి సాధిస్తున్న వారి ఆటతీరు అద్భుతం. ఈ చాంపియన్స్ ట్రోఫీనే చూసుకుంటే మా వెస్టిండీస్ జట్టు టాప్-8లో లేక టోర్నీకి దూరమైంది. మరోవైపు నిలకడగా రాణిస్తున్న అఫ్గానిస్తాన్ మేటి జట్లతో తలపడుతోంది' అని అన్నారు. ఇలాంటి జట్టును, ప్రతిభను చూసి వెస్టిండీస్ మారాలన్నారు. క్రికెటర్లు మాత్రమే కాదు... బోర్డు, దేశవాళీ పరిస్థితులు అన్నింటా మార్పు తేవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ మ్యాచ్‌లను దుబాయ్‌లో నిర్వహించడంపై రిచర్డ్స్ కాస్త అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇంగ్లండ్ మాజీలు నాసిర్ హుస్సేన్, మైక్ అథర్టన్ ఒక్క దుబాయ్ వేదికపై భారత్ అన్ని మ్యాచ్‌లు ఆడటం, వచ్చే అనుకూలతలపై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

పోరాడి ఓడిన శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ



సాక్షి, హైదరాబాద్: ఐ-లీగ్ జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఏడో పరాజయం చవిచూసింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు 0-1 గోల్ తేడాతో నామ్‌ధారి ఎఫ్‌సీ జట్టు చేతిలో ఓడిపోయింది. ఆట 12వ నిమిషంలో క్లైడ్సన్ కర్వాలో డసిల్వా గోల్‌తో నామ్‌ధారి జట్టు ఖాతా తెరిచింది. ఆ తర్వాత చివరి వరకు నామ్‌ధారి జట్టు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని ఈ సీజన్‌లో ఏడో విజయాన్ని అందుకుంది. 12 జట్లు పోటీపడుతున్న ఐ-లీగ్‌లో శ్రీనిధి జట్టు 17 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 6 మ్యాచ్‌ల్లో గెలిచి, 4 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, 7 మ్యాచ్‌ల్లో ఓడి 22 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉంది. ఈనెల 8న పంజాబ్‌లోని మహిల్పూర్ స్టేడియంలో జరిగే తదుపరి మ్యాచ్‌లో ఢిల్లీ ఎఫ్‌సీ జట్టుతో శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు ఆడుతుంది.

తెలంగాణ శుభారంభం



పంచ్‌కుల: జాతీయ సీనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్టు శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన 'బి' డివిజన్ పూల్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ 3-1 గోల్స్ తేడాతో అస్సాంపై ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అస్సాం జట్టే ముందుగా బోణీ కొట్టింది. తొలి క్వార్టర్‌లోనే అస్సాం కెప్టెన్ మున్‌మునీ దాస్ 14వ నిమిషంలో చేసిన ఫీల్డ్ గోల్‌తో జట్టు 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ అస్సాం జోరు ఆ క్వార్టర్‌కే పరిమితమైంది. రెండో క్వార్టర్‌లో అనూహ్యంగా పుంజుకున్న తెలంగాణ అమ్మాయిలు ఏకంగా నిమిషాల వ్యవధిలోనే మూడు గోల్స్ చేయడంతో అస్సాం క్రీడాకారిణులు చేష్టలుడిగారు. 23 నిమిషంలో ప్రతివ కిండో, 26వ నిమిషంలో సుమి ముందరి, 28వ నిమిషంలో పూజ రాథోడ్ తలా ఒక గోల్ చేశారు. తర్వాతి క్వార్టర్లలో ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న తెలంగాణ 3-1తో జయకేతనం ఎగురవేసింది. ఇదే డివిజన్‌లో జరిగిన పూల్ 'బి' పోటీల్లో ఢిల్లీ 1-0తో హిమాచల్ ప్రదేశ్‌పై గెలుపొందగా... చత్తీస్‌గఢ్, చండీగఢ్‌ల మధ్య జరిగిన పోరు 1-1తో 'డ్రా'గా ముగిసింది.

నమస్తే దివ్య...

వైశాలి ఉదంతం నేపథ్యంలో ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ నొదిర్బెక్ సంస్కారం



ప్రాగ్ (చెక్ రిపబ్లిక్): ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ నొదిర్బెక్ యకుబొయెవ్ తీరు మార్చుకున్నాడు. ప్రత్యర్థిని గౌరవించి సంస్కారం చూపాడు. ప్రాగ్ చెస్ ఫెస్టివల్‌లో భాగంగా చాలెంజర్ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న నొదిర్బెక్ తనకు ఎదురైన భారత ప్రత్యర్థి, ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌కి రెండు చేతులు జోడించి 'నమస్తే' అన్నాడు. దీనికి దివ్య కూడా ప్రతి నమస్కారం చేసింది. 23 ఏళ్ల యకుబొయెవ్ మూడో రౌండ్‌కు ముందు దివ్యకు నమస్కరించాడు. ఈ రౌండ్లో ఉజ్బెకిస్తాన్ ఆటగాడు... భారత అమ్మాయిపై విజయం సాధించాడు. మూడు రౌండ్లలో ఒక గేమ్ నెగ్గిన దివ్య రెండు గేముల్లో ఓడింది. ఉజ్బెక్ ప్లేయర్ తాజా వ్యవహారశైలి గతంలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్ వైశాలి ఉదంతాన్ని మరిచిపోయేలా చేసింది.

అప్పుడేం జరిగిందంటే...

జనవరిలో టాటా స్టీల్ చాలెంజర్స్ చెస్ టోర్నీలో (విక్‌ఆన్‌జీ, నెదర్లాండ్స్) నొదిర్బెక్... వైశాలి మధ్య మ్యాచ్ మొదలయ్యేందుకు ముందు ఆనవాయితీ ప్రకారం భారత అమ్మాయి కరచాలనం కోసం చేయి చాచగా... అదేం అక్కర్లేదన్నట్లుగా ఉజ్బెక్ ఆటగాడు షేక్‌హ్యాండ్‌కు నిరాకరించాడు. ఈ 'నో షేక్‌హ్యాండ్' ఉదంతం సోషల్ మీడియాలో వివాదం రేపింది. నెటిజన్లంతా నొదిర్బెక్ సంస్కారహీనుడంటూ కామెంట్లు పెట్టారు. ఇది కాస్తా వైరల్ కావడంతో వెంటనే ఉజ్బెకిస్తాన్ ఆటగాడు... కావాలని నిరాకరించలేదని, మతపరమైన కట్టుబాట్లతోనే పరాయి అమ్మాయి చేతిని తాకలేదని... ప్రతిభావంతురాలైన వైశాలీఅన్నా... భారతీయులన్నా తనకెంతో గౌరవమని 'ఎక్స్'లో వివరణ ఇచ్చాడు. కేవలం ట్వీట్‌తో ఆగకుండా టోర్నీ ఆడేందుకు వచ్చిన అక్కాతమ్ముళ్లు వైశాలి, ప్రజ్ఞానందలతో పాటు తోడుగా వచ్చిన వారి తల్లి నాగలక్ష్మిని వ్యక్తిగతంగా కలిసి పూలు, చాక్లెట్లు ఇచ్చి క్షమాపణలు చెప్పడంతో ఆ వివాదం అక్కడితో ముగిసింది.

బరిలో భారత్ ఉంటే... పోటీ ఇంకా పెరుగుతుంది!

2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల బిడ్‌పై సెబాస్టియన్ కో వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఒలింపిక్స్ (2036) బిడ్డింగ్‌లో భారత పాల్గొంటే ఆతిథ్య పోటీ మరింత రసవత్తరంగా ఉంటుందని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఉన్నతాధికారి సెబాస్టియన్ కో తెలిపారు. ప్రస్తుతం వరల్డ్ అథ్లెటిక్స్ చీఫ్‌గా ఉన్న సెబాస్టియన్ కో ఈనెలలో జరిగే ఐఓసీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీపడుతున్నారు. ఐఓసీ భవిష్యత్ టోర్నీల కమిషన్‌కు ఇప్పటికే భారత్ 2036 ఒలింపిక్స్, పారాలింపిక్స్ ఆతిథ్యం కోసం ప్రాథమిక ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తు చేసింది. ఏ దేశమైనా ఆతిథ్య రేసులో ఉండాలనుకుంటే ఇలాగే తొలి అడుగు వేయాల్సి ఉంటుంది. అంతా అనుకున్నట్లు జరిగితే గుజరాత్‌లోని అహ్మదాబాద్ విశ్వ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాలున్నాయి. 'విశ్వక్రీడల నిర్వహణ కోసం బిడ్డింగ్‌లో భారత్ పాల్గొననుండటం చాలా సంతోషంగా ఉంది. ఇది వారి దేశంలో ఒలింపిక్ దశ-దిశను మారుస్తుంది. అయితే ఎవరైనా బిడ్ వేయొచ్చు. కానీ తీవ్రమైన పోటీ ఎదుర్కోక తప్పదు. భారత్‌లాగే పోలాండ్, ఇండోనేసియా, దక్షిణాఫ్రికా, ఖతర్, హంగేరి, టర్కీ, మెక్సికో, ఈజిప్ట్ దేశాలు కూడా ప్రాథమిక ఆసక్తిని తెలియజేశాయి' అని 2012 లండన్ ఒలింపిక్స్ నిర్వహణ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన సెబాస్టియన్ కో అన్నారు. 2026 తర్వాత 2026 ఒలింపిక్స్ ఆతిథ్య దేశాన్ని ప్రకటిస్తారు.

హైదరాబాద్ క్వీన్స్ జట్టుకు అండర్-19 రోయింగ్ లీగ్ టైటిల్

ఓవరాల్ చాంపియన్ కొచ్చి క్వీన్స్ ● ముగిసిన అస్మిత రోయింగ్ లీగ్



సాక్షి, హైదరాబాద్: భారత రోయింగ్ సమాఖ్య, ఖేలో ఇండియా మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'అస్మిత రోయింగ్ లీగ్' అండర్-19 స్థాయిలో హైదరాబాద్ క్వీన్స్ జట్టు విజేతగా నిలిచింది. హుస్సేన్ సాగర్ వేదికగా నిర్వహించిన తొలి ఎడిషన్‌లో కొచ్చి క్వీన్స్ జట్టు ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకుంది. ఈ లీగ్‌లో కేరళ జట్టు మొత్తంగా 6 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యంతో పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఆతిథ్య హైదరాబాద్ క్వీన్స్ జట్టు 4 పసిడి పతకాలు, ఒక కాంస్యంతో రెండో స్థానం దక్కించుకుంది. మొత్తం 8 జట్లు పాల్గొన్న ఈ లీగ్‌లో అండర్-19, అండర్-23 కేటగిరీల్లో 20 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. గత నెల 26న ప్రారంభమైన ఈ లీగ్‌లో మొత్తం 200 మందికి పైగా యువ రోవర్లు పాల్గొన్నారు. అండర్-23 విభాగంలో ఐదు ఈవెంట్లలో నాలుగింట కొచ్చి క్వీన్స్ ఆధిపత్యం కనబర్చింది. అండర్-19 స్థాయిలో ఐదు ఈవెంట్లలో మూడింట గెలిచిన హైదరాబాద్ టైటిల్ గెలుచుకుంది. సింగిల్ స్కల్స్, డబుల్ స్కల్స్, క్వాడ్రుపుల్ స్కల్స్ ఈవెంట్లలో హైదరాబాద్ విజయం సాధించింది. ఆసియా క్రీడల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వర్ష మాట్లాడుతూ... 'గతంలో జాతీయ క్రీడల్లో కేరళ జట్టుకు ప్రాతినిధ్యం వహించా. కానీ ఈ లీగ్ అందుకు విభిన్నంగా సాగింది. దీంట్లో జట్టు స్ఫూర్తి ప్రస్ఫుటించింది. దీంతో మరింత ఉత్సాహంగా పాల్గొన్నా. కొచ్చి క్వీన్స్ తరఫున కాక్స్‌లెస్ ఫోర్స్ విభాగంలో బరిలోకి దిగి విజేతగా నిలవడం ఆనందంగా ఉంది' అని పేర్కొంది.

చెప్పుల్లేకుండా ఇంటర్వ్యూ

వివేక్ పాత వీడియోపై ట్రోలింగ్

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన అమెరికా పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి మరోసారి వార్తల్లో నిలిచారు. గతేడాది ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ తాలూకు ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంట్లోనే ఇంటర్వ్యూ ఇచ్చిన వివేక్ ఆ సమయంలో చెప్పులు వేసుకోలేదు. ప్రస్తుతం రిపబ్లికన్ అభ్యర్థిగా ఒహాయో గవర్నర్ ఎన్నికల బరిలో దిగడంతో నాటి చిత్రాలు మళ్లీ ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. దీనిపై నెటిజన్లు నెగెటివ్ కామెంట్లు చేశారు. 'మనం భారత దేశంలో లేము' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 'బూట్లు లేవు సరే.. కనీసం సాక్సేవి?' అని మరి కొందరు ప్రశ్నించారు. 'బిలియనీర్ ప్రవర్తించాల్సిన తీరు కాదు. థర్డ్ వరల్డ్ అంకుల్ ఎనర్జీ' అని మరో యూజర్ ట్వీట్ చేశారు. 'ఇది ఇంటర్వ్యూ. ఇంట్లో సోఫాలో కజిన్స్‌తో కూర్చుని వైన్ తాగే శనివారం రాత్రి కాదు. భూమ్మీద అత్యంత శక్తివంతమైన దేశంలో ప్రముఖ స్థానం కోసం ఇంటర్వ్యూ ఇస్తున్నప్పుడు కనీసం సాక్సయినా ధరించండి. ఇది అమెరికా సంస్కృతి కాదు. మీ తీరు అమెరికాకు ఆమోద యోగ్యం కాదు. వివేక్ ఎప్పటికీ ఒహాయో గవర్నర్ కాలేరు' అని మరొకరు వ్యాఖ్యానించారు. అమెరికా రేడియో వ్యాఖ్యాత కిమ్ ఐవర్సన్, మలేషియా వ్యాఖ్యాత ఇయాన్ మైల్స్ చియాంగ్ వంటివారు మాత్రం రామస్వామికి మద్దతిచ్చారు. ''ఈ సంస్కృతి విషయాన్ని అర్థం చేసుకోగలను. కానీ మీ సంస్కృతిలో మార్పు రావాల్సి ఉంది. మా ఇళ్లలో మేం షూనే కాదు కదా, సాక్సులు కూడా ధరించం. మా ఇంటికి వచ్చిన అతిథులకు కావాలంటే సోల్ ఉన్న స్లిప్పర్స్ ఇస్తుంటా. నేను మాత్రం ఉత్తి కాళ్లతో నడుస్తా. నిజానికి అదే ఆరోగ్యానికి మంచిది' ఐవర్సన్ అని ట్వీట్ చేశారు. 'సొంతింట్లో చెప్పుల్లేకుండా ఉండటం అమెరికా వ్యతిరేకత ఎలా అవుతుంది? ఇది చెత్త వాదన. ఇలా వాదించేవాళ్లు బెడ్‌మీద కూడా షూ ధరించే పెరిగారనుకుంటా' అని చియాంగ్ ఎద్దేవా చేశారు.



దేశీ మద్యం గుబాళింపులు

బార్లలో దేశవాళీ రకాలకు పెరుగుతున్న డిమాండ్

ప్రపంచంలో విస్కీని అత్యధికంగా వాడేది భారత్‌లోనే. విశ్వవ్యాప్తంగా తయారయ్యే విస్కీలో దాదాపు సగం మన దేశంలోనే ఖర్చయిపోతోంది. విస్కీ, రమ్, జిన్, ఓడ్కా, బ్రాందీ... ఇలా అన్ని రకాలూ కలిపి భారత్‌లో మద్యం మార్కెట్ విలువ ఏకంగా రూ.4.59 లక్షల కోట్లకు చేరింది. మరో మూడేళ్లలో రూ.5.59 లక్షల కోట్లకు చేరుకోవచ్చని అంచనా. ఇంతటి భారీ మార్కెట్‌లో దేశవాళీ మద్యం కూడా తన హవా కొనసాగిస్తోంది. విదేశీ మూలాలున్న విస్కీ, బ్రాందీ, ఓడ్కా లాంటి వాటితో పోలిస్తే స్థానిక రకాలను ప్రేమించే మద్యం ప్రియులు ఎక్కువైపోయారు. వారి అభిరుచికి తగ్గట్లు స్థానిక రకాలకూ స్థానం కల్పించడం బార్లలో ఇప్పుడు పెద్ద ట్రెండ్‌గా మారింది. ఈ ధోరణి నానాటికీ పెరుగుతోందనేందుకు పెరిగిన దేశవాళీ సరకు అమ్మకాలే నిదర్శనం.



టోంగ్‌బా



టోంగ్‌బా.. జుడియా

సిక్కిం, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లలో టోంగ్‌బా అనే స్థానిక మద్యం మద్యపాన ప్రియులకు మహా ఇష్టం. అస్సాంలో జుడియా, మణిపూర్‌లో సేక్‌మాయ్ యూ... ఇలా స్థానిక రుచులకు జనం నానాటికీ ఫిదా అవుతున్నారు. ఇక గోవాలో ఫెనీ చాలా ఫేమస్. ఈ స్థానిక మద్యాన్ని పులియబెట్టిన జీడిపప్పుల నుంచి తయారుచేస్తారు. గోవాలో ఏ మూలన చూసినా, ఏ బార్‌లో చూసినా విదేశీ మద్యంతో పాటు ఫెనీ కూడా అమ్ముతారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులతోపాటు విదేశీ సందర్శకులు కూడా దీన్ని టేస్ట్ చేయకుండా వదిలిపెట్టరు. అందుకే ఇప్పుడక్కడ దీని విక్రయాలు గతంలో పోలిస్తే బాగా పెరిగాయి. ''పోర్చుగీస్ మూలాలున్న ఫెనీకి స్థానిక రుచిని కలపడంతో గోవా సంస్కృతిలో భాగంగా మారింది'' అని మిస్టర్ బార్‌ట్రెండర్‌గా ఇన్‌స్టాలో ఫేమస్ అయిన కాక్‌టేల్ నిపుణుడు నితిన్ తివారీ చెప్పారు.

దేశవ్యాప్తంగా మారిన టేస్ట్

శతాబ్దాల చరిత్ర ఉన్న స్థానిక మద్యం రకాలకు దేశవ్యాప్తంగా ప్రాధాన్యం పెరుగుతోంది. దాంతో అవి బార్లలోనూ అందుబాటులోకి వస్తున్నట్టు తులీహో సీఈఓ, 30బెస్ట్ బార్స్ ఇండియా, ఇండియా బార్‌టెండర్ వీక్ సహ వ్యవస్థాపకుడు విక్రమ్ ఆచంట చెప్పారు. ఈ ట్రెండ్ గతేడాది నుంచి మొదలైందని నెట్‌ఫ్లిక్స్ మిడ్‌నైట్ ఆసియా కన్సల్టెంట్, ప్రముఖ కాక్‌టేల్ నిపుణుడు అమీ ష్రాఫ్ వెల్లడించారు. ''స్థానిక మద్యానికి జై కొట్టడానికి ప్రధాన కారణం సోషల్ మీడియాలో యువత చేస్తున్న ప్రచారమే. హిమాచల్‌లో ధాన్యం, గింజలను ఉడకబెట్టి తయారుచేసే రైస్ వైన్ వంటి స్థానిక రకాలకు ఇప్పుడిప్పుడే డిమాండ్ పెరుగుతోంది'' అని పీసీఓ, ఢిల్లీ జనరల్ మేనేజర్ వికాస్ కుమార్ చెప్పారు. ''ఇదేదో గాలివాటం మార్పు కాదు. పక్కాగా వ్యవస్థీకృతంగా జరుగుతోంది. దేశవాళీ మద్యానికి గుర్తింపు తేవాలని ఇక్కడి కంపెనీలు నడుం బిగించాయి'' అని డియాజియో ఇండియా చీఫ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ విక్రమ్ దామోదరన్ అన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

విలాస వస్తువుగా..

''ఇండియా అగావే, ఫెనీ, మహువా వంటి స్థానిక మద్యం ఆయా ప్రాంతాల్లో మాత్రమే లభిస్తోంది. ఆ రకం కావాలంటే అక్కడికి వెళ్లాల్సిందే. అయినా సరే, రానుపోను ఖర్చులు, బస, ఇతరత్రా ఖర్చులను కూడా లెక్కచేయకుండా ప్రత్యేకంగా అక్కడిదాకా వెళ్లి మద్యం సేవించి రావడం ట్రెండ్‌గా మారింది. దీంతో స్థానికేతరులకు స్థానిక మద్యం కూడా విలాస వస్తువుగా మారుతోంది'' అని మాయా పిస్టోలా అగావెపురా మద్యం సంస్థ మహిళా సీఈఓ కింబర్లీ పెరీరా చెప్పారు. 'మహువా రకం మద్యం బ్రిటన్‌కు భారత్ వలసరాజ్యంగా మారకముందు చాలా ఫేమస్. తర్వాత మరుగున పడింది. ఇప్పుడు కొందరు దాంట్లో పలు రుచులు తెస్తున్నారు. వాటిని కాక్‌టేల్ నిపుణులు మరింత మెరుగుపరుస్తున్నారు. సిక్స్ బ్రదర్స్ మహువా పేరుతో దేశంలోనే తొలిసారిగా లగ్జరీ మహువా మద్యం తెస్తున్నాం'' అని సౌత్‌సీస్ డిస్టిలరీస్ డైరెక్టర్ రూపీ చినోయ్ చెప్పారు. అయితే, ''స్థానిక మద్యం మొత్తానికీ వర్తించే సింగిల్ బ్రాండ్ అంటూ ఇప్పటికైతే ఏమీ లేదు. ఈ సమస్య పరిష్కారమైతే లైసెన్సింగ్ సమస్యలు తీరతాయి. అప్పుడు దేశవాళీ మద్యం అమ్మకాలు, నాణ్యత పెరుగుతాయి'' అని ఈ రంగ నిపుణులు చెబుతున్నారు.

ట్రంప్‌పై అదే వ్యతిరేకత

ఆయన విధానాలపై పెదవి విరుపు.. సర్వేలో వెల్లడి



వాషింగ్టన్: అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ దేశాన్ని ముందుకు నడిపించే విధానంపై ప్రజల్లో ఇప్పటికీ అనుకూల వైఖరి కంటే వ్యతిరేక వైఖరే ఎక్కువగా కనిపిస్తోంది. ట్రంప్‌పై ప్రజామోదం, పని తీరు, నిర్ణయాలు, దేశాన్ని ఆయన సరైన దిశగా నడిపిస్తున్నారా అంటే లేదనే ఎక్కువ మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. మొత్తమ్మీద ట్రంప్ పని తీరుపై 52 శాతం మంది పెదవి విరిచారు. 48 శాతం మంది మాత్రమే ట్రంప్ పాలన బాగుందన్నారు. ఫిబ్రవరి మధ్యలో సర్వే చేపట్టినప్పుడు సైతం దాదాపు ఇదే ఫలితం రావడం గమనార్హం. ఉద్యోగులపై వేటు సహా ఆయన విధానాలకు సొంత రిపబ్లికన్లు 90 శాతం మంది సానుకూలత చూపగా, ప్రతిపక్ష డెమోక్రాట్లు 90 శాతం మంది వ్యతిరేకత తెలిపారు. స్వతంత్రుల్లో 59 మంది కూడా ట్రంప్ తీరు నచ్చలేదన్నారు. ట్రంప్ విధానాలు దేశాన్ని తప్పుడు మార్గంలో నడిపిస్తున్నాయని 45 శాతం మంది చెప్పగా సరైన దిశగానే దేశం సాగుతోందని 39 శాతం మంది బదులిచ్చారు. 15 శాతం మంది ఏ సమాధానమూ చెప్పలేదు. దేశం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్ర సమస్యలపై ట్రంప్ దృష్టి పెట్టడం లేదని 52 శాతం మంది, ప్రాధాన్యతలు బాగానే ఉన్నాయని 40 శాతం మంది అభిప్రాయం వెలిబుచ్చారు. మొత్తమ్మీద 18–34 ఏళ్ల గ్రూపులో 51 శాతం మంది ట్రంప్ పాలన సరిగా లేదని కుండబద్దలు కొట్టారు. అదే సమయంలో మహిళలు కూడా 57 శాతం మంది ట్రంప్ ప్రభుత్వంపై అసంతృప్తి వెలిబుచ్చారు. ఎస్ఎస్ఆర్ సంస్థ ఫిబ్రవరి 24–28వ తేదీల మధ్య దేశవ్యాప్తంగా ర్యాండమ్‌గా ఎంపిక చేసిన 2,212 మందితో సర్వే చేపట్టింది. ఆన్‌లైన్‌లో, టెలిఫోన్ ద్వారా లేదా లైవ్ ఇంటర్వ్యూ ద్వారా చేపట్టిన ఈ సర్వే కచ్చితత్వం మైనస్ 2.4 శాతం పాయింట్లు అటూఇటుగా ఉండొచ్చని సీఎన్ఎన్ పేర్కొంది. కాగా, శుక్రవారం వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో తీవ్ర వాదోపవాదం జరిగిన ముందు రోజే ఈ పోల్ ముగియడంతో, ఆ ప్రభావం దీనిపై కనిపించదు.

అక్రమ వలసలు రికార్డు స్థాయిలో తగ్గాయి: ట్రంప్

అమెరికాపై అక్రమ వలసల ఆక్రమణ ముగిసిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ''మెక్సికో సరిహద్దులో అక్రమ వలసలు ఫిబ్రవరిలో చరిత్రాత్మక స్థాయిలో తగ్గాయి. నా కఠిన నిర్ణయాల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ''నా పాలనలో మొదటి పూర్తి నెల అయిన ఫిబ్రవరిలో అతి తక్కువ సంఖ్యలో అక్రమ వలసదారులు అమెరికాలో ప్రవేశించడానికి ప్రయత్నించారు. మెక్సికో సరిహద్దులో కేవలం 8,326 మంది అరెస్టయ్యారు. వారందరినీ వెంటనే బహిష్కరించాం'' అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. బైడెన్ హయాంలో నెలకు 3లక్షల మందిపై చిలుకు చొప్పున అక్రమంగా ప్రవేశించారని ఆరోపించారు. వలసలు గణనీయంగా తగ్గాయన్న ప్రకటనను వార్తా నివేదికలు తిప్పికొట్టాయి. ''బైడెన్ అధికారంలో ఉన్న చివరి వారంలో రోజుకు సగటున 2,869 సరిహద్దు అరెస్టులు జరిగాయి. ట్రంప్ అధికారం చేపట్టాక తొలి వారంలో 7,287 అరెస్టులు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 1,041. అంటే తగ్గుదల కేవలం 60 శాతమే. వైట్‌హౌస్ చెబుతున్నట్టు 95 శాతం కాదు'' అని ఫాక్స్ న్యూస్ తెలిపింది.

నడ్డా వారసుడెవరో!

బీజేపీ అధ్యక్షుడి ఎంపికపై అధిష్టానం కసరత్తు

- ఆర్ఎస్ఎస్‌తో సమన్వయం చేయగలిగే నేతకే పగ్గాలు
- ఉత్తరాది నుంచి ఐదుగురు, దక్షిణాది నుంచి ముగ్గురు

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ కొత్త అధ్యక్షుని ఎంపికపై అధిష్టానం చురుగ్గా కసరత్తు చేస్తోంది. రాబోయే ఐదేళ్లలో పలు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలతోపాటు 2029 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని సమర్థంగా నడపగలిగే నేత కోసం బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దలు కొన్ని నెలలుగా మంతనాల్లో మునిగి తేలారు. సంఘ్, పార్టీ మధ్య సమన్వయం చేసుకోగల సత్తా ఉన్న నాయకుడికే పగ్గాలు అప్పగించే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఒక జాబితా సిద్ధమైందని చెబుతున్నారు. అందులోంచి ఒకరిని ఏకగ్రీవంగా ఎంపిక చేయనున్నారు. మార్చి 20 లోపు కొత్త అధ్యక్షుని ప్రకటన ఉంటుందని బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

2019లో అమిత్ షా కేంద్ర హోం మంత్రి అయ్యాక వెంటనే జగత్ ప్రకాశ్ నడ్డా తొలుత బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆర్నెల్ల తర్వాత అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2023 జనవరిలో ముగియాల్సి ఉన్నా 2024 లోక్‌సభ ఎన్నికల దాకా పొడిగించారు. ఆ తర్వాత నడ్డా కేంద్ర కేబినెట్ మంత్రి అయినా మహారాష్ట్ర సహా పలు అసెంబ్లీ ఎన్నికల వల్ల కొత్త అధ్యక్షుని ఎంపిక వాయిదా పడింది. నూతన అధ్యక్షుని ఎంపికపై రెండు రకాల ప్రతిపాదనలున్నట్టు చెబుతున్నారు. పంజాబ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర ప్రదేశ్ వంటి ముఖ్యమైన రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలున్నందున అక్కడ పార్టీని నడపడంలో సమర్థుడై ఉండటంతో పాటు ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగి ఉన్న నేతను నియమించాలనేది ఒక ప్రతిపాదన.

దక్షిణాదిలో చొచ్చుకెళ్లేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. వచ్చే మూడేళ్లలో తమిళనాడు, కేరళ, కర్నాటక వంటి దక్షిణాది రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి. కనుక దక్షిణాది నేతను అధ్యక్షున్ని చేస్తే పార్టీకి మేలన్నది.

బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం అధ్యక్ష రేసులో ఉత్తరాది నుంచి కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, భూపేంద్ర యాదవ్, మనోహర్ లాల్ ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్ పేర్లు గట్టిగా విన్పిస్తున్నాయి. పార్టీ జాతీయ ప్రధాన కార్య

మరో ప్రతిపాదన

దర్శి సునీల్ బన్సల్ పేరు కూడా ప్రస్తావనలో ఉంది. దక్షిణాది నుంచి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తదితర పేర్లు షికారు చేస్తున్నాయి.

యజమాని కోసం పులితో పోరాడి..

భోపాల్: యజమాని ప్రాణాలను కాపాడటానికి తన ప్రాణాలను పణంగా పెట్టిందో శునకం. తన యజమానిపై దాడి చేసేందుకు ప్రయత్నించిన ఓ పులిపై పోరాడి చివరకు ప్రాణాలు కోల్పోయింది. మధ్యప్రదేశ్‌లోని సత్నా జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్ సమీపంలోని గ్రామంలో శివమ్ అనే వ్యక్తి ఫిబ్రవరి 26న తన పెంపుడు కుక్క జర్మన్ షెపర్డ్‌తోపాటు ఇంటి బయట ఆడుకుంటున్నాడు. అదే సమయంలో పక్కనే ఉన్న అడవిలోంచి బయటకు వచ్చిన పులి శివమ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించింది. అది గమనించిన జర్మన్ షెపర్డ్ అడ్డం తిరిగింది. గట్టిగట్టిగా అరుస్తూ పులిని తిరిగి అడవిలోకి పంపాలని చూసింది. మొదట శివమ్‌పైనే దృష్టి పెట్టిన పులి.. ఒక్కసారిగా ఆ కుక్కవైపు తిరిగింది. ఒక్క ఉదుటున మీదకు దూకి.. మెడను నోట కరిచి అడవిలోకి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించింది. అయినా జర్మన్ షెపర్డ్ వెన్ను చూపలేదు. పులి నోట ఉన్నా సరే ప్రాణాలకోసం పోరాడింది. పట్టు వదలని కుక్కను చివరకు వదిలేసిన పులి అడవిలోకి వెళ్లిపోయింది. శివమ్ వెంటనే కుక్కను వెటెర్నరీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లాడు. అయినా లాభం లేకపోయింది. తీవ్రగాయాలపాలైన కుక్క కొన్ని గంటల తరువాత చనిపోయింది.

సార్వభౌమత్వానికి బదులు మతతత్వం

బిలాస్‌పూర్ మేయర్ గందరగోళ ప్రమాణం

బిలాస్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ మేయర్ బీజేపీ నాయకురాలు పూజా విధాని ప్రమాణ స్వీకారం గందరగోళానికి దారి తీసింది. స్థానిక ముంగెలీ నాకా మైదానంలో శుక్రవారం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఉపముఖ్యమంత్రి అరుణ్ సావో, కేంద్ర మంత్రి తోఖాన్ సాహు పలువురు మంత్రులు సైతం కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసే సందర్భంలో పూజా విధాని.. 'మై భారత్ కీ సంప్రదాయిక్త తథా అఖండతా అక్షున్ రఖుంగీ (భారతదేశ మతతత్వాన్ని, సమగ్రతను కాపాడతాను)' అని ప్రమాణం చేశారు. అది గమనించిన బిలాస్‌పూర్ కలెక్టర్ అవనీష్ కుమార్ శరణ్.. వెంటనే సరిదిద్దారు. దీంతో ఆమె మరోసారి ప్రమాణం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆమె నల్లకళ్లద్దాలు ధరించి ఉండటం వల్ల సార్వభౌమత్వానికి, మతతత్వానికి మధ్య తేడాను గుర్తించలేక పోయారని కొందరనగా.. మొత్తానికి తాను నమ్మిన విషయాన్ని చెప్పిందని మరొకరు వ్యాఖ్యానించారు. మతతత్వం ఆమె 'ఎజెండా'లో భాగమా? అంటూ మరికొందరు ప్రశ్నిస్తున్నారు.

అయోధ్యలో చెప్పుల తిప్పలు

రద్దీని నియంత్రణకు ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను మార్చడమే కారణం

అయోధ్య: రామమందిరంలో రద్దీని నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు అయోధ్య మున్సిపల్ అధికారులకు కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టాయి. రామ మార్గంలో ఉన్న ఆలయ ప్రధాన ద్వారం గేట్ 1 వద్ద భక్తులు తమ పాదరక్షలను డిపాజిట్ చేయాలని అధికారులు కోరారు. ఆలయ ఆవరణలో దర్శనం పూర్తి చేసుకున్న తరువాత.. పాదరక్షలు తీసుకోవడానికి ప్రజలు అదే గేటు వద్దకు వెళ్లేవారు. అయితే రద్దీని నియంత్రించేందుకు గేట్ 1 నుంచి ప్రవేశానికి అనుమతించి.. గేట్ 3 నుంచి వదిలేస్తున్నారు. దర్శనం పూర్తయిన భక్తులు చెప్పులు తీసుకోవాలంటే 5–6 కిలోమీటర్ల ప్రయాణించాల్సి ఉంటుంది. దీంతో తిరిగి అంతదూరం వెళ్లలేక చాలా మంది చెప్పులు అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో రోజూ లక్షలాది చెప్పులు అలా పడి ఉంటున్నాయి. వీటిని ట్రాలీల్లోకి నగరానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో డంప్ చేస్తున్నారు. కుంభమేళా సందర్శకుల వల్లే నెలరోజులుగా మార్పులు చేసినట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా తెలిపారు.

ఉక్రెయిన్‌కు అనుకూలంగా అమెరికాలో నిరసనలు

వాషింగ్టన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్, జేడీ వాన్స్‌ల ఆవేశపూరిత సంభాషణ అనంతరం అమెరికా అంతటా ఉక్రెయిన్ అనుకూల నిరసనలు జరిగాయి. న్యూయార్క్, లాస్ ఏంజిల్స్, బోస్టన్‌లలో వందలాది మంది ప్రజలు ఉక్రెయిన్‌కు మద్దతుగా రోడ్లపైకి వచ్చారు. 'అమెరికా స్టాండ్స్ విత్ ఉక్రెయిన్', 'బి స్ట్రాంగ్ ఉక్రెయిన్' ప్లకార్డులను ప్రదర్శించారు. హాలిడే కోసం వెర్మోంట్‌లోని వెయిట్స్‌ఫీల్డ్‌కు వచ్చిన వైస్ ప్రెసిడెంట్ వాన్స్, ఆయన కుటుంబానికి వ్యతిరేకంగా నిరసనకారులు ప్రదర్శన చేపట్టారు. మరోవైపు వీరికి వ్యతిరేకంగా, ట్రంప్, వాన్స్‌లకు అనుకూలంగా వెయిట్స్‌ఫీల్డ్‌లో కౌంటర్ నిరసనలు కూడా జరిగాయి. ఫెడరల్ ఉద్యోగుల తొలగింపుల నేపథ్యంలో ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా స్టోర్ల ముందు కూడా అమెరికా వ్యాప్తంగా ప్రజలు ఆందోళనలు నిర్వహించారు.

100 కొకైన్ మాత్రలు మింగి తనిఖీల్లో దొరికింది!

ముంబై: బ్రెజిల్‌కు చెందిన ఓ మహిళ కొకైన్ అనే మాదకద్రవ్యంతో కూడిన 100 క్యాప్సూల్స్‌ను మింగేసింది. నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన ముంబైలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు విమానాశ్రయంలో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా ఆమె అంగీకరించింది. భారత్‌లోకి దొంగచాటుగా డ్రగ్‌ను తీసుకు వస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి, పొట్టలో ఉన్న 1,098 గ్రాముల బరువైన 100 క్యాప్సూల్స్‌ను బయటకు తీశారు. వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో సుమారు రూ.11 కోట్లని చెప్పారు. బ్రెజిల్‌లోని సావొపాలో నుంచి వచ్చిన ఆమెను అరెస్ట్‌చేసి, కేసులు నమోదు చేశారు.

గౌరవ భృతిపై ఢిల్లీ మహిళలకు బీజేపీ ద్రోహం: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మహిళలకు నెలకు రూ.2,500 గౌరవ భృతి అందజేసే విషయంలో అధికార బీజేపీ ద్రోహం చేసిందని ఆప్ ఆరోపించింది. ఆప్ ఎమ్మెల్యే కుల్దీప్ కుమార్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఏర్పాటైతే కేబినెట్ మొదటి సమావేశంలోనే మహిళలకు ఆర్థిక సాయం పథకంపై ఆమోదముద్ర వేస్తుందని ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ ప్రకటించారంటూ ఆయన గుర్తు చేశారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఈ పథకాన్ని ప్రారంభించాల్సి ఉండగా ఆ దిశగా సీఎం రేఖా గుప్తా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కేబినెట్ ఈ పథకాన్ని ఆమోదించలేదు. అసెంబ్లీ సమావేశాల్లో ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌ను విమర్శించడంతోనే కాలం గడిపారే తప్ప, ఈ పథకానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టలేదని చెప్పారు. మహిళలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

బొలీవియాలో బస్సు ప్రమాదం...

37 మంది దుర్మరణం

లాపాజ్: దక్షిణ అమెరికా దేశం బొలీవియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో 37 మంది చనిపోగా 32 మంది తీవ్రంగా గాయపడ్డారు. వాయవ్య ప్రాంత ఉయుని– కొల్చాని నగరాల మధ్య రహదారిపై శనివారం ఉదయం జరిగింది. ఒక బస్సులో ఉన్న వారంతా లాటిన్ అమెరికాలోనే అతిపెద్ద ఒబురో ఫెస్టివల్‌కు వెళ్తున్న వారని అధికారులు తెలిపారు. ఒక బస్సు డ్రైవర్‌ను ఐసీయూలో చేర్చామని, ఇంకో బస్సు డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉందన్నారు. వీరిద్దరికీ ఆల్కహాలు పరీక్షలు చేయించామన్నారు. ప్రమాద తీవ్రతకు ఒక బస్సు తునాతునకలైంది. ప్రయాణికుల వస్తువులు రోడ్డంతా చెల్లాచెదురుగా పడి ఉన్న దృశ్యాలను బొలీవియా టీవీలు ప్రసారం చేశాయి. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది. ప్రమాద బాధితుల వివరాలను సేకరిస్తున్నామని అధికారులు తెలిపారు. బొలీవియాలో ఘోర రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి. ఫిబ్రవరిలో బస్సు లోయలో పడిన ఘటనలో 30 మందికి పైగా చనిపోగా జనవరిలో పాటోస్ సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో మరో 19 మంది మృత్యువాతపడ్డారు. దేశ జనాభా 1.20 కోట్లు కాగా ఏటా రోడ్డు ప్రమాదాల్లో సగటున 1,400 మంది చనిపోతున్నారు.

స్పెషల్ కౌన్సిల్ చీఫ్ కొనసాగుతారు

ట్రంప్ ఉత్తర్వులు చట్ట విరుద్ధం: జడ్జి

వాషింగ్టన్: ఆఫీస్ ఆఫ్ స్పెషల్ కౌన్సిల్ సారథి హాంప్టన్ డెల్లింజెర్ యథా ప్రకారం తన విధులను కొనసాగించుకోవచ్చని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి అమీ బెర్మన్ స్పష్టం చేశారు. ఆయన్ను తొలగించాలన్న ప్రయత్నం చట్టవిరుద్ధమని తెలిపారు. విధి నిర్వహణలో అసమర్థత, నిర్లక్ష్యం వంటివి కనిపించిన సందర్భాల్లో మాత్రమే ఆయన్ను తొలగించేందుకు అధ్యక్షుడికి అధికారముందంటూ నిబంధనలను స్పష్టంగా ఉన్నప్పటికీ గత నెలలో ట్రంప్ ప్రభుత్వం డెల్లింజెర్‌పై వేటు వేసింది. దీనిపై ఆయన కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన జడ్జి అమీ బెర్మన్..స్పెషల్ కౌన్సిల్ పదవికి ఉన్న రక్షణలు రాజ్యాంగ విరుద్ధమన్న ట్రంప్ ప్రభుత్వ వాదనలను కొట్టిపారేశారు. గతంలో డెమోక్రాటిక్ పార్టీకి చెందిన అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో ఈయన నామినేట్ అయ్యారు. 2024 డిసెంబర్‌లో బైడెన్ ప్రభుత్వం ఈయన్ను నామినేట్ చేయగా ఐదేళ్ల పదవీ కాలానికిగాను కాంగ్రెస్ ఆమోద ముద్ర వేసింది.



గాలింపు చర్యల్లో నిమగ్నమైన భద్రతా సిబ్బంది

గడ్డ కట్టించే చలిలో... మంచు సమాధిలో!

ఉత్తరాఖండ్ బాధితుల భయానక అనుభవాలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో మంచు చరియలు విరిగి పడటం సాధారణమే. కానీ శుక్రవారం జరిగిన ఉత్పాతం మాత్రం విషాదాన్ని మిగిల్చింది. ఎనిమిది మందిని పొట్టన పెట్టుకున్న ఈ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ వాళ్లు జ్యోతిర్మఠ్‌లోని సైనిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తమ భయానక అనుభవాలను వారు మీడియాతో పంచుకున్నారు.

తిండికీ, దాహానికీ మంచే!

''నేను బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ)లో యాక్సిలరేటర్ యంత్రాన్ని నడుపుతున్నా. రోడ్డు పక్కన కంటైనర్లలో నివసిస్తున్నాం. శుక్రవారం ఉదయం నిద్రలేచి బయటికొచ్చి చూశాను. ప్రశాంతంగా కనిపించే మంచు ఉన్నట్టుండి ఉగ్రరూపం దాల్చింది. విపరీతమైన ఉరుముల శబ్దం వినిపించింది. పైకి చూస్తే మంచు మా వైపు వేగంగా దూసుకొస్తోంది. నా సహచరులను అప్రమత్తం చేయడానికి కేకలు వేసి పరుగెత్తాను. కానీ అప్పటికే అడుగుల మేర మంచు కురవడంతో వేగంగా పరుగెత్తలేకపోయాం. అందులోనే కూరుకుపోయాం. రెండు గంటల తర్వాత పోలీసులు మమ్మల్ని కాపాడారు'' అని చమోలికి చెందిన – గోపాల్ జోషి చెప్పాడు. ''మేం నిద్రిస్తుండగానే మంచు దెబ్బకు మా కంటైనర్ బోల్తా పడింది. ఏం జరిగిందో తెలుసుకునే సరికి మంచులో కూరుకుపోయి ఉన్నాం. నా పక్కనున్న సహోద్యోగి మరణించాడు. నా కాలు విరిగింది. తలకు గాయమైంది. కంటైనర్‌లో ఉన్న వాళ్లమంతా గాయాలపాలయ్యాం. దూరంగా హోటల్ కనిపిస్తే అక్కడికెళ్లి తలదాచుకున్నాం. ఎటు చూసినా తెల్లని మంచు! ఆకలేసినా, దాహమేసినా మంచే దిక్కయింది. 12 మందిమి 25 గంటలు గడ్డ కట్టించే చలిలో ఒక్కటే బ్లాంకెట్ సాయంతో తలదాచుకున్నాం'' అని అమృత్‌సర్‌కు చెందిన జగ్బీర్‌సింగ్ చెప్పాడు. ''ప్రమాదం తరువాత 12 గంటల పాటు మంచు కింద గాయాలతో పడున్నాం. ముక్కులు మూసుకుపోయి శ్వాస తీసుకోవడమే కష్టమైంది'' అని బిహార్‌లోని వైశాలికి చెందిన మున్నా ప్రసాద్ వాపోయాడు. ''చాలా రోజులుగా మంచు కురుస్తోంది. మంచు చరియలు విరిగి పడటంతో చూస్తుండగానే వంద మీటర్ల లోతుకు పడిపోయాం. 200 మీటర్ల దూరంలో ఖాళీగా ఉన్న ఆర్మీ బ్యారక్ మాకు జీవితాన్నిచ్చింది. 24 గంటలు దాంట్లోనే తలదాచుకున్నాం'' అని మొరాదాబాద్‌కు చెందిన విజయ్‌పాల్ చెప్పాడు.

కవిబాంధవ అనే బిరుదు ఉన్న రాజు?

మధ్యయుగ భారతదేశ చరిత్ర
(8వ శతాబ్దం - 18వ శతాబ్దం)

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

సోలంకీలు

అనిల్‌వారా రాజధానిగా గుజరాత్, కథియవార్ ప్రాంతాలను దాదాపు నాలుగు శతాబ్దాల పాటు సోలంకీలు పాలించారు. వీరిని అనిల్‌వారా చాళుక్యులు అని కూడా అంటారు.

మూలరాజు

అనిల్‌వారా కేంద్రంగా సోలంకీ రాజ్యాన్ని స్థాపించిన రాజు మూలరాజు. రాజధానిలో రెండు శైవాలయాలను నిర్మించాడు.

మొదటి భీమ

ఇతడి పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్‌లోని దేవాలయాన్ని ముట్టడించాడు. భీముడు ఈ దాడిని ఎదుర్కోలేక కచ్‌కు పారిపోయాడు. ఇతడు తన కుమారుడు కర్ణ కోసం సింహాసనాన్ని త్యాగం చేశాడు.

కర్ణ

ఇతడు తన రాజ్యంలో అనేక నిర్మాణాలు చేపట్టాడు. పలు దేవాలయాలతోపాటు తన పేరుతో ఒక నగరాన్ని కూడా నిర్మించాడు. అదే నేటి అహ్మదాబాద్.

జయసింహ సిద్ధరాజు

సిద్ధరాజ అనే బిరుదుతో ఇతడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. సోలంకీలందరిలో అగ్రగణ్యుడిగా పేరుగాంచాడు. అనేక యుద్ధాలు చేసి పరమారులు, చాందేలులు, చౌహాన్‌లు, కల్యాణి చాళుక్యులను ఓడించాడు. మరోవైపు భాషా సాహిత్యాలను ప్రోత్సహించాడు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవి హేమచంద్రుడు. జయసింహుడు సిద్ధపురలో రుద్ర మహాకాల దేవాలయాన్ని నిర్మించాడు.

కుమారపాల

హేమచంద్రుడు ఇతడి ఆస్థాన కవిగానూ కొనసాగాడు. కుమారపాల చరిత్ర, త్రిశస్తి శలక పురుష, పరిశిష్ట పర్వన్ అనే గ్రంథాలను రచించాడు. ఇతడి ప్రభావంతో కుమారపాలుడు జైనమతాన్ని పోషించడమే కాకుండా తన రాజ్యంలో జంతువధను, జూదాన్ని నిషేధించాడు.

అజయపాల

ఇతడు జైన దేవాలయాలను ధ్వంసం చేసి, జైన మత గురువు రామచంద్రను వధించాడు.

రెండో మూలరాజు

ఇతడు బాలుడు కావడంతో తల్లి నాయికీదేవి సంరక్షకురాలిగా ఉండి రాజ్య పాలనను చేపట్టింది. వీరి ఆధ్వర్యంలోనే 1178 మౌంట్ అబూ యుద్ధంలో సోలంకీ సేనలు ఘోరీ మహ్మద్‌ను ఓడించాయి.

రెండో భీమ

ఇతడి వద్ద తేజపాల, వస్తుపాల అనే సోదరులు మంత్రులుగా ఉండేవారు. రెండో భీముడి పాలనా కాలంలో క్రీ.శ. 1197లో కుతుబుద్దీన్ ఐబక్ ఇతడి రాజ్యంపై దాడి చేశాడు. ఇల్‌టుట్‌మిష్ దాడిని వస్తుపాలుడు తిప్పికొట్టాడు. భీముడి తర్వాత ఈ రాజ్యాన్ని వాఘేలా వంశస్థులు ఆక్రమించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ మొత్తం గుజరాత్‌ను ఆక్రమించాడు.

చౌహాన్‌లు

ప్రతీహారుల తరహాలో చౌహాన్‌ల్లోనూ అనేక శాఖలున్నాయి. శాకంబరిని(అజ్మీర్) కేంద్రంగా చేసుకొని పాలించిన చౌహాన్ రాజ్యం వాటన్నింటిలోకి అతి ముఖ్యమైంది. వీరు మొదట ప్రతీహారులకు సామంతులుగా ఉండి తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు.

వాసుదేవుడు

క్రీ.శ. 6వ శతాబ్దంలో చౌహాన్ వంశాన్ని స్థాపించిన రాజు వాసుదేవుడు.

వాక్పతి రాజు

వాసుదేవుడి అనంతరం పలువురు రాజులు పాలించిన తర్వాత వాక్పతి రాజు రాజ్యానికొచ్చాడు. ఇతడు పుష్కరలో ఒక శైవాలయాన్ని నిర్మించాడు. దీన్ని విమర్శకులు శివుడి కైలాసంతో పోల్చారు.



సింహరాజు

చౌహాన్ వంశంలోని తొలి స్వతంత్ర పాలకుడు సింహరాజు. ఇతడు మహారాజాధిరాజ అనే బిరుదును పొందాడు.

రెండో విగ్రహరాజు

ఇతడు చౌహాన్ రాజ్య వాస్తవ స్థాపకుడు. గుజరాత్‌పై దాడి చేసి మూలరాజును ఓడించాడు.

మొదటి పృథ్వీరాజు

రెండో విగ్రహరాజు తర్వాత పాలకుల్లో ముఖ్యమైన రాజు మొదటి పృథ్వీరాజు. పుష్కర్‌పై జరిగిన చాళుక్యుల దాడిని తిప్పికొట్టాడు. 700 మందిని అంతం చేశాడు.

రెండో అజయరాజు

శాకంబరికి గజ్నవీ రాజుల నుంచి పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని ఇతడు అజయమేరు (అజ్మీర్) అనే నూతన నగరాన్ని, కోటను నిర్మించాడు. తన రాజధానిని శాకంబరి నుంచి అజ్మీర్‌కు మార్చాడు. ఇతడు తన చివరికాలంలో రాజ్యాన్ని తన కుమారుడు అర్న రాజుకు అప్పగించి సన్యాసాన్ని స్వీకరించాడు.

నాలుగో విగ్రహరాజు

ఇతడు గొప్ప విజేత. అనేక ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. తోమారులను ఓడించి వారి నుంచి ఢిల్లీని ఆక్రమించాడు. ఇతడు స్వయంగా కవి, సాహిత్య పోషకుడు. హరికేళి అనే నాటకాన్ని రచించాడు. మహాకవి సోమదేవుడు ఇతడి గురించి లలిత విగ్రహ రాజనాటకం అనే గ్రంథాన్ని రచించాడు. భోజుడు ధారలో నిర్మించిన సరస్వతి కంఠాభరణ విద్యాలయ నమూనాలో ఇతడు అజ్మీర్‌లో సంస్కృత కళాశాలను నిర్మించాడు. విశాల్‌పూర్ అనే నూతన నగరాన్ని కూడా నిర్మించాడు.

మూడో పృథ్వీరాజు

మూడో పృథ్వీరాజుకు ముందు అపరాంగేయ, రెండో పృథ్వీరాజు, సోమేశ్వర అనే రాజులు పాలించారు. చౌహాన్ రాజుల్లో అగ్రగణ్యుడు మూడో పృథ్వీరాజు. ఇతడు తన సమకాలీన రాజులైన గహద్వాలులు, చాందేలులు, సోలంకీలతో అనేక యుద్ధాలు చేశాడు. ఘోరీ మహ్మద్‌తో రెండు యుద్ధాలు చేశాడు. 1191లో మొదటి తరైన్ (స్థానేశ్వర్) యుద్ధంలో ఘోరీని ఓడించాడు. 1192లో జరిగిన రెండో తరైన్ యుద్ధంలో ఘోరీ మహ్మద్, పృథ్వీరాజును ఓడించి అంతమొందించాడు. అనంతరం పృథ్వీరాజు వారసులు రణతంభోర్ కేంద్రంగా కొంతకాలం పాటు పాలించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ ఈ రాజ్యాన్ని జయించి ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపివేశాడు.

మాదిరి ప్రశ్నలు

1. మహ్మద్ ఘోరీని మౌంట్ అబూ యుద్ధంలో ఓడించిన రాజు?
   1) మొదటి భీమ 2) రెండో మూలరాజ
   3) నాలుగో విగ్రహరాజు
   4) మూడో పృథ్వీరాజు
2. గుజరాత్‌పై జరిగిన ఇల్‌టుట్‌మిష్ దాడిని తిప్పికొట్టిన రాజు?
   1) రెండో భీమ 2) మొదటి భీమ
   3) మొదటి నాగభట
   4) రెండో నాగభట
3. మౌంట్ అబూలోని విమల దేవాలయ నిర్మాతలు?
   1) చౌహాన్‌లు
   2) సోలంకీలు
   3) పరమారులు 4) గహద్వాలులు
4. సోలంకీలు నిర్మించిన సూర్య దేవాలయం ఎక్కడ ఉంది?
   1) మార్తాండ్ 2) కోణార్క్
   3) మధుర 4) బరోడా
5. గజనీ మహ్మద్ ధ్వంసం చేసిన సోమనాథ్ దేవాలయాన్ని పునర్నిర్మించినవారు?
   1) రెండో భీమ
   2) రెండో మూలరాజు
   3) విగ్రహరాజు 4) సామంతరాజు
6. అజ్మీర్ నగర నిర్మాత?
   1) నాలుగో విగ్రహరాజు
   2) మొదటి అజయరాజు
   3) రెండో అజయరాజు
   4) మూడో పృథ్వీరాజు
7. హరికేళి నాటకం అనే గ్రంథంలోని వ్యాఖ్యలు గోడలపై కలిగి ఉన్న కట్టడం?
   1) అరై దిన్‌కా జోప్రామసీద్
   2) కువ్వాతుల్ ఇస్లామ్ మసీద్
   3) అజ్మీర్‌లోని సరస్వతి మందిరం
   4) చిత్తోర్ కీర్తి స్తంభం
8. కవిబాంధవ అనే బిరుదు ఉన్న రాజు?
   1) మూడో పృథ్వీరాజు
   2) నాలుగో విగ్రహరాజు
   3) కుమార పాల
   4) జయసింహ సిద్ధరాజు
9. ముస్లిం చరిత్రకారులు రామ్‌పితూర అని ఎవరిని పిలిచారు?
   1) రాణా ప్రతాప్‌సింగ్
   2) రాణా సంగ్రామ్‌సింగ్
   3) మూడో పృథ్వీరాజు
   4) గహద్వాల జయచంద్ర
10. మూడో పృథ్వీరాజు ఆస్థానంలోని ప్రముఖ కవులు?
    1) విద్యాపతి, జనార్దన
    2) జనార్దన, విశ్వరూప
    3) విశ్వరూప, జయనాక, పద్మనాభ
    4) పై వారందరూ
11. రాణీ సంయుక్తతో మూడో పృథ్వీరాజు ప్రేమాయణం గురించి రాసిన 'పృథ్వీ రాజ రాసో'' అనే గ్రంథ రచయిత?
    1) చాంద్ బర్దాయ్
    2) మాలిక్ మహ్మద్ జయసీ
    3) జయనాక
    4) అల్ బెరూనీ
12. ఢిల్లీని నిర్మించిన తోమార్ రాజు?
    1) వజ్రపాలుడు
    2) అనంగపాలుడు
    3) వస్తుపాలుడు 4) తేజపాలుడు
13. 'నవ సాహసాంక చరితం' అనే గ్రంథాన్ని రచించిన సంస్కృత కవి?
    1) పద్మగుప్త 2) పద్మసాంభవ
    3) ధనంజయ 4) జోనరాజ
14. చౌహాన్‌ల ఆగర్భ శత్రువులు?
    1) చాందేలులు
    2) గహద్వాలులు
    3) సోలంకీలు 4) ప్రతీహారులు
15. జ్ఞానపీఠ్ అవార్డులోని వాగ్దేవి ప్రతిమతో సంబంధం ఉన్న రాజు?
    1) పరమార భోజుడు
    2) చాందేల విద్యాధరుడు
    3) చాళుక్య జయసింహుడు
    4) మూడో పృథ్వీరాజు
16. సోమనాథ్ దేవాలయాన్ని ఏ దేవుడికి అంకితమిచ్చారు?
    1) సూర్యుడు 2) గణేశుడు
    3) కార్తికేయుడు 4) శివుడు
17. శపథ లక్ష దేశమని ఎవరి రాజ్యానికి పేరు?
    1) చాందేలు 2) గహద్వాలు
    3) పరమారు 4) చౌహాన్
18. గజనీ మహ్మద్ దాడితో రాజధాని కనౌజ్‌ను వదిలి పారిపోయిన ప్రతీహార రాజు?
    1) యశ పాలుడు 2) రాజ్య పాలుడు
    3) రెండో భోజుడు
    4) విజయ పాలుడు
19. దాసరూప గ్రంథాన్ని రచించిన పరమారుల ఆస్థాన కవి?
    1) హలాయుధుడు 2) ధనిక
    3) ధనంజయ 4) పద్మగుప్త
20. కవి రాజు అనే బిరుదు ఉన్న రాజులు?
    1) హాలుడు
    2) సముద్ర గుప్తుడు
    3) భోజుడు
    4) పై వారందరూ
21. పతంజలి యోగ సూత్రాలపై వ్యాఖ్యానం రాసిన రాజు?
    1) ముంజ 2) భోజ
    3) మొదటి భీమ 4) కర్ణ
22. ఏ రాజు పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్ దేవాలయంపై దాడి చేశాడు?
    1) మొదటి భీమ
    2) మొదటి నాగభటుడు
    3) మొదటి భోజ
    4) జయసింహ సిద్ధరాజ
23. సిద్ధ హేమచంద్ర అనే ప్రముఖ వ్యాకరణ గ్రంథ రచయిత?
    1) సోమదేవుడు 2) హేమచంద్రుడు
    3) మహావీరాచార్యుడు
    4) శ్రీహర్షుడు
24. తన రాజ్యంలో జంతువధను నిషేధించిన జైన రాజు?
    1) జయసింహ సిద్ధరాజ
    2) అమోఘవర్ష 3) కుమారపాల
    4) వాక్పతి ముంజ
25. కలికాల సర్వజ్ఞ అనే బిరుదు కలిగిన జైనకవి?
    1) సోమదేవసూరి
    2) హరి విజయసూరి
    3) కాలకాచార్యుడు
    4) హేమ చంద్రుడు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 3; 5) 1; 6) 3; 7) 1; 8) 2; 9) 3; 10) 4; 11) 1; 12) 2; 13) 1; 14) 2; 15) 1; 16) 4; 17) 4; 18) 2; 19) 3; 20) 4; 21) 2; 22) 1; 23) 2; 24) 3; 25) 4.

'సిద్ధాపూర్'గా ప్రసిద్ధి చెందిన జిల్లా ఏది?

తెలంగాణ భావన (1948-70)
'చారిత్రక నేపథ్యం'

1. నిజాం రాజ్యంలో 'సతీసహగమనం' ఎప్పుడు రద్దు చేశారు?
   1) 1888 2) 1889
   3) 1898 4) 1908
2. 'చుక్క సత్తయ్య' కింది వాటిలో ఏ జానపద రూపాల్లో ప్రసిద్ధి చెందినవారు?
   1) ఒగ్గుకథ 2) జముకుల కథ
   3) శారదకథ 4) బుర్రకథ
3. తెలంగాణలోని ఏ జిల్లా 'చిరతల భజన'కు ప్రసిద్ధి చెందింది?
   1) వరంగల్ 2) నల్లగొండ
   3) నిజామాబాద్ 4) కరీంనగర్
4. కింది వాటిలో ఖమ్మం జిల్లాలో లేని ప్రాజెక్టు ఏది?
   1) లంకసాగర్ 2) కిన్నెరసాని
   3) పెద్దవాగు 4) ముకమామిడి
5. 'ఘంటాడి కృష్ణ' సంగీత విద్వాంసులు ఏ జిల్లాకు చెందినవారు?
   1) రంగారెడ్డి 2) ఖమ్మం
   3) వరంగల్ 4) నల్లగొండ
6. 1857 తిరుగుబాటులో పాల్గొని బ్రిటిషర్ల శిక్షకు గురైన రాజ్‌దీప్‌సింగ్ తెలంగాణలోని ఏ జిల్లాకు చెందినవారు?
   1) ఆదిలాబాద్ 2) ఖమ్మం
   3) మహబూబ్‌నగర్ 4) నిజామాబాద్
7. 'లింబాద్రి' గుట్టలు ఏ జిల్లాలో ఉన్నాయి?
   1) ఖమ్మం 2) నిజామాబాద్
   3) ఆదిలాబాద్ 4) కరీంనగర్
8. 'భైరవ తంత్రం' రచించిన మంథాన భైరవుడు ఏ ప్రాంతానికి చెందినవారు?
   1) మంథని 2) ములుగు
   3) ఆలంపూర్ 4) పానగల్లు
9. 'నియోగ' పద్ధతి (సంప్రదాయం) ఏ తెగలో కనిపిస్తుంది?
   1) గోండులు 2) చెంచులు
   3) లంబాడీలు 4) 2, 3
10. 'దీవికొండ' ఏ జిల్లాలో ఉంది?
    1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
    3) మహబూబ్‌నగర్ 4) నల్లగొండ
11. 'అక్షలి నగరం' అని దేనికి పేరు?
    1) ఓరుగల్లు 2) నిజామాబాద్
    3) ఫణిగిరి 4) నాగార్జునకొండ
12. 'స్తంభాద్రి' అనే పేరున్న జిల్లా ఏది?
    1) నిజామాబాద్ 2) ఖమ్మం
    3) నల్లగొండ 4) ఆదిలాబాద్
13. భారత్ గుణవర్ధక్ సంస్థ లైబ్రరీని ఎప్పుడు స్థాపించారు?
    1) 1896 2) 1872 3) 1901 4) 1913
14. వైద్యశాలలు, వాటి స్థాపనకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) ఆయుర్వేదం - 1890
    2) ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రి - 1879
    3) జజ్జిఖానా - 1905 4) నిలోఫర్ - 1945
15. కింది వాటిలో 'విక్టోరియా మెమోరియల్' దవాఖానా ఏది?
    1) జజ్జిఖానా 2) హోమియోపతి
    3) యునానీ 4) ఆయుర్వేదం
16. 'నవకాశీ' చిత్రకళ ఎవరి కాలంలో ప్రసిద్ధి?
    1) తూర్పు చాళుక్యులు
    2) కాకతీయులు
    3) రేచెర్ల వెలమవంశం
    4) గోల్కొండ కుతుబ్‌షాహీలు
17. నల్లగొండ జిల్లా రాష్ట్రంలోని ఎన్ని జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది?
    1) 7 2) 5 3) 8 4) 6
18. తెలంగాణలోని నిర్మల్ పట్టణం చెక్కబొమ్మలకు ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నవారు?
    1) సర్ జార్జివాట్ 2) హెన్రీ రస్సెల్
    3) టి.యన్.ముఖర్జీ 4) జె.కె. కిప్లింగ్
19. 1903లో హస్తకళా వస్తువుల ప్రదర్శనను ఎక్కడ నిర్వహించారు?
    1) హైదరాబాద్ 2) న్యూఢిల్లీ
    3) బెంగళూరు 4) జైపూర్
20. కింది వాటిలో కృష్ణానదికి ఉపనది కానిది?
    1) ఘటప్రభ 2) దూద్‌గంగా
    3) పంచగంగా 4) తెన్‌గంగా
21. తెలంగాణలో గోదావరి నదికి తొలి ఉపనది ఏది?
    1) కడెం 2) ప్రాణహిత
    3) మంజీర 4) వార్ధా
22. మహబూబ్‌నగర్ జిల్లాలోని 'షాబాద్ గుట్టల్లో' జన్మిస్తున్న నది?
    1) మూసీ 2) దిండి
    3) మంజీర 4) పాలేరు
23. 'ఇందిరాసాగర్' ఎత్తిపోతల పథకం ఏ జిల్లాలో ఉంది?
    1) మహబూబ్‌నగర్ 2) కరీంనగర్
    3) ఖమ్మం 4) ఆదిలాబాద్
24. కింది వాటిలో ఎస్.ఆర్.ఎస్.పి.-2 ప్రాజెక్టుతో లబ్ధి పొందని జిల్లా?
    1) వరంగల్ 2) ఖమ్మం
    3) నల్లగొండ 4) కరీంనగర్
25. 'చేటుపల్లి హన్మంతరెడ్డి' ఎత్తిపోతల పథకం ఏ జిల్లాలో ఉంది?
    1) ఆదిలాబాద్ 2) నిజామాబాద్
    3) ఖమ్మం 4) కరీంనగర్
26. 'నవారు' కుటీర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన జిల్లా?
    1) వరంగల్ 2) నల్లగొండ
    3) నిజామాబాద్ 4) ఖమ్మం
27. చార్మినార్ పేపర్ మిల్లు ఎక్కడ ఉంది?
    1) హైదరాబాద్ 2) మెదక్
    3) ఖమ్మం 4) ఆదిలాబాద్
28. 'తెలంగాణ పేపర్ మిల్స్' ఎక్కడ ఉంది?
    1) నిజామాబాద్ 2) నల్లగొండ
    3) ఆదిలాబాద్ 4) ఖమ్మం



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలంగాణ చరిత్ర

29. 'శ్రీరామ స్ట్రా బోర్డ్ లిమిటెడ్' పరిశ్రమ నెలకొని ఉన్న ప్రాంతం?
    1) నేరేడుచర్ల (నల్లగొండ)
    2) పటాన్ చెరువు (మెదక్)
    3) నాచారం (హైదరాబాద్)
    4) నాచంగూడెం (ఖమ్మం)
30. కొమ్ములు, దంత వస్తువులకు సంబంధించిన కుటీర పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం?
    1) సికింద్రాబాద్ 2) నిర్మల్
    3) ఆసిఫాబాద్ 4) పెంబర్తి
31. గాజుల పరిశ్రమకు ప్రసిద్ధి చెందిన 'గాజుల పేట' ఎక్కడ ఉంది?
    1) చార్మినార్ ప్రాంతంలో (హైదరాబాద్)
    2) రంగారెడ్డి
    3) మహబూబ్‌నగర్ 4) నల్లగొండ
32. 'సారంగపూర్' ఏ పరిశ్రమకు ప్రసిద్ధి?
    1) పొగాకు 2) వస్త్రాలు
    3) చక్కెర 4) సిమెంట్
33. సీతాఫలాలకు ప్రసిద్ధి చెందిన జిల్లా?
    1) హైదరాబాద్ 2) మహబూబ్‌నగర్
    3) నల్లగొండ 4) ఖమ్మం
34. అడవుల విస్తరణ పరంగా తెలంగాణలో ఖమ్మం జిల్లా ప్రథమస్థానంలో ఉంది. ఈ జిల్లాలో అడవుల శాతం ఎంత?
    1) 57.05 2) 47.05
    3) 37.05 4) 52.5
35. కేశోరాం సిమెంట్ పరిశ్రమ ఎక్కడ ఉంది?
    1) బసంత్‌నగర్ 2) కట్టపల్లి
    3) వాడపల్లి 4) హుజురానగర్
36. జోస్యం చెప్పడం, తాయెత్తులు కట్టడం ఎవరి వృత్తి?
    1) బుడబుక్కలు 2) బిక్షుకుంట్లు
    3) అసాదులు 4) దాసర్లు
37. 'పేరం బోయరాజు' కథను ఎవరు ఎక్కువగా చెబుతారు?
    1) బిక్షుకుంట్లు 2) పిచ్చుకుంట్లు
    3) జోలి కళాకారులు
    4) బండారు కళాకారులు
38. 'పెరికజాతి పురాణం' ఏ కళాకారులు చెబుతారు?
    1) బండారు కళాకారులు
    2) తోటి కళాకారులు
    3) పర్దాన్ కళాకారులు
    4) మందెచ్చు కళాకారులు
39. నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించిన 'పండగ సాయన్న' వీరగాథను గానం చేస్తూ ఎవరు ప్రదర్శన చేస్తారు?
    1) బుడబుక్కలు 2) పెద్దమ్మలోళ్లు
    3) మందెచ్చు కళాకారులు
    4) జోగువారు
40. శ్రీరాముడి జననం నుంచి పట్టాభిషేకం వరకు రామాయణ కథను వివరించే నృత్య రూపకం ఏది?
    1) గంటె భాగవతుల కథ
    2) యానాది భాగవతుల కథ
    3) హరికథ 4) చిరతల భజన
41. 'సిద్ధాపూర్'గా ప్రసిద్ధి చెందిన జిల్లా ఏది?
    1) రంగారెడ్డి 2) మెదక్
    3) మహబూబ్‌నగర్ 4) నల్లగొండ
42. పురాతన దేశీయ వేషాన్ని ధరించి తళతళ మెరిసే కత్తులు ధరించి ఉద్రేక పూరిత అడుగుల కదలికలతో చేసే నృత్యం?
    1) సిద్దినృత్యం 2) వీరనాట్యం
    3) రేలాట నృత్యం 4) 2, 3
43. 'మహావీర్ హరిణ వనస్థలి' సంరక్షణ కేంద్రం ఏ జిల్లాలో ఉంది?
    1) ఆదిలాబాద్ 2) ఖమ్మం
    3) హైదరాబాద్ 4) వరంగల్
44. తెలంగాణలో 'పాలరాయి' ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఏది?
    1) ఆదిలాబాద్ 2) ఖమ్మం
    3) నల్లగొండ 4) రంగారెడ్డి
45. 'సింగూర్ జల విద్యుత్ కేంద్రం'ఏ జిల్లాలో ఉంది?
    1) నిజామాబాద్ 2) వరంగల్
    3) ఆదిలాబాద్ 4) మెదక్
46. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) పరిశ్రమ ఏ జిల్లాలో ఉంది?
    1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
    3) మెదక్ 4) నల్లగొండ
47. ఆదిలాబాద్ జనసాంద్రత ఎంత?
    1) 270 2) 70 3) 170 4) 370
48. స్త్రీ, పురుష నిష్పత్తిలో నిజామాబాద్ జిల్లా తొలి స్థానంలో ఉంది. ఇక్కడ వేయి మంది పురుషులకు ఎంత మంది స్త్రీలున్నారు?
    1) 1020 2) 1040 3) 1050 4) 1060
49. కింది వాటిలో హైదరాబాద్‌లో లేని విశ్వ విద్యాలయం ఏది?
    1) నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా
    2) మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ
    3) ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ
    4) మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయం
50. తెలంగాణలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఎక్కడ ఉంది?
    1) హైదరాబాద్ 2) బాసర
    3) నిజామాబాద్ 4) వరంగల్
51. 'ఖుషీమహల్' చారిత్రక ప్రదేశం ఉన్న ప్రాంతం ఏది?
    1) నిజామాబాద్ 2) హైదరాబాద్
    3) వరంగల్ 4) మెదక్
52. శైవ, బౌద్ధ, జైన మందిరాలకు ప్రసిద్ధి కేంద్రంగా విరాజిల్లుతున్న ప్రాంతం?
    1) కురవి 2) కాళేశ్వరం
    3) ధర్మపురి 4) కొలనుపాక
53. 'తెలంగాణ సర్ ఆర్థర్ కాటన్'గా ప్రసిద్ధి చెందిన వారు?
    1) నవాబ్ సాదర్‌యార్ జంగ్
    2) నవాబ్ అలీ నవాజ్ జంగ్
    3) నవాబ్ బహదూర్ యార్ జంగ్
    4) అలీయావర్ జంగ్
54. కింది వాటిలో 'ఏనుగులు తిరిగిన నగరం'గా ప్రసిద్ధి చెందింది ఏది?
    1) ఎలుగొండల 2) రుక్మమ్మపేట
    3) హైదరాబాద్ 4) సిద్ధాపూర్
55. 'రక్తచందనం' వృక్షాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం ఏది?
    ఎ. శేషాచల ప్రాంతం
    బి. నల్లమల అడవులు
    సి. సత్య మంగళం పర్వత ప్రాంతం
    1) ఎ మాత్రమే 2) ఎ, బి మాత్రమే
    3) బి, సి మాత్రమే 4) ఎ, సి మాత్రమే

సమాధానాలు

1) 2; 2) 1; 3) 4; 4) 3; 5) 2; 6) 4; 7) 2; 8) 3; 9) 3; 10) 4; 11) 1; 12) 2; 13) 1; 14) 2; 15) 1; 16) 2; 17) 2; 18) 1; 19) 2; 20) 4; 21) 1; 22) 2; 23) 3; 24) 4; 25) 2; 26) 1; 27) 2; 28) 4; 29) 1; 30) 1; 31) 3; 32) 3; 33) 2; 34) 2; 35) 1; 36) 1; 37) 3; 38) 1; 39) 2; 40) 4; 41) 2; 42) 1; 43) 3; 44) 2; 45) 4; 46) 3; 47) 3; 48) 2; 49) 4; 50) 4; 51) 3; 52) 4; 53) 2; 54) 1; 55) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐసీఎంఆర్-ఎన్‌సీడీఐఆర్, బెంగళూరులో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

బెంగళూరులోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్ఫర్మేటిక్ అండ్ రీసెర్చ్ (ఎన్‌సీడీఐఆర్).. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్-1, యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** యంగ్ ప్రొఫెషనల్1-02, యంగ్ ప్రొఫెషనల్2-02.
» **విభాగాలు:** ఐటీ-గ్రాఫిక్ డిజైన్/వీడియో ప్రొడక్షన్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ఎన్‌ఎల్‌పీ-సాఫ్ట్‌వేర్ డెవలపర్,డేటా వేర్‌హౌసింగ్ స్పెషలిస్ట్.
» **అర్హత:** 55 శాతం మార్కులతో కంప్యూటర్ అప్లికేషన్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ గ్రాఫిక్స్/కంప్యూటర్ సైన్స్ తదితర విభాగాల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితరాలు ఉండాలి.
» **వయసు:** యంగ్ ప్రొఫెషనల్-1 పోస్టులకు 35 ఏళ్లు, యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టులకు 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు యంగ్ ప్రొఫెషనల్-1 పోస్టుకు రూ.30,000, యంగ్ ప్రొఫెషనల్-2కు రూ.42,000.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** recruitment@ncdirindia.org
» **దరఖాస్తులకు చివరితేది:** 03.03.2025.
» **ఇంటర్వ్యూ తేది:** 18.03.2025.
» **వెబ్‌సైట్:** www.ncdirindia.org

రైట్స్ లిమిటెడ్‌లో 40 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా (మెటలాజికల్/మెకానికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 11.03.2025 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.16,338.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.03.2025.
» **రాతపరీక్ష తేది:** 23.03.2025.
» **వెబ్‌సైట్:** https://www.rites.com

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ప్రణాళికాబద్ధ అభివృద్ధి దిశగా సాగిన సుదీర్ఘ ప్రయాణం..

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

భారత ఆర్థిక ప్రణాళికా వ్యవస్థ లక్ష్యాలు, వ్యూహాలు

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశ ఆర్థిక, సామాజిక పురోగతి కోసం ప్రణాళికా వ్యవస్థను రూపొందించుకోవాలని భావించారు. భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వివిధ దేశాల్లో అనుసరిస్తున్న కేంద్రీకృత ప్రణాళికా విధానానికి ప్రభావితులై మన దేశంలోనూ వీటిని అమలు చేయడానికి కృషి చేశారు. నిర్ణీత వ్యవధిలో నిర్దిష్ట లక్ష్యాలను సాధించే విధంగా ప్రణాళికలకు రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 1950లో పి.సి. మహలనోబిస్ ఆధ్వర్యంలో ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశారు.

భారత ఆర్థిక వ్యవస్థ 65 ఏళ్ల అభివృద్ధి ప్రస్థానంలో అనేక ఒడుదొడుకులను ఎదుర్కొంది. మౌలిక లక్ష్య సాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా కాలానుగుణ నిర్ణయాలతో సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి సాధన దిశగా పురోగమించింది. ప్రపంచపటంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరం చేసుకోగలిగింది. ఈ దిశగా ప్రణాళికా వ్యవస్థ నిర్మాణాత్మక పాత్ర పోషించిందని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఎలాంటి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా గమ్యం చేరుకోవడంలో కొన్ని కష్టాలు, నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రణాళికాబద్ధ అభివృద్ధి దిశగా సాగించిన సుదీర్ఘ ప్రయాణంలోనూ ఇలాంటి ఇబ్బందులు అనేకం ఎదురయ్యాయి. వీటన్నింటినీ సమర్థంగా ఎదుర్కొని విధాన నిర్ణయాలతో ముందడుగేశారు.

మన దేశంలో 1950 నుంచి 2012 వరకు 11 పంచవర్ష ప్రణాళికలను అమలు చేశారు. 2012లో 12వ పంచవర్ష ప్రణాళిక ప్రారంభమైంది. ఇది 2017 వరకు కొనసాగుతుంది.

ప్రణాళికా వ్యవస్థ ప్రారంభదశలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, వ్యూహాలు కాలానుగుణంగా ఏ విధమైన మార్పులకు గురయ్యాయి? ఏ మేరకు లక్ష్యాలను సాధించగలిగాం తదితర అంశాలను ముందుగా పరిశీలిద్దాం..

వలసపాలన సంకెళ్లు తెంచుకుని స్వతంత్ర భారతంగా ఆవిర్భవించే నాటికి దేశంలో 70శాతం కంటే అధిక జనాభా వ్యవసాయమే ప్రధాన ఆధారంగా జీవనం సాగిస్తోంది. పేదరికం, నిరుద్యోగ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. పరిశ్రమలు చాలా తక్కువ సంఖ్యలో ఉండటం వల్ల ఉపాధి అవకాశాల కొరత ఏర్పడింది. ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు ప్రణాళికా భివృద్ధి విధానం, మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో స్పష్టమైన లక్ష్యాలను నిర్వచించుకోవడం అనివార్యమయ్యాయి. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రణాళికల రచయితలు అభివృద్ధి, ఆదాయ వనరులను సృష్టించుకోవడంతోపాటు సామాజిక న్యాయం, అన్ని వర్గాలవారికీ సముచిత అవకాశాలు కల్పించడం, ఆదాయ వనరుల కేటాయింపు మొదలైన అంశాలను ప్రాధాన్యాలుగా ఎంచుకున్నారు.



మొదటి పంచవర్ష ప్రణాళిక (1951-56)

రెండో ప్రపంచ యుద్ధ ప్రభావంతో కకావికలమైన దేశాల్లో భారత్ కూడా ఒకటి. ఈ సమయంలో భారత ఆర్థిక వ్యవస్థ అసమతౌల్యంతో కొట్టుమిట్టాడుతోంది. బ్రిటిషర్లు మనదేశంలోని సంపదను కొల్లగొట్టడం వల్ల ఏర్పడిన పరిస్థితులకు క్షామం కూడా తోడవటంతో.. తీవ్ర ఆహార కొరత, ద్రవ్యోల్బణం, దుర్భిక్ష సమస్యలతోపాటు కాందిశీకుల చొరబాటు మన ఆర్థిక వ్యవస్థను కుదిపేశాయి. ఇలాంటి సంధికాలంలో ప్రణాళికా సంఘం ద్వారా 1951 జూలైలో మొదటి పంచవర్ష ప్రణాళికను ప్రారంభించారు. దీన్ని 1952 డిసెంబర్‌లో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.

ప్రణాళిక ప్రధాన లక్ష్యాలు

1. ఆహారోత్పత్తిని పెంచడం.
2. ఉత్పత్తి వనరులను సంపూర్ణంగా వినియోగించుకునేలా అందుబాటులోకి తేవడం.
3. దేశ విభజన, రెండో ప్రపంచ యుద్ధం ద్వారా ఏర్పడిన ఆర్థిక అసమతౌల్యాన్ని తగ్గించడం.
4. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం.
5. రైలు మార్గాలు, విద్యుచ్ఛక్తి, రహదారులు, నీటి పారుదల (డ్యామ్‌ల నిర్మాణం) లాంటి మౌలిక వసతుల (అవస్థాపన సౌకర్యాలు, లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కల్పనకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టడం.
6. ఆస్తి, సంపద, ఆదాయ వ్యత్యాసాల్లో అసమానతలను క్రమంగా తగ్గించి, వాటిని పూర్తిగా రూపుమాపడానికి చర్యలు తీసుకోవడం.

- మొత్తం ప్రణాళికా వ్యయం రూ. 3870 కోట్లు. ఇందులో రూ. 2378 కోట్లు పబ్లిక్ రంగం పెట్టుబడి. మరో రూ.1800 కోట్లు ప్రైవేట్ రంగం నుంచి సమకూరాయి.
- ప్రణాళికా వ్యయం మొత్తాన్ని వ్యవసాయ, పారిశ్రామిక, శక్తి, నీటిపారుదల, రవాణా, సమాచార, సాంఘిక సేవా రంగాలకు కేటాయించారు.
- మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలో చాలా లక్ష్యాలనే సాధించగలిగారు. స్థూల దేశీయోత్పత్తి సగటు వృద్ధి లక్ష్యాన్ని 2.1 శాతంగా నిర్ణయించారు. సాధించిన వాస్తవ వృద్ధిరేటు 3.6 శాతం.
- మొదటి పంచవర్ష ప్రణాళికా కాలంలోనే దేశంలోని ప్రధాన నదులపై మెట్టూర్, హిరాకుడ్, భాక్రానంగల్ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రారంభించారు.

రెండో పంచవర్ష ప్రణాళిక (1956-61)

పి.సి. మహలనోబిస్ స్ఫూర్తితో రెండో పంచవర్ష ప్రణాళికకు రూపకల్పన చేశారు. ఇందులో పారిశ్రామిక రంగం అభివృద్ధికి పునాదులు వేశారు. 1948లో ప్రతిపాదించిన మొదటి పారిశ్రామిక విధాన తీర్మానాన్ని సమీక్షించి 1956లో రెండో పారిశ్రామిక విధాన తీర్మానాన్ని ప్రకటించారు. పబ్లిక్ రంగ పరిశ్రమలకు పెద్దపీట వేశారు. సత్వర పారిశ్రామికీకరణ కోసం భారీ పరిశ్రమలను స్థాపించారు.

- భారత్ అల్యూమినియం, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్, బొగ్గు, రాగి, మాంగనీస్ లాంటి భారీ పరిశ్రమలతోపాటు.. విద్యా, శిక్షణ, శాస్త్ర, సాంకేతిక సంస్థలను పెద్ద ఎత్తున ప్రారంభించారు.

ప్రణాళిక ప్రధాన లక్ష్యాలు

1. జాతీయ ఆదాయస్థాయిని పెంపొందించుకోవడం రెండో ప్రణాళిక బృహత్తర లక్ష్యం. స్థూల దేశీయోత్పత్తి సగటు వృద్ధి లక్ష్యాన్ని 4.5 శాతంగా నిర్ణయించారు. ప్రణాళికాంతానికి ఈ వృద్ధి రేటును దాదాపు అందుకున్నారు.
2. సత్వర పారిశ్రామికీకరణ కోసం ముఖ్య ఆధారభూతమైన పరిశ్రమలను దశలవారీగా నెలకొల్పడం మరో లక్ష్యంగా ఎంచుకున్నారు.
3. శ్రమ సాంద్రత ఆధారిత పరిశ్రమల స్థాపన ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడం మరో లక్ష్యం.
4. అభివృద్ధి సాధిస్తూనే, ఆదాయ అసమానతలను తగ్గించడానికి ప్రయత్నం చేయాలని నిర్ణయించారు.

- రెండో ప్రణాళికా కాలం నాటికి దేశంలో ఆదాయ వనరులు పెరిగాయి. వివిధ దేశాల సహకారంతో ప్రభుత్వ రంగంలో అనేక పరిశ్రమలను స్థాపించారు. దుర్గాపూర్, భిలాయ్, రూర్కేలా స్టీల్ పరిశ్రమలను ఈ విధంగానే ఏర్పాటు చేశారు. వీటితోపాటు భారీ యంత్ర పరిశ్రమలు, యంత్ర పనిముట్లకు సంబంధించిన యూనిట్లను నెలకొల్పారు.
- 1957లో అటామిక్ ఎనర్జీ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
- ఈ ప్రణాళికా కాలంలో మౌలిక రంగ ఉత్పాదనల్లో పటిష్టమైన సమర్థత, వైవిధ్యం సాధించగలిగారు. రైల్వేకోచ్ ఫ్యాక్టరీలు, రసాయన, ఔషధ పరిశ్రమల విషయంలో సాధికారత సాధ్యమైంది.

మూడో పంచవర్ష ప్రణాళిక (1961-66)

మూడో పంచవర్ష ప్రణాళికలో దీర్ఘ కాలిక అభివృద్ధి స్థిరీకరణ, అయిదేళ్లకాలంలో సమర్థమైన స్వయం నిర్భరత, స్వయం సమృద్ధి సాధన, స్వతహాగా ప్రగతి మార్గంలో వృద్ధిరేటు సాధన తదితరాలను లక్ష్యాలుగా నిర్దేశించారు.

ప్రణాళిక ప్రధాన లక్ష్యాలు

1. ఆహార, వ్యవసాయోత్పత్తులను అధికం చేసుకుంటూ ఆహార స్వయం సమృద్ధి సాధించడం.
2. మౌలిక పరిశ్రమలను విస్తరించడం, అందుబాటులో ఉన్న వనరుల వినియోగాన్ని ఒక దశాబ్ద కాలంలో ద్విగుణీకృతం చేసుకోవడం.
3. స్థూల జాతీయోత్పత్తి రేటును 5 శాతం సాధించడానికి కృషి చేయడం.
4. మానవ వనరుల సమగ్ర వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ప్రగతి సాధించడం.
5. ఉద్యోగావకాశాలు, ఆదాయ వనరుల పంపిణీలో ఆర్థిక అసమానతలను తొలగించి అందరికీ సమాన అవకాశాలు కల్పించడం.

- మొత్తం ప్రణాళికా వ్యయం రూ. 11,600 కోట్లు. ఇందులో రూ. 7500 కోట్లు పబ్లిక్ రంగానికి కేటాయించారు.
- నిర్దేశించిన లక్ష్యాలు, అన్ని రంగాల అభివృద్ధిని సాధించడంలో మూడో పంచవర్ష ప్రణాళిక విఫలమైందనే చెప్పవచ్చు.

గుర్తుంచుకోవాల్సిన అంశాలు

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1934లో రచించిన 'ప్లాన్డ్ ఎకానమీ ఫర్ ఇండియా' గ్రంథంలో భారతదేశానికి ప్రణాళికలు అవసరమని పేర్కొన్నారు.
- 1938లో భారత్‌లో ప్రణాళిక కమిటీని ఏర్పాటు చేశారు. దీనికి జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షుడిగా వ్యవహరించారు.
- 1943లో బొంబేకు చెందిన కొంత మంది పారిశ్రామికవేత్తలు ఒక ప్రణాళికను రూపొందించారు. దీన్ని 'బాంబే ప్రణాళిక'గా వ్యవహరిస్తారు.
- గాంధీ సిద్ధాంతాల ఆధారంగా శ్రీమన్నారాయణ అగర్వాల్ 1944లో 'గాంధీ ప్రణాళిక'ను రూపొందించారు.
- ఎంఎన్ రాయ్ 1945లో 'ప్రజా ప్రణాళిక'ను రూపొందించారు.
- 1950 మార్చి 15న ప్రణాళిక సంఘం ఆవిర్భవించింది. ఇది ప్రణాళికలను రూపొందించి వాటి అమలుకు కృషి చేస్తుంది. ప్రధాన మంత్రి దీనికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. మొదటి అధ్యక్షుడు జవహర్‌లాల్ నెహ్రూ. ఉపాధ్యక్షుడు గుల్జారీ లాల్ నందా.
- నిరంతర ప్రణాళికల భావనను గున్నార్ మిర్డాల్ ప్రవేశపెట్టారు.
- నాలుగో పంచవర్ష ప్రణాళిక వరకు ఆర్థికవృద్ధికి అధిక ప్రాధాన్యమివ్వగా అయిదు, ఆరో ప్రణాళికల్లో స్వయం సమృద్ధి, ఉద్యోగ కల్పన, పేదరిక నిర్మూలనకు ప్రాముఖ్యం ఇచ్చారు.
- 1991 జూన్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థూల-ఆర్థిక స్థిరీకరణ సాధనకు పెద్దపీట వేయడంతో భారత ఆర్థిక వ్యవస్థ 'మార్కెట్ ఆధారిత వ్యవస్థ'గా రూపుదిద్దుకుంది.
- 2015 ఫిబ్రవరిలో ప్రణాళికా సంఘం స్థానంలో 'నీతి ఆయోగ్'ను ఏర్పాటు చేశారు. దీనికి 'అరవింద్ పనగరియా'ను ఉపాధ్యక్షుడిగా నియమించారు.

The drawee of a cheque can be



BANK EXAMS
BANKING AWARENESS

Model Questions

1. Insurance Repository is formed and registered under:
a) Companies Act 1956
b) IRDA Act 1999
c) Partnership Act 1932
d) Shops and Establishments Act of respective States
e) None of these
2. Which type of banking that shuns the very idea of interest rates and is founded on the principles of profit sharing:
a) Islamic Banking
b) Land Development Banking
c) Consumer Banking
d) Exchange Banking
e) Personal Banking
3. Which of the following banks has issued Multi Currency World Travel Card?
a) Karur Vysya Bank
b) Union Bank of India
c) Kotak Mahindra Bank
d) Bank of Baroda
e) State Bank of India
4. The Gold Monetisation Scheme, 2015 will replace the existing ________. However, the deposits outstanding under the Gold Deposit Scheme will be allowed to run till maturity unless the depositors prematurely withdraw them.
a) Gold Deposit Scheme, 1995
b) Gold Deposit Scheme, 1999
c) Sovereign Gold Bond Scheme.
d) Gold Deposit Scheme, 1991
e) None of the above
5. Which of the following is not correct regarding the Rajiv Gandhi Equity Savings Scheme.
a) Those investors whose annual taxable income is below Rs. 10 lacs are eligible under the scheme.
b) The maximum investment permissible under the scheme is Rs.50,000.
c) It is a tax savings scheme which gives tax benefit for new investors.
d) The scheme aims to promote debt culture in India.
e) None of the above
6. Which of the following banking system is generally referred to involvement of financial intermediaries in aiding credit creation without regulatory oversight.
a) Tiered Banking
b) Shadow Banking
c) Multiple Banking
d) Universal Banking
e) Night Banking
7. Which one of the following entity is not authorised to open insurance accounts?
a) Central Insurance Repository Limited
b) SHCIL Projects Limited
c) NSDL Database Management Limited
d) Kotak Insurance Repository Limited e) None of the above
8. The scheme "Aapka paisa aapke haath", refers to the
a) Direct Transfer Scheme
b) Direct Benefit Transfer Scheme
c) Direct Bank Transfer Scheme
d) Direct Bank Transfer Mode
e) Direct handing over of cash benefit by hand through postal services
9. Interest rate payable on saving bank account is:
a) Regulated by RBI
b) Regulated by State Govt
c)Regulated by Finance Ministry
d) Deregulated e) None
10. Which of the following are eligible to make deposits under Gold Monetisation Scheme?
a) Resident Indians & HUF
b) Trusts including Mutual Funds / Exchange Traded Funds
c) Registered under SEBI (Mutual Fund) Regulations
d) Companies
e) All of these
11. The Union Finance Minister has launched the IRDA's Insurance Repository System (IRS). Which of the following is not correct about IRS service record of all insurance policies?
a) Insurance Repository is authorised only to maintain the policies in physical form
b) Insurance Repository provide a Insurance
c) The Repository acts as a single stop for several policy service requirements.
d) The Repository will issue a unique code number to all policy holders
e) None of the above
12. The drawee of a cheque can be:
a) One person
b) Two person
c) Any legal or juristic person
d) A Bank e) None of these
13. Which of the following organization was established as a subsidiary of the Reserve Bank of India with the purpose of providing long term industrial finance and later took over business of Refinance Corporation of India in September, 1964?
a) ICICI Ltd b) IDBI Ltd
c) IFCI Ltd
d) Development Credit Bank of India(DCB)
e) None of the above
14. Which of the following is/are called Bretton Woods institution?
a) International Monetary Fund
b) World Trade Organization
c) United Nations
d) Asian Development Bank
e) Multilateral Development Bank
15. The minimum deposit at any one time shall be raw gold (bars, coins, jewellery excluding stones and other metals) equivalent to ____ grams of gold of 995 fineness.
a) 10 gm b) 20 gm
c) 30 gm d) 40 gm e) 50 gm
16. The new RTGS System operationalised is based on which standard messaging formats?
a) ISO 2002 b) ISO 20022
c) ISO 2022 d) ISO 22200
e) ISO 22220
17. The forensic audit of which bank ordered by the Reserve Bank of India is a first in the country's banking history?
a) United Bank of India
b) Allahabad Bank
c) State Bank of India
d) Union Bank of India
e) Dena Bank
18. RBI has mandated that the banks intending to enter insurance broking:
a) NPAs should not exceed 3% of their loans.
b) Should have a minimum net worth of Rs. 500 crore
c) Should have capital adequacy ratio of 10%
d) Only a & b e) All a, b, and c
19. Which State Govt. in India will introduce a cash compensation policy for housewives with less than Rs. 3 laks annual income:
a) Karnataka b) Goa
c) Maharashtra d) Delhi
e) Andhra Pradesh
20. The maximum limit for deposit under the Gold Monetisation Scheme is ________:
a) Rs. 1 lak b) Rs. 5 lak
c) Rs. 10 lak d) Rs 20 lak
e) No limit
21. No margin is required to bought in by the borrower for the education loans to special courses up to ________:
a) Rs. 2 lak b) Rs. 4 lak
c) Rs. 3 lak d) Rs. 5 lak
e) None of the above
22. What is core inflation?
a) It is the inflation rate of a particular basket of commodities
b) It is the sudden increase in prices of certain amount of food grains
c) It is caused by supply shocks in certain essential commodities.
d) It is the sudden decrease in supply of all goods and services.
e) Only a & b
23. Which of the following regulatory authority has been introduced by the Central Govt. with wide powers to recommend, enforce and monitor the compliance of accounting and auditing standards?
a) Financial Reporting Authority of India
b) National Financial Reporting Authority
c) National Financial Stabilization Authority
d) Audit Departments of Respective States
e) None of the above
24. Japan will promote ________, a theory which asserts that the advancement of women in the society is directly correlated with its growth rate.
a) womenomics
b) womenpowerment
c) women Empowerment
d) women Employment
e) None of the above.
25. The Reserve Bank is issuing Banknotes in Mahatma Gandhi Series 2005 with a new numbering pattern and special features for the visually impaired in ____, ____ and _____ denominations.
a) Rs.10, Rs. 50, Rs.100
b) Rs.100, Rs.500 and Rs.1000
c) Rs.50, Rs.100 and Rs.500
d) Rs.10, Rs.500 and Rs.1000
e) Rs.5, Rs.10, and Rs.20
26. To provide better security for debit card holders, payment services provider, National Payment Corporation of India has introduced a chip based card that provide protection to banks and their customers against card skimming and counterfeiting frauds. Such cards falls under which brand?
a) Rupay Brand
b) Rupaiya Brand
c) Rupee Brand
d) Rupiah Brand
e) Rupai Branch
27. As per Govt. guidelines, banks having total business of Rs. 300000 cr are to have how many EDs?
a) Minimum 2 b) 2
c) 3 d) Maximum 3
e) Only one irrespective of total business
28. According to Pension Fund Regulatory and Development Authority which Bank has been appointed as the new National Pension System Trustee Bank ?
a) State Bank of India
b) Axis Bank c) ICICI Bank
d) Punjab National Bank
e) Bank of India
29. Which of the following banks is the first Indian bank to introduce Display Debit cards?
a) HDFC Bank
b) Axis Bank
c) ICICI Bank
d) State Bank of India
e) HSBC Bank
30. The Reserve Bank has reviewed and enhanced the limit or cash withdrawal at Point of Sale (POS - for debit cards and open system prepaid cards issued by banks in India) from Rs.1000 to ________ per day in Tier III to VI centres.
a) Rs. 1500 b) Rs. 2000
c) Rs. 2,500 d) Rs.3000
e) Rs. 3,500

KEY

1) a	2) a	3) c	4) b	5) d
6) b	7) d	8) b	9) d	10) e
11) a	12) d	13) b	14) a	15) c
16) b	17) a	18) e	19) b	20) e
21) b	22) a	23) b	24) a	25) b
26) a	27) c	28) b	29) b	30) b